తాళ్లపాక సాహిత్యము

29

# శృంగార సంకీర్తనలు



తాళ్లపాక అన్నమాచార్యులు

# శృంగారసంకీర్తనలు

## అన్నమాచార్య విరచితములు

పరిష్కర్త:
గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ప్రచురణ:
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
1980.

అన్నిహక్కులు
తిరుమల తిరుపతి దేవస్థానమువారివి

ప్రకాశకులు :
శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వాహణాధికారి :
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

మొదటి ముద్రణ 2,000 ప్రతులు

ముద్రణము :
తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము,
తిరుపతి.

# రసికులకు ఒక విజ్ఞప్తి.

కొండంత భక్తిభావముతో, ముప్పదిరెండు వేలకీర్తనలతో, మన కొండలరాయని తనవానినిగా చేసికొన్నవారు అన్నమాచార్యులు. తనభక్తిపైన, స్వామిఅనుగ్రహముపైన ఎంతో విశ్వాస మున్నవారుగాని

" దాఁచుకో నీపాదాలకుఁ దగ నేజేసినపూజలివి
పూఁచి నీకీరితిరూపపుష్పము లివి యయ్యా
వొక్క-సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాచివుండనీ "

అని చాటలేరు. ఆ భక్తుని సంకీర్తనములన్నీ ప్రజలకు త్వరత్వరగా అందిచ్చుట తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రధాన కార్యము. ఇప్పటికి ఇది 29 వ సంపుటము. ఇంక అచ్చుకావలసినకొత్తవి ఆరు సంపుటములు మాత్రమే.

ఇందులో స్పెషలాఫీసరు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు 5 సంపుటములను అచ్చుకు సిద్ధపరచియున్నారు. ఇంక వ్రాయ వలసినది ఒకసంపుటము మాత్రమే. ఇంతకుముందు అచ్చై చెల్లిపోయిన అధ్యాత్మసంకీర్తనలనుకూడ సంవత్సరమునకు ఒకటి వంతున ముద్రింపించుట మా విధులలో ఒకటి. ఆ కార్యక్రమములో ఇంతకుముందు 5 వ సంపుటమున కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, 11 వ సంపుటమున 3 వ భాగమున కీ॥ శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు అచ్చొత్తించి ప్రకటించిన అధ్యాత్మ కీర్తనల తొలివందరేకులలోని పాటలన్నింటిని 1-వ సంపుటముగ శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు పరిష్కరించి ప్రకటించియున్నారు. ఆ సంపుటము గూడ విక్రయమునకు సిద్ధముగానే ఉన్నది.

స్పెషలాఫీసరు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు ఒక్కొక్క సంపుటమునందును తాళ్లపాకకవులభక్తిని గూర్చి, భాషామర్మములను గూర్చి సశాస్త్రీయముగ చర్చించుచున్నారు. ఆ చర్చలన్నీ సాహిత్యరసికులఆమోదము నందగలవనియే మా ప్రత్యాశ. ఈ చర్చలు భావికాలమున తాళ్లపాకకవులభాషపై. భక్తిపై. పరిశ్రమించు భాషావిమర్శకులకు చేయూతగా ఉండగలవనియే మా భావము.

మా యీకార్యములకు సాహిత్యాభిమానులందరు తోడుపడి గుణదోషములను ఎత్తిచూపుచూ మతచర్చలకు సముచితస్థానము కల్పింపగలరని ఆశించుచున్నాను.

(సం) పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

తిరుపతి
3-12-80

# పీఠిక

వేంకటేశవరిష్వంగపుష్పితా మాత్మనిర్వృతిం।
రసభూషితాంధ్రవచనై। యోఽకరోత్తముపాస్మహే॥

1301 నుండి 1400 వరకుగల నూరురేకులలోని 600 ల శృంగార భక్తిసంకీర్తనలుగల సంపుటమిది. ఈ వందలో నూరు రేకులు సమగ్రముగ నున్నవి.

తాళ్లపాకకవుల సారస్వతము సర్వకావ్యధర్మములకు కాణాచి. 28 వ సంపుటమున కృద్ధిత్తనామధాతువులను గూర్చి లఘువుగ చర్చించితిని. ఈ సంపుటమున అన్నమాచార్యులగుణాలంకారసరణి లఘువుగ చర్చింపదలచితిని.

ప్రాచీను లంగీకరించిన ఓజః ప్రసాదమాధుర్యములలో మొదటి గుణము ఈతనిరచనలలో అరుదుగా కన్పట్టును. తుది రెండు గుణములు ఈతనిరచనయందంతటా అలముకొనియున్నవి. మరీ శృంగారకీర్తనలయందు సంభోగవిప్రలంభాత్మకములైనశృంగారము మాధుర్యమునకు ఆటపట్టుగా, ప్రసాదగుణము అధ్యాత్మశృంగారముల-యందంతటను స్థానమేర్పరచుకొన్నది. పొదిపొదినును తెలుగు-పదములతో రచన బహుళముగా సాగినది. కావున ప్రసాదగుణము నకు కొరతే లేదు. ఎక్కడనైన కవి తానుగా కావలసి కూర్చిన-ప్రహేళికలయందుమాత్రము అర్థము దుర్గమముగా కన్పట్టును. అదీ గాక నిరంతరస్వామిస్మరణము, స్వామియందు లగ్నమైనమనస్సు ఈ వంకీర్తనధారకు కారణములు. ఎప్పుడైన భాషను, భావమును మరచి తన్మయీభావము చేకూరినపుడు, తననోటివెంట ఏమివచ్చు చున్నదోకూడ ఈ కవిమహాత్ముడు గమనించినట్లగపడదు. అట్టి పట్టులమాత్రమే శృంగారమునందుకూడ దుర్గమత్వము గోచరించు

చుండును. అపట్టులను పాదదీపికలో 'ఈ పాటలోని భావము సుస్పష్టమగుట లేదు' అని సూచించునే వచ్చినాను. అధ్యాత్మకీర్తనలలో శ్రుతిస్మృతిపురాణసిద్ధములైనభావములు స్పష్టముగనే తెలియుచుండును. ఎక్కడనో అతిలోకముగ తాను భావించినప్పుడుమాత్రమే అవి కొంచము మఱుగుపడుచుండును. అట్టి స్థలములందుకూడ 'ఈ పాటలోని భావము అర్థమగుట లేదు' ఇత్యాదిగా సూచించుచునే వచ్చినాను.

ప్రకృతమనుసరామః. గుణములు సంఘటనాశ్రయములని, అలంకారములు శబ్ద, అర్థ, ఉభయాశ్రయములని పెద్దలమాట. ఇక్కడ సంఘటనలు రసానుగుణముగ మార్పు చెందవలసినఅవసరము లేదు; ఎక్కడనైన తనకు భావోద్వేగము కలిగినపుడుతప్ప. అదీక్వాచిత్కమే. గుణములు సంఘటనను (పదబంధమును) ఆశ్రయించి సాక్షాత్తుగ రసస్ఫోరకములు. అలంకారములు శబ్దార్థములద్వారా రసస్ఫోరకములు. 'అలంక్రియతే అనేన ఇతి అలంకారః' ఈ శబ్దార్థములు అలంకరించునవి మాత్రమే. అలంకరింపబడునది వేరొకటి ఉండవలెగదా. ఆ అలంకార్యవస్తువు ఏది? అని ప్రశ్నించుకుంటే మరలా రసముదగ్గరకే ప్రయాణము. అధ్యాత్మకీర్తనలయందు శాంతరసము, శృంగారకీర్తనలయందు నానావిధములైనశృంగార-రసము అలంకార్యములుగా నిలుచుచున్నవి.

ఈ శృంగారరసముకూడ అన్నికీర్తనలయందును అలంకారములను పాటించలేదు. ఎక్కువ భాగము విభావానుభావ సంచారిభావములను అభివ్యక్తముచేయుచు, వాని మూలమున శృంగారరసమును ధ్వనించుచువచ్చినది. ఉపయోగించిన రూపక పరిణామ, అపహ్నవ, స్మరణ, ఉదాత్త, అతిశయోక్త్యలంకారములు ప్రధానముగ ఎక్కడ చూచినా కన్పడునవి. తక్కిన అలంకారములు సాధారణముగ అరుదనే చెప్పవచ్చు. అక్కడక్కడ దశావతారములను జోడించినపుడు

మాత్రము శ్లేషకూడ స్థానము కల్పించుకొనుచు వచ్చినది. రస వక్రోక్తియోఽలంకారము లంతటా విందినవే.

సంస్కృతమున సంఘటనను గూర్చి అసమాస, అల్పసమాస, దీర్ఘసమాస యని మూడువిధములుగ విభజించి చూపించినారు. రసానుకూలముగ వాటివాటిస్థానములనుకూడ ఉదాహరించినారు ఆయాగుణములకు ఆయాసంఘటనలు ఆశ్రయములవి, అట్లుకాక విపరీతములైనప్పుడుకూడ పదములయందలిశక్తితో రసభావములు కుంటువడవనికూడ నిరూపించినారు. ఇట్టి విషయములకు ధ్వన్యాలోక-కావ్యప్రకాశాదులు నిధానములు. మనఅన్నమయ్యలో తొలి రెండు తెగలసమాసములకే తప్ప, మూడవ తరగతి సమాసమునకెక్కడనో గాని స్థానములేదు.

తెలుగు సమాసముల రచనలలో "ఆంధ్రం షడ్వర్ణపర్యంతం" అను నియమమును ఈత డెప్పుడు లెక్కగొనలేదు.

ఉదాహరణము :

గట్టివలిపెపుచంద్రకావి యిది (12 - 284);

మేనవారిపిన్నదాని; గాఁటమైనగుబ్బలచక్కనిదాని (12 - 285) ముదితజఘనముమీఁదిమొలనూలిగంటలు ; కొమ్మ పయ్యెదలోని కుచమూలరుచి (12 - 259)

పిడికిటితలఁబాలపెండ్లికూఁతురు (12 – 185)

జోకైనతనవాలుఁజూపులచేఁ (12 – 177) ఇత్యాదులు. ఇంకను పెద్ద పెద్దతెలుగుసమాసములుకూడ కలవు.

సమాసరచనలో ఈతని దొకకొత్తపద్ధతి. ఆ విషయము 27 వ సంపుటమున విశదముగా వ్రాసినాను. ఏమైనను రచనలో ఎక్కువ

భాగము తునుకతునుకతెలుగుపదములతో తిక్కనగారు చెప్పినట్లు 'కాహళ' సంధించినవిధముగా కూర్చుటే ఈతనిసరళి. ఈతని రచన పైకి తేటగా కనపడినను యోచించుకొద్ది లోతులు దాకు పద్ధతి అడుగడుగున కన్పట్టుచుండును. ఈ క్రింది పాటలో ఈ భావము స్పష్టముగ తెలియుచున్నది.

శంకరాభరణం

తరుణి నీయలుక కెంతటి దింతి నీవేళఁ
గరుణించఁగదర వేంకటశైలనాథా ॥ పల్లవి ॥

వొకమారు సంసారమొల్లఁబొమ్మని తలఁచు
వొకమారు విధినేఁత లూహించి పొగడు
వొకమారు తనుఁజూచి వూరకే తలవూఁచు
నొకమారు హర్షమున నొంది మే మఱచు ॥ తరు ॥

విన్నుఁజూచి వొకమారు విలువెల్లఁ బులకించు
తన్నుఁజూచి వొకమారు తలపోసి నగును
కన్నుఁ దెరచి నిన్నుఁజూచి కడుసిగ్గువడి విలిచి
యిన్నియును దలపోసి యింతలో మఱచు ॥ తరు ॥

వదలైనమొలనూలు గదియించు నొకమారు
చెదరిన కురులెల్లఁ జెరుగు నొకమారు
అదనెరిఁగి తిరువేంకటాధీశ పొందితివి
చదురుఁడవు నినుఁబాయఁజాల దొకమారు ॥ తరు ॥

(12 సం—70పాట)

ప్రణయకలహముతో అలిగినపతిమతి నొప్పి తీరునట్లు నాయిక దశను అప్పటి ఆమె దయనీయస్థితిని, కేవలము సంచారిభావములతో

ఊహింపజేసి రసములొలికించినాడు. నీయంతటి మహనీయుడు కోపగించుటకు తగినస్థానమూ దానిది. ఇది పిచ్చుకపై బ్రహ్మాస్త్రము కాదా. ఈ నాటికి చెలిని కరుణించరాదా, అని పల్లవిలో చెప్పి, 'ఒక మారు సంసార మొల్లఁబొమ్మని తలఁచు' అను పాదముతో నిర్వేద మును, 'యొకమారు విధినేఁతలూహించి పొగడు' అనుపాదముతో దైన్యమును, 'యొకమారు తనుఁజూచి వూరకే తలవూఁచు' అను దానితో వితర్కమును, 'యొకమారు హర్షమున నొంది మేమరచు' అను దానితో మోహమును' 'విన్నుఁజూచి యొకమారు విలువెల్లఁ బులకించు' అను దానితో ఔత్సుక్యమును, 'తన్నుఁజూచి యొకమారు తలపోసి నగును' అనుపాదముతో అపస్మారమును 'కన్నుఁదెరచి నినుఁజూచి కడుసిగ్గువడి నిలిచి' అను దానితో వ్రీడను, 'యిన్నియును దలపోసి యింతలో మరచు' అన్నపాదముతో మరల మోహమును, 'వదలైనమొలనూలు గదియించు నొకమారు' అను దానితో మరల ఔత్సుక్యమును, 'చెదరిన కురులెల్లఁ జెరుగు నొకమారు' అను-దానితో మరల ఆవేగమును, ఈ భావములన్నింటితో భావశబలతను సృష్టించి, మూడవచరణము కడపటి రెండుపాదములలో దానికంతటికి ఫలితముగ సమాగమమును వర్ణించి చరితార్థుడైనాడు.

శృంగారము వర్ణించుపట్టులందు విభావ, అనుభావ, సాత్త్విక-భావ, సంచారిభావములనే ఎక్కువగ వర్ణించుచు తన్మూలమున రసా-స్వాదనకు దారి చూపినాడు. "విభావానుభావసంచారిసంయోగాద్రస-నిష్పత్తిః" అనునది భరతసూత్రము. దీనికి మమ్మటాచార్యులు "యద్యపి విభావానాం అనుభావానాం ఔత్సుక్య-వ్రీడా-హర్ష-కోపాఽ-సూయా-ప్రసాదానాం చ కేవలనామత్రస్థితిః. తథాప్యేతేషాం అసా ధారణత్వం ఇత్యన్యతమద్వయాక్షేపకత్వే సతి నానైకాంతికత్వమితి "(కావ్యప్రకాశః 4 ఉల్లాసః 28 కారికావృత్తిః)" అని వ్యాఖ్యానించి పైవానిలో ఏ ఒకటి రెండు బలవత్తరములైనను తక్కినవి ఊహతో

తమంతకు తామే తోచి సహృదయుని రసపరవశుని చేయును అని నిరూపించినాడు. దీనినే "యత్రక్వచిత్ ఏకస్మాదేవ అసాధారణాత్ రసోద్భేదః తత్ర ఇతరద్వయమాక్షేప్యమ్" అని పండితరాయలు ధ్రువీకరించినాడు.

మన అన్నమయ్యలో రచనశంతయు ఎక్కువ భాగము. గుణ ప్రధానముగ సాగుచున్నది. అనగా శ్రోతలు తాకి పరామర్శించిన గాని భావము బయటపడదన్న మాట. గుణములు శౌర్యాదులవలె ఆత్మధర్మములు కదా. మనిషి బక్కచిక్కియున్నను పరపరాక్రమ అసహిష్ణుత, దానిని క్రిందు చేయవలెనను ఉత్సాహము, కొందరి-యందు గోచరించుట మనమెరుగుదుము. అట్టులే అన్నమయ్యశైలి తేటతెలుగు పదములతో దుర్బలముగ కనబడుచున్నను నెమరువేయు-కొద్ది భావములు ఉవ్విళ్లూరుచుండును. ఈ క్రింది పాటను రసికులు గమనింపగలరు.

శ్రీరాగం

మరునినగరిదండ మాయిల్లెఱఁగవా
    విరులతావులు వెల్లవిరిసేటిచోటు ॥ పల్లవి ॥

మఱఁగుమూఁకచింతల మా యిల్లెఱఁగవా
    గుఱుతై సబంగారుకొండలసంది
    మఱపుఁదెలివియిక్క మాయిల్లెఱఁగవా
    వెఱవక మదనుఁడు వేఁటాడేచోటు ॥ మరు ॥

మదనువివెదసంత మాయిల్లెఱఁగవా
    చెదరియుఁజెదరనిచిమ్మఁజీఁకటి
    మదిలోన నీవుండేటిమాయి ల్లెఱఁగవా
    కొదలేక మమతలు కొలువుండేచోటు ॥ మరు ॥

మరులుమ్మెతలతోఁట మాయిల్లెఱఁగవా
తిరువేంకటగిరిదేవుఁడ నీవు
మరుముద్రలవాకిలి మాయిల్లెఱఁగవా
నిరతము నీసిరులు వించేటిచోటు ॥ మరు ॥

(12 సం—282 పాట)

ఇందు 'గురుతైన బంగారుకొండలసంది' 'వెరవక మదనుఁడు వేఁటాడే చోటు', 'చెదరియుఁజెదరని చిమ్మఁజీఁకటి' 'కొదలేక మమతలు కొలువుండేచోటు' మొదలగు పదములలోని భావములు వివరించితే పచ్చియగునని వదలితిని.

ఈతని సంఘటనాగుణము శృంగారమును అధ్యాత్మ విద్యగా కూడ మార్చుచున్నవి.

ముఖారి

పలుకుఁదేనియల నుపారమియ్యవే
అలరువాసనలనీయధరబింబానకు ॥ పల్లవి ॥

పుక్కిటిలేనగవు పొంగుఁబాలు చూపవే
చక్కనినీవదనంపుచందమామకు
అక్కరో నీవాలుఁగన్ను లారతిగా నెత్తవే
గక్కన నీచెక్కుతొలకరిమెరుపులకు ॥ పలు ॥

కమ్మనినీమేనితావి కానుకగా నియ్యవే
వుమ్మగింత చల్లెడినీవూరుపులకు
చిమ్ములనీచెమటలఁ జేయవే మజ్జనము
దిమ్మరి నీమురిపెపుతీగమేనికి ॥ పలు ॥

పతి వేంకటేశుఁ గూడి పరవశమియ్యావే
యితవైన నీమంచిహృదయానకు
అతవినే తలఁచఁగ నానతియ్యఁగదవె
తతితోడ నీలోవితలపోఁతలకు ॥ పలు ॥

(సం. 12–221 పాట)

## శ్రీరాగం

ప్రతిలేనిపూజ దలఁపఁగఁ గోటిమణుఁగులై
అతిపరవశము బ్రహ్మానందమాయ ॥ పల్లవి ॥

మానినీమణిమనసు మంచియాసనమాయ
నానందబాష్పజలమర్ఘ్యాదులాయ
మీనాక్షికనుదోయి మించుదీపములాయ—
నాననసుధారసం బభిషేకమాయ ॥ ప్రతి ॥

మగువచిరునవ్వులే మంచిక్రొవ్విరులాయ
తగు మేవిశావి చందనమలఁదుటాయ
విగవిగవితనుకాంతి నీరాజనంబాయ
జగడంపుటలుక లుపచారంబులాయ ॥ ప్రతి ॥

ననుపైనపొందులే నైవేద్యతతులాయ
తనివోనివేడుకలు తాంబూలమాయ
వనిత తిరువేంకటేశ్వరునికౌఁగిటఁ జేయు—
వినయవివరంబు లరవిరిమొక్కులాయ ॥ ప్రతి ॥

(సం. 12–301 పాట)

ఈపాటల్లో పూజకుపయోగపడు షోడశోపచారములు శృంగారమునకు ఎట్లు వొదిగి వచ్చినవో ప్రసాదగుణము, మాధుర్యము చెప్పక చెప్పుచున్నవి.

శృంగారరస సామ్రాజ్యముగ ఈతవి వంఘటన ఈ క్రింది పాటలో వెల్లివిరియుచున్నది.

**ముఖారి**

చెప్పరా దీయింతిసిరులు దీని—
 వొప్పులిన్నియుఁ జూడ వొరపులోకావి ॥ పల్లవి ॥

ముదితజఘనముమీఁదిమొలనూలిగంట లవి
 కదలురవ మెట్లుండెఁ గంటిరె చెలులు
 మదనుఁ డుండెడిహేమమందిరము దిరిగిరాఁ
 గదిసి మ్రోనెడి పారిఘంటలోకావి ॥ చెప్ప ॥

కొమ్మపయ్యెదలోనికుచమూలరుచి వెలికిఁ
 జిమ్ముటది యెట్లుండెఁ జెప్పరే చెలులు
 యిమ్మైనమరుధనములెల్ల రాసులువోసి
 కమ్మకొని చెంగావి గప్పిరోకాని ॥ చెప్ప ॥

నెలతకంఠమునందు నీలమణిహారములు
 అలరు టెట్లుండు కొవియాదరే చెలులు
 లలితాంగి ప్రాణవల్లభుఁడు వేంకటవిభుఁడు
 నెలకొన్నకౌఁగిటనె నిలిచెనోకాని ॥ చెప్ప ॥

(12 సం—259 పాట.)

ఈపాటలోని అపూర్వభావరచన కొన్నివేలమందిప్రబంధకవులను వెలకు కొనగలదు గదా? మొదటి రెండు చరణములను వ్యాఖ్యానిస్తే పువ్వు నలిపి వాసన చూచినట్లగునని మానితి.

## అలంకారములు

అలంకారశాస్త్రమునందు తర్కశాస్త్రము ప్రవేశించిన దాదిగా అవచ్ఛేదకావచ్ఛిన్నములతో అలంకార సర్వస్వమే అడుగంటినదని చెప్పెడు పెద్దలు కూడ లేకపోలేదు.

వాచం కవీనా ముపలాలయన్యాం
భుంక్తే రసజ్ఞో యువతిం యువేవ।
తామేవ భుంక్తే నను తార్కికోఽపి
ప్రాణాన్ హరన్ భూత ఇవ ప్రవిష్టః॥

(శివలీలార్ణవము 1—69)

అనిన నీలకంఠునిభావమే పై నామాటకు కారణము. పెద్ద సహృదయుడు, మహాకవి అయిన ఈతడెందుకో తర్కశాస్త్రమును ప్రత్యక్షముగ పరోక్షముగ పరిహాసముగ పరమార్థముగ ఎత్తిపొడుచుచునే ఉండును. హాలాహలము వెలికి వచ్చినతరువాత దేవతలందరు కొందలపాటుతో జడిసిరి. పరమేశ్వరుడు దానిని మ్రింగెను. అప్పుడు లోకము ప్రశాంతమాయను. ఆస్థితిని వర్ణించుచు

అజని శనై ర్విశదం జగదపసర్పతి కాలకూటసంతమసే
తాత్పర్యమివ కవీనాం తార్కికకోలాహలోపరమే॥

(నీలకంఠవిజయ చంపువు 4—80)

అని అభివర్ణించినాడు. ఏ పరిష్కరణమునకైన తర్కశాస్త్రమువంటి గట్టిది మరొకటి లేదు. అలంకారములను పరిష్కరించునప్పుడు పండితరాయలకు పట్టుగొమ్మ ఈ శాస్త్రమేకదా। ఇది అప్రస్తుతమైనను ఊరక మతభేదములను తెలుపుటకు ఉదాహరించితినంతే. ధ్వన్యాలోకమునందుకూడ పకడ్బందీగా తర్కశాస్త్రపరిష్కరణము కనపడక పోయినను సాహిత్యరూపముగ తర్కశాస్త్రము ప్రతివాక్యమునందును కన్పట్టుచునేయుండును.

ఈతనిరచనలో రసవదలంకార ప్రేయోఽలంకారములు ప్రధాన స్థానము నలంకరించినను, తక్కిన అలంకారములుకూడ యథా ప్రకాశ-

ముగ స్థానము కల్పించుకొన్నవి. అందుకనియే "అలంకారాన్తరాణిహి నిరూప్యమాణదుర్ఘటనాన్యపి రససమాహితచేతసః ప్రతిభానవతః కవేః అహంపూర్వికయా పరాపతన్తి" అని ఆనందవర్ధనుడు[1]

అందుకనియే కావ్యప్రకాశకారుడు

"ఉపకుర్వంతి తం సంతం యేఽఙ్గద్వారేణ సంశ్రితాః[1] హారాదివ దలంకారాః తేఽనుప్రాసోపమాదయః" అని ప్రారంభించినాడు. ఆయా అలంకారములస్వరూపస్వభావవైలక్షణ్యములను విద్యా నాథుడు సవిమర్శముగ నిరూపించినాడు. ఈతని కవిత్వమునందు ఛేకాను ప్రాస, వృత్త్యనుప్రాస, పునరుక్తవధాభాస, లాటానుప్రాసములు చాల స్వల్పముగ కన్పడుచుండును.

అంత్యాను ప్రాసములు పైవానికంటె విరివిగ తోచుచుండును. ఉదాహరణములు.

కేదారగౌళ

తనచేతి దీఁకను ధర్మము పుణ్యము
చానిపి యింకాఁ దన్ను సొలనేఁటి దేఁటిదే ॥ పల్లవి ॥

ములువాఁడి కొనగోరి మొనలు వాఁడి
కలయని తనతోడికాఁకలు వేఁడి
అలసితి రెంటివల్లా నప్పుడే నేను
యెలమి వింకాఁ దనతో నేఁటిమాఁటలే ॥ తన ॥

సారపుఁ బయ్యదలోవి చన్నులు గట్టి
సారెకు నాదే సరసములు వెట్టి
ఆరితేరె నింగానందు నందరిలోన
మారుకొని యింకాను మరి యేఁటిపొందులే ॥ తన ॥

---

1. పుట 222. ధ్వన్యాలోకము 1940 చౌఖంబా ముద్రణాలయము.

నెమ్మి పేడినతురుమునెరులు చిక్కి
కమ్మరఁ గూడినయట్టి కాఁగిలి చొక్కి
నమ్మించి శ్రీవేంకటేశుఁడు నన్నేలెను
సమ్మతిఁ దనకు నాకు సరినేఁటి సిగ్గులు ॥ తన ॥

(ఈ సంపుటము - 125 పాట)

ఇందు మూడు చరణములందును మొదటి రెండేసి ప్రాసములు అంత్యాను ప్రాసకుదాహరణములు.

ఆహిరి

ఇంటికి విచ్చేసితివి యెంతవనికి
అంటిసుదివంటిదాన నందుకోపేనా ॥ పల్లవి ॥

యెంగిలిమోవిదాన యేడలేనిసిగ్గుదాన
పొంగేటిచెమటలతోఁ బొరలేదాన
వంగవిచన్నులదాన వాడికెవలపుదాన
పంగెనకోపముదాన బాఁతెయ్యేనా ॥ ఇంటి ॥

సన్నపునడిమిదాన సళపుఁజూపులదాన
వెన్నెలనవ్వులతోడిపేరిడిదాన
నున్ననిచెక్కులదాన నూఁగురులకొప్పుదాన
పిన్నదాన నే నీకుఁ బ్రియమయ్యేనా ॥ ఇంటి ॥

చిగురుఁబాదాలదాన చిమ్ముఁజూపులదాన
వెగటుఁబిఱుఁదుగలవేఁకపుదాన
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
జిగిబిగువులదానఁ జిత్తము వచ్చేనా ॥ ఇంటి ॥

(ఈ సంపుటము - 198 పాట)

ఇందు మూడుచరణములందును రెండు నాలుగు పాదములందు తప్ప మిగత పాదములందంతటా అర్ధర్ధపాదములకు అర్థ భేదములేని యమకము సృష్టింపబడినది.

ఆహిరి

మోహంపురతిముదము ముద్దుఁజూపులమదము
దేహంపుసొబగెల్లఁ దెలిపె సదమదము ॥ పల్లవి ॥

మించుమట్టెలగిలుకు మెరుఁగుగుబ్బలకులుకు
వంచుఁజూపులచిలుకు వసివాడుఁబలుకు
మంచుఁజెమటలతళుకు మనసులోపలియళుకు
అంచుటధరపుబెళుకు అలమేఁటిజళుకు ॥ మోహం ॥

కరమూలములఁ గరఁగు కదలుఁబయ్యెదచెరఁగు
సిరులచెలువపుమెరఁగు చెక్కుపై మరఁగు
గరగరికెతతు లెరుఁగు ఘాతలంటినతెరఁగు
గరిమెతో చెలియునికి కప్పురపుటరఁగు ॥ మోహం ॥

కలికితనములపోగు కమ్మఁదావులవేఁగు
వలపుతమకములపరవశము పెనుజాగు
కలకంటిబాగు వేంకటపతికిఁ జెలరేఁగు
చెలియ సమరతుల మించినవింతబాగు. ॥ మోహం ॥

(12 సంపు—302 పాట)

ఈపాటయందు ప్రతిచరణమునందును ప్రతిపాదార్థమునకును అంత్యానుప్రాస చెవిచిక్కింపుగా సాగినది.

## సామంతం

కనుఁగొనవయ్యా కలికిని
కొలువు(కొనుపు?)నఁ జిలుకలకొలికిని ॥ పల్లవి ॥

వదనకమల మటు వంచి
పొదిగొనుచూపులఁ బొంచి
మెదలేటికళలను మించి
అదె నీపయిఁ జెలి యాసలు నించీ ॥ కనుఁ ॥

మునుకొని చేతుల మొక్కి
వినుపుఁదమకముల విక్కి
తపియనిమాఁటల దక్కి
పవివడి నీపాదము దొక్కి ॥ కనుఁ ॥

పలురాగంబులఁ బాడి
వలవంతల వసివాడి
యెలమిని శ్రీవేంకటేశుపై యాడి
అలమేల్మంగ విన్నంకెలఁ గూడీ ॥ కనుఁ ॥

(24 వంపు—308 పాట)

పాట అంతటా అన్నిపాదములయందును అంత్యానుప్రాసము సూటిగా హృదయంగమముఁగా మలచినాడు.

## పళవంజరం

మనసుకు మనసే మరి తారుకాణవచ్చె
చెనకినచెనకులు చేచేత నున్నవి ॥ పల్లవి ॥

వలపులు సరివచ్చె వనిత నిన్ను మెచ్చె
పొలసి యిందాఁకా నాపె పొగడెనయ్యా
కలలు విక్కములాయ కడుమర్మములు రాయ
కొలువులో నాపెవద్దఁ గూచుండవయ్యా ॥ మన ॥

నవ్వులు నెఱవి ముంచె ననుపులు లోలో మించె
మవ్వముతో విన్ను నాపె మరిగెనయ్యా
జవ్వనము సరిదూఁగె జగడములెల్ల దాఁగె
చివ్వన లోవికిని విచ్చేయవయ్యా ॥ మన ॥

చూపులఁ గళలు నిండె సురతము పంటవండె
వోపిక నిన్నాపె నోరూరించెనయ్యా
యేపున శ్రీవేంకటేశ యిద్దరుఁ గూడితి రిట్టె
తీపుల నాపె నురము దించకువయ్యా ॥ మన ॥

(ఈ సంపుటము — 222 పాట)

ఈపాటలో తొలి రెండు చరణములందు, ఒకటవ మూడవ పాదము లందు పాదార్ధములకూ, మూడవ చరణము తొలి పాదమునందు పాదార్ధమునకుమాత్రము అంత్యానుప్రాసము వింపినాడు.

దేవగాంధారి

ఇంక నెంతగావలె యీవలపూ
యింకదు చెక్కుచెమట యిదెకాదా వలపు ॥ పల్లవి ॥

పెదవిపై వీడెపుఁబిసరు
అదన విన్నుఁజూచి యసురుసురు
పదరి పయ్యదకొంగుపై విసరు
యెదిగించీఁ జెలి సీపై నిదెకాదా వలపు ॥ ఇంక ॥

గక్కన మనసులోవికరఁగూ
మొక్కలపుసిగ్గులతో మొరఁగూ
మిక్కలిమరుకళల మెరుఁగూ
యిక్కువలు చూపెఁ జెలి కదిగాదా వలపూ ॥ ఇంక ॥

iii

ననుపుతో నెలవులనగవూ
పెనఁగేటికాఁగిటిబిగువూ
యెనసె శ్రీవేంకటేశ యింతి విన్ననూ
యినుమడించెఁ దమక మిదిగాదా వలపూ ॥ ఇంక ॥

(ఈ సంపుటము–249 పాట)

ప్రతి చరణమునందును నాల్గవ పాదమును తొలగించి ప్రతి పాద మందును అంత్యాను ప్రాసమును పాటించినాడు.

## పాడి

నాతో దాఁచక చెప్పవే నాతిరో నీవు
యీతనువు సోఁకినవాఁ డెంతభాగ్యవంతుదే ॥ పల్లవి ॥

చక్కవివెన్నెలవూట సతి నీనవ్వులతేట
మొక్కలలోనిమొలఁగు మోవితెలఁగు
రెక్కతుమ్మిదలవొప్పు విక్కనసీపెద్దకొప్పు
యిక్కవ విన్నెలినవాఁ డెంతభాగ్యవంతుఁదే ॥ నాతో ॥

అలచందురువిదీము అతివ నీనెమ్మోము
కలువలమైబాగులు కన్నుసోగలు
లలికంఠముకులము లక్షణపునీగళము
యిల నీమగఁడై నవాఁ డెంతభాగ్యవంతుఁదే ॥ నాతో ॥

నిరతిఁ గొండపొదవు నీచన్నులవదువు
మరునికొలువు నీ మర్మపునిలువు
సిరులఁ గూడె విన్నట శ్రీవేంకటేశుఁడట
యిరవై నీవు గలవాఁ డెంతభాగ్యవంతుఁదే ॥ నాతో ॥

(ఈ సంపుటము–357 పాట)

ఈ పాటలో మూడవ చరణము కడపటి రెండు పాదములూ మొదటి-రెండుచరణములలోని కడపటిపాదములుతప్ప తక్కినచరణము లందంతటా మనోహరమైన అంత్యానుప్రాసము.

రామక్రియ

ఇదె శిరసుమాణిక్య మిచ్చి పంపె నీకు నాకె
అద నెఱిఁగి తెచ్చితి నవధరించవయ్యా ॥ పల్లవి ॥

రామ వినుఁబాసి నీరామ నేఁ జూడఁగ నా-
రామమున నినుఁ బాడె రామరామ యనుచు
ఆమెలుఁత సీతయని యపుడు నేఁ దెలిసి
నీముద్రవుంగరము నే నిచ్చితిని ॥ ఇదె ॥

కమలాప్తకులుఁడ నీకమలాక్షి నీపాద-
కమలములు దలపోసి కమలారి దూరె
నెమకి యీలేమ నే నీదేవి యని తెలిసి
అమరంగ నీసేమ మటు విన్నవించితి ॥ ఇదె ॥

దశరథాత్మజ నీవు దశశిరునిఁ జంపి యా-
దశనున్న చెలిఁగావు దశదిశలఁ బొగడ
రసికుఁడ శ్రీవేంకటరఘువీరుఁడ నీవు
శశిముఖిఁ జేకొంటివి చక్కనాయఁ బనులు ॥ ఇదె ॥

(26 సంపుటము-220 పాట)

ఈ పాటయందు మాత్రము ఛేకానుప్రాస, వృత్త్యనుప్రాసములు రెండును జంటగ నడచినవి. పనిబూని ఈ పనిగూడ నాకు చేత వచ్చునని చూపుటకు చేసిన రచనగా ఇది తోచుచున్నది.

ఈపై చూపిన శబ్దాలంకారముల వంటివి ఈ రచనలో పెక్కు గలవు. అర్థవిశేషము ఏ కొన్ని స్థలములలోనో ఉండును. కావి తక్కిన స్థలములయందంతటా శబ్దమాధుర్యమునకే అగ్రస్థానము.

అర్థాలంకారములు:

నాదరామక్రియ

ఎటువంటివిలాసిని యెంతజాణ యీచెలువ
తటుకన నీకు దక్కె దైవారఁ జూడవయ్యా ॥ పల్లవి ॥

మగువ మాటాడితేను మాణికాలు వెందుకొనీ
పగడాలు పెదవులఁ బచ్చిదేరీని
మగిడి చూచితేను మంచినీలా లుప్పతిలీ
తగు నీకు నీపెదిక్కు తప్పక చూడవయ్యా ॥ ఎటు ॥

పదఁతిజవ్వనమునఁ బచ్చలు గమ్ముకొనీని
నడచితే పై దూర్యాలు వెదలీ గోళ్ల
తొడిఁబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు
వాడికమైనది యీపెవారపు చూడవయ్యా ॥ ఎటు ॥

కొమ్మ ప్రియాలతేనెలఁ గురిసీఁ బుష్యరాగాలు
కుమ్మరించీఁ జెనకుల గోమేధికాలు
ముమ్మరపుఁజెమటల ముత్తెపుసరాలు విందీ
నెమ్మది శ్రీవేంకటేశ నీదేవిఁ జూడవయ్యా ॥ ఎటు ॥

(ఈ సంపుటము—30 పాట)

ఈపాటలో అంతటా రూపకాలంకారము, అధ్యవసాయ ప్రధానమైన-అతిశయోక్తి పెనగొని నవరత్నములను పేంపి అలంకారసంసృష్టిని రంగరించినాడు.

మాళవి గౌళ

ఎటువలెఁ బొగడినా విన్నిటికిఁ దగినది
ఘటియించె మేలు మేలు కంటిమి యీవేడుక ॥ పల్లవి ॥

చెలిచన్నులబలిమి సింగారానకుఁ గలిమి
అలరుఁగన్నులచూపు ఆసలదాపు
విలువుఁజక్కఁదనము నెమ్మిదాఁచినధనము
కులుకుఁగుత్తికసొంపు కోవిలలగుంపు ॥ ఎటు ॥

కాంతవెట్టినకొప్పు గండుఁదుమ్మిదలకప్పు
చెంత నెన్నడిమికీలు సింగముఁబోలు
యెంతే పిఱుఁదుతీరు ఇంచువిలుతునితేరు
వింత చిరునవ్వులాగు వెన్నెలపోగు ॥ ఎటు ॥

లేమపాదములసోగ లేఁతచిగురులో చేఁగ
భూమిలో మించె యీయమ్మ పుత్తడిబొమ్మ
ఆముక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
ప్రేమ నేలితివి పొందు బెరసినవిందు ॥ ఎటు ॥

(ఈ సంపుటము—95 పాట)

ఈపాటలో శబ్దాలంకారముతోపాటు రూపక హేత్వలంకారములు రెండును కలిసి, వాచ్యముగనే ప్రేయోఽలంకారమునకు కారణములై అలంకారసంకరముగ భాసించినవి.

కాంబోది

ఏమమ్మ యశోద మీయింటికి నేము వచ్చితే
గాముపంటిబిడ్డ నిచ్చి కలుపడఁ జేసితి ॥ పల్లవి ॥

పాలుగారీ నెలవులఁ బక్కనఁ జెక్కుమీఁటితే
వేలువెట్టితే లోకాలు వెల్లివిరిసీ
పీలి నేము వుగ్గువెట్ట వెరతుము మీవాఁడు
బాలుఁడా దయ్యముగాక పట్టవమ్మా ॥ ఏమ ॥

నెమ్మిఁ దొడమీఁద నుండి నిలువు నూరు వండీవి
పమ్మి నాల్గుమోములపాపఁడు లోన నున్నాఁడు
నెమ్మది బాలు వోయఁగ నేవెరతు మీవాఁడు
ఇమ్ముల వీఁడు మానిశా యెవ్వఁడోకాక ॥ ఏమ ॥

పక్కన నీరార్చితిఁ బయ్యదలో నిడుకొంటి
మక్కువ నాకే తాను మగఁడై నాఁడు
చిక్కనపను లింకేమీఁ జెప్పఁగనేవెరతును
యెక్కువ శ్రీవేంకటేశుఁ డితఁడేపోయమ్మా ॥ ఏమ ॥

(25 సంపు — 481 పాట)

ఈ పాటలో శ్రీకృష్ణునిపై గొల్లెతలు నిందలుమోపుట వర్ణింపబడినను, కవికి కృష్ణునిపైగల వాత్సల్యము, అద్భుతరసప్రధానమై, ప్రేయోఽలంకారమునకు దారి చూపినది.

శ్రీరాగం

కంటిమిదివో నేము కన్నులపండుగగాను
జంటలఁగొలువై నీవు చనవియ్యఁగాను ॥ పల్లవి ॥

హేమంతకాలము నేఁడు యిటు నీతిరుమేన
ఆముకొని జవియించినట్లుండెను
భూమిఁగలకప్పురము పొడిసేసి విలువెల్లా
నేమముతో నిందరును నీకుఁజాతఁగాను ॥ కంటి ॥

వానకాలము నీలవర్ణముతోఁ దిరుమేన
సోనయై కురిసినట్టు చూపట్టెను
సేనగాదట్టుపుణుఁగు చిత్తడిగా సర్వాంగాల
పూని యిందరును నీకుఁ బూయఁగాను ॥ కంటి ॥

వసంతకాలము తానె వచ్చి నీతిరుమేన
యెసగినట్టు శ్రీవేంకటేశ తోఁచెను
వెస నలమేల్మంగతో వింతసొమ్ము నీవురాన
పొసగిం చందరు నిన్నందరు బొగడఁగాను ॥ కంటి ॥

(ఈ సంపుటము – 142 పాట)

ఈపాటలో స్వామి కవిమనసున ఎన్ని ఊహలు రేకెత్తించినాడో ఉత్ప్రేక్షాలంకారము బాగుగా నిరూపించినది. ఇందు ఋతు వర్ణనము కూడ మిళితమై అప్రస్తుతప్రశంసకు దాఁటిసి ఉత్ప్రేక్షా-ప్రస్తుతప్రశంసలసంకరముగ ఈ పాట తీరినది.

శుద్ధరామక్రియ

ఇన్నిరాసులయునికి యింతి చెలువపురాశి
కన్నె నీరాశికూటమి గలిగినరాశి ॥ పల్లవి ॥

కలికి బొమవిండ్లుగలకాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికివి మీనరాశి
కులుకుకుచకుంభములకొమ్మకును కుంభరాశి
చెలఁగుహరిమధ్యకును సింహరాశి ॥ ఇన్ని ॥

చిన్నిమకరాంకపుఁబయ్యెదచేడెకు మకరరాశి
కన్నెపాయపుసతికి కన్నెరాశి
వన్నెమై పైఁడితులఁదూఁగువనితకుఁ దులారాశి
తిన్నవివాఁడిగోళ్ళసతికి వృశ్చికరాశి ॥ ఇన్ని ॥

ఆముకొనునొరపుల మెరయునతివకు వృషభరాశి
గామిడిగుట్టుమాఁటలసతి కర్కాటకరాశి
కోమలపుచిగురుమోవికోమలికి మేషరాశి
ప్రేమ వేంకటపతిఁ గలసె ప్రియమిథునరాశి ॥ ఇన్ని ॥

(12 సంపుటము – 148 పాట)

ఈతనికి జ్యోతిశ్శాస్త్ర పరిచయము కలదనీ ఈ రాశి కూట ములపాట తెలుపుచున్నది. ఇందు రూపకాలంకారము మిగతా అన్ని అలంకారములను వెనుకకు నెట్టి నిట్టబోడుచుకొని చూచుచున్నది

ఈపై అలంకారములను ప్రతిపదార్థసమన్వయముతో చూపుట- యన్న పీఠిక బరువెక్కునన్న భావముతో తొలగించితిని.

ఈ శబ్దాలంకారములన్నియు పరంపరగ వేంకటేశ్వరునికి, నాయికయగుఅన్నమయ్యకునడుమ సంభోగవిప్రలంభశృంగార- ములను యథావిధిగ పోషించుచు రసవత్ప్రేయోఽలంకారములకు దారితీసినవనుట నిర్వివాదము.

తాళ్ల పాకకవుల సంగీతసాహిత్యములను వెలుగులోనికి తెచ్చి సహృదయులకు అందివ్వవలెనను సత్సంకల్పము, దానికి సొమ్మెంత యైనను ఖర్చుపెట్టుటకు వెనుకాడనిదీక్ష కలిగి, ఉత్సాహమురూపొంది నట్లు అగపడుచున్న కార్యనిర్వహణాధికారులు శ్రీ P. V. R. K. ప్రసాద్, I. A. S., గారికి నా కృతజ్ఞతాభివాదములు. మెలకువగ పని సత్వరముగ జరిపించు స్వభావముగల తి. తి దే. ప్రెస్ మేనేజరు శ్రీ M. విజయకుమారరెడ్డి గారికిని, వారికన్నివిధముల అండగ నుండి మా పనిని ప్రోత్సహించుచు ముందుకు నడిపించుస్వభావము గల పౌరసంబంధశాఖాధికారి (P. R. O.) శ్రీ R. సూర్యనారా యణమూర్తి, M.A., గారికిని, ప్రతిపదమునంటును వానీడవలె సాయ పడుచున్న 'సప్తగిరి' సంపాదకులు శ్రీ K. సుబ్బారావు గారికిని నా ధన్యవాదములు. నాకీపరిష్కరణ కార్యమునందు సహాయ కుడుగ ఒకటిన్నరసంవత్సరకాలముగ అన్నివిధముల తలలో నాలుక వలె పనిచేయుచున్న శ్రద్ధావిధేయతలు భూషణముగాగల చిరంజీవి J. బాలసుబ్రహ్మణ్యం, M.A., కును, అచ్చుపని వీలైనంత నిర్దుష్టముగ కొనసాగించునేర్పరులగుఅచ్చుకూర్పరులకును నా మంగళా శాసన

ములు. నాబుద్ధి బలమునకు తగినంతగా జరిగిన ఈపరిష్కరణము-నందు గుణదోషములను గమనించినపెద్దలు దోషములను తెలిపినచో పైపై పరిష్కరణములందు మెలకువ గలిగి ఉండగలమని మనవి.

వేదవాఖ్యస్య యద్వాణీ అన్నమార్యస్య యా తథా।
యత్సంగాదుజ్జ్వలా దీప్తా తం వందే కృష్ణదేశికమ్॥

విధేయుడు,
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
స్పెషల్ ఆఫీసరు,
తాళ్లపాక వాఙ్మయ పరిష్కరణశాఖ,
అన్నమాచార్య ప్రాజెక్టు.
తి. తి. దేవస్థానములు.

తిరుపతి,
1–12–80.



శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు.

శ్రీరస్తు

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

## 29 వ సంపుటము.

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధిసంవత్సరమందు, తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన-పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను. అదిమొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగునేఁటి దుందుభిసంవత్సరఫాల్గుణ బహుళ ౧౨ నిరుధానకు[1] తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసినశృంగారసంకీర్తనలు.

రేకు 1301 సౌరాష్ట్రం

నీకెంత వేడుక గద్దో నేమూఁ జూచేముగాక
కాకుసేయవచ్చునా కడలవారికిని ॥ పల్లవి ॥

వలెనని యాతనికి వాడిక నీవు చూపఁగా
వలదనవచ్చునా వాడవారికి
చలపట్టి యప్పటిని సలిగెలు నెరపఁగా
పొలసులాడవచ్చునా పొరుగువారికిని ॥ నీకెం ॥

---

1. ఈశబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గావచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాఁడు కడపటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన "పరియగు" అనువర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అనునర్థములో "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ వెంగమాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమివారి విష్ణుపారిజాతము ౬౬ పుట. నే నీప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ-శర్మగారు, "నిఱుత్తం" అనుఅరవపదముకూడ 'నిలుపు' అనునర్థముతో దీనికి సహాయపడుననిరి.

చిప్పిల నీ వాతనితోఁ జేఁతలెల్లాఁ జేయఁగాను
వుప్పటించవచ్చునా వూరివారికి
చొప్పుగఁ బతిమొగము చూచి నీవు నవ్వఁగాను
తప్పులెంచవచ్చునా దండనున్నవారికి ॥ నీకెం ॥

గారవించి నీవూఁ దానుఁ గాఁగిలించుకొనఁగాను
వారించఁగవచ్చునా సవతివారికి
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
వేరుసేయవచ్చునా వింతవారికి ॥ నీకెం ॥ 1

దేసాళం

మఱి మీకు వేళలేదా మగువలాల
మెఱశాతఁదే మన్నించీ మిమ్మూ సవతులాల ॥ పల్లవి ॥

ఆలుమగఁడు నున్నారు అదివో యేకతమున
యేల తొంగిచూచేరే యింతులాల
మేలువారై తమలోన మేలములాడుకొనేరు
ఆలకించే రదియేమే అతివలాల ॥ మఱి ॥

వెలఁది పాటవాడఁగా వింటానున్నాఁ డాతఁడు
[1] గంభిసేయకురే కాంతలాల
నలిరేఁగి యిద్దరూను నవ్వుకొంటా నున్నవారు
తలుపేల తెరచేరే తరుణులాల ॥ మఱి ॥

సరిఁ దాము చిలుకకు చదువులు నేరిపేరు
పరాకుసేయకురే పడఁతులాల
అరుదై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగ నున్నారు
సిరులఁ గాచుకుండరే చెలువలాల ॥ మఱి ॥ 2

1. గంభాయే 'గంభి' యేమో ?

ముఖారి

చెప్పవే యాకె కీమాట చెలియా
యెప్పుడూను నాబలిమి యెఱఁగదా తాను ॥పల్లవి॥

పంతమాడుకొంటేనేమి పడఁతి తనవిభుని
వంతులకు వలపించవలెఁగాక
యెంతగర్వము చూపినానేమి సరివారిలోన
రంతుతోడ నేరుపు మెరయవలెఁగాక ॥చెప్ప॥

యీడువెట్టుకొంటేనేమి ఇల్లాలై యాతనికి
వాదలోఁ బొగడించుకోవలెఁగాక
వేడుకకు బిరుదులు వెసఁ బెట్టుకొంటేనేమి
తోడనే వాసుల తులఁదూఁగవలెఁకా(గా?)క ॥చెప్ప॥

యేతులు చూపితేనేమి ఇట్టె శ్రీవేంకటేశుచే
వాతప్పక బాసగొనవలెఁగాక
యీతఁడే నన్నేలె తానూ నేమిసేసినా నేమి
రేతిరిఁ బగలూఁ దమిరేఁచవలెఁగాక ॥చెప్ప॥ 3

సామంతం

సతి విన్నింతచేసినజాణనిఁ జెప్పేదిగాక
కతకారి పైతివి కడుఁజిన్నదానవు ॥పల్లవి॥

చెలులమఱుఁగులును చిత్తములో కరఁగులు
తెలిసిగ్గులును యేడఁ దెచ్చుకొంటివే
మలగుపై వొరగులు మరి నివ్వెరగులును
కలికి నీవెటువలెఁ గలిగించుకొంటివే ॥సతి॥

చిఱుతనవ్వులును చిందేటికొప్పుపువ్వులును
 కెఱలి నేఁ డెందు దొరకించుకొంటివే
కఱతలమాటలును కన్నులలో తేటలును
 గుఱుతు లిన్నేసి యెందుఁ గూడపెట్టుకొంటివే ॥ సతి ॥

కావరపుఁగెలపులు కమ్మకొన్న వలపులు
 యీవేళ నీవెట్టు గడియించుకొంటివే
శ్రీవేంకటేశుఁడట చేరి నిన్నుఁ గూడెనట
 వేవేలు నీచేఁత లెంత వెలయించుకొంటివే ॥ సతి ॥ 4

## కుంతలవరాళి

ఆసుద్దులే [1]చెప్పుకొనే మది [2]నీవేలడిగేవు
 దోస మానవెట్టకుము తోయరాదు మాకును ॥ పల్లవి ॥

వోరగండ్లనుఁ జూచి వొయ్యనే [3]నీవాకెను
 చేరి వాఁడికొనగోరఁ జిమ్మవా [4]నీవు
సారెకునుఁ దమిరేఁగ సన్నలు సేసుకొంటా
 పేరుకొని నీయింటికిఁ బిలువవా నీవు ॥ ఆసు ॥

తనువుఁదనువు సోఁక దండ నాకెఁ బెట్టుకొని
 ననుపు సేసుక కొంత నవ్వవా నీవు
నిను నాపె జంకించఁగా నిమ్మపంట వేసుకొంటా
 పెనఁగుచు వలపులు పెంచవా నీవు ॥ ఆసు ॥

పచ్చిదేర నీ వాపెను బలిమిఁ గాఁగిటఁబట్టి
 కొచ్చికొచ్చి మోవి చవిగొనవా నీవు
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
 తచ్చి యాకెఁ దెరలోన దాఁచవా నీవు ॥ ఆసు ॥ 5

1. చెప్పుకొనేము + అది 2. నీవు + ఏల + అడిగేవు. 3. 4 పునరుక్తి.

దేసాళం

బంగారువంటిమేనెల్లాఁ బచ్చినేసుకొంటివి
సింగారా లద్దములోనఁ జేరి చూచుకోవయ్యా ॥ పల్లవి ॥

అగ్గలమై సతిసొమ్ము లవె నీబుజాల నొత్తి
బిగ్గెఁ గాఁగిలించుకొని పెనఁగితివో
వొగ్గి వట్లుగట్టుక వున్నది నెలవిఁ దమ్మ
యెగ్గులేక విడెమునే సింతికిఁ బెట్టితివి ॥ బంగా ॥

మించి నీచేతులఁ గదుమెఱుఁ[1]గై జిడ్డంటె నదె
పొంచి జవ్వాదాపెమేనఁ బూసితివో
నించి లత్తుకరేకలు నీనొసల నంటినవి
వంచనతో నాపెకు వలచి మొక్కితివో ॥ బంగా ॥

కప్పి నీచెక్కులవెంటఁ గారీఁ బెఁ(బెం?)జెమటలు
చెప్పరానిచేఁత లట్టె నేసుకొంటివో
యిప్పుడు శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చొప్పులు నావల్ల గడించుక మెఱసితివో ॥ బంగా ॥ 6

రేకు 1302 ఆహిరినాట

సొరిది నీపంతాలెల్లాఁ జూచేరా నేను
సిరులనీకోరికలు చెల్లించేరా నేను ॥ పల్లవి ॥

అంతేసి నాకేమి చెప్పే వందుకేమి కానీలేరా
వింతలు నీసేఁతలెల్లా వింటిరా నేను
యెంతకెంత నీతోను యిప్పటనుండీనేల
చెంత నీచిత్తమురాను సేసేరా నేను ॥ సొరి ॥

---

† గీతలుగలది చిలుముతినినందున అస్పష్టము. 1. ఇందలి అర్థము కానరాదు.

నన్నేమి చెక్కు నొక్కేవు నవ్వువచ్చీ నాయలేరా
కన్నులారా నీఁచేతలు కంటిరా నేను
సన్నలా చాయలా నిన్ను సాదించఁగ మరియేల
మిన్నక కూచుండ నిన్నే మెప్పించేరా నేను ॥ సారి ॥

సారెఁ గాఁగిలించేవు చలములు దీరెలేరా
చేరి నీపొందులఁ దనిసితిరా నేను
యీరీతి శ్రీవేంకటేశ యిఁకఁ గాదనఁగనేల
కూరిమితో నిన్ను వేఁడుకొనేరా నేను ॥ సారి ॥ 7

కాంబోది

ఏల యింతసేసేవు యింటికి రావే
వేళవచ్చె నీకనైన విడెమందుకోవే ॥ పల్లవి ॥

వగరుఁబెదవులపై వులివచ్చినీమాఁటలు
చిగిరించి వలపులు చిమ్మిరేఁచీనే
తెగ నిండాఁజాఁచినతీగెసోగలచూపులు
తగిలి మర్మములంటి తమి పుట్టించీనే ॥ ఏల ॥

కలకలమనియేటికప్పురపునీనవ్వులు
తలఁపులో గుబ్బితిలి దైవారించీనే
పొలపు మిగిలినట్టిబొమ్మలనీజంకెనలు
తలకొవి యాసాసలఁ దగిలించీనే ॥ ఏల ॥

చక్కఁదనములనీసరసపువిలాసాలు
వెక్కసపువేడుకలఁ జొక్కించీనే
ఇక్కడనె శ్రీవేంకటేశుఁడనైననాకు
దక్కితివి నీచేఁతలు తడఁబడచీనే ॥ ఏల ॥ 8

భైరవి

ఇట్టె నాకు సిబ్బితయ్యీ నేమీ వనఁజాలను
 దిట్ట వాతవితలంపుఁ దెలియవే చెలియా ॥ పల్లవి ॥

తప్పకచూచితేఁ బతి దంట ఇది యనునో
 కప్పుర మడిగితేను గబ్బి యనునో
 అప్పటిఁ గానుకిచ్చితే నాసపడీ ననునో
 చెప్పవే బుద్ధి నే నేమిసేతునే వోచెలియా ॥ ఇట్టె ॥

నెలవుల నవ్వితేను చిత్తిణి ఇదెనునో[1]
 సొలసి పాదాలొత్తితే జూటరెనునో[2]
 వెలయఁగ మొక్కితేను వేసాలది యనునో
 నెలకొన్న వెరవులు నేరుపవే చెలియా ॥ ఇట్టె ॥

పచ్చిగా నేఁ జెనకితే పంతగత్తె యనునో
 రచ్చలో నేఁ గొసరితే రాఁగయనునో
 ఇచ్చట శ్రీవేంకటేశుఁ డింతలో నన్నేలినాఁడు
 మచ్చిక నాతని నాతో మరుపవే చెలియా ॥ ఇట్టె ॥ 9

శ్రీరాగం

ఏమిసేతుఁ జెప్పవే యేది నా కుపాయము
 ఆముకొన్న నావలపు లాఁపరాదే చెలియా ॥ పల్లవి ॥

కళ రేఁగ వానిమేను కలువల వేతునా
 కలయుమనుచు మొక్కి కాఁగిలింతునా
 మొలకచన్నుల నొత్తి మొనగోరు దాఁకింతునా
 పిలిచి పోకుండా నానవెట్టుదునా చెలియా ॥ ఏమి ॥

---

1. ఇది + అనునో. 2. జూటరి + అనునో.

యీకడిమోమౌదాఁకా నెసగి సొలతునా
కై కొని పాదాలొత్తి కరఁగింతునా
జోకతో మోవితేనెలు సోఁకించి చొక్కింతునా
కోకకొంగువట్టి వేఁడుకొందునా చెలియా ॥ ఏమి ॥

సురతపువిందుచెప్పి చూపులు నాఁటింతునా
సరుగ నిచ్చకముల జట్టిగొందునా
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
సిరుల నేఁ బొగడి మెచ్చింతునా చెలియా ॥ ఏమి ॥ 10

## పాడి

ఈపాటిది వలె నీకు నిన్నియునుఁ జెల్లఁబెట్ట
దాఁపురము గల్గె నీకు తానెవ్వరోయీ ॥ పల్లవి ॥

పొంకముగాఁ దిట్టీ పొలఁతి; నీమాటలు
వంకలొత్తి పూనుకవచ్చి నీకు
లంకెలై యడ్డాలు దూరీ లావుగా నిన్నాడుకొంటే
కొంకక యెందు గడించుకొఁ(కొం?)టివోయి యీకెను
॥ ఈపా ॥

బాసలు సేయఁగవచ్చి పలుమారు నీకుఁగాను
వాసితోఁ బొగడీ నిన్ను వద్దివారితో
సేసినచేఁతలకుఁ జెప్పీఁ గతకారణాలు
నేసుక యెన్నాళ్లాయఁ జెప్పవోయి యీకెను ॥ ఈపా ॥

తప్పులుదీరుచవచ్చి తక్కరిసీనడకలు
తప్పక సాకిరిచెప్పీఁ దగుదువంటా
ఇప్పు డిట్టె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
అప్పసము దాఁచుకొంటి వవునోయి యీకెను ॥ ఈపా ॥ 11

గౌళ

మేలు మేలు యిపీఁ గొన్ని మించె బూమిపైఁ గొత్తలు
సోలినున్నమిమ్మిద్దరిఁ జూచి వేడుకయ్యీని ॥ పల్లవి ॥

చెలరేఁగిచెలరేఁగి చెప్పీ నాపె సుద్దులు
పొలసిపొలసి కడుఁబొందు నేసీని
తలఁచుకతలఁచుక తగ నూడిగాలు నేసీ
యెలమి నీపెపొందు లినుమడించఁబోలు ॥ మేలు ॥

తగిలితగిలి నీపైఁ దమకము వించీవి
మొగమెత్తి మొగమెత్తి మోము చూచీని
నగినగి సారెసారె నాఁటించీఁ జన్నులు
మగువవలపు లినుమడిగాఁబోలును ॥ మేలు ॥

పెనఁగిపెనఁగి నిన్నుఁ బ్రేమఁ గాఁగిలించీని
తనిపితనిసి నిన్నుఁ దగ మెచ్చీని
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
నని చిద్దరివలపూ యినుమడిగాఁబోలు ॥ మేలు ॥ 12

రేకు 1303 పళవంజరం

మేలుసుద్ది చెప్పితేను మెచ్చవద్దా ఇఁకనైనా
కాలుదొక్కుదువు పాన్పుకడకు రావయ్యా ॥ పల్లవి ॥

వెలఁది యొకతె నిన్ను వెదకీ నేమిటికో
నొలవక నీమొగము చూపవయ్యా
పిలిచీ నప్పటనుండి పెదపెదయెలుఁగుల
పలుకవయ్యా యేల పరాకు నీకు ॥ మేలు॥

వాడి నేమోపెట్టుకొనివుండి నిన్నే తలఁచీని
అది గాపెఁ దెలుసుకోవయ్యా నీవు
నడిపీది విలుచుండి నన్ను నీకడకు నంపె
విడిది నీపొరుగే యీవింతలేల నీకు ॥ మేలు ॥

చేవమీర నేకతము చెప్పేనంటా నున్నది
నావంటిదే తానూ నేమి చెప్పేవయ్యా
శ్రీవేంకటేశ నన్నుఁ జేరి యిట్టె కూడితివి
సేవించే నాపెనే నేను చెప్పనేల నీకూ ॥ మేలు ॥ 13

సింధురామక్రియ

వద్దనేవా రెవ్వరు వలపు నీకుఁ గలితే
పెద్దరికముతోడనే పెండ్లాడరాదా ॥ పల్లవి ॥

సారెకు నాతనితోను సరసము లేమాడేవు
కోరికై తేఁ గాఁగిలించుకొనరాదా
తేరకొన మోముచూచి తిమిరి యాఁకారనేల
సారపుటాతనిమోము చవిగొనరాదా ॥ వద్ద ॥

పొసఁగ నితనికెంత పొంచిపొంచి లాచేవు
కొసరు గలితే వద్దఁ గూచుండరాదా
ముసిముసినవ్వులతో మొక్కులు మొక్కఁగనేల
విసవిస నాతనిచే విడెమందుకోరాదా ॥ వద్ద ॥

వొల్లనే యంటిముట్టి వూడిగా లేమిసేసేవు
చెల్లుబడై తేఁ జేఁతలు నేయరాదా
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వెల్లవిరి నీవాతవి వేఁడుకొనరాదా ॥ వద్ద ॥ 14

### లలిత

నేనే వుపచారా లేవి చెప్పవయ్యా
　వేసాలేల నేనేవు వేఁడుకొనే నిన్నును ॥ పల్లవి ॥

వింతవింతమాటలే వేగినంతా నాడితిరి
　బంతి విడెములు నేసి పరగితిరి
　కొంతదడ వూరకే గుట్టుతోడ నుంటిరి
　యెంతేసిబడలితివో యెఱఁగము నేము ॥ నేనే ॥

నడుమనడుమ మీరు నవ్వుకొంటా నుంటిరి
　బడినే సుతిగూఁడుక పాడుకొంటిరి
　విడివిగాఁ బంతాలతో నెత్తమాడుతా నుంటిరి
　అడరి నీవోర్పు దెలియను మాకు విపుడు ॥ నేనే ॥

వొప్పగ నుయ్యాలమీఁద నూఁగుకొంటా నుంటిరి
　కప్పుకొంటివి రెంటెము గళబెళను
　యిప్పుడు శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీడ
　దప్పిగొనవుగదా నీతలఁ పడిగేను ॥ నేనే ॥ 15

### సామంతం

ఎంత బయలీఁదించేవే యీతని నీవు
　ఇంత నేరకుండితేను యిల్లాల వవుదువా ॥ పల్లవి ॥

చూపులనే సొలసేవు చుట్టమువలె నాపతి
　రాఁపునేసి నీయింటికి రమ్మంటాను
　పూఁపచన్నుల నొత్తేవు బొమ్మల జంకించుకొంటా
　యేపున ముద్దుటుంగర మిమ్మవియంటాను ॥ ఎంత ॥

కోరి కొంగువట్టేవు కూరిమితో నప్పటిని
ఆరగించ విందుకు రమ్మనియంటాను
గోరనే చెక్కునొక్కేవు గుట్టుతోడ వేఁడుకొంటా
సారమైననీ మోవి చవిచూపుమంటాను ॥ ఎంత ॥

వుద్దండానఁ బెనఁగేవు వొడఁబడికగాఁ జెప్పి
వొద్దికై నీపొత్తునఁ గూచుండుమంటాను
కొద్దిమీర నన్ను నేలుకొనె శ్రీవేంకటేశుఁడు
సుద్దు లేమిచెప్పేవే చొక్కఁజేసుకొంటాను ॥ ఎంత ॥ 16

నట్టనారాయణి

చెలియా మఱవకువే చెప్పితి బుద్ది
తొలుతే గాలిగల్టటే తూరుపెత్తుమందురు ॥ పల్లవి ॥

బత్తితో నీరమణుఁడు పానుపుపై నున్నవాఁడు
చిత్తమురా విన్నపాలు నేసుకొనవే
హత్తినీతో సమేళమై యిప్పు డున్నవాఁడు
గుత్తపుగుబ్బల నొత్తి కొసరఁగఁగదవే ॥ చెలి ॥

నవిచి నీమోము చూచి నవ్వుతానే వున్నవాఁడు
చెనకి యేపనులైనాఁ జేయించుకోవే
కనుఁగొని నీమీఁదివే కన్నులై తా నున్నవాఁడు
పెనఁగి తమ్ములమిట్టె పెట్టించుకోఁగదవే ॥ చెలి ॥

మరిగి నీతోడుతనే మాటలాడుతా నున్నాఁడు
యెరవు లేకుండా వరమిప్పించుకోవే
ఇరవై నిన్నేలి చనవిచ్చి నీకు తా నున్నాఁడు
సరుగ శ్రీవేంకటేశు సారె మెప్పించఁగదే ॥ చెలి ॥ 17

ధన్నాసి

అందుకేమే నాసంతోస మదియేకాదా
కందువల నన్ను నిట్టె కరుణించుమనవే ॥ పల్లవి ॥

ఇంతవడి నన్నె చూచె యేమినోము నోచితినో
వింతలేల మాయింటికి విచ్చేయసీవే
యెంతేసి వేడుకొనీనే యెదురాదేనా నేను
అంతేపో వోయమ్మ అడుగఁగవలెనా ॥ అందు ॥

వేడుకై తేఁ జాలుఁగాక విచారమేల నాచేత
వూడిగము సేయించుకవుండుమనవే
పీడె మందుకోనీవే వేరేల తనవారమే
చూడవో చేసుకొంటేను చుట్టరికముగాదా ॥ అందు ॥

అడియాల మంపెఁ దాను అంత నేను బాఁతియైతే
యెడమాట లిఁకనేల యేలుమనవే
బడినే శ్రీవేంకటపతి దానె వచ్చి కూడె
కడమ లేదే మన్నించె కమ్మటి మెచ్చీని ॥ అందు ॥ 18

రేకు 1304 బౌళి

ఇతఁడే నావాఁడై తే నెవ్వరికీ లోఁగనేల
కతగా యీవుపాయము గంటినే వోచెలియా ॥ పల్లవి ॥

చిలుకలు వలుకనీ చేరి కోవిల గూయనీ
చెలువుఁ డాడినమాట చెప్పఁగదవే
కలువలు మెరయనీ కమలాలు చెలఁగనీ
తలఁపు దెలిసితివా తగిలి నీవతని ॥ ఇతఁ ॥

చందురుఁడు రానీవే చల్లగా లేతేరనీవే
యిందుకు వచ్చెనా తాను యెఱిఁగించవే
ఇందిందిరాలు రేఁగనీ యిగిరించనీ తీగెలు
కందువ నాపై బత్తిగఁ దా విభునికి ॥ఇతఁ॥

కప్పుర మగ్గువగానీ గందవా డెక్కుడుగానీ
వొప్పుగఁ బానుపుపై నాతఁ డున్నాఁడటే
కప్పి వసంతకాలము గానీ మరుఁ డెసగనీ
యిప్పుడు వచ్చి శ్రీవేంకటేశుఁడేలె నన్నును ॥ఇతఁ॥ 19

### ముఖారి

నన్ను చింతసేసినాఁడు నాయకుఁడు వలపించి
అన్నిటా మన్నించె నింకా నాఁపరాదు మనసు ॥పల్లవి॥

విందమువో తనమాట వేడుక నేమిచెప్పినో
పెందలకాదే దూతికఁ బిలిచి తేవే
పందెమువేసె నాతోను పతిఁదెచ్చేనంటాను
అందాఁకాఁ జిమ్మిరేఁగీ ఆఁపరాదు మనసు ॥నన్ను॥

చూతమువో తనమోము సొమ్ము లేమిదెచ్చినో
దూతిక యిక్కడికే తోడుకరావే
యేతులు నెరపె నాతో సిట్టె పొందులు సేసేనంటా
ఆతనిఁజూచినదాఁకా నాఁపరాదు మనసు ॥నన్ను॥

ఇత్తమువో తనకు మెచ్చి యిట్టె యాతనిఁ జూపితే
బిత్తరపుదూతిని రప్పించవే ఇందు
ఇత్తల శ్రీవేంకటేశు నెనయించెఁ దా చింతలో
హత్తి కూడె నీతఁ డింకా నాఁపరాదు మనసు ॥నన్ను॥ 20

పాడి

కన్నె గరుజవరాలు కామిని నీకు మేలుది
ఇన్ని సేవలును( జేసె నిక జాగులేటికి ॥ పల్లవి ॥

కొమరెగుబ్బ లదర( గొలిచివచ్చి( జెలి
చెమటలు గార(గాను సిగ్గుతోడను
అమర( బల్లకిమీ(ద నాపె( బెట్టుకొనరాదా
రమణి యలయికలు రచ్చవేయనే(టికి ॥ కన్నె ॥

సరిబిరుదువేకాన బిరబిర వచ్చిని
పరువులు వెట్టుకొంటా బడివాయక
ఇరవుగ గుబ్బముపై నిద్దరూ నెక్కకోరాదా
తరుణి నిందరిలో నింతలు సేయనే(టికి ॥ కన్నె ॥

కడుబుసకొట్టుకొంటా( గైదండ నీకిచ్చుకొంటా
యెడయక మేడయెక్కె నిందా(కా నీతో
తొడపై నిడుకోరాదా తోడనె శ్రీవేంకటేశ
పడ(తి( గూడితి వి(క( బచ్చిసేయనే(టికి ॥ కన్నె ॥ 21

కాంబోది

వేడుకైతే మాయింద్లకు విచ్చేయవయ్యా
యీడ నేమియడిగేవు యివిగో మాసుద్దులు ॥ పల్లవి ॥

మోవరానిమోపులు మునుకొన్నవలపులు
పూవకపూచేపూవులు పూ(పనవ్వులు
చేవలోనివే(గలు చెప్పరానివయసులు
యీవల నేమడిగేవు ఇవిగో మాసుద్దులు ॥ వేడు ॥

పట్టరానిపదనులు పంతపుమావాసులు
చెట్టులపై చిగురులు చిమ్ముఁజూపులు
పుట్టులపై తేనెలు పుడివోవిమామాటలు
యిట్టె యేమడిగేవు ఇదిగో మాసుద్దులు ॥ వేడు ॥

వెన్నెలలోపులఁగాలు వెక్కసపుమాసిగ్గులు
కిన్నెరమీఁటులు గిలిగింతరతులు
ఇన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ముఁ దొల్లె
యెన్నెవి యడిగేవయ్యా ఇదిగో మాసుద్దులు ॥ వేడు ॥ 22

ముఖారి

ఇంతులంట మగఁడట యేల మానేరు
వింతలుగ నీవెంత వేసాలు నేసేవే ॥ పల్లవి ॥

సలిగెగలుగువారు జంకింతురు రమణుని
వలచినవారు రవ్వలు నేతురు
బలిమిగలుగువారు పైపైఁ బెనఁగుదురు
నిలుచుండి చూచిచూచి నీవేల దూరేవే ॥ ఇంతు ॥

మనసెనసినవారు మందెమేళాలు నేతురు
ననుపైనవారు చెనకవత్తురు
తనియనివారు సంతతముఁ గొనరుదురు
వనితరో నీవేల వానులురేఁచేవే ॥ ఇంతు ॥

మేనవారయినవారు మంచి యేమైనాఁ జేతురు
పూని మరిగినవారు పొదుగుదురు
యీనెపాన శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
నానఁబెట్టుకొని నీవు నవ్వు లేమి నవ్వేవే ॥ ఇంతు ॥ 23

ఆహిరినాట

ఏమే నమ్మితిఁగదే యింకానేల దాఁచేవు
చేమంచితివేమో నాకుఁ జెప్పవే యాకతలు ॥పల్లవి॥

కళలు మోమునఁ దేరీఁ గారీఁ జెఁ(బెం?)జెమటలు
చెలి నిన్నాతఁ డేమైనాఁ జెనకెనచె
పిలువ నిన్నంపితేను పెనఁగులాడితివేమో
నెలవి నేమినవ్వేవు చెప్పవే యాకతలు ॥ఏమే॥

నాతి నీకొప్పదె జారె నలఁగెఁ గట్టినచీర
అతఁ డేమైనా నిన్ను నంటెనటవె
రాతిరెల్లా నాడనుండి రచ్చలు సేసితివేమో
చేతిసన్నేమి చూపేవు చెప్పవే యాకతలు ॥ఏమే॥

మోవిపైఁ గెంపులు నిండె ముడిచిన కొప్పు(కొంగు?)జారె
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెందెనటవే
నీవెంటనే వచ్చె తాను నేఁడు నన్నూ నేలెఁ బతి
సేవ లేమిసేసేవు చెప్పవే యాకతలు ॥ఏమే॥ 24

రేకు 1305 ఆహిరి

చిత్తాన నెగ్గుపట్టకు చేతులెత్తి మొక్కేమిదె
కొత్తకొత్తవయసులకోమలులము ॥పల్లవి॥

కెలతుము సొలతుము కేరడము లాడుదుము
వలపులు చల్లుదుము వనితలము
పిలుతుము పేరుకొని ప్రియములు చెప్పుదుము
సళుపుఁజూపులఁ జూచి సరసమాడుదుము ॥చిత్తా॥

వినయాలు సేతుము వేడుకతో నవ్వుదుము
చనవున మెరతుము జవరాండ్లము
పెనఁగుదుము పైకొని పెక్కుచేఁతలు సేతుము
మనసులు గరఁగించి మరిగింతుము ॥ చిత్తా ॥

యెప్పుడైనాఁ గూడుదుము యెంగిలిమోవి సేతుము
చెప్పుకొందుము నీపొందు చెలులము
ఇప్పుడే శ్రీవేంకటేశ యేలితి విన్నిటా మమ్ము
కుప్పలుగాఁ జొక్కించి గురుతులు నింతుము ॥ చిత్తా ॥ 25

గౌళ

నేరుపే విధానము నెలఁతలకు
తారుకాణ నామాట తలఁచుకోవే ॥ పల్లవి ॥

వినయములే సేసి వేడుక వుట్టించితే
మనసు గరఁగు నిట్టె మగవానికి
యెనయఁ గొలువుసేసి ఇచ్చకమే నెరపితే
ననుపులు సమకూరు నాయకునికి ॥ నేరు ॥

చెప్పినట్టెల్లాఁ జేసి చేరి పాయకుండితేను
కప్పుకొనుఁ దమకము కాంతునికి
వొప్పుగా మాటలాడి వోరిమతో మెలఁగితే
చిప్పిలఁ గళలు రేఁగు చెలువునికి ॥ నేరు ॥

చతురత నవ్వు నవ్వి సరసము లాడితేను
రతులఁ గాంక్షలు వుట్టు రమణునికి
సతమై శ్రీవేంకటేశు సతివైతి విట్టె తే
యితవులౌ నన్నియును యితనికిని ॥ నేరు ॥ 26

సాళంగం

ఎటువంటిపొందులో మీ కిద్దరికిని
ఇటుకన నీలోనే తలచుకోవయ్యా ॥ పల్లవి ॥

పట్టెడేసిగుబ్బలపడతి మొక్కితిననె
నెట్టన బంగారువంటినీపాదాలకు
మట్టున నీతోడుత మాటలాడి రమ్మనె
యిట్టె మారుత్తరము లేమని చేప్పేవయ్యా ॥ ఎటు ॥

చేరడేసికన్నులచెలి యడిగితినసె
చేరి నీపరిణామపుచేతలెల్లాను
వేడుసేయ కిట్టె నీవేళ చూచి రమ్మనె
నేరుపు మాపెతోడుత నేనేమందునయ్యా ॥ ఎటు ॥

కాగెడేసిపిఱుదులకాంత వలచితిననె
వీగక నీవుగూడినవేడుకలను
కాగిటిలో నిన్నుం దన్నుం గలపుదువు రమ్మనె
యేగివచ్చి శ్రీవేంకటేశ కూడితివయ్యా ॥ ఎటు ॥ 27

ఆహిరి

వలపులేవిజోలి వట్టివిరాలి
యెలయించె నన్నుం దాను యేమిసేయుమనీనే ॥ పల్లవి ॥

మంతనములే యాడితి మాపునాకాం దనతోను
వింతగాం జోకటాలాడి వేగించితి
చెంతనే పొద్దులువుచ్చి చెలరేగి నవ్వితి-
నింతసేసె నన్ను దానె యేమిసేయుమనీనే ॥ వల ॥

సారెసారె రచ్చలోన సరసములాడితి
కోరి కొలువులుసేసి గుబ్బతిలితి
తేరకొనఁ జూచిచూచి తేలితిఁ దనమాయల
యీరీతిఁ దా నింతసేసె నేమిసేయుమనీనే ॥ వల ॥

ఆసాసలఁ గొంతవడి యట్టె పాదాలొత్తితి
రాసినసిగ్గులలోన రాఁపైతిని
సేసవెట్టి నన్నుఁ గూడె శ్రీవేంకటేశ్వరుఁడు
యీసులే కింతసేసెఁ దా నేమిసేయుమనీనే ॥ వల ॥ 28

మధ్యమావతి

కంటిమి వింటిమి నీకతలెల్లాను
దంటవై పొగడించుకోఁ దగుదువే నీవు ॥ పల్లవి ॥

కన్నులారిచేవు యెంతకలికితనమో నీది
సన్నలు సేసే వదేమిజాణతనమో
చన్నులతో గునిసేవు సాము లెంతనేరుతువో
యిన్నిటా నీమురిపెము లేమి చెప్పేదే ॥ కంటి ॥

యేకతములాడేవు యేమేమెఱుఁగుదువో
కైకొన విదేటివాసికత్తెవో నీవు
దాఁకొని నవ్వేవు దొరతనమెట్టిదో యిది
యీకడ నీపెద్దరిక మేమి చెప్పేదే ॥ కంటి ॥

కాలుదొక్కఁబూనే వెంతకతకారితనమో
వోలవేయఁ జొచ్చే వెంతవొయ్యారివో
యేలె నన్ను శ్రీవేంకటేశుఁడు నీవు లాచేవు
యీలీల నీపగటులు యేమిచెప్పేదే ॥ కంటి ॥ 29

నాదరామక్రియ

ఎటువంటివిలాసిని యెంతజాణ యీచెలువ
తటుకన నీకు దక్కె దైవారఁజూడవయ్యా ॥పల్లవి॥

మగువ మాటాడితేను మాణికాలు వెండుకొనీ
పగడాలు పెదవులఁ బచ్చిదేరీని
మగిడిచూచితేను మంచినీలా లుప్పతిలీ
తగు నీకు నీపెదిక్కు తప్పకచూడవయ్యా ॥ఎటు॥

పడఁతి జవ్వనమునఁ బచ్చలు గమ్మికొనీని
నడచితే వైడూర్యాలు వెడలీ గోళ్ల
తొడిఁబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు
వొడికమైనది యీపెవొరపు చూడవయ్యా ॥ఎటు॥

కొమ్మ ప్రియాలతేనెలఁ గురిసీఁ బుష్యరాగాలు
కుమ్మరించీఁ జెనకుల గోమేధికాలు
ముమ్మరపుఁజెమటల ముత్తెపుసరాలు నిండీ
నెమ్మది శ్రీవేంకటేశ నీదేవిఁ జూడవయ్యా ॥ఎటు॥30

రేకు 1306 సామంతం

ఎంతవేడుకో నీకు నిటువంటిచేఁతలు
మంతుకెక్క నేనూ నీమతి గరఁగించేను ॥పల్లవి॥

చల్లరితనాన నీపైఁ జూపులు చిమ్మికొంటా
విల్లఁగోట్లాడీ నీప్రియురాలు
కొల్లలుగఁ గొనగోళ్లఁ గుంకుమచెమట నించి
చల్లీ వసంతము నీపై జవరాలు ॥ఎంత॥

వాడికమాటల నిన్ను వలపులు రేఁచి రేఁచి
వేడుకలు గాదేఁటోసీ విత్తరాలు
వోడక బొమ్మజంకెన నుదుటులు చూపుకొంటా
జాడతోఁ బంతాలు దూసీ చదురాలు ॥ ఎంత ॥

నేసవెట్టి నిన్నుఁగూడి చిరునవ్వు నవ్వుకొంటా
మూసిదాఁచీ సిగ్గులు ముద్దరాలు
వాసితో శ్రీవేంకటేశ వరుసరతుల నీకు
యీసుదీర సేవసేసీ నిచ్చకరాలు ॥ ఎంత ॥ 31

వరాళి

ఎందాఁకా మనసుచూచే వేమిటోలిఁ బెట్టేవు
అంది కాఁగిలించుకొని యాదరించవయ్యా ॥ పల్లవి ॥

చెప్పరానిప్రియములు చెప్పిచెప్పి నీకును
కప్పురము గానుకిచ్చెఁ గలికి
కొప్పుజార మొక్కిమొక్కి కూరిమి గొసరీ నిన్ను
తప్పక యిఁకనైనాను దయదలఁచవయ్యా ॥ ఎందాఁ ॥

సేయరానివినయాలు చేసిచేసి యప్పటికిని
పూయమని గందమిచ్చె బొలఁతి
చేయిమీఁదుగా నిన్నుఁ జెక్కునొక్కి వేఁడుకొనీ
పాయరానిచనవిచ్చి పాలించవయ్యా ॥ ఎందాఁ ॥

ఆదరానిమంతనము లాడియాడి నీముందర
పీడెము చేతికిచ్చె వెలఁది
యీడుజోడై శ్రీవేంకటేశ ఇప్పు డేలితివి
వేడుకలెల్లాఁ జేసి వెలయించవయ్యా ॥ ఎందాఁ ॥ 32

బౌళి

ఏమిటాఁటి నేము నీకు యేల తడవేవు మమ్ము
కామునిదీములమైనకాఁతలము ॥ పల్లవి ॥

వాసులకు నొడిగట్టి వంతులకుఁ జేయిచాఁచి
ఆసలనే చెలఁగేటియంగనలము
నేసలు మీఁదటఁ జల్లి సిగ్గులనేపొరలేటి-
మూసినముత్యాలు(ల?)వంటిముగుదలము ॥ ఏమి ॥

చిమ్ముఁజూపులను జూచి చిత్తములోఁదలఁచేటి-
వుమ్మగిలువలపుల వువిదలము
తమ్మిమోము విచ్చి నవ్వి తమకించి పెనఁగేటి-
కుమ్మరింపుఁగోరికలకోమలులము ॥ ఏమి ॥

అంకెల గుబ్బలనొత్తి అంతలోనే వేఁడుకొనే-
కొంకుఁగొనరెఱఁగనికొమ్మలము
పొంకాన శ్రీవేంకటేశ పొదిగి నన్నేలితివి
కంకణముగట్టుకొన్నకామినులము ॥ ఏమి ॥ 33

సామంతం

ఏల జాగరాలు నేనే విటు నే నుండఁగాను
వేళవచ్చెఁ గూడరాదా వెఱపుమీ కేఁటికి ॥ పల్లవి ॥

మచ్చికతో మీరిద్దరు మాటాడుకోరాదా
కచ్చుపెట్టి నే వాకిటఁ గాచుకుందేను
విచ్చనవిడిగా నింక విడేలుసేయరాదా
యిచ్చిపంపెఁ జెలిచేత నెన్నయినాను ॥ ఏల ॥

గాఁటముగా నొండొరులు కాఁగిలించుకోరాదా
తేటతెల్లమి గాకుండాఁ దెరవేసేను
చాటువగా మోవితేనె చవులుగొనఁగరాదా
పూటలుగా మోమురసా లుబ్బఁజేసెను ॥ ఏల ॥

పానుపుపై నాపె నీవూఁ బవళించి వుండరాదా
కానిమ్మని పచ్చడము గప్పె మీకును
యే నలమేలుమంగను నన్నేలితి శ్రీవేంకటేశ
పూని మీమనసు లిచ్చె పొత్తుగలపేను ॥ ఏల ॥ 34

కన్నడగౌళ

అందుకు మనసు నిల్పనలవిగాదుగావి
కందువతో నీపొందు కలకాలము మేలు ॥ పల్లవి ॥

వెదకి వెదకి నీపైవిరహాన వేఁగుకంటే
కొదదీర నిద్రించినాఁ గొంతమేలు
యెదురులు చూచి నీకు నేఁకారుతానుండుకంటే
చదుర(రం?)గమాడి పొద్దు జరపినా మేలు ॥ అందు ॥

ఆసల నిన్నుఁ దలఁచి యసురుసురవుకంటే
వేసరక చుక్క లెంచివేసినా మేలు
నీసుద్దులు వినివిని నెమ్మి గుబ్బతిలుకంటే
వాసితో నింటిలో వీణ వాయించినా మేలు ॥ అందు ॥

నవ్వులు నవ్వుతా నిన్ను నాఁటఁగఁ జూచుటకంటే
చివ్వన నీమోవి గంటిసేయుటే మేలు
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నివ్వటిల్లేమనరతినివ్వెరగే మేలు ॥ అందు ॥ 35

పాడి

ఇంతే కలితే మీరు మాఇంటిలోని కేఁగరాదా
చెంత మీరు సన్నలేల సేసుకొనేరు ॥పల్లవి॥

మొక్కలాన నాకె నీవూ మోములు చూచుకొంటాను
పక్కన నట్టె సిగ్గులుపడుకొంటాను
అక్కరతో నంతలోనే యాసల మాటలాడుకొంటా
ఇక్కడ మీరెందాఁకా నేలాటాలాడేరు ॥ఇంతే॥

చెలరేఁగి యిద్దరును సెలవుల నవ్వుకొంటా
చలపట్టి బొమ్మలను జంకించుకొంటా
నిలువునఁ గరఁగుతా నివ్వెరగు లందుకొంటా
వలపుల నెందాఁకా వసివాడేరు ॥ఇంతే॥

చేవమీరి మీకుమీరే చేఁతలు మెచ్చుకొంటాను
యీవల నన్నేలి విడె మిప్పించుకొంటా
శ్రీవేంకటేశుఁడ కూడి చేరి యలమేల్మంగాను
వేవేలకు నెందాఁకా వినోదాలాడేరు ॥ఇంతే॥ 36

రేకు 1307 రామక్రియ

ఆతని కొక్కతెవే నీ వాలవైతివా
సతులందరును నీసాటివారేకారా ॥పల్లవి॥

గాదెఁబోసుకొనేవేమే గంపముంచి వలపులు
పోదిసేసి రమణునిపొంత నీవుండి
పాదుసేసి విత్తేవేమే పదనుతో నీసిగ్గులు
ఆదిగొని చన్నులు పయ్యదఁ గప్పికప్పి ॥ఆత॥

వెదచల్లే వదియేమే వెన్నెలవంటినవ్వులు
కొదదీర నీతనికొలువునను
తుదఁ బచారించేవేమే తొంగితొంగి నీచూపులు
చెదరిననీకొప్పు చేతఁ బెట్టుకొంటాను ॥ అత ॥

వాడిఁగట్టుకొనేవేమే పుబ్బరిసంతోసాలు
కడఁగి శ్రీవేంకటేశుకాఁగిటఁ గూడి
నడుమ నీ వదియేమే నన్ను నీతఁ డిపు దేలె
అదరి యలమేల్మంగనౌత నీవెలుఁగవా ॥ అత ॥ 37

భల్లాటి

ఉద్దండము నయమును వొనరి నీయందున్నవి
సుద్దులేల చెప్ప నీవే చూచుకొనరాదా ॥ పల్లవి ॥

పొంచిపొంచి యాతనిని బొమ్మల జంకించనేల
మంచితనములు చూపి మాటాడరాదా
ఇంచుకించుక సొలసి యెలయించ నింతయేల
కంచపుమోవి చూపి కరఁగించరాదా ॥ ఉద్దం ॥

కన్నులఁ దప్పకచూచి ఘాతలు సేయఁగనేల
నున్ననిచేతులఁ జెక్కు నొక్కఁగరాదా
చన్నుమొనలు దాఁకించి సాదించ నిదియేల
చిన్నినెలవుల నవ్వి చిక్కించుకోరాదా ॥ ఉద్దం ॥

పంతపుఁజేఁతల నిట్టె పట్టి పెనఁగఁగనేల
చెంతని నిరతిఁ గూడి చెనకరాదా
అంతటి శ్రీవేంకటేశునలమేల్మంగవు నీవు
వింతగా నన్నితఁ దేలె వేగమె మెచ్చరాదా ॥ ఉద్దం ॥ 38

తెలుఁగుఁగాంబోది

నీకేమి గలిగినాను నెమ్మి సది నాలాటము
జోకగా నానతీవయ్యా సొంపుగా వినేను ॥ పల్లవి ॥

చెక్కులమీఁదట నవే చెమటలూ। నీ-
చక్కనిమోమున నవే చంద్రకళలు
యెక్కడఁ గలిగెనయ్యా యింతేసి
నిక్కము చెప్పఁగరాదా నేనూ వినేను ॥ నీకే ॥

సెలవుల నవిగో చిఱునవ్వులూ। నీ-
తలిరుమోవిని నిండె తగుకెంపులు
యెలమి నీకె యమరె నీకొత్తలు
నెంకొవి చెప్పరాదా నేనూ వినేను ॥ నీకే ॥

తారలె నీనొసల లత్తుకచిన్నలూ। నీ-
విరవయిన శ్రీవేంకటేశుఁడవు
పురాన నలమేల్మంగ నున్నదానను
విరతితోఁ జెప్పరాదా నేనూ వినేను ॥ నీకే ॥ 39

సామంతం

ఎంత సణఁగులు రాల్చే వితనిమీఁద
చెంత నిన్నుఁ గూడి పచ్చిసేయ కేల మానునే ॥ పల్లవి ॥

పలుకులఁ గొసరుతా పయ్యదను విసరుతా
చిలుకుగోరికొనలఁ జిమ్ముతాను
యెలయించి రమణునికేల వొడ్డించుకొనేవే
బలుసిచన్ను లాతఁడు పట్టితే నేమాయనే ॥ ఎంత ॥

బొమ్మల జంకించుతాను బొంచి యానలు వెట్టుతా
పమ్మిఁజూపుపంతాలు పచారించుతా
యెమ్మెలకు నాతనితోనేల సాములునేసేవే
నిమ్మపంట వేసితేను నీకేమాయనే ॥ ఎంత ॥

ఆయములు దాఁకించుతా నంటిముట్టి పెనఁగుతా
చాయల సన్నల నిన్ను సాదించుతాను
పాయ కలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడు
యీయెడ నిన్నేలి చనవిచ్చితే నేమాయనే ॥ ఎంత ॥ 40

బౌళి

చూడ ముద్దరాలుగాని జూటరి యిది
యేడ నీపె నెట్టు గడియించుకొంటివయ్యా ॥ పల్లవి ॥

కదలుఁగన్నులఁ జూచి కప్పురము గానుకిచ్చి
పెదవుల మాటలాడి బెల్లించీ నాకె
వెదచల్లి నేరుపుల వేడుకలు నీకుఁ జేసి
యెదుటనే నిలుచుండి యెలయించీ నిన్నును ॥ చూడ ॥

తరితీపుమాట లాడి తమకము నీకు రేఁచి
తెరమాఁటువలపులఁ దేలించీ నాకె
పొరపులు నీకుఁ జూపి వొడిఁబెట్టి వావులు
గరిమలఁ జొక్కించి కరఁగించీ నిన్నును ॥ చూడ ॥

జోకగాఁ బ్రియాలు చెప్పి చుట్టరికాలు నటించి
మేకులనే నిన్నుఁ గూడి మెప్పించీ నాకె
పైకొని యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడ
నాకు మగఁడవైతివి నవ్వించీఁ దా నిన్నును ॥ చూడ ॥ 41

పాడి

నీకొలఁదివారమా నేమెల్లాను
కాకునేయఁజాలక కనుఁగొనేఁగాక ॥ పల్లవి ॥

పంత మేమినెరపేవే పగటేమి చూపేవే
కొంతైనా సిబ్బితిలేక కొలువులోన
వంతుకేల పెనఁగేవే వట్టి(ద్ది?)వారితో నీవు
ఇంతటినాయకుఁడు విన్నేమీ ననఁడంటాను ॥ నీకొ ॥

వేసా లేలసేసేవే వెగటేల సలిపేవే
వాసులేమీ నెంచక వనితలతో
తోసుకేల వచ్చేవే తోడివూడిగపువారి
యీసేఁత లాతఁడు చూచి యేమీ ననఁడంటాను ॥ నీకొ ॥

నెలవినేల నవ్వేవే సిగ్గులేల పెంచేవే
తలఁపేమీ నెఱఁగనితగువారిలో
అలమేలుమంగపతియగుశ్రీవేంకటేశుఁడు
యిల నన్నేలె నిన్నా(న్నా?)తఁడేమీ ననఁడటాంను ॥ నీకొ ॥42

రేకు 1308 ఆరిబి

అందులకే వెరగయ్యీ నతివరో విన్నుఁ జూచి
సందుకొని యాతవితో సరసములాడేవు ॥ పల్లవి ॥

మత్తిలి నీరమణునిమన సెట్టు గంటివే
కొత్తకొత్తవలపులకొడెదానవు
యిత్తల నీతఁ డిప్పుడే యెట్టు గైవసమాయనే
హత్తి కడునవ్వేవు అంతలోనే నీవు ॥ అందు ॥

కలికితనాల నెంత కాఁపురాలు సేసేవే
మొలకచన్నులతోడిముద్దరాలవు
చలివాసి యింతలోనే చనవరివై తివటే
బలిమి నాతని మీరి పలికేవు నీవు ॥ అందు ॥

రాఁపుగ శ్రీవేంకటేశు రతి నెట్టు గూడితివే
పూఁపజవ్వనముతోడిపోడికత్తెవు
యేపున నలమేల్మంగ యేమినేరుచుకొంటివే
ఆఁపరానితమితోడ నడరేవు నీవు ॥ అందు ॥ 43

శంకరాభరణం

ఎక్కడికెక్కడ మరుఁదేలికట యిన్నిటికి
యిక్కువల నూరఁగూట మెట్టు గూడెనే ॥ పల్లవి ॥

కొలనిలో తుమ్మిదలు కొండలలోనిచల్లగాలి
చెలరేఁగి పలికేటిచిలుకగుంపు
మొలవాఁడివిరులును మోయిలులోని మెఱుఁగు
యెలమి నూరఁగూట మెట్టుగూడెనే ॥ ఎక్క ॥

కావరపుచందురుఁడు కడువేఁడివెన్నెలలు
చేవమీరినట్టిలేఁతచిగురులును
పావురపుఁబలుకులు బలువసంతునిడాక
యీవిధాన నూరఁగూట మెట్టు గూడెనే ॥ ఎక్క ॥

చిమ్మిరేఁగేవలపులు చెఱకుసింగిణివిల్లు
తెమ్మలకోరికలపొందికరతులు
కొమ్మయలమేలుమంగఁ గూడె శ్రీవేంకటేశుఁడు
యెమ్మెల నూరఁగూటము లెట్టు గూడెనే ॥ ఎక్క ॥ 44

బౌళి

చిన్నదాన పైతేనేమి చేఁతలు పెద్దవిగావా
సన్నలా చాయలా నీకు జడియఁగనేఁటికే ॥ పల్లవి ॥

సిక్కనిక్కి పతిఁజూచి నీడనుండి యలసేవు
చెక్కులవెంటాఁ జెమట చిందుకొనేవు
అక్కర ఇంతగలితే నాతనిఁ బెండ్లాడరాదా
వుక్కుమీరి యాసలను వుమ్మగిలనేఁటికి ॥ చిన్న ॥

చేరిచేరి మాటలాడి చెనకి బయలీఁదేవు
వూరకే లోలో నస్సురుస్సురంటాను
కూరిమింత గలిగితే కొంగుపట్టి తియ్యరాదా
సారెసారె కొప్పువీడి జాలిబడనేఁటికి ॥ చిన్న ॥

వచ్చివచ్చి నవ్వునవ్వి వలపు చవిగొనేవు
మెచ్చె శ్రీవేంకటేశుఁ డలమేలుమంగవు
మచ్చికింత గలిగితే మరిమరిఁ గూడరాదా
యిచ్చ నన్నేలీ నీవేఁక నెచ్చరించనేఁటికే ॥ చిన్న ॥ 45

ముఖారి

మఱి వెనక నాతోను మాటలాడుదువుగాని
గుఱుతులు దాఁచుకోవే కొమ్మలు నవ్వేరు ॥ పల్లవి ॥

పిక్కటిల్లుఁ జన్నులపై పెనగొన్నహారాలు
చిక్కువడీ దిద్దుకోవే చక్కఁగా నీవు
చుక్కబొట్టు చెమటలఁ జొబ్బిలఁగాఁ గరఁగెను
గక్కన నద్దముచూచి గంధముపెట్టుకోవే ॥ మఱి ॥

కొప్పులోవిసంపెఁగలు కొఁణికలవెంటజారీ
విప్పక ముడుచుకోవే వేగఁ దురుము
పిప్పిగట్టి పెదవులు పిరి(డి ?)చినట్టున్నది
దప్పిదేర వేసుకోవే కప్పురబాగాలు ॥ మఱి ॥

కట్టినచీర వదలి కానవచ్చీఁ బోఁకముడి
వొట్టి బిగించుకొనవే వొడ్డాణము
యిట్టె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నెట్టన నన్నేలెఁ బొందు నీవూఁ దెలుపుకోవే ॥ మఱి ॥ 46

## ద్రావిళభైరవి

చెప్పితి నీచిత్తము చెలిభాగ్య మిఁకను
తప్పదు కలిగినది దాఁచ నీకు నేను ॥ పల్లవి ॥

వలఁది యిప్పుడు నీవేళ చూచి రమ్మనె
తలఁపు నీకెట్టున్నదో తెలియుమనె
కలపుకోలుగాఁ దనకానుకిచ్చి రమ్మనె
పిలిచి తెమ్మనె నింతి ప్రేమ దాఁచనేఁటికి ॥ చెప్పి ॥

తనతో నీవన్నమాట తలఁపించి రమ్మనె
వినయములెల్లాఁ జేసి వేఁడుకొమ్మనె
మునుపనె తనమారు మొక్కులు మొక్కుమనె
తనుఁజూడ రమ్మనె దాఁచ నిఁకనేఁటికి ॥ చెప్పి ॥

[1] ఇంతలో నీరాకకు నెదురుకొనీ(నే?) రమ్మనె
చెంత నీవేలితివి మెచ్చితి విన్ననె
అంతటిశ్రీవేంకటేశ యలమేలుమంగ యీకె
మంతనాన గూడితిరి మఱి దాఁచనేఁటికి ॥ చెప్పి ॥ 47

1. ఈచరణపూర్వార్ధ మంతసుఘటితార్థము గాదు.

నాదరామక్రియ

ఎఱఁ(ఱిఁ?)గించవే నాకు విట్టె వూరకుండేఁగాని
గుఱుతు దెలుసుకొని గుట్టుసేసుకొనేను ॥పల్లవి॥

చెలికత్తెలకునేల పిగ్గులుమూఁటగట్ట
అలరి దేవులకైతే నమరుఁగాక
కొలువులో నీవేల కోర తలవంచేవే
నెలవై యాతనిపొందు నీకూఁ గొంత గలదో ॥ఎఱఁ॥

పొరుగుదానికినేల బువ్వానఁ గూచుండ
గరిమతో సమ్మందము గలితేగాక
సరసుఁ దారఁగించఁగా సంగడిఁ గూచుంటివేమే
ఆరయ నీకిట్టె తొల్లి నలనా(వా?)టు గలదో ॥ఎఱఁ॥

కెలనిమగువకేల కెరలి సరసమాడ
లలి మఱఁదల నాకెలాగౌఁగాక
అలమేలుమంగపతియైనశ్రీవేంకటేశుఁడు
కలసె నన్ను నీకూఁ గారణము గలదో ॥ఎఱఁ॥ 48

రేకు 1309 సాళంగనాట

వట్టియెమ్మెలు చెప్పఁగా వచ్చేదేమే
నెట్టన నాజలెనే మన్నింపించుకోవలెఁటో ॥పల్లవి॥

వాసికత్తెయైనది వదిఁ బంతాలు చూపదు
సేసి చూపు నూడిగాలు చేరి పతికి
రాసికెక్కినగరితె రవ్వసేసి మాటాడదు
మూసినముత్తెమువలె ముచ్చటలే యాడును ॥వట్టి॥

నేరుపరియిల్లాలు నేరమెంచదు విభుని
కోరి తనుమన్నించినగుణా లెంచును
సారమైనచదురాలు సణఁగులు నెరపదు
గారవించి తనఇచ్చకములే నెరపును ॥ వట్టి ॥

జడిసి మానాపతి చలము సాదించదు
పుడమి శ్రీవేంకటేశుపొందు సాదించు
అదరి నన్నేలె నాతఁ డలమేల్మఁ(మం?)గను నేను
యెదయనిచుట్టమైన దిట్టనే వుండును ॥ వట్టి ॥ 49

రీతిగౌళ

తొయ్యలి నీభాగ్యమున దొరకెఁగాక
వెయ్యైనా నీపెకు మరి వెల యేదయ్యా ॥ పల్లవి ॥

పలచనిపెదవుల బచ్చితేనియలు గారీ
మొలకలై సెలవుల ముత్యాలు రాలీ
నెలకొన్నచన్నులను నిమ్మపండ్లుప్పతిలీ
వెలఁదిజవ్వనానకు వెలయేదయ్యా ॥ తొయ్య ॥

నెఱిఁగుఱులను మంచినీలపురంగులు మించీ
మెఱుఁగులు మొగమున మేళవించీని
పిఱుఁదుపెంపరసితేఁ బెరసీఁ గరికుంభాలు
మెఱసేయీజవ్వనముమేలువెల యేదయ్యా ॥ తొయ్య ॥

పాదపుసొబగులను పద్మరాగా లొలికీని
పాదుకొనె దేహమెల్లా బంగారువన్నె
యీదెస శ్రీవేంకటేశ యేలితి వీకె నింతలో
యేదైనా యీజవ్వనాన కిఁక వెల యేదయ్యా ॥ తొయ్య ॥ 50

వరాళి

పిలుచుకవచ్చితివా ప్రియుని నీడకు నేఁడు
తలపోసితలపోసి తడబడీ నాసలు ॥పల్లవి॥

కుప్పలాయఁ దెప్పలాయఁ గోరికలు నాకు నేఁడు
యెప్పుడు వచ్చునే పతి యేమే చెలియా
చెప్పరాదు చూపరాదు చిత్తములో తమకము
కుప్పళించినట్లు మేనఁ గురిసీఁ జెమటలు ॥పిలు॥

తతివచ్చె మితివచ్చె తప్పక నాజవ్వనము
అతఁ డేమి నేసీనే అదఁ జెలియా
రతికెక్కె నుతికెక్కె రాఁపుల నావలపులు
చతురతఁ జె(జి?)మ్మిరేఁగీ సారె నావేడుకలు ॥పిలు॥

పచ్చిదేరీ మెచ్చువారీ పైకొన్ననాకూటములు
ఇచ్చల శ్రీవేంకటేశుఁ డేలెఁ జెలియా
తచ్చనేల గిచ్చనేల దాకొనె సంతోసాలు
అచ్చమై యీతనిమీఁద నమరీ మచ్చికలు ॥పిలు॥ 51

దేశాక్షి

కొత్తపెండ్లికూఁతు రిది గుట్టుతోడిమానిసి
చిత్తగించి మెల్లనే చెనకఁగరాదా ॥పల్లవి॥

చెక్కుచేతితోడఁ జెలి సిగ్గువడి వుండఁగాను
వుక్కుమీరి కాతరాన నొడివట్టేవు
మక్కువతోడుతఁ దెరమఱఁగున నున్నదాని
జక్కవలఁ బోలునంటా చన్నులంటేవు ॥కొత్త॥

ముసిముసినవ్వులతో మోమువంచుకుండఁగాను
సుసరాన మర్మములు సోఁకనాడేవు
పసగా నీదిక్కు చూచి భావము గరఁ(గ)గాను
కొసరికొసరి నీవు గోరఁ జిమ్మేవు ॥ కొత్త ॥

చెప్పరానిమోహముతో చిమ్మిరేఁగియుండఁగాను
కప్పురముమోవి విచ్చి కాఁగిలించేవు
యిప్పుడే శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గూడెనని
చిప్పిల సరసమాడి చేత గిలిగించేవు ॥ కొత్త ॥ 52

శ్రీరాగం

ఎంతని చెప్పేము నీకు యింతి నీపైఁగలబత్తి
చెంత నీవే చూతువు విచ్చేయవయ్యా ఇంటికి ॥ పల్లవి ॥

తరుణి నీరూపము తలపోసితలపోసి
శిరసూఁచి మెచ్చిమెచ్చి చెంగలించును
గరిమ నీవిచ్చినవుంగరము తప్పకచూచి
మరిగి సంతోసాన మనసు గరఁగును ॥ ఎంత ॥

చెలులచే నీసుద్దులు చెవులారా వినివిని
నెలవుల నవ్వినవ్వి చిమ్మిరేఁగును
మెలుపున నీపంపినచిలుకతో మాటలాడి
వెలలేనివేడుకల విఱ్ఱవీఁగును ॥ ఎంత ॥

వేసరక నీరాకకు వేళగాఁచి వేళగాఁచి
ఆసలనే చొక్కిచొక్కి యానందించును
నేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ యింతలో
వాసితో నీరతికేలి వరుసఁ బొగడును ॥ ఎంత ॥ 53

హిందోళం

ఏమని చెప్పుదునే యింతిరో నాముచ్చటలు
సాములు సేసె నాతో నరసపువిభుఁడు ॥ పల్లవి ॥

కన్నులఁ దాఁ జూచితేను కరఁగె నామనసు
సన్నల మోవిఁ జేసితే చవులు రేఁగె
చన్నులు చేతనంటితే జలజలఁ జెమరించె
యిన్నేసిచేఁతలు సేసె నేకతాన విభుఁడు ॥ ఏమ ॥

పాడిపట్టుకుండితేను వుమ్మగిలె వలపులు
విడెమిచ్చితే నెంతోవేడుకాయను
తడవి మాటాడితేను తమకము లుప్పతిల్లె
బడి నుండి యింతసేసె పాయపునావిభుఁడు ॥ ఏమ ॥

గక్కనఁ గాఁగిలించితే కాయమెల్లాఁ బులకించె
వుక్కగోరు సోఁకించితే నుబ్బెఁ గళలు
మక్కువతోఁ గూడితేను మర్మములు గుబ్బతిల్లె
చెక్క నొక్కి రట్టుసేసె శ్రీవేంకటవిభుఁడు ॥ ఏమ ॥ 54

రేకు 1310 ఆహిరి

ఆతనికే వలతు నే నన్నిందాను
కాతరాన నిందుకే నేఁ గాచుకవుందానను ॥ పల్లవి ॥

విన నవధరించెనా విభుఁడు నీవిన్నపము
మనసు రంజిలి నీతో మాటలాడెనా
నవిచి నీచేకానుక నంటున నందుకొనెనా
వినవేడుకయ్యీ నాకు వెలఁది చెప్పఁగదే ॥ ఆత ॥

అదిగెనా విన్నాతఁ డట్టె నాపరిణామము
కడుసంతోసాన నిన్ను గారవించెనా
కడఁగి నేనంపినలేకలు చదువుకొనెనా
జడియ కాతలఁపులు చక్కఁగాఁ దెలుపవే ॥ ఆత ॥

నీవెంటనే వచ్చెనా నెమ్మి శ్రీవేంకటేశుఁడు
యీవేళఁ జనవిచ్చెనా యింతలో నాకు
కైవసమై నన్నునేలె కప్పురపుటింటిలోన
తావుకొన్నభావములు తగ నెఱిఁగించవే ॥ ఆత ॥ 55

## మాళవిగౌళ

నీవెంత లెస్సవుండినా నేఁ డది నాలాబము
యీవల నొకటొకటే యెచ్చరించే నేను ॥ పల్లవి ॥

సొలసి యాపె విన్నుఁజూచినమర్మపుఁజూపు
నలిరేఁగి నీమనసు నాఁటుకొనెనా
చెలులచే నెడనెడఁ జెప్పిపంపినమాటలు
తలఁచుకొంటివా నీవు తనివారను ॥ నీవెం ॥

అల్లంత నుండి నీకు నాపె నేసినసన్నలు
తెల్లమిగా నీలోనఁ దెలిసితివా
వొల్లనే నీచేతి కాపెవొసగినబాగాలు
చల్లఁగా నీపుక్కిటిచవులాయనా ॥ నీవెం ॥

ముచ్చటతో నాపె నీకు మొక్కినకేలిమొక్కులు
అచ్చముగ నీకు నెలవాయనా నేఁడు
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను విట్టె
మెచ్చి యాపెపొందు నీవు మెయికొంటివా ॥ నీవెం ॥ 56

దేసాళం

అడుగరే యీమాట అవునో కాదో
తడయక నావేడుక తా నెఱఁగఁడా ॥ పల్లవి ॥

కుచ్చితము నేరను కూళతనము నేరను
యిచ్చకములాడనేర్తు నిట్టె తనకు
మచ్చికతో నప్పటి నామనసేమి సోదించేనే
తచ్చిచూచి నాగుణము తా నెఱఁగడా ॥ అడు ॥

వెక్కసాలూ నెఱఁగను వేసాలు నెఱఁగను
మొక్కనెఱుఁగుదు నేను ముందే తనకు
యిక్కడ నానేరుపులు యేంతంతని తెలిసీనే
తక్కక నేఁజేసేసేవ తా నెఱఁగఁడా ॥ అడు ॥

బలిమిఁ బెనఁగానోప పంతములాడానోప
వొలిసి కాఁగిలించఁగనోపుదుఁగాని
యెలమి శ్రీవేంకటేశుఁ డెంతసరసమాడీనే
తలకొన్ననావలపు తా నెఱఁగఁడా ॥ అడు ॥ 57

భూపాళం

ఏకతాన నున్నవాఁడు యిందరికి మగఁడాయ
చేకొందము చనవులు చేఁత లేమిసేసీనో ॥ పల్లవి ॥

విడెము చేతికియ్యరే విన్నపాలు నేయరే
వేడుకసంతోసాన విభుఁ డున్నాఁడు
కూడి సరసమాడరే గుబ్బలఁ గదునొత్తరే
యీడనే చూతము తా నిఁక నేమిసేసీనో ॥ ఏక ॥

పానుపు వరచరే బాసలు సేయించుకోరే
నానినమోహాన( బతి నవ్వుచున్నా(డు
మోనముతో మొక్కరే మోవితేనె లందుకోరే
తానకమై యీవేళ తా నేమిసేసీమో ॥ ఏక ॥

కొలువులుసేయరే గుఱుతెఱి(గించుకోరే
యెలమి శ్రీవేంకటేశు( డేలుకొన్నా(డు
పొలుపొంద( జెనకరే పొత్తు గలపుకొనరే
మలసి పచ్చిసేతము మరి యేమిసేసీనో ॥ ఏక ॥ 58

మంగళకౌసిక

మగ( డేమీననడంటా మలసేవు కెలసేవు
యెగసక్కెలాదేవారి నెంచుకోవుగదవే ॥ పల్లవి ॥

పంతములు మెరసేవు పకపకనవ్వేవు
మంతనాన రమణు(డు మన్నించెనంటా
చెంతనున్నవారిలోను సిగ్గువడ వించుకంతా
యెంతలేదు నీపగటు యెమ్మెలా(డివటవే ॥ మగ( ॥

సారెసారె మాటాడేవు సన్నలు మోవి (జేసేవు
చేరి నీచన వాత(డు చెల్లించెవంటా
యీరీతి విల్లాండ్లకు నింతరట్టు గలవా
నేరుపులెల్లా( జూపేవు నీటుకత్తెవటవే ॥ మగ( ॥

ముప్పిరి( జెంగలించేవు ముద్దులెల్లా గువిసేవు
యిప్పుడే శ్రీవేంకటేశు( డేలెనంటాను
వొప్పుగ( గూడె నన్నిత( డూ(కొని వినవే నీవు
కప్పురము చల్లేవు కతకారివటవే ॥ మగ( ॥ 59

శ్రీరాగం

విందువేడుకలతోడ నెమ్మది నుండుటఁగాక
పందువెన్నెలలోన బయలీఁదనేఁటికి ॥ పల్లవి ॥

మొగమోటే కలిగితే మించి పదరనీయదు
నగితేఁ జుట్టరికము నాఁటుకొనును
తగిలితే మనసే తలవుకాఁడై మించు
మగనికి నాలికిని మఱి చింత యేఁటికి ॥ విందు ॥

తలకొన్న నేస్తాలే తమకము పెడరేఁచు
పిలుపు లోనగూడితేఁ బ్రియాలు పుట్టు
తొలసినజవ్వనమే పొంతనాలై కలయించు
చెలియకుఁ బతికిని సిగ్గువడనేఁటికి ॥ విందు ॥

ఆసలు నెలకొంటేను అఁ(అం?)దించుఁ గాఁగిటిరతి
వేసరక పొదిగితే వెలయు బత్తి
నేసవెట్టి నిన్నునేలె శ్రీవేంకటేశ్వరుఁడు
బాస లాతనికి నీకుఁ బచారించనేఁటికి ॥ విందు ॥ 60

రేకు 1311 ఆహిరినాట

పొద్దువోవివాఁడు తాను పొంచి నన్నుఁ జెనకీని
వొద్దికైతి నే నంతేసి కోపుదునటే ॥ పల్లవి ॥

పెనఁగులాడితేను పెఁ(పెం?)జెమట లుప్పతిలు
నవిచి సిగ్గువడితే నవ్వులు రేఁగు
కమఁగవఁ జూడఁజూడ కాంక్షలు మిక్కుటమౌను
వానరి తనతో పొందు కోపుదునటే ॥ పొద్దు ॥

కదుఁగదుమాటాడితే గ్రక్కున మర్మాలు సోఁకు
తడవితేఁ దమకము దైలువారు
వొడిఁగట్టుకొంటేను వుమ్మగిలు వలపులు
వుదివోనివేడుకల కోపుదునటే ॥ పొద్దు ॥

చెలఁగి కాఁగిలించితే చిత్తమెల్లాఁ గరఁగును
కొలువుసేసితే నాస గుబ్బతిలును
యెలమి శ్రీవేంకటేశుఁ దేలె నన్ను నింతలోనె
వులివచ్చిచేఁతలకు నోపుదునటే ॥ పొద్దు ॥ 61

కన్నడగౌళ

[1] అన్నినాయ నీఁకనేల అసుద్దులు
మన్నించితి వప్పుడే నీమాట వింటినయ్యా ॥ పల్లవి ॥

యింటికి నీవు వచ్చి యితవరివై యుండఁగా
నంటుసేసి నీతోను నవ్వవలెఁగా
జంటనుండి వావులు సారె నీవు చెప్పఁగాను
అంటిముట్టి సరసములాడవలెఁగా ॥ అన్ని ॥

కదిసి చుట్టమవై కాఁపురాలు సేయరాఁగా
యెదురుకొని విడెము లియ్యవలెఁగా
కొదలేక నీవు నాకొంగువట్టి పెనఁగఁగా
యిదె నీతో మొగమోట నియ్యకొనవలెఁగా ॥ అన్ని ॥

చేరిచేరి నీవు నాపై సేవలు చల్లఁగాను
కూరిమితోఁ గాఁగిలించుకొనవలెఁగా
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కోరికె లీడేరె నిన్నుఁ గొనియాడవలెఁగా ॥ అన్ని ॥ 62

1. 'అన్నియున్ + అయ' అనుటకు వ్యావహారికరూపము.

దేసాళం

నేరుపరి వన్నిటాను నెరజాణవు
యీరమణితెఱఁగు నీ వెఱుఁగుకోవయ్యా ॥ పల్లవి ॥

కలువలు పైఁజల్లె కమలము లందిఇచ్చె
ములువాఁడిజాజులు మోపుగట్టె
చెలమ లూటకుఁబెట్టె చింతలచిగురుఁ గోసె
చెలియభావము నీవు చిత్తగించవయ్యా ॥ నేరు ॥

వెన్నెలల ముగ్గువెట్టె [1]విరుగాలి తూరుపెత్తె
పన్నుకొని నిమ్మపండ్లు పట్టెఁ గానుక
చిన్నితుమ్మిదల రేఁచె చిలుకలఁ బలికించె
కన్నెచందములు నీవు కనుగొనవయ్యా ॥ నేరు ॥

తేనెలు పెరలదించె తీగెలను పల్లెవేసె
ఆనుకొని చంద్రకళ లంగడిఁ దోసె
పూని శ్రీవేంకటేశుఁడ పొంచి నీపై సేసవెట్టె
మానిని నేలితివి మఱఁగులేటిఁవయ్యా ॥ నేరు ॥ 63

బౌళి

వాకిటి కప్పటనుండి వచ్చివున్నదాన నేను
కాకుసేయ కాతని విక్కడికి నంపఁగదే ॥ పల్లవి ॥

చెంతల నాతని నొంటిఁ జిక్కించుక యేమేమో
మంతనములాడేవేమే మాపుదాఁకాను
వింతగా నాతనిచేత వీణె వాయించుకొంటా
యెంతభ్రమలఁబెట్టేవే ఇంటిలోనను ॥ వాకి ॥

---

1. విరులయొక్క గాలి అని విగ్రహము, 'విరు' ఔత్యేకవచనము కాబోలు.

పచ్చడము గప్పుకొని పతిపక్కఁ బండుండి
యిచ్చకా లేమిసేసేవే యెందాఁకాను
పచ్చిగా [1]నెటిపెటిని బాగా లొత్తి యిచ్చుకొంటా
మచ్చిక లెంతచూపేవే మఱఁగునను ॥ వాకి ॥

ప్రేమమున లోలోనె పెనఁగులాడుకొంటాను
వేమారు నేమి నవ్వేరే వేగుదాఁకాను
అముక శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్ను నేలె
యేమే నన్ను మెచ్చేవే యిందుకుఁగాను ॥ వాకి ॥ 64

రామక్రియ

వింతవింతవలపులవిటుకులాఁడి
యింతయెమ్మెలు చూపీ నీకేమౌనయ్యా ॥ పల్లవి ॥

నిక్కఁ గొప్పుముడిచిననీలపుఁగురులయాపె
చెక్కుచెమటలతోడిసిగ్గులయాపె
ముక్కుపై వేలిడుకున్నముసిముసినవ్వులాపె
ఇక్కడ నున్నది నీకు నేమౌనయ్యా ॥ వింత ॥

నెలఁతమాఁటున నుండి నీదిక్కు చూచేయాపె
కెలసి చిలుకఁ బలికించేయాపె
పెలుచుఁజేఁతలతోడిపెద్దపెద్దగోళ్లాపె
యెలుఁగెత్తి పాడీ నీకు నేమౌనయ్యా ॥ వింత ॥

పట్టెఁదేసిచన్నులుపచారించుకున్నయాపె
గట్టిగా నీపొందులకుఁ గాచుకున్నాపె
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
యిట్టె నిన్నుఁ దా మెచ్చీ నీ కేమౌనయ్యా ॥ వింత ॥ 65

1. ఎటిపెటి=ఎదురెడురుగా, సరికి సరిగా ఇత్యాది అర్థము కావచ్చు. ఇంకను విచార్యము.

సౌరాష్ట్రం

పొలఁతికి నీతోపొందు పోఁకకుఁ బుట్టెఁదాయ
యెలమి నీభాగ్య మిఁక నెఁ(నెం?)తైనాఁ గద్దయ్యా ॥పల్లవి॥

పదఁతిచెక్కులవెంటఁ బన్నీటివాన గురిసె
పది నందె మెఱుఁగులవాన గురిసె
విడివడి తురుమున విరులవాన గురిసె
చిరుముడి జవ్వనము చిగిరించెనయ్యా ॥పొలఁ॥

మొలకనవ్వులనె ముత్యాలవాన గురిసె
పలపులఁ బెనుజడివాన గురిసె
కలికిసిగ్గులఁ దొలుకరివానలు గురిసె
పలుమారు జవ్వనము పదనెక్కెనయ్యా ॥పొలఁ॥

సొరిది మోవితేనల సోనలవాన గురిసె
వరుస రతులఁ దతివాన గురిసె
యిరవై శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
పరగినజవ్వనము పచ్చిదేరెనయ్యా ॥పొలఁ॥ 66

రేకు 1312 లలిత

మేలుమేలు మీగుణాలు మెచ్చ నెట్టుండవచ్చు
ూలవేసి గుట్టుతోడ నున్నారమయ్యా ॥పల్లవి॥

చెప్పఁజెప్పఁ గొత్తలాయ నేసినవే చేఁతలాయ
కప్పురగందికి నీకుఁ గాఁపురములు
చొప్పు లెత్తిపెట్టరాదు నుద్దు లడుగఁగరాదు
ొప్పుగాని గుట్టుతోడ నున్నారమయ్యా ॥మేలు॥

చూడఁజూడ సోద్యాలాయ చుట్టరికము [1]గట్టేయ
  జాడతో మీయిద్దరికి సరసములు
  వేడుకకు వెలలేదు విచ్చిచెప్ప వేళ గాదు
  వోడకిట్టె గుట్టుతోడ నున్నారమయ్యా ॥ మేలు ॥

పుట్టఁబుట్ట వింతలాయ పొద్దు కొక్క చాయలాయ
  ఇట్టె శ్రీవేంకటేశ మీఇంపురతులు
  నెట్టన నన్నేలితివి నీకు నాకు నిఁకఁ బోదు
  వొట్టుకొని గుట్టుతోడ నున్నారమయ్యా ॥ మేలు ॥ 67

గౌళ

చెంతనున్న చెలులము చెప్పితిమి తగవులు
  మంతనాన లాలించు టే మగపాడిసుమ్మీ ॥ పల్లవి ॥

చిగురుఁబెదవులె త్తి చెప్పి నీకుఁ బ్రియములు
  జిగిమించ వేఁడుకొని చెక్కునొక్కి ని
  యెగసక్కెలు నిన్నాడి ఇంతలోనె పంతమిచ్చె
  మగువగాఁగిలించు టే మగపాడిసుమ్మీ ॥ చెంత ॥

అందపుఁజన్నులు మోవ నప్పటి నీతోఁ బెనఁగి
  విందువలె నీచేతికి విడెమిచ్చిని
  ముందె బొమ్మల జంకించి మొక్కి నీకు వినయాన
  మందలించి మన్నించు టే మగపాడిసుమ్మీ ॥ చెంత ॥

చక్కనిమోము చూపి సరసము నీతో నాడి
  తక్కక గోరఁ జెనకి తమిరేఁచీని
  ఇక్కువ శ్రీవేంకటేశ యాకెఁ గరుణించితివి
  మక్కువ నిట్టె యేలుటే మగపాడిసుమ్మీ ॥ చెంత ॥ 68

1. గట్టి+అయ.

## భైరవి

వెన్న పట్టుకొని నేయి వెదకనేల
కన్నప్పుడే రమణునిఁ గాఁగిలించుకొనవే ॥ పల్లవి ॥

మంతనము లాడియాడి మరి యెడమాటలేల
చెంత నొక్కటైనమీఁద సిగ్గులేలా
సంతోసమైనవెనక సారె విచారములేల
కాంతరో విభుని మెచ్చి కాఁగిలించుకొనవే ॥ వెన్న ॥

కన్నులఁ జూచి పతి చకఁ(చక్కఁ?)దనా లడుగనేల
ఇన్నియు నేరిచి బయలీఁదనేల
మన్ననలు చేకొని మఱఁగున దాఁగనేల
కన్నెవై తేనే మితనిఁ గాఁగిలించుకొనవే ॥ వెన్న ॥

ననుపు లొనగూడితే మనసు సోదించనేల
తనిసి యాసాసలు దప్పఁగనేల
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె విన్ను మెచ్చి
ఘనుఁ డీతని నేపొద్దూ గాఁగిలించుకొనవే ॥ వెన్న ॥ 69

## పళవంజరం

ఏఁటిజాణతనమే యెవ్వరు మెత్తురే యిది
తేటలనే మగవానిఁ దేలించఁగదవే ॥ పల్లవి ॥

కలికితనాలఁ బతిఁ గరఁగించవలెఁగాక
బలిమిసేయఁగఁబోతే పచ్చిదేరదా
చెలిమి పొందుగఁ జేసి చిక్కించుకొంటఁగాక
వలవని సణఁగుల వలపించవచ్చునా ॥ ఏఁటి ॥

ఇచ్చకపుఁజేఁతలనే యెలయించవలెఁగాక
పెచ్చురేఁగి కొసరితేఁ బిప్పిగట్టదా
మచ్చికతోఁ బానుపుపై మరిగించుకొంటఁగాక
రచ్చలోనఁ బెనఁగితే రతి సమకూడునా ॥ ఏఁటి ॥

సొరిది గుబ్బల నొత్తి చొక్కించవలెఁగాక
గరువానఁ గూడితేను గరివడదా
కరుణించి శ్రీవేంకటేశుఁడే నిన్ను నేలె
వొరసిటె పైకొంటేను వొక్కటౌనా మనసు ॥ ఏఁటి ॥ 70

భూపాళం

రమ్మనవమ్మ విభుని రత్నాలపెట్టె
[1] చిమ్ముకొన గొల్ల నారీశిరోమణి ॥ పల్లవి ॥

చిత్తగించవమ్మ పతిఁ జిలుకలకొలికి
చిత్తజుదీమమా వోసింగారదండా
గుత్తపుగుబ్బలతీరు కొనియాడీ నీమగఁడు
బత్తి చేకొనఁగదమ్మ బంగారుబొమ్మ ॥ రమ్మ ॥

సుద్దులు చెప్పఁగదమ్మ చొప్పాణిముత్తెమా
పొద్దువొద్దు నీపతికి పువ్వారుఁబోణి
అద్ది జవ్వాది పూసీ నీకతఁడు కారుమెఱుఁగ
వద్దనక చేకొనవో వనముకోగిలా[2] ॥ రమ్మ ॥

ముచ్చటలాడఁగదమ్మ ముంగిటినిధానమా
గచ్చుతేల రా వోచెంగలువబంతీ
హెచ్చి శ్రీవేంకటేశుఁడు యిన్నిటాను నిన్నుఁ గూడె
రచ్చకెక్కె నీవలపు గాయంచకొదమా ॥ రమ్మ ॥ 71

1. ఈ వాఙ్మయ సంప్రదాయముతో 'చిమ్ముఁగొనగొల్లనారీశిరోమణి' కావచ్చు.
2. కోకిలకు 'కోగిల' వ్యావహారికము కావచ్చు.

శ్రీరాగం

ఏరుపరచి చెప్పరే యింతిచక్కఁదనములు
వూరకే యీరెంటికిని నొనరె నీభావము ॥పల్లవి॥

తుమ్మిదలో నీలాలో తొయ్యలినెరిఁగురులు
పమ్మి యద్దమో చంద్రుఁడో పసనిమోము
వుమ్మడిఁ దిలపుష్పమో వొగి సంపెంగో ముక్కు
కమ్మటిఁ గలువలో గండుమీలో కన్నులు ॥ఏరు॥

జక్కవలో నిమ్మపండ్లో జవరాలిచన్నులు
అక్కజపుబయలో సింహమో నడుము
చొక్కపుబిసములో సొంపుఁదీగెలో చేతులు
చక్కనిసుకదిబ(బ్బ?)లో చక్రాలో పిఱుఁదులు ॥ఏరు॥

కందువ నరఁటులో కరికరాలో తొడలు
చెందమ్ములో చిగురులో జిగిఁ బాదాలు
ఇందిరాదేవి శ్రీవేంకటేశుపురమున విదె
కుందణమో మెఱుఁగో నిగ్గుల యీకెమేను ॥ఏరు॥ 72

రేకు 1313 ముఖారి

మరిగించితి వాతని మాయలఁబెట్టి
యిరవుగా నేఁ జేకొంటి నిఁక నేమిసేసేవే ॥పల్లవి॥

ఆకుమడిచి యిచ్చితి వాతనికి వద్దనుండి
యేకతములాడితివి యింటిలోనను
చేకొని నీయాతుమార సేవలెల్లాఁ జేసితివి
యీకడ నీయాసోద మింకా నెంతగలదే ॥మరి॥

లలి నీ వాతనితమ్ములము వెట్టించుకొంటివి
సలిగెతనాల నివె జట్టిగొంటివి
కొలువు లేపొద్దూఁ జేసుకొంటా నిట్టె వుందానవు
యెలమి నీయాసోద మింకా నెంతగలదే ॥ మరి ॥

పచ్చడములో చొచ్చుక పతి నెలయించితివి
విచ్చనవిడి నిందాఁకా వెలసితివి
యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
హెచ్చితి నీయాసోద మింకా నెంతగలదే ॥ మరి ॥ 73

దేవక్రియ

ననిచి పదివేలకు నావాఁడే తాను
వినయానఁ దనకిట్టె విన్నవించరే ॥ పల్లవి ॥

యెక్కడఁ దా నుండినాను యెదలోఁ దలఁతు నేను
మొక్కలాన మఱచున్నా మొక్కుదు నేను
యిక్కువ లంటకుండితే యెచ్చరికసేతు నేను
పక్కన తన్నుఁ దప్పులువట్టినా నేను ॥ నని ॥

యెంతవొద్దు రాకుండినా నెదురులుచూతు నేను
చెంతనుండి పరాకైతే చేచాఁతు నేను
వింతవారితో నవ్వితే వేడుకతో మెత్తు నేను
యెంతైనాఁ దన్ను నేరములెంచేనా నేను ॥ నని ॥

పవళించి వుండితేను[1] పాదాలు గుద్దుదు నేను
అవలిమోమై యుంటే మాటాడుదు నేను
ఇవల శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నన్ను నేలె
తివిరి తనగుణాలు దిద్దేనా నేను ॥ నని ॥ 74

---

1. ఇక్కడ దొకనిడుగీత వ్యర్థముగ నున్నది.

శ్రీరాగం

ఎంత నాసుద్దులు చెప్పీ విందరితోను
కొంతైనా తనపాదపుగోరఁ బోలఁగలనా ॥ పల్లవి ॥

తనమన్ననే నాచక్కఁదనముగలఫలము
ననిచినతనవొందే నాభాగ్యము
పెనఁగేటితనరతిపెంపే నాసంపద
యని చెప్పరే చెలులు యతనితోను ॥ ఎంత ॥

కరుణించి తాఁ జూచుటేకలది నాసింగారము
సరుగఁ దాఁ బైకొనుటే [1]సామ్రాజ్యము
పరగఁ దా మెచ్చుటే నాపాయపుగరగరిక
గరిమఁ దెలుపరే యీకతలు విభునికి ॥ ఎంత ॥

కొలువులోఁ దా నవ్వుటే గుట్టు నాపెద్దరికము
కలసేతనకాఁగిలే [2]కాణాచిమేలు
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నునేలె
చెలఁగి యీవిన్నపము సేయరే తనకు ॥ ఎంత ॥ 75

ఆహిరి

ఏల సిగ్గులువడేవే యింతిరో నీవు
వేళవేళ నూడిగాలు వెలయఁగఁ జేయవే ॥ పల్లవి ॥

చూడఁజూడఁ దగులును చుట్టరికము
వాడికలనే పెరుగు వలపులును
తోడనే గుబ్బె(ట్టై?)తే నిక్కు దొరతనము
వీడెమిచ్చి పతితోను వేడుక నెరపవే ॥ ఏల ॥

---

1, 2, పాఠ అంతటా 'నాభాగ్యము' ఇత్యాదిగ నుండుటచే ఇక్కడగూడ 'నాసామ్రాజ్యము' 'నాకాణాచిమేలు' అని యుండవచ్చునేమో?

సేయఁగఁజేయఁగ మించు చెలులమెల్లా
కాయముఁ గాయ మంటితేఁ గరఁగు మతి
పాయక కాచుకుండితేఁ బంత మీఁదేరు
ఆయములంటి మగని నాసలురేఁచవే ॥ ఏల ॥

నవ్వనవ్వ మీఁదమీఁద నాఁటుఁ బ్రియము
పువ్విళ్లూరితేఁ గోరిక లుప్పతిలును
యివ్వల శ్రీవేంకటేశుఁ దేలె విన్నును
చివ్వన నితనిఁ జెంది సేవలుసేయవే ॥ ఏల ॥ 76

## సామంతం

వినవేడుకయ్యీ మాకు వింతవింతమీసుద్దులు
మనసు లొక్కటిగాను మాకు నెఱిఁగించవే ॥ పల్లవి ॥

చెలరేఁగిచెలరేఁగి సెలవుల నవ్వేవు
యెలమి నాతఁడు నిన్ను నేమినేసెనే
బలిమి నూరకె నీవు పలుమారుఁ బెనఁగేవు
అలరినమీచెనకు లవి యెటువంటివే ॥ విన ॥

అంటకుముట్టకుమని యానలెల్లాఁ బెట్టేవు
యింటిలో మీ చయ్యాటా లేరీతివే
వొంటినుండి మీలో మీరు వొద్దికై వేఁడుకొనేరు
దంటలై మీరాడినపంతము లెటువంటివే ॥ విన ॥

కన్నుసన్నలుగఁ దారుకాణలకుఁ జొక్కేవు
మన్నించి విన్నెటువలె మరిగించెనే
యెన్నఁగా శ్రీవెంకటేశు నెనసి పెండ్లాడితివి
అన్నిటా మీసమరతు లవి యెటువంటివే ॥ విన ॥ 77

సామంతం

అందరికిఁ దారుకాణ లౌఁగదరె చెలులాల
పొందుగా నీరీతుల భోగించుటే నేరుపు ॥ పల్లవి ॥

వినయముతోఁ జెప్పినవిందు కడుఁగడుఁజవి
ననుపుతో నవ్వినవవ్వుఁచవి
మనసురా మాటాడినమంతన మెప్పుడుఁ జవి
పవిపూని వలచినపతికి సతికిని ॥ అంద ॥

యితవుతోనాడించేయెడమాటలే ఇంపు
తతి నెదురుచూపులతమక మింపు
చతురతఁ బెనఁగేటిసరసపుఁజేఁత లింపు
అతికాంక్ష మెలఁగేటియాలికి మగనికి ॥ అంద ॥

గుట్టుతోడఁ గూరిములు గొసరుటే వేడుక
చుట్టుక రతుల మెప్పించుటే వేడుక
వొట్టుకొన్న కూటముల నుమ్మగిలుటే వేడుక
అట్టె శ్రీవేంకటేశు కలమేలుమంగకూ ॥ అంద ॥ 78

రేకు 1314 భైరవి

ఏమని చెప్పుదునే యింతులాల మీతోను
కామించి యాతఁడే నన్నుఁ గరుణించీఁగాక ॥ పల్లవి ॥

కామరెవలపు లోలో గుబ్బతిలుకొంటాను
తమకమే రేఁచుఁగాని తవియఁగనియ్యదు
తిమిరేటితలపోఁత తీగెలువారుకొంటా
మమతలే పెంచుఁగాని మఱవఁగనియ్యదు ॥ ఏమ ॥

నేసుకొన్నపొంకులు చేఁగలుదేరుకొంటా
ఆసలే పుట్టించుఁగాని అలపారనియ్యదు
నేసవెట్టినవేడుక పిగ్గువాపుకొంటాను
వానిఁ బెనఁగించుఁగాని వదలఁగనియ్యదు ॥ ఏమ ॥

పాయనిచుట్టరికము పచ్చిదేరుకొంటాను
కాయము చొక్కించుఁగాని గద్దించనియ్యదు
పాయపుటలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
యీయెడ నన్నేలెఁ దగు లెడయఁగనియ్యదు ॥ ఏమ ॥ 79

కురఁ(రం?)జి

ఎఱుఁగుకోవే నీయెమ్మెలు చాలు
మఱియుఁక దూరకువే మగఁడు నాపాలు ॥ పల్లవి ॥

పలుమారుఁ జూపకువే పంతాలు
వెలయ నింతేఁటికి వేసాలు
పెలుచవై యాడకువే బింకాలు
చెలువుఁ డిన్నిటా నాకుఁ జేసినాఁడే మేలు ॥ ఎఱుఁ ॥

ఆయనాయఁ జెప్పకువే అందాలు
పాయ నాతని నేను పగలు రేలు
నీయందుఁ గంటిమే కడునేమాలు
యీయెడఁ బెట్టె నా కాతఁ డిదె సేసపాలు ॥ ఎఱుఁ ॥

చేనె నాకుఁ జూడవే సింగారాలు
వాసులు నెరపకువే వట్టిమాయలు[1]
బాసతో నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
మోసపోక నన్ను నేలె మోహాన కిదె కీలు ॥ ఎఱుఁ ॥ 80

1. పాట అంతటా పాటించినగురుపూర్వకాంత్యప్రాస దెబ్బతిన్నది. 'వట్టి మాయాలు' అనుటకు వీలులేదు.

వరాళి

ఇవిఁ గొన్ని నేరిచితి విసుమంతపడుచవు
జవరాలవై తివి సాదించనోపుదువే ॥ పల్లవి ॥

నెలవుల నవ్వుకొంటా సిగ్గులువడుకొంటాను
తలకొవి పతికెంత తమిరేఁచేవే
కలువల వేసుకొంటా కడుసన్న సేసుకొంటా
వలపులు చల్లిచల్లి వలలఁబెట్టేవే ॥ ఇవిఁ ॥

కన్నులారుచుకొంటాను కతలు చెప్పుకొంటాను
పన్నుక యాతని నెంతభ్రమయించేవే
చన్నులు చూపుకొంటాను సంగడిఁ గూచుండుకొంటా
తిన్ననిచేఁతల నెట్లు తేలించేవే ॥ ఇవిఁ ॥

సరసములాడుకొంటా చవులుచూపుకొంటాను
పెరరేఁపుల నెందాఁకా బెల్లించేవే
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగపతి
యిరవై నన్నేలె నిఁక నేమిసొలసేవే ॥ ఇవిఁ ॥ 81

సామంతం

నీచిత్తము నాభాగ్యము నీవెట్టయినాఁ జేయి
కాచుకున్నదాన నీకుఁ గరుణించు మిఁకను ॥ పల్లవి ॥

మనసురావియట్టిమాట లెన్నియాడినాను
పనిమాలుటేకావి బాఁతి గావు
తనివిలేనియట్టితమక మెంతవెంచినా
పెనఁగులాటకునుఁబెట్ట కేల మానును ॥ నీచి ॥

నెలవుగానియట్టిచేఁత లెన్ని సేసినాను
అలమటలేకాని యందము గావు
వలవనికోరికలు వాములెంత వేసుకొన్నా
తలకొన్నవలపులు తనియనేలిచ్చును ॥ నీచి ॥

ఆయముసోఁకనినవ్వు లవి యెంతనవ్వినాను
కాయకములేకాని కళ దాఁకదు
పాయపుటలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడ
యీయెడ నన్నేలితివి యిఁక నిన్ను మెత్తును ॥ నీచి ॥ 82

నాదరామక్రియ

నేరుప రిన్నిటా నీపె నీకే తగు
సారపుచక్కెరబొమ్మచంద మిట్టిదయ్యా ॥ పల్లవి ॥

బంగారువంటిది చెలి పదారుగళల మించు
ముంగారుమొయిలువంటిది ముద్దుగురుసు
అంగపుహంసవంటిది యడుగులుపెట్టేచోట
రంగుగ నీకు నేమని రచ్చఁ బొగడేమయ్యా ॥ నేరు ॥

కోవిలవంటిది సతి కోమలపుపెలుఁగున
పూవువంటిది వాసనబుగులుకొను
పావురమువంటిది గొబ్బనఁ బిల్పునకువచ్చు
వేవేల కీపె నేగతి వినుతించేమయ్యా ॥ నేరు ॥

చిలుకవంటిది యింతి చేరి పలుకఁగనేర్చు
[1] చిలుకువంటిది రతిఁ జిక్కించుఁ గూడి
అలమేలుమంగపతివైనశ్రీవేంకటేశుఁడ
యెలమి నీకెఁ గూడితి వెంతగొనాదేమయ్యా ॥ నేరు ॥ 83

1. తలుపుమొదలగువానికి బిగించేచిలుకా యిది? గట్టిగా పట్టుకోవడము సాధారణధర్మమా?

పాడి

మనసుకు మనసే మరి తారుకాణగాదా
నిను నే నింతేసి తా నేరము లెన్నితివి ॥ పల్లవి ॥

చెలరేఁగి నీ వెక్కడఁ జింతించే వెవ్వతెనో
తలఁపులో నాపె నిన్నుఁ దలఁచఁబోలు
పులకించె నీమేను పొంచి యూరకుండి యుండి
మెలఁత జాజిననలు మీఁదెత్తఁబోలును ॥ మన ॥

కోరి యెవ్వెతనో నోర గుణించుకొనేవు నీవు
పేరుకొని యాపె నాదఁ బిలువఁబోలు
పేరడిగా నీచెక్కులఁ బెంజెమటలు గారీ
యేరీతినో పన్నీరు నీ కెక్కించఁబోలును ॥ మన ॥

చెంది యెవ్వతెకుఁగానో సెలవుల నవ్వేవు
కందువ నిన్నాపె నవ్వేఁగాఁబోలును
అందపుశ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
పొందితి నన్నాకె నీకుఁ బూఁచుకుండఁబోలును ॥ మన ॥ 84

రేకు 1315 ధన్నాసి

ఇట తలవాతిపను లేఁక నీకే తెలుసును
యెటువలెనైనాఁ జేయు మెదురాడ నీకును ॥ పల్లవి ॥

చేసిననావిన్నపము చిత్తానఁ బట్టెనో లేదో
అసల నెక్కడ పరాకై వుంటివో
వేసరక నాతో పొందు వేడుకాయనో లేదో
యేసుద్ది నెఱఁగ నీయిచ్చలోనిదానను ॥ ఇట ॥

యిట్టె నాతో కొంపురము ఇతవాయనో కాదో
నెట్టన నెటువంటివి నీకుఁ బ్రియమో
జట్టిగొన్న నా సేవలు సమ్మతాయనో కాదో
యెట్టొతా నెఱఁగ నీయిచ్చలోవిదానను ॥ ఇట ॥

నెమ్మి నాచక్కఁదనము నీయాడువచ్చునో రాదో
కమ్మర నాకు నీదయ గలుగుటెట్టో
పమ్మి యలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడ
యెమ్మె లెఱఁగనియాల నీయిచ్చలోదానను ॥ ఇట ॥ 85

భూపాళం

ఎక్కడ పరాకు నీకు యెన్నిలేవు పనులు
దిక్కు నీవే యిందరికి దేవరాయా ॥ పల్లవి ॥

గుత్తపుగుబ్బలాఁడి నీకొలువుకు వచ్చినది
కొత్తలుగాఁ జూడవయ్య కోడెకాఁడ
పుత్తడిబొమ్మవంటిది పూఁచి నీతో మాటలాడీ
చిత్తగించి వినవయ్య సింగారరాయా ॥ ఎక్క ॥

చిమ్ముఁజూపులాఁడి యదె చిరునవ్వులు నవ్వీని
నెమ్మది లాలించవయ్య నెరతనీఁడ
పమ్మి చంద్రకళవంటిపడఁతి సన్నలు సేసీ
సమ్మతిఁ జేకొనవయ్య జాణరాయా ॥ ఎక్క ॥

కూడె నిన్నుఁ జేఁతలాఁడి కుచ్చి కాఁగిటను వించి
విడె మియ్యఁగదవయ్య వేడుకకాఁడ
వాడితో నలమేల్మంగపతివి నన్నేలితివి
చేదియ నీపె నేలుము శ్రీవేంకటరాయా ॥ ఎక్క ॥ 86

పాడి

మెలుఁత నిన్నిటాను మెచ్చితి నేను
ఫలియించె నేఁడు నాభాగ్యమెల్ల నిపుడు. ॥ పల్లవి ॥

తరుణి నీమాటలు తారుకాణ వచ్చెనే
నెరజాణతనములు నేర్పు నతఁడు
సొరిది నాతో నీవన్నసుద్దులెల్లాఁ జెప్పెవే
పొరిఁ జక్కఁదనములు పోగైనవాఁడే ॥ మెలు ॥

కాంత నీవునేసేవుపకారము నీదేరెనే
వంతుతో నావున్నాడకు వచ్చె నతఁడు
సంతోసమునేసి నాకు చనవెల్లా నిచ్చెనే
యెంతకెంత వానిగుణ మేమనిచెప్పుదునే ॥ మెలుఁ ॥

చెలి నీవు వొడఁబరచినమేలు దక్కెనే
పలుమారు నన్నుఁగూడి పాయఁ డతఁడు
అలమేలుమంగపతియైనశ్రీవేంకటేశుఁడ
కలిగె నాకు నిఁక గైకొంటి వేడుకలు ॥ మెలుఁ ॥ 87

భైరవి

చిత్తానఁ బెట్టుకోవయ్యా నేసిననావిన్నపము
సత్తుగ నన్నేలితివి జాణవు నీవౌదువు ॥ పల్లవి ॥

యెంతెంతచక్కఁదనాన నెక్కుడగా మెరసిన
కాంత గుణవంతురాలు గావలెను
వంతుకుఁ జూచితే నుప్పు వడిఁ దెల్లనై యుండితే
సంతతము కప్పురము సాటివచ్చీనా ॥ చిత్తా ॥

నిగిడి మగువ యెంతనేరుపరియైనాను
మగవి కిచ్చకురాలై మనవలెను
పొగరుగలుగుతుమ్మిపువ్వు లెన్ని ముడిచినా
తగినజాజులవలె తావి యంటీనా ॥ చిత్తా ॥

సతి యెంత జవ్వనాన జడియుచునుండినాను
రతికేలిఁ జిత్తముఁ గరఁగించవలె
క్షితి నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడ
సతమై కొక్కెరలు హంసలఁ బోలీనా ॥ చిత్తా ॥ 88

## ముఖారి

చూచితే గోలగాని జూటుదనా లిన్నియును
చేచేత నీపెచేఁతలు చెప్పఁ గొత్తలయ్యా ॥ పల్లవి ॥

మాటలఁ దేనెలు గారీ మలసితే సిగ్గుదేరీ
తేటలై కనుచూపులఁ దెల్లవారీవి
కోటిసేయ నిన్ను నీపె కూరిములు గొసరిని
నీటున నెన్నఁ డింతేసి నేరిచెనోకాని ॥ చూచి ॥

నడక నందెలు వాఁగీ నవ్వితే వెన్నెల రేఁగీ
తడవితేఁ గొప్పు తుమ్మిదలు మూఁగీని
వడిగాఁ జెనకుతాను వలపుల నిన్ను నాఁగీ
కడు నెటులాఁ గతలఁ గఱచెనోకాని ॥ చూచి ॥

కొనగోరు నీపైఁ జిమ్మీ గుబ్బచన్నులనుఁ గుమ్మీ
కినియక విన్ననే కాఁగిటఁ గమ్మీని
పనితో నలమేల్మంగపతిశ్రీవేంకటేశుఁడ
యెనసితివి నన్ను తా నెట్టెటేఁగెనోకాని ॥ చూచి ॥ 89

మేఁచబౌళి

కోమలిరో యింతులకు గుట్టు వలదా
యేమే నవ్వులు నవ్వే వెందరిలోనాను ॥ పల్లవి ॥

కాఁపురాలుసేసేవారు కలరుగాక నీవలె
చేపట్టి మన్నించెనంటాఁ జెప్పుకొందురా
యేపొద్దూఁ బాయకవుండి హెచ్చవలతురుగాక
పైపై వెల్లవిరిగాఁ బచ్చిసేసుకొందురా ॥ కోమ ॥

ఇల్లాండ్లయినవారు ఇంటిలో నుందురుగాక
పెల్లునఁ జేఁత లంగడిఁబెట్టుకొందురా
మెల్లనే సేవలుసేసి మెప్పించుకొందురుగాక
పల్లదాన గర్వములు పచారించుకొందురా ॥ కోమ ॥

తగులుగలుగువారు తతిఁ గూడుదురుగాక
మిగులా నీయెమ్మె లిట్టె మెరఇంతురా
జిగి నలమేల్‌మంగమోఁచివశ్రీవేంకటేశుఁడు
తగ నన్నునేలె నీమగఁడనుకొందురా ॥ కోమ ॥ 90

రేకు 1316 రీతిగౌళ

ఇంత నేరకుండితే నిన్నెవ్వ రెరుఁగుదురమ్మ
వింతలెల్లాఁ జూచిచూచి వెరగయ్యీ మాకు ॥ పల్లవి ॥

నేయరానివూడిగాలు చేసిచేసి యాతని -
ఆయములు గరఁగించ్చి ఆలవై తివే
చాయల నేపొద్దూ[1] మోముచక్కటిఁ గొలువునేసి
పాయరానిచుట్టమవై పనిగొంటివే ॥ ఇంత ॥

1. మోముచక్కటిన్=మొగమువకు సూటిగా. (ముక్కుకు సూటిగ)

అనరానిమాటలెల్లా నాడియాడి కళరేఁచి
ఘనునికిఁ జనవరికాంతవై తివే
చెనకి యాతఁడు సేసేచేఁతలెల్లా నొడిగట్టి
యెనలేక యిందరిలో నిట్టె దొరవై తివే ॥ ఇంత ॥

తలఁచరానిరతులఁ దగిలి కూడికూడి
కలికితనాలఁ గతకారివై తివే
అలమేలుమంగపతియైనశ్రీవేంకటేశుఁడు
యెలమి నన్నేలె నీవూ నిందుకు మెచ్చితివే ॥ ఇంత ॥ 91

రామక్రియ

ఏడనుండి వచ్చినాఁడే యీడకుఁ దాను
వీడెమిచ్చీఁ జూడవే వేసాలవాఁడు ॥ పల్లవి ॥

వెలలేనివలపులవేడుకకాఁడు
కలికితనాలమంచిగయ్యాళివాఁడు
చలమరిసరసాలజాజరకాఁడు
చెలువుఁడు వీఁడుగదె శ్రీవేంకటేశుఁడు ॥ ఏడ ॥

కొనబుతనాలతోడికోడెకాఁడు
వినుపునవ్వులునవ్వేసీటులవాఁడు
వొనరినవరముల[1] వుదారికాఁడు
చెనకులవాఁడుగదే శ్రీవేంకటేశుఁడు ॥ ఏడ ॥

గొల్లెతలమానములకొల్లకాఁడు
పిల్లదొరులూఁదేటిపిన్నవాఁడు
యెల్లగా నలమేల్మంగనేలినవాఁడు
చెల్లుబడి వీఁ(వాఁ?)డుగదె శ్రీవేంకటేశుఁడు ॥ ఏడ ॥ 92

1. ఉదారికాఁడు = ఉదారుడు కావచ్చు.

నారాయణి

చెల్లఁబో యేమయ్యా యింత నేతురా నీవు
వెల్లవిరిఁ దమకాన వేఁగించీఁ దాను ॥ పల్లవి ॥

చిప్పలవంటికన్నులచెలి నీ కెదురుచూచీ
యెప్పుడు వత్తువోయంటా నింటా వాకిట
చొప్పుగా నీ వీపెతోను [1]జా(జూ?)జాలాడే దెఱఁగదు
చొప్పుగా నీరాక నమ్మివున్నది దా నాడను ॥ చెల్లఁ ॥

అంతరంగపుటాసల నట్టె నీవు గూదేవంటా
మంతనానఁ దలపోసీ మంచముమీఁద
యింతులపాట వింటా నీ విందునుందే దెఱఁగదు
చెంత నీవేళ గాచుక చెలఁగీఁ దా నాడను ॥ చెల్లఁ ॥

వెలినుండి నీవు రాఁగా వేడుకతో నవ్వు నవ్వీ
అలసతి వెంటవచ్చే ద దెఱఁగదు
అలమేలుమంగపతివై న(శ్రీ)వేంకటేశుఁడ
కలసితి విప్పుడంటా సొలసీఁ దా నాడను ॥ చెల్లఁ ॥ 93

శంకరాభరణం

చెలికత్తెవు నీవేమి నేసినా దోసము గాదు
తొలుసారే యింతేసిపొందులు నే నెఱఁగను ॥ పల్లవి ॥

వూరకే తాఁ గతచెప్పీ నూఁకొనవే నామారు
చేరి యెం(యం?)త దంటగాను చిన్నదానను
తేరకొన నన్నుఁజూచి దిగ్గన మోము చూపవే
నేర నంతేసి తనతో నెరవాదితనము ॥ చెలి ॥

---

1. యతిభంగము

వాడివట్టి తీసీ నామా రొద్దఁ గూచుండఁగదవే
చిదుముడి నందుకైతే సిగ్గయ్యీ నాకు
విడెమిచ్చీ నందుకొని వేగమె నాకొసఁగవే
గుడిగొన్నకొత్తపెండ్లికూఁతురను నేను ॥ చెలి ॥

నలువున గిలిగించీ నామారు నీవు నవ్వవే
ఇలువెల్లకభోగించేఇల్లాల నేను
అలమేలుమంగపతియగుశ్రీవేంకటేశుఁడు
కలసె నన్నిట్టే మెచ్చఁగదవే నేఁ గోలను ॥ చెలి ॥ 94

మాళవిగౌళ

ఎటువలెఁ బొగడినా నిన్నిటికిఁ దగినది
ఘటియించె మేలుమేలు కంటిమి యీవేడుక ॥ పల్లవి ॥

చెలిచన్నులబలిమి సింగారానకుఁ గలిమి
అలరుఁగన్నులచూపు ఆసలదాపు
విలువఁజక్కఁదనము నెమ్మి దాఁచినధనము
కులుకుఁగుత్తికసొంపు కోవిలలగుంపు ॥ ఎటు ॥

కాంతవెట్టినకొప్పు గండుదుమ్మిదలకప్పు
చెంత నెన్నడిమికీలు సింగముఁ బోలు
యెంతే పిఱుఁదుతీరు ఇంచువిలుతునితేరు
వింతచిరునవ్వులాగు వెన్నెలపోగు ॥ ఎటు ॥

లేమపాదములసోగ లేఁతచిగురులో చేఁగ
భూమిలో మించె యీయమ్మ పుత్తడిబొమ్మ
ఆముక శ్రీవేంకటేశ అలమేల్‌మంగపతివి
ప్రేమ నేలితివి పొందు బెరసినవిందు ॥ ఎటు ॥ 95

బౌళి

సెలవిచ్చితి నీకు నీచేఁతలకెల్లా లోను
 సెలవుల నవ్వుకొంటా [1]సిగ్గువడ కిపుడు ॥పల్లవి॥

కోరి నీవెవ్వతేఁ దెచ్చుకొవినా నే వలదన
 యీరానియీవు లిచ్చినా నేమీ ననను
 సారె నీకు నాపెకును సమతారుకాణలాయ
 చేరి నామొగము చూచి సిగ్గువడ కిపుడు ॥సెల॥

మఱి నెవ్వతెతోనైనా మాటలాడు నోరార
 గుఱిగాఁ దొడపైఁ బెట్టుకొని లాలించు
 మెఱసి నీ కాపె తొల్లె మేనవదినెగాఁబోలు
 చిఱుఁజెమటలతోడ సిగ్గువడ కిపుడు ॥సెల॥

తలఁచుకో యింకా నీతరుణి నెవ్వతెనైనా
 చలివాసి కూడిమాడి సరసమాడు
 అలమేలుమంగపతివైన(శ్రీ)వేంకటేశుఁడ
 చెలఁగి నన్నేలితివి సిగ్గువడ కిపుడు ॥సెల॥ 96

రేకు 1317 ఆహిరి

ఆదరించి మంచిమాట లాడేఁగాక
 భేదముసేయ కాతవిఁ బిలువవే చెలియా ॥పల్లవి॥

కోరేటికోరికలెల్లా గురిమైయుండేటివాని
 సారపుమోవితేనె లొసఁగేటివాని
 చేరి చేతులెత్తి నాపై సేసలువెట్టినవాని
 తూరి యేమిసేసినాను దూరనెట్ట వచ్చునే ॥ఆద॥

1. సిగ్గువడకు(ము)+ఇపుడు. అన్నిచరణాంతములం దింతే.

కూడిపాయరానినెట్టుకొన్నచుట్టమైనవాని
పీడెముపొత్తుకు లోనై వెలసేవాని
జోడుగూడేయాసలకు చోటై యుండేటివాని
యేడనుండివచ్చినాను యెట్టు దూరవచ్చునే ॥ ఆద ॥

సరుస నాకాఁగిటికే సతమైయుండేటివాని
మరిగిననామనసుమర్మపువాని
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుని
తొరల నన్నేలె నిఁక దూరనెట్టువచ్చునే ॥ ఆద ॥ 97

భైరవి

పీడెమియ్యఁగదవే విభునికిని
వేడుకలు గొనసాగె వెరగు లిఁకనేలే ॥ పల్లవి ॥

చేరి యాకతాన నుండి సిగ్గులువడఁగనేలే
కోరి వావిచెప్పి మరి కొంకఁగనేలే
సారెఁ బయ్యద జారీని చక్కఁబెట్టుకొననేలే
తారుకాణాయఁ బొందులు తరితీపులేలే ॥ పీడె ॥

తప్పక మోముచూచి తలవంపు లిఁకనేలే
కొప్పు వీడె గొణఁగుతాఁ గొసరనేలె
చిప్పిలఁ జెమట లబ్బెఁ జిమ్ముచుఁ బెనఁగనేలే
వొప్పుగా మర్మము లంటె వొడఁబాటులేలే ॥ పీడె ॥

పొత్తులవిడెము లంది పొంతనా లడుగనేలే
గుత్తపుగబ్బల నూఁది కొదుకనేలే
బత్తితో నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
చిత్తగించి నిన్ను నేలె చేసన్నలేలే ॥ పీడె ॥ 98

ముఖారి

ఒకరిపై నెపము వేరొకరిపైఁ జూపేవు
యెకసక్కెలకు నాపె నేమీననఁజాలకే ॥పల్లవి॥

పక్కనఁ గొంత చన్నులు పయ్యదలో దాఁచుకోఁగా
ఱక్కవపిట్టలనేల సాదించేవయ్యా
మక్కువ నాపె సిగ్గుతో మాటలాడకుండితేను
ఇక్కడ గూఁటిచిలుక నేలక్షిగిట్టేవయ్యా ॥ఒక॥

ఇట్టినీచేఁతలు చూచి ఇంతి మోము వంచితేను
చుట్టుక యద్దమునేల సొలసేవయ్యా
వుట్టిపడ నాపె నిన్ను ఎదుటునఁ జూచితేను
పట్టి చకోరాలతోడ పంతమేలాడేవయ్యా ॥ఒక॥

నిండుఁగొప్పు వెట్టుకొని నెలఁత నిక్కిసంటాను
గండుఁదుమ్మిదలఁ జెనకఁగనేలయ్యా
అండనే శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
దండి గవఁగూడి యాపెచక్కఁదనము మెచ్చేవయ్యా॥ఒక॥99

బౌళి

ఎంత వోరుచుకుండినా నెఱఁగవు నాముందర
వింతలుగా నెంతేసి వేసాలు సేసేవే ॥పల్లవి॥

వన్నెలు వెట్టుకొంటేనే వాసికత్తె వైతివా
చన్నులు గొప్పలైతేనే జాణవైతివా
సన్నపుచీర గట్టితే సరి దొరవైతివా
ఇన్నిటా నాపతితోడ నేమిమాటలాడేవే ॥ఎంత॥

---

త్రిగీతగలవి బాగా కానవచ్చుటలేదు.

విక్కుఁగొప్పు వెట్టితే నేరుపరి వైతివా
పుక్కిట విడె ముంటేనే భోగివైతివా
చెక్కుటఁ జేయిడుకొంటే చేఁతలాఁడివైతివా
ఇక్కడ నితనితోడ నేమినవ్వేవే ॥ ఎంత ॥

సంగడిఁ గూచుండితేనే చనవరివైతివా
అంగాలు సోఁకించితే నొయ్యారివైతివా
చెంగట నలమేల్మంగఁ జెంది శ్రీవేంకటేశుఁడు
యింగితమెఱిఁగి నన్ను నేలె నేమిసేసేవే ॥ ఎంత ॥ 100

తెలుఁగుఁగాంభోది

ఇన్నిటికి మూలము ఇతఁడు నారమణుఁడు
కన్నులారఁ జెలులాల కనుఁగొంటిరటరే ॥ పల్లవి ॥

తనివోనియాసలు తమకానకు మూలము
ననుపులు చుట్టరికానకు మూలము
చెనకినచెనకులు సిగ్గులకు మూలము
వినయాలు సురతపువేడుకకు మూలము ॥ ఇన్ని ॥

కొసరుఁజూపులెల్లాను కోరికలకు మూలము
కసరుజంకెలు మచ్చికకు మూలము
ముసిముసి నవ్వులు ముచ్చటలకు మూలము
పొసఁగినసరసాలు [1]పొందులకు మూలము ॥ ఇన్ని ॥

తలపోఁతలు మదనతంత్రములకు మూలము
లలిఁ దాలిములు [2]పొందులకు మూలము
అలమేలుమంగపతియైనశ్రీవేంకటేశుఁడు
కలసె; నన్నిటా చెప్పఁ గతఁకు మూలము ॥ ఇన్ని ॥ 101

1, 2 సంఖ్యగలవి పునరుక్తములు.

పాడి

అంగనలఁ గనుఁగొంటే నాచారా లెక్కడ నుండు
సంగతి గాదన్నాఁ బోక సాకిరి దెలిపేవు ॥ పల్లవి ॥

మనసువచ్చినాపెతో మాటలాడకుండేవా
ననుపుగలచోటను నవ్వకుండేవా
చనవరిదానిమోవి చవిగొనకుండేవా
యెనయ నెందూ నంటాను యేల పెట్టే వానలు ॥ అంగ ॥

కొలువుకు వచ్చినాపెఁ గోరి చూడకుండేవా
అలమి పైకొన్నదాని నంటకుండేవా
వలచివచ్చినదానివసము గాకుండేవా
పలుమారు నాతో నీవు బాసలేల నేసేవు ॥ అంగ ॥

కడుఁ బ్రేమగలయాపెఁ గాఁగిలించకుండేవా
పుడివోనికూటముల కూరకుండేవా
అదరి శ్రీవేంకటేశ యలమేల్మంగపతివి
యెడయక నన్నేలితి వే లొడఁబరచేవు ॥ అంగ ॥ 102

రేకు 1318 సామంతం

తానే యెఱుఁగుననవే తరవాతిపనులెల్లా
నే నేమిచెప్పేఁ దనకు నేరిపేనా సుద్దులు ॥ పల్లవి ॥

చిత్తములో తమకము చిమ్మిరేఁచఁగా
వొత్తి యడఁచేనంటే నొద్దికయ్యీనా
గుత్తపుగుబ్బలు పైపై గొప్పలు గాఁగా(గాఁ?)
బొత్తుగాఁ గొలఁదివెట్టి బుద్ధిచెప్పవచ్చునా ॥ తానే ॥

కన్నులఁ జూచేయాసలు కడుమఁగాను
వన్నెలఁబట్టి నెఁ(నెం?)తైనా వసమయ్యీనా
తిన్నవివయసు తరితీపుసేయఁగా
వున్నతి నందులకు నూరకుండవచ్చునా ॥ తానే ॥

వీనుల విన్నవినికి వేగిరించఁగా
ఆనుకొన్న కోరికలు ఆఁపవచ్చునా
పూవి యలమేల్మంగవిభుఁడు శ్రీవేంకటేశుఁడు
మేనవావితో నన్నేలె మెచ్చకుండవచ్చునా ॥ తానే ॥ 103

రీతిగౌళ

పుట్టఁగాఁ బుట్టినవి పొలఁతుల కీగుణాలు
నెట్టవ నీ వేలితేను నేస్తములై యుండును ॥ పల్లవి ॥

వున్నతి సవతికాంత లొకరొకరిఁ గంటేను
నన్నల నుప్పతింతురు సాదింతురు
విన్నకన్నవారితోడ వెంగెములాడుదురు
పన్ని పతిపైఁ బెట్టి పంగింతురు ॥ పుట్టఁ ॥

ముందరికి వచ్చితేను మూతులు గిరుపుదురు
నిందింతురు వూరకే నెపా లెంతురు
అంది సింగారించుకొంటే నటుమోమై నవ్వుదురు
యెందు మేలు గలిగినా నీసడింతురు ॥ పుట్టఁ ॥

చక్కఁదనా లీడుచూపి సణఁగులు రాలుతురు
నిక్కిచూతురు యెమ్మెలు నెరపుదురు
పక్కన నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడ
ఇక్కడ నన్నేలినందు కిఁక మెచ్చుకొందురు ॥ పుట్టఁ ॥ 104

పాడి

గుట్టుసేసుకో నీలోలో గుబ్బతిలీ వలపులు
చుట్టరిక మేవేళ చూపీనో నీకును ॥ పల్లవి ॥

చిప్పిలుసిగ్గులతోడఁ జెలి నీయొద్ద నిలిచె
కప్పుకొనెఁ బయ్యెద జంగాళముగాను
విప్పినదోసిట నీకు విదెమియ్యవచ్చె నదె
యెప్పుడు మోమెత్తి చూచి యెనసీనో నిన్నును ॥ గుట్టు ॥

తనివోనితమితోడ తనసింగారాలు చూపి(పె?)
పెనుఁగొప్పు మఱఁగుగాఁ బెట్టెఁ జెంపల
పవివూవి వేడుకతోఁ బాదాలొత్త లాచీనదె
మనసిచ్చి యేపొద్దు మాటాడీనో నీతోను ॥ గుట్టు ॥

కడకంటిచూపులతో కమ్మటి నిన్నుఁ గొసరె
చిడుముడి చిఱునవ్వు చిందుకొంటాను
అడరి శ్రీవేంకటేశ యలమేల్మంగపతివి
యెడయక నన్నేలితి వెన్నఁడు తాఁ బొందీనో ॥ గుట్టు ॥ 105

శుద్ధవసంతం

ఎంత చెప్పినా మానఁడు యిదేమే తాను
చెంతనుండి నామీఁదఁ జేయివేసీఁ దాను ॥ పల్లవి ॥

యెక్కడనుండి వచ్చెనే యీతఁడు నన్నుఁ బొదిగి
చక్కఁదనము వొగిడీ సారెసారెకు
నిక్కినిక్కి నన్నుఁజూచీ నే సిగ్గుతో నుండఁగాను
వెక్కసాన నవ్వుకొంటా వీదెమిచ్చీ నాకును ॥ ఎంత ॥

యెన్ని నేరుచుకొన్నాఁడే ఇప్పు డీమాయకాఁడు నా-
చన్నులు పయ్యదఁ గప్పి జారెనంటాను
చిన్నినిమ్మపంట వేసి చేరి నే నొడ్డించుకోఁగా
కన్నెపడుచను యేల కాకుసేసీ నన్నును ॥ ఎంత ॥

యేమి జాణతనమే తా నిదె శ్రీవేంకటేశుఁడు
మోము వంచఁగానే నాకు ముడిచీఁ గొప్పు
ఆముక యలమేల్మంగవనఁగానే నన్నుఁగూడి
ప్రేమముతో వేడుకకుఁ బేరడిగీ నిన్నును ॥ ఎంత ॥ 106

ఆహిరి

మావసమా బుద్ధిచెప్ప మరి నీయెం(యఁ?)తవానికి
నీవే యెఱిఁగి పతికి నెయ్యములు చూపవే ॥ పల్లవి ॥

మల్లాదేకోపకత్తెను మట్టుకుఁ దేవచ్చుఁగాని
చల్లజంపులాఁడినైతే సాదించరాదు
తెల్లమిగా గోలదానిఁ దీరుకుఁ దేవచ్చుఁగావి
వొల్లనే జూటుదాని నొడఁబరచరాదు ॥ మావ ॥

చలమరిదానినైనా చాయకుఁ దేవచ్చుఁగాని
పలువినయపుదాని గెలువరాదు
నొలసి పంతపుదాని సూటికిఁ దేవచ్చుఁగాని
లలి నాలిదానిగుట్టు దెలియఁగరాదు ॥ మావ ॥

వెట్టచేఁతలాఁడినైనా వీఁకకుఁ దేవచ్చుఁగాని
చుట్టపుసూడుదానిఁ జొక్కించరాదు
పట్టి యలమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరు-
నిట్టె కూడితివి నిన్ను నిఁక దూరరాదు ॥ మావ ॥ 107

గౌళ

చెప్పినట్టు నేసే విఁకఁ జేతికి లోనైతివి
 చప్పుడుసేయకు మిఁక సటలకు నోరువను ॥పల్లవి॥

నవ్వులెంత నవ్వేవు నానాసతులఁ గూడి
 రవ్వ లెల్లఁ జేసితివి(వి?) రపమాయను
తవ్వకు తొల్లిటిపొందు తడవాయ నిఁకనేల
 జవ్వనము జాలువారీ సటలకు నోపను ॥చెప్పి॥

మాట లెఁ(లెం?)దాఁకా నాడేవు మగువల ఇండ్లు చొచ్చి
 పాటించితివి దూరు నీపాలాయను
వాటము నేయకు బాస వదిఁబడీ విఁకనేల
 సాటివచ్చె సుద్దులెల్లా సటలకు నోపను ॥చెప్పి॥

చూపులేమి చూచేవు సుదతుల వెంటఁ దెచ్చి
 కాఁపురా లీదేర్చితివి కతలాయను
రాపుగ శ్రీవేంకటేశ రతి నన్నుఁగూడితివి
 చాపలము నీకేదది సటలకు నోపను ॥చెప్పి॥ 108

రేకు 1319 వరాళి

నీకు నేము [1] బాఁతెయ్యేమా నేఁ డిపుడు
 ఆకుమడిచిమ్మంటా నాసలు రేఁచేవు ॥పల్లవి॥

ఏందుచెప్పేయాపె నిన్ను విడిదికిఁ బిలుచుక
 మందలించి వొయ్యనే మరిగించెను
పందేలువేసి నీతో పగడసా లాడియాడి
 కందువైనరతులలెక్కలు మోపెను ॥నీకు॥

---

1. బాఁతి + అయ్యేమా.

పెక్కుకానికె లొసఁగి పీఁటపైఁ గూచుండఁబెట్టి
గక్కన నీమనసెల్లఁ గరఁగించెను
చిక్కించి చుట్టరికాలుచెప్పి విడెములువెట్టి
దక్కఁగొని నిన్ను నిట్టె తగిలించుకొనెను ॥ నీకు ॥

యిచ్చగించి పాదాలొత్తి యేకతానఁ దెరవేసి
మెచ్చులుగాఁ గాఁగిలించి మెప్పించెను
యిచ్చట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తచ్చి తా నావొంటు నీకుఁ దలఁపించెను ॥ నీకు ॥ 109

## కన్నడగౌళ

ఏమని చెప్పేమయ్యా ఇదివో మాకాఁపురాలు
నీమేలులోనివారము నీచిత్త మిఁకను ॥ పల్లవి ॥

తలఁచితే తలఁపులు తగులమూలై యుండు
పలికితే మాటలు పచ్చిదేరును
మొలచితే సిగ్గులు ముదిరి తీగెలువారు
వలచితే వలపులు వాములకొలఁదులు ॥ ఏమ ॥

పెంచితే ప్రియములు పెంటలై పెరుగును
వంచుకొంటే నవ్వులు వరదవారు
నించితేఁ దమకములు విందుబండారములౌను
ముంచితే జవ్వనాలు మోపులకొలఁదులు ॥ ఏమ ॥

తవిసితేఁ గోరికలు తప్పక దైలువారు
మునిపితేఁ బంతములు ముప్పిరిగొను
యెనసితి విటు నన్ను వింతలో శ్రీవేంకటేశ
గొనకొన్నరతు లివి కోట్లకొలఁదులు ॥ ఏమ ॥ 110

కాంబోది

చెప్పరానినేరుపుంచేతలవాఁడవు నీవు
నెప్పున నిన్నుఁ గొసర నే నెంతదానను ॥పల్లవి॥

నంటున నీ వడుగఁగా నావావి చెప్పితిఁగాక
యింటికి నిన్నుఁ బిలువ నెంతదానను
అంటిముట్టి సరసములాడఁగాఁ బైకొంటిఁగాక
జంటలై నీతోఁ బెనఁగ సరి నెంతదానను ॥చెప్ప॥

నీచిత్తానఁబెట్టి మన్నించఁగా మాటాడేఁగాక
యేచి నిన్నుఁ బలికించ నెంతదానను
కాచుక నావంకఁ జూడఁగాఁ గానుకిచ్చితిఁగాక
లాచి నీతోఁ బొఁ(బొం?)దుసేయ లలి నెంతదానను ॥చెప్ప॥

వినఁగానే [1]వినపాలు వేమారుఁ జేసితిఁగాక
యెనసి నిన్ను నే మించ నెంతదానను
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
పెనురతుల నిన్ను మెప్పించ నెంతదానను ॥చెప్ప॥ 111

నాదరామక్రియ

మాటలెన్ని యాడేవే మాపుదాఁకాను
చాటువగా రమణుఁడు చనవిచ్చె నాకును ॥పల్లవి॥

సలిగెగలదానికి సరసములాడఁజెల్లు
చెలిమికత్తెకు నేమిసేసినాఁ జెల్లు
కలిమిగలదానికి గర్వించియుండఁజెల్లు
పిలుపుగలదానికి బీరములు చెల్లునే ॥మాట॥

---

1. 'కొన్ని'కి 'కొని' వలె ఈవాఙ్మయములో 'విన్నపము'వంటివానికి 'వినపము'—వంటిరూపము లనిపించుచున్నది.

వాడఁబాటుగలదాని కొరసి పెనఁగఁజెల్లు
బడివాయనిదానికి పంతము చెల్లు
కడుఁజుట్టమైనదానిఘనతలెల్లాఁ జెల్లు
వాడికముగలదానివొప్పిదము చెల్లునే ॥ మాట ॥

బత్తిగలిగినదానిపగటులెల్లాఁ జెల్లు
హత్తికొలిచినదానియందము చెల్లు
కొత్తగా నలమేల్‌మంగకుఁ బతి శ్రీవేంకటేశుఁ-
డిత్తల నన్నునేలె నింపు నాకే చెల్లునే ॥ మాట ॥ 112

బౌళిరామక్రియ

వనితలజాడలు వద్దంటే మానరు
చనవు నీవిచ్చినదే సరివచ్చెనా ॥ పల్లవి ॥

అంకెకువచ్చినదాఁకా నాడుదురు మాఁటలు
చంకకులోనైతేనే జంకింతురు
పొంకపుగొల్లెతలను భోగించి చూచితివి
సంకెదీర నామాట సరివచ్చెనా ॥ వని ॥

నమ్మికైనయందాఁకా నవ్వుదురు సెలవుల
సమ్మతించినందుమీఁద సాదింతురు
వుమ్మడిఁ బదారువేల నొడివట్టి చూచితివి
సమ్ముకానఁ జెప్పితిని సరివచ్చెనా ॥ వని ॥

దక్కినయందాఁకానే తమకించి పైకొందురు
చిక్కితేనే కొనగోరఁ జెనకుదురు
గుక్కక శ్రీవేంకటేశ కూడి నన్నుఁ జూవి(చి?)తివి
చక్కవినావిన్నపము సరివచ్చెనా ॥ వని ॥ 113

కొండమలహరి

ఇప్పుడు మారతివేళ నిన్నిపొందులు
తప్పకుండాఁ దలఁచుకో తనిసేవు పొందులు ॥పల్లవి॥

వెన్నలారగించేనాఁటివేఁడివేఁడిపొందులూ
చన్నులకొనలనొత్తేచద్దిపొందులూ
అన్నిటా రాసక్రీడ యమునలో పొందులూ
మున్నిటివి దలఁచుకో ముచ్చటలపొందులూ ॥ఇప్పు॥

చల్లలమ్మేచోట్ల సరసపుపొందులూ
పిల్లఁగోవిరాగాలపెనుపొందులు
తొల్లి నీవుగాచుకున్నదొడ్డిపొంతపొందులూ
వెల్లవిరిఁ దలఁచుకో వేడుక నీపొందులు ॥ఇప్పు॥

ఆవులఁ బిలిచేచోటిఆనవాలపొందులూ
కావరపుమందల పొంగటి(లి?)పొందులూ
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
గోవాళుఁడ తలఁచుకో గొల్లవారిపొందులూ ॥ఇప్పు॥ 114

రేకు 1320 దేసాళం

ఇంత సేసితివి నీవే యిందాఁకాను
యేఁ(యెం?)తైనాఁ గద్దు చలము యేమిసేతురా ॥పల్లవి॥

మంచిమాఁట లాడేనంటే మరి వెంగేలే తోఁచీ
చుంచుల నిచ్చకములు సూటిపడవు
లంచము మోవిచ్చేనంటే లావులఁ బెనఁగీ మోము
యెంచరాదు నాపంతము యేమిసేతురా ॥ఇంత॥

సేవలు సేసేనంటే చేతికొనగోరు దాఁకీ
వోవరిలో మనసులు వుడికించీని
భావించి నవ్వేనంటే పగిది వెట్టినట్టయ్యీ
యీవిధము నావుదుటు లేమిసేతురా ॥ ఇంత ॥

మెచ్చి కాఁగిలించుకొంటే మేవిగురుతులు రాఁగీ
కొచ్చికొచ్చి సిగ్గులెల్లా గుంపుగూడీని
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితి వింతలో నన్ను
యెచ్చరించీ మర్మములు యేమిసేతురా ॥ ఇంత ॥ 115

శంకరాభరణం

ఇద్దరికిఁ జెల్లు నిటువంటిప్రేమ
ముద్దుఁదుమ్మిదలు మొరసినట్టాయ ॥ పల్లవి ॥

తళుకుఁజూపులు తరుణి చూచితే
నెలవుల నవ్వేవు చెలువుఁడ
వొలిసి చంద్రుఁడు వుదయించితేను
కలువలు చెలఁగేగతులాయను ॥ ఇద్ద ॥

కాంత నిమ్మపండు కానుకిచ్చితే పూ-
బంతిఁగొని యాపెపై వేసితి
కంతువివసంతకాలము వచ్చితే
పొంత వనమెల్లఁ బూచినట్టాయ ॥ ఇద్ద ॥

మోవి చూపి యాపె మొక్కె మొక్కితేను
శ్రీవేంకటేశ్వర చేకొంటివి
వావిరి భూమిపై వానగురిసితే
భావించి పంటలు పండినట్టాయ ॥ ఇద్ద ॥ 116

నాదరామక్రియ

గారవించవయ్యా యింతిఁ గాఁగిలించి
కోరికతో కొప్పుజారీ కొచ్చిచూచి విన్నును ॥ పల్లవి ॥

నీకు మొక్కఁబూనితేను నెలఁత వేలిగోరు
రేకగాఁ జెక్కుమీఁదఁ జీరెను చేతప్పి
ఆకడ నీవు నవ్వితి వందుకుఁగా సిగ్గువడి
వాకుచ్చనేరక తలవంచుకున్న దెదుట ॥ గార ॥

నీతో మాఁటలాడరాఁగా నెలఁతపలు నొరసి
ఘాతగాఁ దనపెదవి గంటివడెను
యేతున నీవు మెచ్చితే నిందుకుఁగా సిగ్గువడి
కాతరాన నిన్నుఁజూచి కాఁతాళించీ నదివో ॥ గార ॥

నిన్నుఁ గాఁగిలించఁగాను నెలఁతచనుఁగొండలు
తన్నుఁదానే తనచంకఁ దనఁబడితే
కన్నె శ్రీవేంకటేశుఁడ కఁటివఁటా సిగ్గువడి
వన్నె నిన్నుఁ బరాకుగా భ్రమయించీ నిపుడు ॥ గార ॥ 117

ముఖారి

మరిగేల కొసరేవు మగువను సారెసారె
తరితీపులకునెల్ల తమకించెఁ జాలదా ॥ పల్లవి ॥

యెక్కువతక్కువలుగా నెదురు మాటాడక
అక్కరతో సేవసేసె నది చాలదా
కక్కసించి మారుకొవి కాఁతాళము రేఁచక
మక్కువ నీనవ్వులకు మారునవ్వెఁ జాలదా ॥ మరి ॥

చప్పనవుప్పననుచు జగడాలుదియ్యక
అప్పుడే విడెమిచ్చె నది చాలదా
తప్పులు విన్నుఁబట్టి తరితీపులు చూపక
ముప్పిరిఁ జేతులెత్తి మొక్కె నీకుఁ జాలదా ॥ మరి ॥

సిగ్గులునెగ్గు లెంచక శ్రీవేంకటేశ్వర యింతి
అగ్గమై నిన్నుఁ గూడె నది చాలదా
వెగ్గళించ కింపులుగా వేవేలురతులను
వొగ్గి నీకు నొడిగట్టి వొక్కటాయఁ జాలదా ॥ మరి ॥ 118

సౌరాష్ట్రం

కడమ లే దేమిటాను ఘనుఁడవయ్యా
కడుపులోనే నేర్చితి కంటిమయ్యా ॥ పల్లవి ॥

సిగ్గువడ్డఆపెనే చీరవట్టి తీసేవు
అగ్గలమైతి వన్నిటా నౌనయ్యా
వొగ్గి నవ్వేయాపెనే వూరకే గిలిగించేవు
తగ్గులేనిజాణఁడవు తగునయ్యా ॥ కడ ॥

మొక్కేటియాపెపైనే మోపేవు నీపాదములు
మిక్కిలి నేరుపరివి మేలయ్యా
అక్కరపడేయాపెకే ఆసలు మరి రేఁచేవు
యెక్కువగుణాలు నీయం దెఱిఁగితిమయ్యా ॥ కడ ॥

కూడేటియాపెనే కుచ్చి కాఁగిలించేవు
వోడనేమిటికి నీవు వొప్పితిమయ్యా
పాదితో శ్రీవేంకటేశ పైకొని యాపెఁ బైకొంటి-
వేడనైనా నీవే దొర వియ్యకొంటిమయ్యా ॥ కడ ॥ 119

తెలుఁగుఁగాంబోది

వట్టిబూటకాన వడి నన్ను దూరేవు
దట్టించి ముట్టితే తాఁకీనటరా ॥ పల్లవి ॥

కొప్పువట్టితీసి గోర గీరితే
యిప్పు డింతలోనే యేమాయరా
వుప్పతించి నిన్ను నొట్టువెట్టితే
కప్పిననీమేను కసుగందెనటరా ॥ వట్టి ॥

తిలకించి చూచి తిట్టుదిట్టితే
యెలమి వింతలో నేమాయరా
లలి సరసాన లావు చూపితే
అలసి నీవుర మగడాయనటరా ॥ వట్టి ॥

సారె గాఁగిలించి చన్నుల నొత్తితే
యేరా యింతలోనే యేమాయరా
యీరీతి శ్రీవేంకటేశ నేఁ గూడితే
బీరపునీమోవి పిప్పాయనటరా ॥ వట్టి ॥ 120

రేకు 1321 ఆహిరినాట

సమ్మతిలఁ జెప్పేవు సారెసారెకు
వుమ్మడి మామనసింకా నొదఁబడీనా ॥ పల్లవి ॥

అన్నిటా నీవెంత నన్ను ఆసలఁబెట్టినాను
యెన్ని లేవు నీగుణాలు యెఱఁగినవే
కన్నులఁ దొల్లె నేము కంటిమి నీసరితలు
వున్నతి నామనసిది వొదఁబడీనా ॥ సమ్మ ॥

రవ్వలుగ నీవెంత రతికిఁ బిలిచినాను
యివ్వల నీచేఁతలు యెఱిఁగినవే
తవ్వి తలకెత్తేవు నీతగవులు మాకును
వువ్విళ్లూర మామనసు వొడఁబడీనా ॥సమ్మ॥

సిగ్గువడక నీవెంత చెక్కులు నొక్కినాను
యెగ్గులేని నీపొందు లెఱిఁగినవే
నిగ్గున శ్రీవేంకటేశ నేఁడె నన్ను నేలితివి
వొగ్గి యింక వేరేమనసొ వొడఁబడీనా ॥సమ్మ॥ 121

నీలాంబరి

చెలఁగి పెద్దరికము సేతుఁగాని
కలఁకరేఁచేదానఁగానుసుమ్మీ నిన్నును ॥పల్లవి॥

నాకే వలతునంటా నమ్మికె లేలిచ్చేవు
చేకొంటెఁ గావచ్చుఁ జెప్పవలెనా
రేకలు దీయమనేవు రీతిగా నీభుజముల
కాకునేసేదాననుఁగానుసుమ్మీ నిన్నును ॥చెలఁ॥

పాయలేనుసుమ్మీయని బాసలేల నేసేవు
యీయెడనే కావచ్చి నిదియేఁటికి
నేయరానిచేఁతలెల్లాఁ జేయుమని యేలనేవు
కాయ పండుసేసేదానఁగాను సుమ్మీ నిన్నును ॥చెలఁ॥

యిచ్చకపువాఁడనంటా యేల నన్ను ముట్టేవు
యెచ్చరిక గానవచ్చె నెఱుఁగుదును
కొచ్చి శ్రీవేంకటేశుఁడ కూడి నన్నేలుమనేవు
గచ్చుల మీరేదానఁగానుసుమ్మీ నిన్నును ॥చెలఁ॥ 122

బౌళి

అందసున్నచెలులము నన్నిటాఁ దనిసితిమి
యెందా నీడాఁ దెలిసితి వేమిసేతువయ్యా ॥ పల్లవి ॥

చెప్పినమాటలెల్లా చెవులొగ్గి వింటివి
రెప్పలెత్తి చూచితివి వొప్పుగొంటివి
దప్పిదేరె నీయింతి దవ్వుల నీసుద్దులకే
ఇప్పు డింతకంటె వీఁక నేమిసేతువయ్యా ॥ అంద ॥

కరఁగితి వింపులను కడును లాలించితివి
శిరసూఁచుకొని సన్న సేసితివి
సరసమున నీఇంతి చనవరియాయను
ఇరవాయ నింతకంటె నేమిసేతువయ్యా ॥ అంద ॥

చేరి కాఁగిలించితివి చెక్కు చేత నొక్కితివి
గారవించి రతులనుఁ గైకొంటివి
యీరీతి శ్రీవేంకటేశ యీసతి మన్ననఁ బొందె
[1] యేరవ్వా నే లింతకంటె నేమిసేతువయ్యా ॥ అంద ॥ 123

సింధురామక్రియ

ఈపె వంటిదిట్టతన మేడ నీవు గంటివయ్యా
నీపాదము లొత్తుతాను నీవద్దనే వున్నది ॥ పల్లవి ॥

ఆసల నిన్నుఁ దిట్టీ అన్నిటికి సెలవుగా
సేసకొప్పు వంచి నీకు చెలి మొక్కీని
సేసేచేఁత నిన్నుఁ జేసి చిత్తమురా వలసి(చి?)
మూసినముత్తెమై ముందటనే వున్నది ॥ ఈపె ॥

1. యేరవ్వాను+ఏల+ఇంతకంటే. "యేరవ్వలు నేలింతకంటె నేమిసేతువయ్యా" అని యుండవచ్చును.

నీమోవి గంటిసేసీ నేరములెల్లాఁ దీర
చేముట్టి కప్రవిడెము చేతికిచ్చీని
సాముసేసినట్లనే చన్నులను నిన్ను నొత్తి
ఆముకొని పంతమిచ్చి ఆయమంటుచున్నది ॥ఈపె॥

పాదమునేఁ దా(నేదాఁ?)కించీ భయమెల్లాఁ బాయను
సాదువలెఁ గాఁగిలించి సరిఁగూడీని
యీదెస శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
ఆదరించి కమ్మటివి ఆసరేఁపుచున్నది ॥ఈపె॥ 124

### కేదారగౌళ

తనచేతి దిఁకను ధర్మము పుణ్యము
చొనిపి యింకాఁ దన్ను సొలసేఁటిదేఁటిదే ॥పల్లవి॥

ములువాఁడికొనగోరిమొనలు వాఁడి
కలయనితనతోడికాఁకలు వేఁడి
అలసితి రెంటివల్లా నప్పుడే నేను
యెలమి నింకాఁ దనతో నేఁటిమాఁటలే ॥తన॥

సారపుఁబయ్యదలోవిచన్నులు గట్టి
సారెకు నాదేసరసములు వెట్టి
అరితేరె నిందునందు నందరిలోన
మారుకొని యింకాను మరి యేఁటిపొందులే ॥తన॥

నెమ్మి వీడినతురుమునెరులు చిక్కు
కమ్మరఁ గూడినయట్టి కాఁగిలిచొక్కు
నమ్మించి శ్రీవేంకటేశుఁడు నన్నేలెను
సమ్మతిఁ దనకు నాకు సరి నేఁటిసిగ్గులు ॥తన॥ 125

నాదరామక్రియ

అంగడినేల వేసేవు అప్పటి వలపులు
యింగిత మెఱిఁగి యిట్టె యేలుకొనరాదా ॥ పల్లవి ॥

మంచిమాఁట లాడితేనే మనసుఁ గరఁగుదుము
కంచముపొత్తిచ్చితే కాఁతాళించము
మంచమెక్కనిచ్చితేనే మచ్చికలు సేతుము
యించుకంత చనవిచ్చి యేలుకొనరాదా ॥ అంగ ॥

చెక్కునొక్కినందుకే సేవలెల్లాఁ జేతుము
చక్కఁగాఁ జూచితేనే సమ్మతింతుము
గక్కనఁ గొంగువట్టితే కందువకు లోనౌదుము
యిక్కువతో మన్నించి యేలుకొనరాదా ॥ అంగ ॥

చనుఁగవ లంటితేనే సరుసఁ గాఁగిలింతుము
వొనరఁగ నవ్వితేనే వోరుతుము
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి వింతలోనే
యెనసి యిట్టె లాలించి యేలుకొనరాదా ॥ అంగ ॥ 126

రేకు 1322 ఆహిరి

ఇందులోనే వున్నవివె యింతితమకములెల్ల
గొందినే కోరికలెల్లా [1] కొమ్మ లే కిగిర్చెను ॥ పల్లవి ॥

చెలి నీకడకు రాఁగా చెమటలఁ దొప్పఁదోఁగె
వలపులు వానలేవివరదాయ
యెలమి నీరాకల కెదురులుచూడఁగాను
వెలయఁగ దివ్వెలేకే వెలుఁగనిపించెను ॥ ఇందు ॥

---

1. 'కొమ్మ' కు రూపాంతరమా?

వెదకుతానే నిన్ను వెలఁది కాఁకలఁ బొందె
యెదుటఁ బొద్దువొడవ కెండగాసెను
యిదె నీపైయాసల నిట్టె మేను పులకించె
వెదవెట్టక ససులు వేవేలు మొలచెను ॥ఇందు॥

నీరతికిఁ జేయిచాఁచె నిట్టూర్పుల నిండెఁ జెలి
కోరి యాస గాలిలేక తూరుపెత్తెను
సారె శ్రీవేంకటేశుఁడ చన్నుల నిన్నొత్తి
బోరునఁ దా జాళిలేక బొమ్మరాలు వేసెను ॥ఇందు॥ 127

## రామక్రియ

నీవేడుకే చూచేవు నెలఁతలా గెంచవు
సోవలకన్నుల నాపె సొలయఁగాను ॥పల్లవి॥

యెందాఁకా మాటలాడేవు యెంతలేదు నీనవ్వు
అందపుటాసలఁ జెలి అలయఁగాను
యిందునందూ సోలుతా నెమ్మె లేమిచూపేవు
గొంది నుండి యాపె నిన్నుఁ గొసరఁగాను ॥నీవే॥

యేమి సరసమాడేవు యేదిగొద్ది నీపగటు
కామిని కాఁకలచేతఁ గసుగందగా
సాములుసేయుచును చలమేల సాదించేవు
వేమరు నాపె నిన్ను వేఁడుకొనఁగాను ॥నీవే॥

యెట్టు వేసాలుసేసేవు ఇన్నియు నేర్తువు నీవు
అట్టె ఇంతి నిన్నుఁగూడి అలయఁగాను
రట్టుగ శ్రీవేంకటేశ ముట్టి యేల కెలసేవు
వెట్టదీర నాపె నిన్ను వినుతించఁగాను ॥నీవే॥ 128

పాడి

దేవుఁడవు నీవూ దేవుల నేను
వావులు గూడఁగాను వడి నేసవెట్టితి ॥ పల్లవి ॥

వలపులు నే నెఱఁగ వాసు లెఱఁగను; నీవు
కలకల నవ్వితేనే కరఁగితివి
పలుకులు నే నేర భావించఁగ నే నేర
పిలిచి విడెమిచ్చితే ప్రియమందితివి ॥ దేవుఁ ॥

మనసు సాదించనోప మర్మము లడుగనోప
చెనకి గోర నూఁదితే చేకొంటిని
పెనఁగఁజాలను నేను బిగియఁగఁజాలను
కనువిచ్చి చూచితేనే కావిమ్మంటిని ॥ దేవుఁ ॥

పచ్చిచేఁతలు రచించఁ బలుమారు సిగ్గువడ
మచ్చికఁ గాఁగిలించితే మరిగితివి
యిచ్చట శ్రీవేంకటేశ యేలుకొంటి విటు నన్ను
మెచ్చి కాఁగిలించితేను మేకొని మొక్కితివి ॥ దేవుఁ ॥ 129

సామంతం

అన్నిటికి నేరుతువు అవునయ్యా
కన్నదే కంది గురుమ కంటిమయ్యా ॥ పల్లవి ॥

పిలిచె విందాఁకాను పెద్దయెలుఁగున నింతి
పొలసి నీ వెక్కడికిఁ బోతివయ్యా
మొలచినట్లు వచ్చి ముసుఁగుతో పానుపుపై
తల గానరా దాఁగేవు తగునయ్యా ॥ అన్ని ॥

వెదకె నిందాఁకాను వీదులవీదుల నాకె
వుదుటున నెవ్వరింట నుంటివయ్యా
తుద పిందె దిగినట్టు దోమతెరమరఁగున
నిదురవోతా బొంకేవు నేరుపరివయ్యా ॥ అన్ని ॥

కొసరె నిందాఁకాను కొమ్మ నీకాఁగిటఁ గూడి
వెస నేమని చెవుల వింటివయ్యా
రసిక శ్రీవేంకటేశ రమణిఁ గూడితి విట్టె
కసుగాయమో విచ్చేవు ఘనుఁడవయ్యా ॥ అన్ని ॥ 130

దేసాళం

కొమ్మలు పదారువేలగోవిందరాజ
నిమ్మపంట వేతురా నీ వాఁటదానిని ॥ పల్లవి ॥

చేరి కొంగువట్టెనంటాఁ జెలులతోఁ జెప్పిచెప్పి
ఆరీతి నవ్వుదురా ఆఁటదానిని
కోరి చెమటదీసితే కొనగోరు దాఁకెనంటా
నేరము లెన్నుదురా నీ వాఁటదానిని ॥ కొమ్మ ॥

సన్నలఁ జిక్కించెనంటా సాకిరులు వెట్టిపెట్టి
అన్నిటా దూరుదురా ఆఁటదానిని
చన్నులనోఁతఁగ నీసరుసఁ గూచుండెనంటా
నిన్నటికి నేఁ డందురా నీ వాఁటదానిని ॥ కొమ్మ ॥

జట్టిగొని కూడెనంటా సముకాన మెచ్చిమెచ్చి
అట్టె పొగడుదురా ఆఁటదానిని
వొట్టుక శ్రీవేంకటేశ వుర మెక్కించుకొంటివి
నెట్టన నింతసేతురా నీ వాఁటదానిని ॥ కొమ్మ ॥ 131

సాళంగనాట

కొలువు సేయించుకొనేగోవిందరాజా
అలరి వోరుచుకొంటే నందమయ్యా ॥ పల్లవి ॥

చిగురుమోవులవారు చేరి నీతో మాటాడితే
వొగరువేయకుండునా వొకకొంతైనా
వెగటున విని నీవు వెంగెములుసేసుకొనేవు
నగవుసేసుకొనేదే నయమయ్యా ॥ కొలు ॥

కలువకన్నులవారు కప్పి నిన్నుఁ జూచితేను
చలువ గాకుండునా జవ్వనానకు
లలి నీ వందుకును చలములు రేఁచుకొనేవు
పులకించి మెచ్చేదే బుద్ధియౌనయ్యా ॥ కొలు ॥

జక్కవచన్నులవారు సరిఁ గాగిలించుకొంటే
ముక్కులు సోఁకకుండునా మించి పురము
యిక్కువ శ్రీవేంకటేశ యిందుకుఁగా నలసేవు
చొక్కుచు సంతసించేదే జోకౌనయ్యా ॥ కొలు ॥ 132

రేకు 1323 శ్రీరాగం

అటువంటివాఁడు గాఁడు ఆతఁడు నీకుఁ దప్పఁడు
కిటుకులెల్లా మాని కేలెత్తి మొక్కవే ॥ పల్లవి ॥

దప్పిదేరేమోముతోడ తమకాన నున్నాఁడు
కప్పుర మియ్యఁగదవే కలికీ
ఇప్పుడు వచ్చితి వాతఁ డిందాఁకాఁ దా నొంటి నుండె
చిప్పిలుఁజెమట లార్చి సేదదేర్చవే ॥ అటు ॥

అసురుసురనుకొంటా ఆసలతో నున్నాఁడు
కొసరి విడెమియ్యవే కోమలీ
ముసుఁగు దీసితి విట్టె మోము గాన కాతఁ డుండె
వెస నీమోవి యిచ్చి వేడుక సేయవే ॥ అటు ॥

చిగురుఁదలపోఁతతో శ్రీవేంకటేశుఁ డున్నాఁడు
తగురతిఁ గూడవే తరుణీ
వొగి నేసవెట్టితివి వొలిసి నిన్నాతఁ దేలె
పొగడి కాఁగిటిలోనే పొసఁగివుండవే ॥ అటు ॥ 133

సాళంగం

కొండవంటిదొరవు కోరి చెయివట్టఁగాను
కండించి యాడవచ్చునా కానీవయ్యా ॥ పల్లవి ॥

వలపు చవిచూపితే వద్దనఁగవచ్చునా
చెలఁగి మాయింటికి విచ్చేయవయ్యా
వొలిసి విడెమియ్యఁగా నొల్లననవచ్చునా
తిలకించి పుచ్చుకొనేఁ దేవయ్యా ॥ కొండ ॥

సిగ్గులు చేతికిచ్చితే చేత దొబ్బవచ్చునా
వెగ్గళించ నీకఁ దెరవేయవయ్యా
వొగ్గి నవ్వులు నవ్వఁగా నోపననవచ్చునా
నిగ్గుల సమ్మతించితి నీచిత్తమయ్యా ॥ కొండ ॥

జవ్వనము పైఁబూసితే జంకించవచ్చునా
చివ్వనఁ గాఁగిట వించి(చే?) చేదాఁచవయ్యా
యివ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నివ్వటిల్ల మన్నించి(చే?) నిండుకుండవయ్యా ॥ కొండ ॥ 134

## రామక్రియ

అంటుకొంటి వీఁకనో ఆయఁగా రట్టు
కంటగించ కంతలోనె కాఁగిలించుకొంటివి ॥ పల్లవి ॥

చెఱఁగుమాసినసుద్ది చెలితో నేఁ జెప్పఁగాను
యెఱుకలుసేసుకొనే వేఁటికి నీకు
చిఱుతనవ్వులు నవ్వి సిగ్గువడి నే నుండితే
వొఱపుతోడను వచ్చివొద్దఁ గూచుండితివి ॥ అంటు ॥

నాలునాళ్లు సేసేనని నాతులఁ బిలిచితేను
యీలీల నదేమనేవు యేఁటికి నీకు
మైలవాసి నేనిటు మఱఁగున నుండఁగాను
పోలిమి నెంగిలిచోటు పొలసి తొక్కితివి ॥ అంటు ॥

పాయపుమదముతోడఁ బడఁతులఁ జూచితేను
యీయెడ నేకతమాడే వేఁటికి నీకు
చాయల శ్రీవేంకటేశ జంట నను గూడితివి
పాయ నీచేయి దాఁకెఁ బట్టినకాఁగిలి ॥ అంటు ॥ 135

## ఆహిరి

అందువంకనైనాఁ గొంత ఆతుమ దనుసును
పొందులన్నియునుఁ దలపోసుకొనవయ్యా ॥ పల్లవి ॥

పెక్కుసతులమీఁదను ప్రియముగలవాఁడవు
వొక్కతే నీరతులకు నోపుదునా
గక్కన నీమనసు కరఁగేయట్టుగాను
తక్కక మరిఁగొందరిఁ దలఁచుకోవయ్యా ॥ అందు ॥

నానావిధాలవారితో ననిచినవాఁడవు
నేనొక్కతె నవియెల్లా నేరుతునా
సోనగా మై చెమరించి చొక్కేయట్టుగాను
తానకపుకతలెల్లాఁ దలఁచుకోవయ్యా ॥ అందు ॥

చెంచులా గొల్లెతలా మెచ్చినయట్టివాఁడవు
మించి నేనొక్కతెనే మెప్పించేనా
కొంచక శ్రీవేంకటేశ కూడితి వైనట్టుగాను
దంచక నావంటి దేది తలఁచుకోవయ్యా ॥ అందు ॥ 136

## కాంబోది

చెప్పినట్టు సేయవయ్య చెలియచిత్తమురాను
దప్పిదేర బుజ్జగించి తనివందవయ్యా ॥ పల్లవి ॥

చిగురుఁబోణి నిన్ను [1] శ(సెః)లవుల నవ్వీని
జిగి నీవెక్కడ నేమినేసితివయ్యా
తగిలి నీనిలువెల్లాఁ దప్పకచూచీ విదె
యెగసక్కెపుమచ్చము లేమున్నవయ్యా ॥ చెప్పి ॥

కచ్చుపెట్టి నీకు నట్టె కస్తూరి పూసీని
పచ్చిగా నెవ్వతెతావి పట్టెనయ్యా
దిచ్చరినీమోవి గలతేనెతీపు చాలదని
వెచ్చ మేడఁ బెట్టి కొంత తెచ్చితివయ్యా ॥ చెప్పి ॥

శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కాఁగిలించి కూడె
కావించి నీనిజ మెట్టు కనెనయ్యా
వోవరిగాఁ దనకు నీవురము నెలవుచేసె
భావమెఱిఁగి రతెట్టు పవిగొనెనయ్యా ॥ చెప్పి ॥ 137

1. యతిభంగము

మాళవిగౌళ

[1] ఎఱుఁగుదు మిన్నియును ఇంతేశేల
వలవాతా నింకా వింతవారమా నేము ॥ పల్లవి ॥

మాటలనే చొక్కితిమి మంతనాలు మెచ్చితిమి
తాఁటలఁదూఁటలచేతఁ దనిసితిమి
యేఁటికి మమ్మఁ జెనకీ నిన్నిటాఁ జుట్టాలము
వాఁటముగ నీక వింతవారమా నేము ॥ ఎఱుఁ ॥

నగవుల నలసితిమి నయముల నమ్మితిమి
తగవులు నెరపఁగాఁ దనిసితిమి
మొగము లేమిచూచీని మోహించినవారము
వగలేల యింకా వింతవారమా నేము ॥ ఎఱుఁ ॥

మోవితేనె లానితిమి ముచ్చటలఁ గూడితిమి
తావుల సరసములఁ దనిసితిమి
యేవల్లా శ్రీవేంకటేశు కిచ్చకపుసతులము
వావిగూడె నింకా వింతవారమా నేము ॥ ఎఱుఁ ॥ 138

రేకు 1324 వరాళి

అవునయ్య మంచివాఁడ వన్నిటా నీవు
యివల నిన్నేమందు నెంతకాఁతరీఁడవు ॥ పల్లవి ॥

చెప్పదునా అపెతోడ చెంది నీసేసినచేఁత
యిప్పు డిట్టె వింటేను యేమను నిన్ను
చెప్పరానివిశ్వాసిచెలికత్తెలము నేము
కొప్పువట్టి మాపయ్యదకొం గంటఁదగునా ॥ అవు ॥

---

1. ఈపాటలో 1, 2 చరణములలో 'జెనకీ' 'చూచీని' క్రియలు మధ్యమపురుషము లైతే అన్వయము బాగుండునేమో? లేక చెలితో చెప్పినమాటలా?

చూపుదునా ఆపెకు సొమ్ములు నీవిచ్చినవి
ఆపనుల కేమని ఆడునో నిన్ను
వోపికతో నితపరివూడిగపువారము
చేపట్టి మాచెక్కులను జీరఁదియ్యఁదగునా ॥ అవు ॥

సాకిరి దెలుపుదునా సరి నీనవ్వినవ్వు
[1]తూకొనెలమేల్మం గెంతదూరునో నిన్ను
యీకడ శ్రీవేంకటేశ ఇద్దరి నమ్మినవార-
మేకాలఁది[2](ది?) గాఁగిలించి యింత మెచ్చఁదగునా॥అవు॥139

దేసాళం

నీలో మెలఁగినదాన నేఁడు మాకుఁ గొత్తలా
నీలాగులన్నియును నే మెఱఁగమా ॥ పల్లవి ॥

కట్టినది చంద్రగావి, కాయము తట్టుపుణుఁగు
యెట్టెవ్వతెఁ గూడినా నిన్నెఱఁగవచ్చు
పెట్టకు మంతేసియాన బిరుదుబంటవు నీవు
నెట్టుకొన్ననీనిజము నే మెఱఁగమా ॥ నీలో ॥

పొదికప్రము చెక్కుల, పూవులదండలు మేన
కద నెవ్వతెఁ బొందినాఁ గానఁగవచ్చు
పొదఁబరచకు మంత పొదయఁడ వందరికి
నిడుపునీగుణాలు నే మెఱఁగమా ॥ నీలో ॥

వోవరి శ్రీవేంకటాద్రి, వురాన నలమేల్మంగ
చేవ నెవ్వతెఁ గూడినాఁ జెప్పఁగవచ్చు
కావించకు బాస నాకు శ్రీవేంకటేశ నన్నేలి
నీవోజ లెప్పుడును నే మెఱఁగమా ॥ నీలో ॥ 140

---

1. తూకొని+అలమేల్మంగ 2. 'ఏకాలది' అని ప్రశ్నార్థకము. 'కాలఁదిఁ' లో 'ది' తరువాతి అరసున్న విచార్యము.

బౌళి

కాఁగిలించవయ్యా కామిని నీవు
మూఁగినమోవితోడ మధురమైవున్నది ॥పల్లవి॥

యెలయింపుఁజూపులను ఇంతిఁ జూచితే నాపెకు
చెలపచెమటనీరు చిమ్మిరేఁగెను
వెలయ నీవందుకుఁగా విసరితివి సురటి
పులకమొగ్గలమేనఁ బొదిగొనివున్నది ॥కాఁగి॥

మనసిచ్చి సతితోను మాటలు నీవాడితేను
చనుఁగవ బిగువెక్కి జారెఁ బయ్యద
అనువుగాఁ బెట్టఁబోతే నందుపై నీగోరు సోకి
మనసెల్లాఁ గరఁగి నీమంచముపై నున్నది ॥కాఁగి॥

దొమ్మి నలమేల్మంగతోడ నీవు నవ్వితేను
కుమ్మరింపుసిగ్గుతోడ కొప్పు వీడెను
నెమ్మది శ్రీవేంకటేశ నీ వింతలోఁ గూడితేను
సమ్మతించి మెచ్చిమెచ్చి సారె నీకు మొక్కెను ॥కాఁగి॥141

శ్రీరాగం

[1]కంటి మిదివో నేము కన్నులపండుగగాను
జంటలఁ గొలువై నీవు చనవియ్యఁగాను ॥పల్లవి॥

హేమంతకాలము నేఁడు యిటు నీతిరుమేన
ఆముకొని జవియించినట్లుండెను
భూమిఁగలకప్పురము పొడిసేసి నిలువెల్లా
నేమముతో నిందరును నీకుఁ జాతఁగాను ॥కంటి॥

1. ఇది అధ్యాత్మకీర్తనలలో నుండదగినది. "ఒకపరి కొకపరి కొయ్యారమై" అను కీర్తనవంటిది.

వానకాలము నీలవర్ణముతోఁ దిరుమేన
సోనయై కురిసినట్టు చూపట్టెను
సేనగాదట్టుపుణుఁగు చిత్తడిగా సర్వాంగాల
పూని యిందరును నీకుఁ బూయఁగాను ॥ కంటి ॥

వసంతకాలము తానె వచ్చి నీ తిరుమేన
యెసగినట్టు శ్రీవేంకటేశ తోఁచెను
వెస నలమేల్మంగతో వింతసొమ్ము నీవురాన
పొసగిం [1] చందరు విన్నందరు [2] బొగడఁగాను ॥ కంటి ॥ 142

ఆహిరి

ఎదురాడఁజాలదు యేమిసేసినా నీకు
వదలఁదురుమువట్టి వంచకువయ్యా ॥ పల్లవి ॥

చెక్కునఁ జేయివెట్టుక చింతించేచెలియకు
పుక్కిటితమ్మల మిడి పొదిగేవు
వెక్కసపువిరహాన వేగించె నిందాఁకా
పిక్కటిల్లుఁజన్నులు పిసుకకువయ్యా ॥ ఎదు ॥

వుమ్మగిలఁజెమటచే నోలలాదేమగువను
కమ్మక యిప్పుడు వచ్చి కాయమంటేవు
నెమ్మనపుఁదమకాన నెరి నలసె నిందాఁకా
బిమ్మటిగాఁ జేయివట్టి పెనఁగకువయ్యా ॥ ఎదు ॥

వుసురసురనుకొంటానుండేయలమేలుమంగను
పొసగించి కూడి యిట్టె భోగించితివి
యెసఁగ శ్రీవేంకటేశ యెనసె నిన్నిందాఁకా
వెస మోవి గంటిగావించకువయ్యా ॥ ఎదు ॥ 143

---

1, 2, పునరుక్తులు. ఇట్టివక్కడక్కడ గలవు.

భైరవి

[1] చెలులాల యేమనిచెప్పెనో తాను
యెలమితో వివరించి యీతని నడుగరే ॥ పల్లవి ॥

చెక్కులవెంటఁ గారీఁ జెమటలూ
వెక్కసపుఁగొప్పువెంట విరులు రాలీ
చెక్కుకొంటాఁ దనదట్టీచెఱఁగు జీరాడఁగా
యెక్కడనుండి వచ్చీని యీతని నడుగరే ॥ చెలు ॥

అంగమునఁ దొట్టుపడీ నలపులూ
వుంగిటిగొనీ ముక్కున నుసురులు
సింగారపువింతలెల్లా చెలఁగఁగా
యెంగిలై యెందుండి వచ్చీ నీతని నడుగరే ॥ చెలు ॥

గిఱికొనీ మోవిమీఁద కెంపులూ
మెఱసీ నురాన నలమేలుమంగా
తఱి శ్రీవేంకటేశుఁడు తానె మమ్మేల్లా నేలె
యెఱఁగ మెందుండి వచ్చీ నీతని నడుగరే ॥ చెలు ॥ 144

రేకు 1325 దేవగాంధారి

ఎన్నినోములు నోఁచెనో యీరమణి
చన్నుల జవ్వనపుసంపదతోడా ॥ పల్లవి ॥

వలపుగద్దె యెక్కె వనితా
చెలపచెమటఅభిషేకముతోడ
కొలువు సేయించుకొనీఁ జెలులచేతా
బలిమి నిట్టచూపులపఁ(పం?)జులతోడా ॥ ఎన్ని ॥

1. ఈపాటలో తరువాతిరెండుపాటలలో కొన్నిపాదాలకడ దీర్ఘాలు సంగీతమునకు చెందినవి కావచ్చు.

కోరికలరాజ్యమేలీఁ గోమలి
నూరువేలుపులకకానుకలతోఁడ
చేరి శైత్యోపచారాలు సేయించుకొనీ
సారెఁ గొప్పనల్ల జల్లిచామరాలతోఁడా ॥ ఎన్ని ॥

మరుపట్ట మలమేలుమంగ గట్టె
వురమున శ్రీవేంకటోత్తముతోఁడా
గరిమఁ గప్పముగొనెఁ గళలెల్లాను
సురతపుకొనగోరిసొమ్ములతోఁడా ॥ ఎన్ని ॥ 145

శంకరాభరణం

ఏలుకొన్న ఫలమూ యింటి కిట్టె రావయ్య
మేలుగలఫలమూ మెచ్చఁగదవయ్యా ॥ పల్లవి ॥

చెప్పినట్టువింటేనే సేసినంతఫలమూ
వొప్పుగొవి నామాఁటకు నూఁకొనవయ్యా
యిప్పుడియ్యకొంటేనే యిచ్చినంతఫలమూ
చప్పఁగాదు నాపొందు సమ్మతించవయ్యా ॥ ఏలు ॥

నావూడిగము చేకొంటే నగినంతఫలమూ
భావించి నీపాదము నాపైఁ జాఁచవయ్యా
వావి నాతోఁ జెప్పితేనే మోవియిచ్చినఫలము
యీవల నేఁ జేసేబత్తి కిటు లోనుగావయ్యా ॥ ఏలు ॥

కప్పుర మందుకొంటేనే కాఁగిలించినఫలము
దప్పిదేరీ రతికేళిఁ దనుపవయ్యా
అప్పఁడ శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
యిప్పుడు గూడినఫల మీడేరించవయ్యా ॥ ఏలు ॥ 146

లలిత

కడుఁజుట్టమవు నీవు కా వంటినా
యెడయక నన్ను నిట్టె యేలుమంటిఁగాక ॥ పల్లవి ॥

చెక్కునొక్కి నీవు నాచేయిమీఁదఁ జేయివేసి
తక్కక నవ్వు నవ్వఁగాఁ దగదంటినా
వొక్కతెపైఁబెట్టి మాట వొక్కొక్కటె తడవఁగా
వక్కణించ నంతేసి వద్దంటిఁగాక ॥ కడుఁ ॥

యేపున నావద్దనుండి ఇంత కలసిమెలసి
కాఁపురము సేయఁగాను కాదంటినా
చూపి మోపి యాదోవారిసొమ్ములు మేనఁబెట్టుక
రాఁపులు సేయఁగా నందు కోపనంటిఁగాక ॥ కడుఁ ॥

చన్ను లురమున రాయ సారెఁ గాఁగిలించుకొని
యెన్నిచేఁతలు సేసినా నేఁటికంటినా
అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్మంగనే నేను
మన్నించి కూడితి విది మాననంటిఁగాక ॥ కడుఁ ॥ 147

మాళవిగౌళ

[1] చెప్పరాదు యీతనిసింగారాలు
ముప్పిరిగొని సిరులు ముంచెనోకాని ॥ పల్లవి ॥

అందనే కప్పురకాఁపు లదివో దేవునికి
మెందుకొని అమరెను మేనవెల్లాను
పుండరీకాక్షుఁడుగాన పొదలి తెల్లనికాంతి
నిండుకొని నిలువెల్లా నెరసెనోకాని ॥ చెప్ప ॥

1. చూ. పాట 142. భావసామ్యము గలది

తట్టుపుణుఁగుకాఁపు దైవాలరాయనికి
దట్టమై యమరె నిదె తనువెల్లాను
చుట్టు నెమలిపెంచముచుంగులనల్లనికాంతి
అట్టె అంగములనెల్లా నలమెనోకాని ॥ చెప్ప ॥

అలమేలుమంగ పురమందు శ్రీవేంకటేశున-
కెలమి నమరె యిదె యీతనువున
మొల పీతాంబరమున మొలచినపైఁడికాంతి
అలరి మెడను సొమ్ములాయనోకాని ॥ చెప్ప ॥ 148

సామంతం

గడుసవుగదె నీవు కలికీ । వోరి
అడరి మరునిమహి మటువంటిదౌరా ॥ పల్లవి ॥

తప్పకచూచేవేమే తరుణీ । వోరి
కుప్పించీ నీమీఁదను చకోరాలురా
చిప్పిల నామేనెల్లాఁ జెమరించెనే । వోరి
యెప్పుడూ వాఁటిగుణాలు ఇటువంటివౌరా ॥ గడు ॥

వొఱపులే నీచన్నులువిదా । వోరి
మెఱసీ జక్కవలు నీమీఁదనుండిరా
మఱి కరఁగేఁగదవే మగువా । వోరి
యెఱఁగవా వాఁటివోజ లిటువంటివౌరా ॥ గడు ॥

మించి వురమెక్కె వలమేలుమంగా । వోరి
యెంచలు నీయందు వోలాడఁజొచ్చెరా
యెంచఁగల శ్రీవేంకటేశుఁడఁగదే । వోరి
వంచనతోఁ గూడితివి వానిజాడలౌరా ॥ గడు ॥ 149

పాడి

ఏమి దక్కువాయ నీకు నిందువంకను
కామినినేసేట త్తిఁగై కొనరాదా ॥పల్లవి॥

కన్నులనే కొసరుచు కాఁకలు నీపైఁ జల్లీ
అన్నిటా నదేమని యడుగరాదా
చిన్ననాఁడే బాస యిచ్చి నేసలు వెట్టితివట
మన్నించి యట్లానే మనుపరాదా ॥ఏమి॥

పలుకుచు సతి నీపచ్చడముకొంగంటీ
నిలిచి మారుమాఁట నీవాడరాదా
అలరుఁజవికెలోన ఆసలఁబెట్టితివట
తలపోఁత లీడేర్చి దయఁజూడరాదా ॥ఏమి॥

నవ్వుతా నలమేలుమంగ నంటున నీవురమెక్కె
నివ్వటిల్ల నీమచ్చిక నెరపరాదా
రవ్వగా శ్రీవేంకటేశ రతుల మెచ్చితివట
జవ్వనికి నన్నిటాను చనవియ్యరాదా ॥ఏమి॥ 150

రేకు 1326 శంకరాభరణం

నీనేరములకు నేనా గురి
నానఁబెట్టి కత నడపఁగరాదా ॥పల్లవి॥

మఱఁగుల మొఱఁగుల మాఁటలాడితే
మఱి కరఁగెను నీమన సిపుడు
యెఱఁగను నే నందుకేమి సేతురా
నెఱపునీబిగువు నిలుపఁగరాదా ॥నీనే॥

నేయరానిపని చేసి చెనకితే
కాయపుఁజెమటలు కడు వడిసె
రాయడించరా రతివేళ వెనక
తీయక ధైర్యము తెచ్చుకోరాదా ॥నీనే॥

అలమేల్‌మంగ నే నటు నినుఁ గూడిన
పులకించె మొగము కళ రేఁగి
సెలవి నవ్వరాదా శ్రీవేంకటేశ్వర
బలిమిఁ బరాకునఁ బై కొనరాదా ॥నీనే॥ 151

హిందోళవసంతం

మేలు మేలయ్యా నిన్ను మెచ్చితిమి నీ వింతిని
లాలింతురుగాక యీలాగు సేతురా ॥పల్లవి॥

శిరసువంచుకుండితే సిగ్గుదేర్చవలెఁగాక
కరకరిఁబెట్టి యింత కాఁగిలింతురా
విరసాన నలిగితే వేఁడుకొనవలెఁగాక
పెరిగేకుచము లిట్టె పిసుకుదురా ॥మేలు॥

దవ్వులనే నిలుచుంటే దగ్గరిరావలెఁగాక
పవ్వళించి గజ నిమ్మపంట వేతురా
అవ్వలిమోమైతేను ఆదరించవలెఁగాక
కువ్వవడ కుచ్చెలకొంగువట్టి తీతురా ॥మేలు॥

మోనాన నుండితే మోవితేనె చవిగొంటగాక
కానుకగా నందుమీఁద గంటిసేతురా
ఔనని శ్రీవేంకటేశ అలమేల్‌మంగఁ గూడితి-
వానుక వుండువుగాక ఆఱడి సేతురా ॥మేలు॥ 152

కాంబోది

ఎంత గిజిగిజిసేసే వింతిని నీవు
మంతనానఁ జేయరాదా మటి చేఁతలెల్లను ॥పల్లవి॥

విప్పుచు నెలవులను విన్నపాలు సేయఁగాను
చిప్పిల మోవి యెంగిలి సేసేవు
రెప్పలెత్తి కన్నులను రేసువడి చూడఁగాను
కొప్పువట్టి జారఁదీసి కొసరేవు ॥ ఎంత ॥

పాదములు నీ కొత్తఁగాఁ బడఁతి చన్నుమొనలు
[1]దాదాత(య?) బొట్టనవేళ్లఁ దాఁకించేవు
కాదనక నీకు నూడిగములెల్లాఁ జేయఁగాను
సేదదేరఁ బిరుదుపైఁ జేయిచాఁచేవు ॥ ఎంత ॥

గందము నీకుఁ బూయఁగా కమ్మి యలమేల్మంగను
కందువ శ్రీవేంకటేశ కాఁగిలించేవు
సందడింపురతులను చవులెల్లాఁ జూపఁగాను
మందలించి కూడి సదమదము సేసేవు ॥ ఎంత ॥ 153

## మాళవిగౌళ

[2]భావించి చూడరే పడఁతులాల
చేవదేరి మహిమలు చెలఁగినట్టుండెను ॥ పల్లవి ॥

పరమపురుషునకి పచ్చకప్పురముకాఁపు
తిరుమేన నమరెను తెల్లనికాంతి
ఫరలోఁ బాలజలధి తచ్చేటివేళను
మురిపెమై తుంపురులు ముంచినయట్టుండెను ॥ భావిం ॥

---

1. దాయన్+దాన్దా=దాయయన్ : అని స్వతంత్రించియుండునా? ఇదియూ ప్రకరణమునుబట్టియే. 'దాదాత' అని ఒకప్రయోగ మీవాఙ్మయమున అక్కడక్కడ కలదు. అర్థము తోచుటలేదు. 2. చూ. పాట 142. భావసామ్యము. దీని మొదటిపాదము "క్షీర సాగరతరంగశీకరాసార" అను కులశేఖరాళ్వార్ పద్యమును పోలియున్నది. ఈ పాటలే 'ఒకపరికొకపరికొయ్యారమై' అనుపెదతిరుమలాచార్యులపాటకు మూలము కాబోలు.

తవిలి యీదేవునికి తట్టుపుణుఁగుకాఁపు
నవమై మేన నమరె నల్లనికాంతి
తివిరి గోవర్ధనమెత్తిననాఁడు నిఁడుకొని
ధ్రువమై మేఘకాంతులు తొలఁకినట్టుండెను ॥ భావిం ॥

శ్రీవేంకటేశునికి సింగారించిన సొమ్ములు
భావించ మేన నమరె బంగారుకాంతి
తావుగా నలమేల్మంగ తనవుర మెక్కఁగాను
వేవేలుసంపదలెల్లా వెలసినట్టుండెను ॥ భావిం ॥ 154

రామక్రియ

చిత్తగించవయ్యా చెలియ విలాసాలు
బత్తినేసీ నేఁడు నీపాదా లొత్తఁగాను ॥ పల్లవి ॥

చిగురుమోవిమీఁదఁ జిప్పిలీఁ దేనెలు కడు
మగువ నీతో నట్టె మాటాడఁగాను
నగెడిసెలవులను నారుకొనీఁ గప్పురము
మొగము చూచి నీకు మొక్కఁగాను ॥ చిత్త ॥

నెరసి గుబ్బలమీఁద నిండీఁ బులక లివె
తరుణి పయ్యెద నిన్నుఁ దాఁకఁగాను
పురిగొని కొప్పులోనిపువ్వులు రాలీ నివె
బెరసి నీకాఁగిటఁ బెనఁగఁగాను ॥ చిత్త ॥

కలికి మొగములోనఁ గళలు రేఁగీ నవె
అలమేలుమంగ నిన్ను నరమఁగాను
అలరి శ్రీవేంకటేశ అంగములు పొంగీ నవె
అలసినరతిలో నీ వాదరించఁగాను ॥ చిత్త ॥ 155

ముఖారి

ఎఱఁగించీ నిరుమేలా నిదివో నీమనసు
గుఱి గాడిపారీని గోవిందరాజా ॥ పల్లవి ॥

కొలువులోపలనున్నకొమ్మలపాటలు వింటా
అలరి నీవు పరాకై వుండఁగా
కులికి పాదములొత్తేకొమ్మలు కొనగోళ్ల
యెలమిఁ దమమోహము లెచ్చరించేరు ॥ ఎఱఁ ॥

యెదుట నాట్యములాడేఇంతులనుఁ జూచుకొంటా
గుదిగొని యట్టె చొక్కుచునుండఁగా
ఇదివో ఆకుమడిచిఇచ్చేసతులు చేతుల-
నదిమి తమమీఁదట ఆసలుచూపేవు ॥ ఎఱఁ ॥

సారె విన్ను సింగారించేసతులచన్నులు చూచి
చేరి శ్రీవేంకటేశుఁడ చేఇచాఁచఁగా
శ్రీరమణి భూరమణిఁ [1] జెంది నీ కాఁగిటిలోన
పేరడిరతుల విన్నుఁ బెచ్చురేఁచేరు ॥ ఎఱఁ ॥ 156

రేకు 1327 సామంతం

చూడరమ్మ చెలులాల సుదతిభాగ్యాలు నేఁడు
వేడుకలెల్లా వెల్లివిరిసినట్లుండె ॥ పల్లవి ॥

కోమలికొప్పుననుండి కురిసేటివిరులకు
వాములై తుమ్మిదలు వాలఁగాను
కాముఁడు గురులేయఁగా కడనుండి నల్లఁబజ [2]
దోమటి నెఱుకలాను తొడఁగినట్లుండె ॥ చూడ ॥

---

1. ఈ అరనున్న సముచ్చయమునకు. 2. నల్లప్రజ = కిరాతసంఘము అని వావిళ్ల-నిఘంటువు. "కొమ్మలుఁ మోయ నల్లప్రజ" శుక-1-224. 'నల్లఁబజ' అన్నమయ్య ప్రయోగము.

మెలుత మాటాడఁగాను మించె చిగురుమోవిని
తొలఁగక కోవిలలు తొడుకఁగాను
వలరాజు నఱికిన వాఁడినెత్తురుపట్టెలు
చెలఁగి బంట్లు చికిలిసేసినట్లుండె ॥ చూడ ॥

కొమ్మ శ్రీవేంకటేశ్వరుఁ గూడినచెమటవావ—
కుమ్మడిఁ [1]జకోరాలు వొడియఁగాను
దిమ్మరేఁగి మరుఁడు ముత్తేల వసంతమాడఁగా
యిమ్ముల నర్థులు వచ్చి యెదిరినట్టుండె ॥ చూడ ॥ 157

వరాళి

వింతవారమా నేము విచారించుకొనవయ(య్యా?)
బంతి నున్నారు సతులు పాయనినీకృపను ॥ పల్లవి ॥

యెంతలేదు నీనవ్వు యెన్నిలేవు నీమాటలు
అంతటాను తనిసిరి యాఁడువారెల్లా
చింతదీర నీకు నేము సేవసేసేవారము
దొంతి నున్నది వలపు తొల్లె నీకృపను ॥ వింత ॥

యేమిసేసేవు నీయాన లెఱఁగమా మీబాసలు
దోమటిగాఁ దొడికిరి తొయ్యలులెల్లా
వోముచు నే మెప్పుడును వూడిగపువారము
వాములాయఁ దమకము వంచిననీకృపను ॥ వింత ॥

యెక్కడా నీసుద్దులే యెవ్వరైనాఁ బొగడేరు
వొక్కటై కూడిరి నిన్ను వువిదలెల్లా
చిక్కి నన్ను నేలితివి శ్రీవేంకటేశ్వర
వెక్కసమాయ భోగము వెలసె నీకృపను ॥ వింత ॥ 158

---

1. చాతకాలు కావచ్చు.

దేసాళం

వెలఁది నింతచే నీవు వేఁడుకోవయ్యా
యెలయింపుఁజేఁతలు నేఁ డివి యేలయ్యా ॥ పల్లవి ॥

మొగమోటమునఁ జెలి మొదలికోపము మాని
మగఁడవంటా నీతో మాటాడెఁగాని
అగడుసేసేనంటే అందు నెంతైనాఁ గద్దు
యెగసక్కెలింకాను నీవేలాడేవయ్యా ॥ వెలఁ ॥

ప్రియవాదిగన నీతోఁ బెనఁగి మారాడక
నయమిచ్చి జలజాక్షి నవ్వెఁగాని
నియతి సాదించేనంటే నేరుపెంతైనాఁ గలదు
జయమాయ నిఁకనేల చల మింకానయ్యా ॥ వెలఁ ॥

యిచ్చకురాలై నిన్ను యెనసి శ్రీవేంకటేశ
మచ్చికసేసి యిఁ(యిం?)తి మరిగెఁగాని
పచ్చిసేసేనంటేను పగటెంతైనాఁ గద్దు
యిచ్చినచనవు లిట్టె యీడేరించవయ్యా ॥ వెలఁ ॥ 159

మాళవిగౌళ

ఇప్పుడే విన్నవించితి నెఱఁగుకొందువుగాని
తప్పితే నఱలమోఁత తమికిఁ(కిం?)చీఁజుమీ ॥ పల్లవి ॥

బలిమి నింతి నీవు పాసివుందేవుగనక
తలఁపఁ గప్రపువేఁడిఁ దాఁకీఁజుమీ
నలువంక నెలవులనవ్వక నీవుండితేను
కలువపూవుటమ్ములగాలి వారీఁజుమీ ॥ ఇప్పు ॥

చేరి చెనకఁగ నీవు సిగ్గువడేవుగనక
సారెకు వెన్నెల వడచల్లీఁజుమ్మీ
గారవించి యాపె యిట్టె కాఁగిలించకుండితేను
నారుకొని చిగురు మొనలుచూపీఁజుమ్మీ ॥ ఇప్పు ॥

మొక్కలాన నీ వవ్వలిమోమయ్యేవుగనక
నిక్కి కోయిలలరొద నిండీఁజుమ్మీ
గక్కన శ్రీవేంకటేశ కలసితి వీకె నిట్టె
కక్కసించితే మదనకళలందీఁజుమ్మీ ॥ ఇప్పు ॥ 160

హిందోళవసంతం

నీవుండే దొక్కయంగము నేనుండే దొక్కయంగము
కైవశమైతివి యింకఁ గతలెల్లాఁ జెల్లును ॥ పల్లవి ॥

సిగ్గువిడిచేయాఁటది చేతులఁ బట్టఁగరాదు
యెగ్గులేదు మగవాని కెట్టుండినాను
వొగ్గి నేను మేరతోనే వున్నచో నుండానను
బగ్గన నీకంతటాను పారాడఁజెల్లును ॥ నీవుం ॥

పొంచి యణఁకువలేనిపొలఁతి దేఁటిగుణము
వంచనలేకున్నా మగవాని కమరు
మంచముపై నిట్టె నెమ్మది నే నుండానను
యెంచఁగ రచ్చలుసేయ నిటు నీకుఁ జెల్లును ॥ నీవుం ॥

గుట్టుతో నుండకుంటేను కోమలి కేఁటివారపు
వట్టిరట్టు మగవానివద్దనే కద్దు
ఇట్టె శ్రీవేంకటేశ ఇటు నిన్ను నేఁ గూడితి
ముట్టి యెంతైనా నీవు మోహించఁజెల్లును ॥ నీవుం ॥ 161

కాంబోది

ఎఱఁగనివాఁడవా యేమయ్యా నీవు
మఱవవచ్చునా మేలు మన్నింతురుగాక ॥ పల్లవి ॥

సరసములాడితేను సొకిరివెట్టుదురా
వొరసివొరసి నవ్వుదురుగాక
శిరసువట్టితేనే చేతుల బిగింతురా
కరఁగినమనసుతో కైకొందురుగాక ॥ ఎఱఁ ॥

తచ్చితచ్చి చూచితేను తలవంచుకొందురా
ఇచ్చగించి గక్కనఁ జేయిత్తురుగాక
పచ్చిమాటలాడితేను పరాకుసేయుదురా
అచ్చమైనచనుఁగొండ లంటుదురుగాక ॥ ఎఱఁ ॥

అట్టె కాఁగిలించుకొంటె ఆయాలు ముట్టుదురా
నెట్టుకొని యిట్టె కరుణింతురుగాక
గుట్టున శ్రీవేంకటేశ కూడినింతి జంకింతురా
చుట్టరికములెల్లాను చూపుదురుగాక ॥ ఎఱఁ ॥ 162

రేకు 1328 శంకరాభరణం

ఔదువయ్యా జాణఁడవు అన్నిటాను
సొదవని పొగడితే జడిసేవయ్యా ॥ పల్లవి ॥

నీచిత్తము రావలసి నేఁ జేసితి నూడిగాలు
యేచి యందుకు నవ్వే వదేమయ్యా
చేచేత నే విన్నపాలు చెవిలోనఁ జేసితేను
లాచి నన్నుఁ దిట్టితివి లాగౌనయ్యా ॥ ఔదు ॥

సంగతి నాకుమడిచి చవిదెలి సిచ్చితేను
యెంగిలంటాఁ గాకుసేసేవేమయ్యా
ముంగిట నే నీశిరసుముడిచేసంటా నంటితే
వంగి నాకొప్పు నంటేవు వాసికాఁడవయ్యా ॥ ఔదు ॥

గాఁటముగా రతికేలిఁ గాఁగిలించుకొంటేను
నాఁటెఁ జన్నులంటా గోర గీఁటేవయ్యా
సీఁటుల(శ్రీ)వేంకటేశ నిన్ను నేనే మెచ్చితేను
యీటులేనిచనవెల్లా నిచ్చితివయ్యా ॥ ఔదు ॥ 163

శుద్ధవసంతం

ఇందుకే నేఁ జింతించే నెటువలె నున్నాఁడవో
సందడి పెండ్లిండ్లాయ సరుస నీబతుకు ॥ పల్లవి ॥

చెంతలనాకె నీపైఁ జేయిచాఁచఁగాను
వంతుకుఁ జేయిచాఁచితి నవ్వల నే నుండి
యింతుల మిద్దరమును ఇరువంకలా నుండఁగా
సంతకూటమాయ నిదె చక్కనినీమేను ॥ ఇందు ॥

ఆకడ నాకె నీకు నాకుమడిచియ్యఁగాను
యీకడ నేనూ నీకు నిచ్చితి నిట్టె
కైకొని యిద్దరు నూడిగము నీకుఁ జేయఁగాను
కాకుపడి కలగూరగంపాయ నీనోరు ॥ ఇందు ॥

గక్కన నాపె నిన్నుఁ గాఁగిటఁ గూడఁగాను
వొక్కటై నేనూ నట్టే వొనరఁగాను
యిక్కువ (శ్రీ)వేంకటేశ యెనసి యిద్దరివల్లా
అక్కర నురిపేకల్లమాయను నీవురము ॥ ఇందు ॥ 164

ఆహిరి

ఇద్దరిభావములును యేమని విన్నవించేము
అద్దుకొన్నప్రియములు ఆయములు సోఁకెను ॥ పల్లవి ॥

చెక్కుచేతితోడనే చెలి నిన్నుఁ జూడఁగాను
చిక్కనిచెమటలెల్లా చేర నిండెను
నెక్కొని యంతవట్టును నీమీఁద నేఁ జల్లితేను
వెక్కసమై పులకలు వెదకు మొలచెను ॥ ఇద్ద ॥

పయ్యదముసుఁగుతోడ పడఁతి నీతో నవ్వితే
వొయ్యనే కొప్పువిరులు వొడి నిండెను
నెయ్యపువేడుకతోడ నీమీఁద నవి చల్లితే
మయ్యరానికళలెల్లా మోమున వెలసెను ॥ ఇద్ద ॥

చన్ను లురమున మోవ సతి విన్నుఁ గూడితేను
వున్నతి మోవిఁ దేనె లుబ్బి నిండెను
యెన్నఁగ శ్రీవేంకటేశ యివి నీమోవిఁ జల్లితే
తిన్ననియానందము దేహాన నిలిచెను ॥ ఇద్ద ॥ 165

సాళంగం

ఎఱఁగనివారు గల రెరుఁగువారు గలరు
యెఱుకతోనే నీవు ఇంత గేలిసేతురా ॥ పల్లవి ॥

మన్నింతువంటా నీతో మనవి విన్నవించితే
సన్నల నవ్వేవు నీవు సారెసారెకు
తిన్నఁగాఁ దప్పుగలితే దిద్దవలెఁగాక నీవు
యెన్నఁగ వింతులలోన నింత గేలిసేతురా ॥ ఎఱఁ ॥

వోరుత(తు?)వంటా నిన్ను వొడివట్టి కొసరితే
సారెసారె నవ్వేవు జారుఁగొంగుతో
నేరమి గలిగితేను నేరుపఁగవలెఁగాక
యీరీతి నిందరిలో నింత గేలిసేతురా ॥ఎఱ॥

చెందితివంటా నిన్నుఁ జెలఁగి మెచ్చితేను
సందడి నవ్వు నవ్వేవు సారెసారెకు
విందుల శ్రీవేంకటగోవిందుఁడ నన్నేలితివి
యిందరిలో నారతుల నింత గేలిసేతురా ॥ఎఱ॥ 166

సాళంగనాట

బతికితి వన్నిటాను పడఁతివల్లను నీవు
రతికిఁ బిలువవయ్య రవ్వగాఁ జేసీని ॥పల్లవి॥

సుద్దులు నీతోఁ జెప్పి చొక్కించి అందరుఁ జూడ
బుద్దులు నీకు నేరపీఁ బొలఁతి
వొద్దనుండి నవ్వుతాను వొడివట్టి తీసితీసి
పెద్దరికములు నేసి ప్రియముచెప్పీని ॥బతి॥

చెక్కులు నీకు నొక్కి సేవలు గొంతసేసి
ఇక్కువలెల్లా నంటీ నింతి
అక్కరతో వీడెమిచ్చి ఆకుమడిచొసఁగుతా
వెక్కసపుటిచ్చకము వేమారుఁ జేసీని ॥బతి॥

నెమ్మదిఁ గాఁగిట నించి నీకు మోవి చవిచూపి
సమ్మతించఁజేసి కూడె సకియ
మమ్ముఁ [1] గూడితివి నేఁడు మక్కువ శ్రీవేంకటేశ
చిమ్ముచుఁ గమ్మటిఁ దాను సేసలువెట్టీని ॥బతి॥ 167

1. 'గూతివి' రేకు.

శ్రీరాగం

వెనకటినేరములు వేయైనాఁ దడవను
మనసొక్కటిగా బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥ పల్లవి ॥

యేఁటికింకా మాటలు యేమని దూరేము నేము
గాఁటపుఁదనకరుణ కలంతే చాలు
కూటమికి రమ్మనవే గుట్టుతోనే వుండేను
మాఁటులేనితాను బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥ వెన ॥

కాఁతరించఁబనిలేదు గద్దించ నోపను
చేతికిలోనై మన్నించినదే చాలు
తే తెమ్మనవే విడెము తిరమైతి నన్నిటాను
మాతలఁపువలె బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥ వెన ॥

చెక్కు లెంతవడి నొక్కె సిగ్గు లెందాఁకా నెరపె
ఇక్కువంటి ననుఁగూడె నిదె చాలు
దక్కె శ్రీవేంకటేశుఁడు తానే నాకిన్నిటాను
మక్కువ నింతట బుద్ధిమంతుఁడై తేఁ జాలును ॥ వెన ॥ 168

రేకు 1329 రామక్రియ

కలసితి మిందరము కాఁగిటిపొత్తు
చెలఁగి నీనేమములు చెప్పనేఁటి కిఁకను ॥ పల్లవి ॥

కాంతలందరితోఁదాను కలయఁగ నవ్వేవు
సంతవావులాయఁగా నీసరసములు
యింతలో నందరిమోవులెంగిలి నేకములాయ
చెంతల నీనేమములు చెప్పనేఁటి కిఁకను ॥ కల ॥

చల్లఁగా నందరితో జూజములు నీ వాడేవు
గొల్లదోమటాయఁగా నీకోరికలు
కల్లగాదు రతివేళ కాఁగిళ్లెల్లా నొక్కటాయ
చిల్లర నీనేమములు చెప్పనేఁటి కింకను ॥ కల ॥

వాడిక నందరి కొక్కవరుసిచ్చి కూడితివి
యీడఁ గలగూరగంపె యెనసెఁ బొందు
తోడనే శ్రీవేంకటేశ [1]దొమ్మెయ మరుతంత్రము
జీడిగా నీనేమములు చెప్పనేఁటి కింకను ॥ కల ॥ 169

శుద్ధవసంతం

ఎదిరి నిన్నెంచుకోవు యేమీ నీవు
కదిసివుండినవారిఁ గైకొనవచ్చేవు ॥పల్లవి॥

తఱగరివానివలె తచ్చితచ్చి మాఁటాడేవు
యెఱఁగవా నాగుణ మింతకతొల్లి
మెఱనేసతులరతి మిక్కిలి బేరములాడి
కొఱతలేనివారిఁ గొసరవచ్చేవు ॥ ఎది ॥

తగవరివలెనే తతిగొని యడిగేవు
పగటు దెలియవా నాభావపు(ము?) నీవు
ఆగపడినయింతుల అలుకలు దిద్దిదిద్ది
వొగరులేనివారి నొరయవచ్చేవు ॥ ఎది ॥

చుట్టపువానివలె చూచి కాఁగిలించేవు
దిట్టతన మెఱఁగవా దేవుల నేను
యిట్టె శ్రీవేంకటేశ యిటు ని(న?)న్నుఁ గూడికూడి
మట్టులేనివారిని మరుపవచ్చేవు ॥ ఎది ॥ 170

1. దొమ్మి+అయ.

సామవరాళి

గట్టున నుండుటే మేలు కొసరఁగఁబనిలేదు
బట్టబయ లీఁదఁగాను పనికివచ్చీనా ॥పల్లవి॥

వలసీనొల్లనిసతివద్ద నెంతనిలుచున్నా
తలఁపులో నీకిట్టె దయవుట్టీనా
సొలసిసొలసి యెంత సోబానఁ బాడినాను
పిలువనిపేరటము ప్రియమయ్యీనా ॥గట్టు॥

చనవులేనియింతి సరస మెంతాడినాను
పెనగొని నీకిఁకఁ బ్రేమవుట్టీనా
మనవితో నిచ్చకము మాపుదాఁకాఁ జేసినాను
వొనరవినేస్తములు వొద్దికయ్యీనా ॥గట్టు॥

ననుపుగానిచెలి నవ్వు లెన్ని నవ్వినాను
తనిసి వుందువుగాక తమకించేవా
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
వెనకటివారిపొందు వేడుకయ్యీనా ॥గట్టు॥ 171

మధ్యమావతి

కానీలే అందుకేమి కామిని దానె వచ్చి
మైనమువలెఁ జేయక మనమాట వినునా ॥పల్లవి॥

చలపాదివానితోడ జాణతనాలాడితేను
మలసి తనగుణము మానీనా
మొలకచన్ను మొనలమోసుల[1] నూఁది మనసు
చెలఁగించినఁగాక చెప్పినట్టు సేసునా ॥కానీ॥

1. మొనలు — మోసులు వేరా?

గట్టువాయువానితోడ కతలెన్ని చెప్పినాను
అట్టే వుండుఁగాక చాయకు వచ్చీనా
మట్టుమీరఁ గొనగోర మర్మములెల్లా నంటి
వొట్టి కరఁగించక వొడఁబడనేర్చునా ॥ కానీ ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జెక్కు లెంతనొక్కినాను
చేవలుమీరుఁగాక సిగ్గువడీనా
యీవేళనే యింతిఁ గూడి ఇచ్చలాడి వురముపై
తావుకొన నిటుగాక తనవోజ మానునా ॥ కానీ ॥ 172

బౌళి

చెనకేవు వూరకైనాఁ జెరఁగువట్టి తీసేవు
మనసిచ్చి మమ్మెందులో మన్నించేవయ్యా ॥ పల్లవి ॥

చనవుగలవారికి సారె మందెమేళము
ననుపుగలవారికి నవ్వులువచ్చు
యెనసినవారికి ఇయ్యకోలై వుండు
అనిశము మమ్మెందులో నాదరించేవయ్యా ॥ చెన ॥

మేనవారైనవారికి మించు నట్టె వుద్దండము
నానినయింటివారికి నమ్మిక గల్గు
పూని కొలువువారికి పొద్దులు దనిసివుండు
కానీలే మమ్మెందులోఁ గైకొనేవయ్యా ॥ చెన ॥

వొట్టి పెండ్లాడినవారి కొతమనసై వుండు
నెట్టుకొన్నవారికి నెలవై వుండు
గుట్టున శ్రీవేంకటేశ కూడితివి నన్ను నేఁడు
యిట్టె మమ్మెవ్వరిలోన నేలేవయ్యా ॥ చెన ॥ 173

శంకరాభరణం

నీవల్ల నింతేసి నివ్వెరగందితి
చేవల్లకు రావే చెప్పేను నేను ॥ పల్లవి ॥

కొప్పు దువ్వఁగాను గోరుదాఁకెఁ జెక్కు-
యెప్పుడు నవ్వఁగ నేమిటికి
చిప్పిలఁగా నీవు జీరదీసితివో
చెప్పఁగదే భ్రమసితి నేను ॥ నీవ ॥

పలుకఁగాను నాపల్లు దాఁకె మోవి
యెలయించి నవ్వనేమిటికి
నిలిచి యీచేఁత నీవు సేసితివో
తలఁపించవే కొత్తలైతి నేను ॥ నీవ ॥

సరసమాడఁగాను సందిసొమ్ము లొత్తె
యిరవయితి నవ్వనేమిటికి
సరి శ్రీవేంకటేశ్వరుఁడను నా-
వుర మెక్కితివి వొప్పితి నేను ॥ నీవ ॥ 174

రేకు 1330 ముఖారి

చెవులార వినరే చెలులాల మీకుఁ జెప్పే
వివరించి యీతగవు విచ్చిచెప్పరాదే ॥ పల్లవి ॥

యెఱుఁగుదులేవే తన కిచ్చలాడితే నేను
మఱపులేనియట్టిమంచిదానను
నెఱయ నెరుసువెట్టి నేరములెంచితేను
నెఱతనములతోడినిష్ఠూరి నేను ॥ చెవు ॥

తెలుసులేవే తన్ను దేవరంటాఁ బొగడితే
పలుమారు నాపై నే బత్తిసేసీని
అలిగి తనమర్మము లట్టె యెత్తి తిట్టితేను
చలపాదితనములజగడాఁగ నేను ॥ చెవు ॥

కంటిలేవే యిట్టె తన్ను కాఁగిలించి కూడితేను
జంటతో తనపాలికి జాణనైతివి
యింటిలో శ్రీవేంకటేశుఁ డితవి నే సోదించి
దంటతనపునేఁతలతరుణి నేను ॥ చెవు ॥ 175

## నాదరామక్రియ

ఇంక నెంతగాఁ గద్దో యింతి నీజవ్వనము
వుంటువై వొక్కటొక్కటి కొనగూడె వలపు ॥ పల్లవి ॥

చిక్కఁగా నీవు నవ్వితే చిత్తడిచెమట గారె
చెక్కునఁ జేయిపెట్టితే సిగ్గులు మూఁగె
నెక్కొన మాటాడితేను నిట్టూరుపులు రేఁగె
వొక్కటొక్కటే దొంతరై వొనగూడె వలపు ॥ ఇంక ॥

తప్పకచూచితేనే తతిగొనెఁ బులకలు
చిప్పిలఁ జెనకితేనే చింత రేఁగెను
వొప్పి సరసమాడితే వొడికట్టు వదలెను
వుప్పరాలై వొక్కటొక్క టొనగూడె వలపు ॥ ఇంక ॥

తనుపులు మోచితేనే తతిగొనెఁ దమకము
పెనఁగితేఁ బ్రియములు పిక్కటిల్లెను
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నివ్విన్నిటాను
వునికై వొకటొకటే వొనగూడె వలపు ॥ ఇంక ॥ 176

రీతిగౌళ

చెలియకు నే నన్నిఁ జెప్పిపంపేను
అలయక నీవే యన్ని నానతియ్యవయ్యా ॥ పల్లవి ॥

మంతనాన నాపెచేత మాటలెల్లా నాడించే
చెంతల నీమేనెల్లాఁ జెమరించించే
దొంతినున్నవలపులు దోమటిదొడికించించే
వింతలేమి సేయవలె వేగ నానతీవయ్యా ॥ చెలి ॥

సేవసేసి విన్ను విట్టే సిగ్గులెల్లాఁ బరపించే
పూవులనే వేసి నన్నుఁ బొనఁగింపించే
లావులఁ బెనఁగి నీమై లచ్చనలు నిండింపించే
కావలసినపని గక్కన నానతీవయ్యా ॥ చెలి ॥

సమరతులను నీజవ్వనము పండింపించే
తమితో మోముకళలు దాకొనిపించే
నెమకి శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
సముకాన నీయాసలు సారె నానతీవయ్యా ॥ చెలి ॥ 177

మాళవి

ఇంతటివాఁడవు నీకు యేమ రెవ్వ రున్నారు
చెంత నీవు సేసినవే చేఁతలుగావా ॥ పల్లవి ॥

కొమ్మలమనసులోవికోపములు మానిపేవి
పమ్మి నీవు సేసేటిబాసలేకావా
తమ్మి మొకములనిండా కళ లట్టే రేఁచేవి
చిమ్ముల నీకొనగోరి చెనకులేకావా ॥ ఇంత ॥

కడుసంధానము సేసి కపటాలు పాపేవి
అడియాలమైననీయాసలే కావా
బడిబడిఁ బాయకుండా బాఁతిపడఁజేసేవి
విడువక నీవు సేసేవినయాలే కావా ॥ ఇంత ॥

జమళిసిగ్గు దీరిచి చవులు పుట్టించేవి
నుముకమయిననీచూపులే కావా
తమితో శ్రీవేంకటేశ తగ నన్ను నేలితివి
నెమకేవి నీరతులనేరుపులే కావా ॥ ఇంత ॥ 178

హిందోళవసంతం

నీకే మేలుగదవే నీపతిసరసములు
దాకొవి నిలువుననే తమి నూరు వండీని ॥ పల్లవి ॥

కోపగించుకొనకువే కోరి యాతఁ దేమనినా
తీపులమాటలవెంటఁ దేనె గారీని
యేపున వేసరకువే యిట్టె చెనకితేను
రాపుల గోరికొననే రాలీని వలపు ॥ నీకే ॥

సిగ్గులువడకువే చెంత నాతఁ డుండితేను
వెగ్గళపువినయాన వెన్న పుట్టీని
బిగ్గనఁ దిట్టకువే పయ్యదకొం గంటితేను
వొగ్గి వుంగరపువేళ్ల నొరపు మించీని ॥ నీకే ॥

కొసరకువే నిన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
నుసరపురతులను సుంకు మోపీని
అసురుసురనకువే అన్నిటాఁ బెనఁగితేను
వెసఁ గనుచూపుల వెన్నెలగాసీని ॥ నీకే ॥ 179

తెలుఁగుఁగాంబోది

[1] మొకదాకిరిని నీపై మోహమే చల్లుఁగాని
వెకలితనాన నిన్ను వేసరించదు ॥ పల్లవి ॥

యెఁ(యెం?)తైనాఁ జెలి నీతో యెదురు మాఁటాడదు
వంత గలిగితేఁ దలవంచుఁగాని
వింతవై తిరిగినాను వెగ్గళించదు నిన్ను
అంతలోనే వుసురసురనుఁగాని ॥ మొక ॥

యెరవుగ మఱచి(చై?)నా యెంచదు నేరాలు నిన్ను
వొరిమెతో మోనాన నుండుఁగాని
విరహతాపము గల్గా విసుగదు నీమీఁద
సిరులవెక్కిఁటచేత చింతించుఁగాని ॥ మొక ॥

నవ్వులకయినా నీతో నాలివెంగే లాడదు
యివ్వలిమోమై విడె మిచ్చుఁగాని
రవ్వగా శ్రీవేంకటేశ రమణిఁ గూడితి విట్టే
వువ్విళ్లూరఁ గాఁగిట నొనరుఁగాని ॥ మొక ॥ 180

రేకు 1331 ఆహిరినాట

నీయంతా నెఱఁగవు నేము చెప్పినా వినవు
పాయముగలయందుకు ఫలమా ఇది ॥ పల్లవి ॥

పట్టినదే చలమా పడఁతి నీ వాతనితో
చుట్టరికము సేసితే సూడువట్టేవా
బట్టబయ లీఁదించేవు పలుకుల సారెసారె
గుట్టుతోడిసతులకు గుణమా ఇది ॥ నీయం ॥

1. మొకదాకిరినిన్=ముఖదాక్షిణ్యముతో అని భావార్థము.

చెనకితే నెలవా చెమరించే వంతలోనె
పెనఁగఁగానే ఆలసి విగిసేవు
తనిపేవు నవ్వులనే తను విది మీఁదమీఁద
చనవుగలయందుకు చందమా ఇది ॥ నీయం ॥

నేసినదే చేఁతా శ్రీవేంకటేశుకాఁగిట
నేసవెట్టఁగానే గోరఁ జెక్కునొక్కేవు
రాసినేసేవు వలపు రతులలో నెల్లా నీవు
పోసరపువేడుకకు భోగమా యిది ॥ నీయం ॥ 181

మాళవిగౌళ

బలిమి యెంతనేసినాఁ బనికిరాదు
అలరఁగ నిచ్చకము లాడవలెఁగాని ॥ పల్లవి ॥

ఆటమటములవాని నౌఁగాదనఁగరాదు
సటలాడేవాని సాదించరాదు
విటతనములవాని వేమారుఁ గొసరరాదు
చిటుకురంటే సేవనేయవలెఁగాని ॥ బలి ॥

తూఁటరివిద్యలవాని దూరితేఁ బనికిరాదు
జూటుఁదనములవాని నొలయరాదు
మాటకుమాటాడేవాని మారుకొనఁగరాదు
మూఁటకట్టువినయాన మొక్కవలెఁగాని ॥ బలి ॥

[1] పంతగారివానిని పచ్చిగా నాడఁగరాదు
అంతరంగమైనవాని నణఁచరాదా
ఇంతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను మెచ్చి
వింతనేయరాదు నిన్ను వేఁడుకోవలెఁగాని ॥ బంచి ॥ 182

1. 'పంతగాఁడు' కన్నడమున 'పంతగార' దాని ఔపవిభక్తికము 'పంతగారి వాఁడు, అని.

### దేవగాంధారి

కొలఁదులుమీరినగోవిందా
పలుదెఱగుల మతి పరగీఁజుమ్మీ ॥ పల్లవి ॥

యేలితి వప్పుడే యిల్లాండ్లఁగా
గోలతనముగలగొల్లెతల
ఆలఁ గాచితివి ఆఁబోతువలెనే
పాలించ మనసు పారీఁజుమ్మీ ॥ కొలఁ ॥

పెట్టితి నేసలు పెండ్లికూఁతులఁగా
వొట్టి యచ్చరల కొకమాటే
చుట్టితి పెంచముసోగ నెమలివలె
పెట్టనెమళ్ళను బెరిసేవుసుమ్మీ ॥ కొలఁ ॥

కలసితివి శ్రీవేంకటేశ మమ్మిటు
లలిఁ బట్టపుసతుల మనుచును
యెలమి యమునలో నీఁదులాడితివి
పొలసి యాఁడుమీలఁ బొందేవుసుమ్మీ ॥ కొలఁ ॥ 183

### మాళవిశ్రీ

ఎందాఁకా మనసు చూచే వింతిని నీవు
పొందులనే కానరాదా భోగములు ॥ పల్లవి ॥

మొగము దప్పకచూచి మోహము నీతోఁ జెప్పి
నగినందే కానరాదా నాతియాసలు
చిగురుమోవి ఇచ్చి చేతులుచాఁచీ నీకు
తగులఁగా గానరాదా తమకములు ॥ ఎందాఁ ॥

నిలువుఁగొలువు సేసి నేరుపులు వచరించీ
పిలువఁగఁ గానరాదా ప్రేమములు
మొలకచన్నులు చూపి ముద్దులమాట లాడీ
తలఁచితేఁ గానరాదా నిలుకడలు ॥ఎందాఁ॥

కదిసి కూచుండి యట్టె కాఁగిటను బిగియించీ
పుదుట్లఁ గానరాదా వొడఁబాటు
అదన శ్రీవేంకటేశ అంగన నేలితి విట్టె
యెదుటనే కానరాదా ఇచ్చకములు ॥ఎందాఁ॥ 184

సౌరాష్ట్రం

బదుకవయ్యా ఇంత పగిడికాఁడవై తివి
పదరి వొకరొకరు పైకొనఁగాను ॥పల్లవి॥

మనసొక్కటాయనా మాట నీకుఁ జెల్లెనా
చెనకి యాకెపై నీకె చేఇచాఁచఁగా
కనుపట్టెనా నీకు కడునవ్వు వచ్చెనా
వెనుకొవి ఆకె నీకె వెసఁ దిట్టఁగాను ॥బదు॥

చలము నీకుఁ జెల్లెనా సమ్మతి నీకాయనా
బలిమి నాకె నీకె పరచఁగాను
తలఁపు లీడేరెనా తగవు గెలిచెనా
సలిగెతో నాకె నీకె జంకించఁగాను ॥బదు॥

పంతాలు సమకూడెనా పనులు నీకు దక్కెనా
ఇంతలో నాకె నీకె నిన్నెనయఁగాను
సంతోసమాయనా చక్కని శ్రీవేంకటేశ
వొంత నిన్నాకె నీకెఁ బొగడఁగాను ॥బదు॥ 185

వరాళి

ఏల వంకలు దిద్దేరే యీతనిలా గెఱఁగరు
యేలాటము లాడేవి యెఱఁగరాదా ॥ పల్లవి ॥

నగుతానే రమణుఁడు నాలినే పొద్దు గడపీ
యెగసక్కెములు సేసే దెఱఁగరాదా
మొగము చూడఁగానే మొనగోర నూఁదీ యాస-
లిగిరించఁజేసేది యెఱఁగరాదా ॥ ఏల ॥

సుదతుల నీకువెట్టి సూడుఁబాడుఁ బట్టించిన
యెదలోనిమర్మము లెఱఁగరాదా
అదనులు చెప్పించి అట్టె తనరాకకు
యెదురులుచూపించే దెఱఁగరాదా ॥ ఏల ॥

చొక్కుచుఁ గాఁగిట నించి సురతము చవిచూపీ
యెక్కువల కెలయించే దెఱఁగరాదా
చక్కనిశ్రీవేంకటేశ్వరుఁ డిదె నను నేలె
యిక్కడనే వుండినది యెఱఁగరాదా ॥ ఏల ॥ 186

రేకు 1332 దేసాళం

ఇంత చాలదా నిష్ఠూర మింకా వేరే వలెనా
మంతన మిదే చాలదా మర్మములు రేఁచను ॥ పల్లవి ॥

నవ్వితేనే చాలదా నాతులమనసులలో
అవ్వలఁ బంచబాణములై నాఁటును
దవ్వుల మాఁటలాడితే తగ నదే చాలదా
పువ్వులతేనియలై తీపులు రేఁచును ॥ ఇంత ॥

చూచితేనే చాలదా సుదతులమేనుల
కాచినట్టే పులకలగని చూపునుట్లు
చేచేత నీ వంటితేనే నేనలుగాఁ జాలదా
తాచినట్టె వలపులతమి రేఁచును ॥ ఇంత ॥

నన్న యిదె చాలదా చక్కని శ్రీవేంకటేశ
యిన్నిటా నిన్నును నన్ను నెనయించెను
మన్నించి నీవు నన్ను మరుఁగుచే చాలదా
విన్నకన్నజాడలను వేడుకలు రేఁచును ॥ ఇంత ॥ 187

కన్నడగౌళ

తలఁచినపనులెల్లా తానే అయ్యీఁగాని
చలములు మాని మోవి చవిచూపరాదా ॥ పల్లవి ॥

వెంగలియలుకలేల విరహతాపము లేల
అంగనతో మంచిమాఁట లాడరాదా
ఇంగితమెఱిఁగి యాకె యెదురుగా వచ్చీని
ముంగిటికి విచ్చేసి మోము చూపరాదా ॥ తల ॥

అసురుసురననేల ఆరడిఁబడఁగనేల
ఇసుమంత పంతము వియ్యరాదా
సుసరాన నీతో నాకె సొలయుచు వచ్చీని
వెస నీవే ముందుగాను విడెమియ్యరాదా ॥ తల ॥

శిరసు వంచుకోనేల చెలుల నంపఁగనేల
సరుసఁగూచుండి చేయి చాఁచరాదా
గరిమ శ్రీవేంకటేశ కలసితి వాకె మెచ్చి
సరుగఁ జెక్కు లంటుచు సరసమాడరాదా ॥ తల ॥ 188

రామక్రియ

నీకు నీవే గడించుకొనేవు గాక యేమైనా
దాకొని వి న్నందరిలో తగదంటినా ॥ పల్లవి ॥

ఆవల వేరే మరి ఆనవెట్టవలెనా
నీవాదేమాటలు విజమేకావా
వేవేలుగా నిందు వెంగెమేమైనా వున్నదా
నావద్ద నీవుండఁగాను నమ్మనంటినా ॥ నీకు ॥

చెలులచే యింకా బుద్ది చెప్పించవలెనా
వెలయ నీవాడినవే వేదాలుగావా
వెలుపలి సుద్దులెల్లా వెలచుకొంటాయిది
పిలిచి మరేమైనా బేరుకొంటినా ॥ నీకు ॥

చూడుమని నీమేను సోదనియ్యవలెనా
జాడతో నీనేఁతలు సత్యాలుగావా
వేడుకఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను నిట్టె
యేడ నేర్చితివి రతు లివి యంటినా ॥ నీకు ॥ 189

పళవంజరం

వేరేపొందు వలెనా వింతవారితో
ఆరితేరితే మనసు అలవాటువడును ॥ పల్లవి ॥

మక్కళించి మక్కళించి మాటలట్టె ఆడితేను
చిక్క నీవలపులకు చేవలెక్కును
యెక్కడెక్కడనైనాను యెదురుకట్లసుంచే
జవ్వన ముబ్బి దైలువారును ॥ వేరే ॥

తగిలితగిలి మోము తప్పకచూచితేను
అగపడ్డరతులకు ఆస పుట్టును
నగినగి పలుమారు నవ్వులు సేసితేను
జిగి మర్మాలు గరఁగి చిమ్మిరేఁగును ॥ వేరే ॥

చెలరేఁగిచెలరేఁగి చెనకదొరకొంటేను
ములువాఁడికొనగోళ్లముద్ర లంటును
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పలుకుఁబంతము లిఁకఁ బచ్చిదేరును ॥ వేరే ॥ 190

## మంగళకౌసిక

అంగన నాపతితోడ నంటివా నీవు
అంగడికెక్కె వలపు లంటివా నీవు ॥ పల్లవి ॥

చేతుల మొక్కితినని సిగ్గుతో నుందాననని
ఆతనితో నీమాఁట అంటివా నీవు
నాతలఁపెఱుఁగుమని నమ్మితి నన్నిటానని
ఆతుమలో విలువఁగ నంటివా నీవు ॥ అంగ ॥

నానితిఁ జెమటనని నవ్వులకు లోనవి
ఆనలు మరవనని అంటివా నీవు
వీనుల నాలించుమని విన్నపము లివేయని
బినదయ్యాఁ దానే గతి యంటివా నీవు ॥ అంగ ॥

కప్పురపుఁబడియ నీకాఁగిలి నాసొమ్మని
అప్పణ నాకిమ్మని అంటివా నీవు
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్నునని
అప్పుడే మెచ్చితినని యంటివా నీవు ॥ అంగ ॥ 191

శుద్ధవసంతం

అడుకొనే నెంతశైనా అందరితోను
    వేడుక నీవు విచ్చనవిడి నుండవయ్యా ॥ పల్లవి ॥

మంతనాన నీవు నాతో మాటలాడవా యిప్పుడు
    అంతలోనే లేదనేవు ఆకెఁ జూచి
    వంతులేక నీవొకరివాఁడవా యేమైనాను
    ఇంతటిమగవాఁడవు యేల నీకు వెరపు ॥ అడు ॥

అందమంది నాచే విడె మందుకొనవా నీవు
    అందుకాచే వప్పటివి ఆకెఁ జూచి
    బెండుపడి నీ వొకరిపెట్టుఁజెట్టవా యేమైనా
    నిందుదొర వప్పటివి నీకేల వెఱపు ॥ అడు ॥

కలసి మెలసి నన్ను కాఁగిలించవా నీవు
    అలికే వింతటిలోనే యాకెఁ జూచి
    చెలఁగి శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
    నెలకొంటి వింతటాను నీకేల వెఱపు ॥ అడు ॥ 192

రేకు 1333 హిజ్జిజి

[1]చెలిచెలువ మేమనిచెప్పేమయ్యా
    అలమేలుమంగ నీకె యమరు నన్నిటాను ॥ పల్లవి ॥

కొమ్మమోముఁదమ్మిమీఁదికుంతలపుఁదుమ్మిదలు
    సమ్మతిఁ జంద్రాస్యనేత్రచకోరములు
    నెమ్మి నధరపుఁదేనె నిండునవ్వువెన్నెలలు
    వుమ్మడి నుండఁగ నంటనోడి భ్రమసెను ॥ చెలి ॥

1. ఈపాటలో సమాసపద్ధతి, తత్సమీకరణమూ సరిగా లేవు.

మెలుతనాభిసరసిమీఁదిచనుజక్కవలు
మలసి కుహరనాభి మధ్యసింహము
అలరు వళితరంగాలు అందపుటారసుపాము
చెలఁగివుండఁగాఁ బ్రవేశించక భ్రమసెను ॥ చెలి ॥

తరుణిఘనకటిపులినతలపు గతిహంసలు
కరిశిరోనితంబోరుకాండకరులు
వరుసఁ జెమటేరు యౌవనవనము నుండఁగా
గురు శ్రీవేంకటేశుఁడ కూడఁగా భ్రమసెను ॥ చెలి ॥ 193

బౌళి

ఏమినేరుపులు చూపే వెందాఁకాను
[1]కామించి నీపట్టు కతికడవలేఁగాక ॥ పల్లవి ॥

ఆకెతో మాటాడఁగా నేమందునోయంటా నీవు
వాకున మాటాదేవు వంతుకు నాతో
పైకొని నాపై నంతబత్తి గద్దా నీకేమైనా
నీకు మోహించినదాన నేఁ బాయలేఁగాక ॥ ఏమి ॥

నెట్టన నాపెతో నవ్వి నేఁ గోపగించేనంటా
నట్టనడుమ నూరకే నవ్వేవు నాతో
బట్టబయలు నే నీకు బాఁతే ఇందరిలోనా
అట్టిట్టని నీతోను అలుగలేఁగాక ॥ ఏమి ॥

అలమేలుమంగఁ గూడి అట్టె నన్ను బుజ్జగించఁ
గలసితి నిటు భూకాంత నేనంటా
యెలమి శ్రీవేంకటేశ ఇంతకరుణా నాపై
మలసి యెంతైనా నిన్ను మరవలేఁ గాక ॥ ఏమి ॥ 194

1. నీపట్టుకు + అతికడవలేనుఁగాక = నీభావమునకు మించి దాటిపోలేను అనియా?

## సామంతం

ఎఱఁగము నీచిత్త మిఁక నెట్లున్నదో
మఱియు నీయానతికి మారుకొనమయ్యా ॥ పల్లవి ॥

చలములు సారెకు సాదించువారికి
మలసి యేమనినా సమ్మతి గాదు
వలపులు పైపై వడిసేటివారికి
పిలిచినఁ గొండంతప్రియము గలుగును ॥ ఎఱఁ ॥

పంతములే కడుఁబచరించేవారికి
శాంత మించుకయు సమకొనదు
సంతపుఁబొందులు జరపెడివారికి
వింతగాఁ జూచినా వేడుక గలుగు ॥ ఎఱఁ ॥

ధరలో యెగ్గులుతప్పులవారికి
సరసపుఁజెనకులు చవిగావు
యిరవుగ శ్రీవేంకటేశ కూడితివి
ఆరయ మనల కింకా ఆసలే కలుగు ॥ ఎఱఁ ॥ 195

## శంకరాభరణం

మదనుబండారము మగువమేను
పొదిగొన్నవలపులఁ బొసఁగెఁగాన ॥ పల్లవి ॥

మరునియాయుధశాల మగువకొప్పు
తొరలించి విరులెల్లాఁ దురిమెఁగాన
యిరవై కీరపు(ము?)లాయ మీపెగళము
సరసపుమాఁటలెల్లా జరపెఁగాన ॥ మద ॥

కాముని సాముగరిడి కాంతపురము
ఆమవిచనుసంగడా లమరెఁగాన
ప్రేమపుఁగేళాకూళి గంభీరనాభి
తేమచెమటలచేత దిగుపారెఁగాన ॥ మద ॥

కాంతునివేఁటపొలము కన్నెపిఱుఁదు
బంతి మొలనూళ్ల పోఁగు వారెఁగాన
అంతటివానితల్లి యీయలమేల్మంగ
యింతలో శ్రీవేంకటేశు నెనసెఁగాన ॥ మద ॥ 196

తెలుఁగుఁగాంబోది

వట్టియలుకల నీకు వచ్చినదేమి
యిట్టె చెలిని మన్నించి యింటికి రావయ్యా ॥ పల్లవి ॥

ఆపెతో మాఁటాడితేను ఆయములెల్లాఁ గరఁగు
చేపట్టి పెనఁగితేను చెమరించును
వోపి నవ్వు నవ్వితేను వొడలెల్లాఁ బులకించు
తీపులుండఁగాఁ జేఁదు తిననేఁటికయ్యా ॥ వట్టి ॥

సరుసఁ గూచుండితేను సంతోసములు మించు
ఇరవై చూచితే కోర్కు లీడేరును
తిరమై గురులు నించితే కొంకుగొనరు మాను
వెరవుతో నీడలివె యెండలేలయ్యా ॥ వట్టి ॥

మోవితేనె లానితేను మోహములు చెలరేఁగు
భావించి నేసవెట్టితే ఫలము గద్దు
శ్రీవేంకటేశ కూడితి వీవేళ నలమేల్మంగ
యీవల నీకె వుండఁగా నితరమేలయ్యా ॥ వట్టి ॥ 197

ఆహిరి

ఇంటికి విచ్చేసితివి [1]యెంతవనికి
[2]అంటిసుదివంటిదాన నందుకోపేనా ॥ పల్లవి ॥

యెంగిలిమోవిదాన యేడలేవిసిగ్గుదాన
పొంగేటి చెమటలతోఁ బొరలేదాన
వంగనిచన్నులదాన వాడికెవలపుదాన
పంగెనకోపముదాన బాఁతెయ్యేనా ॥ ఇంటి ॥

సన్నపునడిమిదాన సళుపుఁజూపులదాన
వెన్నెలనవ్వులతోడివీరిడిదాన
నున్నవి చెక్కులదాన [3]నూఁగురులకొప్పుదాన
పిన్నదాన నే నీకుఁ బ్రియమయ్యేనా ॥ ఇంటి ॥

చిగురుఁబాదాలదాన చిమ్ముఁజూపులదాన
వెగటుఁబిఱుఁదుగలవేఁకపుదాన
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
జిగిబిగువులదానఁ జిత్తమువచ్చేనా ॥ ఇంటి ॥ 198

రేకు 1334 దేశి

ఎంత కాతరీఁ డితఁ డేమి సేతునే
పంతముతోడ నాకు పైకొనఁగవచ్చునా ॥ పల్లవి ॥

సిగ్గులు మూఁటగట్టి చెక్కుచేయి తీసిపెట్టి
యెగ్గులేక నవ్వుమనీ నేమి సేతునే
వొగ్గి తా నేమిసేసినా నూరకే యమరుఁగాక
తగ్గుమొగ్గులేవినాకు తమకించవచ్చునా ॥ ఎంత ॥

1. ఎంత+పనికి. 2. అరఁటికి అంటి అని వ్యావహారికము. 3. నూఁగు+కురులు

గుట్టు బాయిటను వేసి కోరికలు యెగపోసి
ఇట్టె పాదా లొత్తుమనీ నేమిసేతునే
రట్టుగాఁ దా నెట్టుండినా నెట్టన నమరుఁగాక
చుట్టమనయిననాకు జోలిఁబెట్టవచ్చునా ॥ ఎంత ॥

కొంకుగొసరెల్లా మాని కుచము లెదురువూని
ఇంకాఁ గాఁగిలించుమనీ నేమిసేతునే
అంకె శ్రీవేంకటేశుఁ డవి దన కమరుఁగాక
సంకలేవిదాన నాకు సటలాడవచ్చునా ॥ ఎంత ॥ 199

పాడి

ఎట్టిజాణలో మీరు ఇటువలె నుండవద్దా
చుట్టపువరుస మిమ్ముఁజూచి నేరవలెను ॥ పల్లవి ॥

మక్కువగలనీవైతే మాటలాడి తనియవు
దక్కి యాపైతే నూఁకొని తనియదు
ఇక్కడ నందరుఁ జూచే రెగ్గుసిగ్గు లెఱఁగరు
చొక్కపువలపు మిమ్ముఁజూచి నేరవలెను ॥ ఎట్టి ॥

ఆసల నీ వాపెచన్ను లంటియంటి యలయువు
నేసి యాపె వూడిగేలచే నలయదు
తాసువలెఁ బెనఁగుచు తలమొల యెఱఁగరు
మాసకపుఁబెండ్లి మిమ్ముఁజూచి నేరవలెను ॥ ఎట్టి ॥

గక్కన శ్రీవేంకటేశ కాఁగిలించి పాయవు
యెక్కువ నాపె నీవురమెక్కి పాయదు
పక్కన నానారతుల పగలురే యెఱఁగరు
చొక్కటియాసలు మిమ్ముఁ జూచి నేరవలెను ॥ ఎట్టి ॥ 200

బౌళి

మన్నించవయ్యా యీమగువ నిట్టె
విన్నపము విని నీవే విడెమియ్యవయ్యా ॥ పల్లవి ॥

మచ్చికసేసి యాపె మాట నీతో నాడఁగాను
యెచ్చోటు చూచేవు పరా కేడదయ్యా
పచ్చిచెమటలతోడ పాదాలు నీకు గుద్దఁగ
వచ్చునా నాకు విద్దుర వట్టిసట లేలయ్యా ॥ మన్నిం ॥

నంటుసేసి యప్పటిని నవ్వులెల్ల నవ్వఁగాను
గొంటవై వున్నాఁడవు యీగుణమేలయ్యా
చంటిమొన సోఁకఁగ వేఁ(విం?)జామర నీకు వేయఁగ
వొంటి నీసిగ్గు దగునా వొగి మాయలేలయ్యా ॥ మన్నిం ॥

కందువకుఁ దీసి యాపె కాఁగిటికి రమ్మనఁగ
యెందరితో సన్న సేసే వెమ్మెలకయ్యా
చెంది శ్రీవేంకటేశుఁడ సేస లాపె చల్లఁగాను
మందలించి మారుకుమారు చల్లే వౌనయ్యా ॥ మన్నిం ॥ 201

కాంబోది

ఆఁటదానిబలిమి నీయంతకంటె నెక్కుడా
మేఁటివి నీయెమ్మెలెల్లా మెరసెఁగా ఇపుడు ॥ పల్లవి ॥

పయ్యదకొం గంటఁగాను పడఁతి దప్పించుకొంటే
అయ్యెడనే పంతాలెల్ల నాడేవు
వుయ్యాలమంచ మెక్కితే వొద్దఁ బండుండితి విట్టె
చెయ్యారా నీపంతములు చెల్లెఁగా ఇపుడు ॥ ఆఁట ॥

కొప్పువట్టి తియ్యఁగాను కొమ్మ నీచేఇ వట్టుకొంటే
రెప్పలెత్తి జంకించి రేసులాడేవు
అప్పుడే సిగ్గువడితే నాయము లంటితి విట్టె
చిప్పిల నీకోరికలు సిద్ధించెఁగా ఇపుడు ॥ ఆఁట ॥

రతికేలిఁ గూడఁగాను రామమేను చొక్కితేను
ఇతవుగా కొనగోర నెచ్చరించేవు
సతమై శ్రీవేంకటేశ జట్టిగొంటే మెచ్చే విట్టె
తతి మీఇద్దరిమేళ్లు దక్కెఁగా ఇపుడు ॥ ఆఁట ॥ 202

## మేఁచబౌళి

సరసుఁడ విన్నిటాను జాణవు నీవు
వొరసె నిందాఁకా సతి వోరుచుకోవయ్యా ॥ పల్లవి ॥

మనసొక్కటైనదాఁకా మాటలు సూటిఁబడవు
యెనయకుండితే నవ్వీ యెరవెరవే
వినుఁబాసి విరహాన నెలఁత యెంత దూరెనో
వొనరితి విఁక నవి వోరుచుకోవయ్యా ॥ సర ॥

సిగ్గులుదేరినదాఁకా చేఁతలు సమ్మతి గావు
దగ్గరఁ గూచున్నదాఁకా తనివిలేదు
కగ్గి నీవు రా నట్టె కాతరాన నెట్టుండెనో
వొగ్గి మన్నించితి విఁక నోరుచుకోవయ్యా ॥ సర ॥

కలసికూడినదాఁకా కడమలు దీరవు
చలములు మానితేనే చవివుట్టును
యెలమి శ్రీవేంకటేశ యిప్పు డీ కెంత మెచ్చెనో
వొలసి యేలితి విఁక నోరుచుకోవయ్యా ॥ సర ॥ 203

శంకరాభరణం

కొప్పు వంగ నీ వెంతైనా గోవిందరాజా । పైఁడి-
 కుప్పెకతారము వట్టి గోవిందరాజా ॥ పల్లవి ॥

నిద్దిరించేనంటాను నెలఁతలచేఁ బాదాలు
 గుద్దించుకొనే విప్పుడు గోవిందరాజా
సుద్దులు చెప్పేనంటా చొక్కించితివి మేనులు
 కొద్దిమీరె వలపులు గోవిందరాజా ॥ కొప్పు ॥

అలసితినంటాను ఆఁడువారిచే నేప్రొద్దు
 కొలిపించుకొనే విట్టే గోవిందరాజా
వలచితినంటాను వారితోడిమంతనాలు
 కొలఁదిమీరె నెప్పుడు గోవిందరాజా ॥ కొప్పు ॥

పచ్చడము గప్పేనంటా పడఁతులతొడలపై
 కాచ్చేవు నీమునివేళ్ల గోవిందరాజా
నిచ్చ నాలుగుచేతులు నిండుఁగాఁగిట నిద్దరి
 గుచ్చేవు శ్రీవేంకటాద్రి గోవిందరాజా ॥ కొప్పు ॥ 204

రేకు 1335 పాడి

ఏలా ఇంకాఁ గొసరను ఇన్నిటా తా జాణఁడౌను
 మేలుమేలు ఇన్నిటాను మెచ్చితి నేననరే ॥ పల్లవి ॥

కానుక నే నంపితేను కమ్మటి మారుకుమారు
 తానూఁ గప్పురమంపెఁ దగవేకదే
వీనులు చల్లఁగా వింటి వీడుకువీడాయను
 మోనమున నప్పటివి మొక్కితి నేననరే ॥ ఏలా ॥

పూవుల నే వేసితేను పూఁచి తా మారుకుమారు
తావిజవ్వాదిని వేసెఁ దగవేకదే
సావివోక వలపులు సరికిసరాయను
పోవులుగా తను నేఁ బొగడితిననరే ॥ ఏలా ॥

అదరి నేఁ బిలిచితే నంతలో మారుకుమారు
తడయక పూఁకొనెఁ దగవే కదే
యెడయక శ్రీవేంకటేశుఁ దేలెఁ బొందాయను
నడుమ సమరతికి నవ్వితి నేననరే ॥ ఏలా ॥ 205

శ్రీరాగం

ఏమిసేయుమనేవయ్య యింకా నన్ను
కామించి నీమన్ననలు గైకొంటి నేను ॥ పల్లవి ॥

వొద్ద నేఁ గూచుండనా వూఁకొననా నీమాటలు
కద్దు నిజమేయనా కానిమ్మనవా
గుద్దిరము మాననంటా కొసరేవు కమ్మటిని
ముద్దుముద్దువలె నీముంగిట నుందానను ॥ ఏమి ॥

పాదాలు పిసుకనా బత్తిసేయనా నీకు
సాదువలె నుండనా సమ్మతించనా
సోదించక మాననంటా సొలసేవు కమ్మటిని
సాదించి నీసేవకు మంచముపై నుందానను ॥ ఏమి ॥

గక్కన విడెమియ్యనా కాఁగిలించి కూడనా
మిక్కిలి నీకు లోఁగానా మెచ్చు మెచ్చనా
యెక్కువ శ్రీవేంకటేశ యేలితివి నన్ను ; నాకు
దక్కితివి కమ్మటిని తగిలివుందానను ॥ ఏమి ॥ 206

నాదరామక్రియ

మొక్కఁ జేకొను మోహపునీసతి
చెక్కుదియ్య దియ్య(దియ్యఁదియ్య) చెదరదు వలపు ॥పల్లవి॥

చనవుసేసుకొని సతి విసుఁ గొసరెను
మనసునఁబెట్టకు మాఁట లిఁక
ననుపు గలుగఁగా నవ్వులు నవ్వేను
విను నీపట్టుకు వెంగము గాదు ॥ మొక్కఁ ॥

చుట్టరికంబున సుదతి చెనకె నిను
పట్టకు యెగ్గులు పలుమారు
జట్టిగొనెఁగనక జంకించె విపుడు
అట్టిట్టనకుము అరగొర లేదు ॥ మొక్కఁ ॥

దేవులతనమున తెలివ నిన్నొరసె
శ్రీవేంకటేశుఁడ చింతించకు
వావిగలుగఁగా వడి నినుఁ గలసెను
భావించ కిచటఁ గపటమే లేదు ॥ మొక్కఁ ॥ 207

కేదారగౌళ

దొరవు నీవన్నిటాను తొయ్యలి నేను
కరకరిఁ గక్కసించఁగలమా నేము ॥ పల్లవి ॥

యేఁటికి నవ్వితివయ్యా యెఱఁగము నే మాపని
నాఁటకుఁడ వేమ[1]ందుకునైనా వచ్చును
మూఁటగట్టి వలపులమోపు నెత్తికి నెత్తేవు
గాఁటాన వింతేసి కోపఁగలమా నేము ॥ దొర ॥

---

1. ఏ మందుకునైనా=దేనికైనా కావచ్చు. 'అందుకు' అను పదము 'దానికి' అనునర్థములో మాండలికము.

చేసన్న లేఁటివయ్యా సిగ్గువడితిమి నేము
అసోద మెంత నీమనసందు నున్నదో
పూసగుచ్చి తరితీపు పొంచి మెడఁగట్టేవు
గాసించి నీతోఁ బెనఁగఁగలమా నేము ॥ దొర ॥

తప్పకచూచేవేమయ్యా దయలోవారము నేము
ఇప్పుడు శ్రీవేంకటేశ యెంతేమన్నాను
వొప్పగించినట్టు నీవొళ్ల నాకాఁగిటి కిచ్చి
కప్పేవు మే లెదురాడఁగలమా నేము ॥ దొర ॥ 208

సామంతం

ఘనుఁడవు చింతకుంటకంభమురాయ। మముఁ
గనుఁగొని రక్షించు కంభమురాయ ॥ పల్లవి ॥

కంతునిగురుఁడ వోకంభమురాయ। శ్రీ-
కాంతఁ దొడపైనిడినకంభమురాయా
కాంతులు నీమేనెల్లఁ గంభమురాయ। యే-
కాఁతమాదే వింతులతోఁ గంభమురాయ ॥ ఘనుఁ ॥

కప్పురపువిడేలకంభమురాయ
కప్పము గొనే వింతటఁ గంభమురాయ
కప్పులుదేరీ నీమోవిఁ గంభమురాయ
కప్పుకొమ్మీ పచ్చడము కంభమురాయ ॥ ఘనుఁ ॥

కమ్మఁజెమటలు నిండెఁ గంభమురాయ
కమ్మటిఁ గూడితి విట్టే కంభమురాయ
కమ్మకొనెఁ బులకలు కంభమురాయ
కమ్మన(ని?)శ్రీవేంకటాద్రికంభమురాయ ॥ ఘనుఁ ॥ 209

తోండి

ఏల నీకు వెరపూ ఇన్నిటా గెలిచితివి
నాలి మాని నీతో నేను నవ్వుచుండఁగాను ॥ పల్లవి ॥

మంతనాన నీవాపెతో మాటలాడినసుద్దులు
ఇంతయు నాతోఁ జెప్పి రిందరు నేఁడు
యెంతకెంత సేసి నాతో యేలానలువెట్టేవు
రంతుసేసి నిన్ను నేను రవ్వపెట్టేనా ॥ ఏల ॥

సిగ్గువడ కిఁదరునుఁ జేసినసేఁతలెల్ల
నిగ్గుల సోరణగండ్ల నేఁ జూచితి
అగ్గమై సాకిరులేల అట్టె నాకుఁ దెలిపేవు
తగ్గించి విన్నిఁక నేను తలవంపించేనా ॥ ఏల ॥

కలసిన మీలోనికాఁపిరాలు నిన్నరేయి
కలలోనే కంటి శ్రీవేంకటగిరీశా
చెలఁగి నన్నిట్టె కూడి చెక్కులేల నొక్కేవు
పలుమారు యిఁక నిన్నుఁ బంగించేనా ॥ ఏల ॥ 210

రేకు 1336 సామంతం

నీ వెఱఁగవా వోయి నే నేమిచెప్పే నీకు
వేవేలైనాఁ బొందుసేసి విడువరాదు ॥ పల్లవి ॥

పంతములాడఁగవచ్చు పట్టిపెనఁగఁగవచ్చు
బంతినే సతులఁగూడి పాయఁగరాదు
రంతులుసేయఁగవచ్చు రాజసాన నుండవచ్చు
యెంతైనా వలపులేరు యీఁదఁగరాదు ॥ నీవె ॥

యెమ్మెలు నెరపవచ్చు యేమైనాఁ జేయఁగవచ్చు
దొమ్ములనానవెట్టితే తోయఁగరాదు
వుమ్మడి నుండఁగవచ్చు వొరట్లు చూపవచ్చు
కమ్మి కాఁగిలించుకొంటే కాదనఁగరాదు ॥ నీవె ॥

నాయము చెప్పఁగవచ్చు నవ్వులు నవ్వఁగవచ్చు
పాయపుమదము చేతఁ బట్టఁగరాదు
యీయెడ శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
చాయలు చూపఁగవచ్చు జంట వాయరాదు ॥ నీవె ॥ 211

బౌళి

పిన్నలు నాచన్నులు పిసుకకు పలుమారు
వున్నతిఁ బెరిగితేను వోరిచేఁగాని ॥ పల్లవి ॥

నేరుపుగలవారలు నీతో మాటలాడిరి
నేరవిదాన నేను వూరకుండాన
గోరనేల వూఁదేవు కుమ్మెలయ్యీ మే విట్టె
నేరుపరాదా నీవల్ల నేరిచేఁగాని ॥ పిన్న ॥

రట్టడిసతులెల్లాను జట్టులు నేసిరి నిన్ను
గుట్టుతోడిదానఁగాన కొసరనోప
పట్టకు కుచ్చెల చేత పాసీ పోఁకముడి
గట్టువాయఁ జేయరాదా ఘనమయ్యేఁగాని ॥ పిన్న ॥

వెగ్గళించినచుట్టాలు వెట్టిపనులు గొనిరి
సిగ్గువడ్డదానఁగాన సేవనేసితి
నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయ నన్నేలితివి
తగ్గక మోవియ్యరాదా దప్పిదేరేఁగాని ॥ పిన్న ॥ 212

దేసాళం

ఆసోదకుఁడవు నినే(విన్నే?) మనేమయ్యా
అసుద్దు లింకానా అవునయ్యా ॥ పల్లవి ॥

కప్పురము చేతికిచ్చి కలయఁగ విడెమిచ్చి
చెప్పరానిమాటలెల్లాఁ జెప్పిచెప్పి
అప్పసము నీవద్ద నాపె గాచుకుండఁగాను
అప్పటి మమ్ముఁ జెనకే వవునయ్యా ॥ ఆసో ॥

గందము నీపైఁ బూసి కమ్మి సురటి విసరి
గొందిఁ బానుపు వరచి గుబ్బల నొత్తి
యెందునుఁ బాయక ఆకె యేఁకారుచుండఁగాను
అంది మాపైఁ జేయిచాఁచే వవునయ్యా ॥ ఆసో ॥

సిగ్గులెల్ల విడిపించి చేరి మోవి గంటిసేసి
వెగ్గళపునవ్వు నవ్వి వేసాలుసేసి
వొగ్గి శ్రీవేంకటేశ్వర వొడిగట్టాపె వుండఁగ
అగ్గమై నన్నుఁ గూడితి వవునయ్యా ॥ ఆసో ॥ 213

దేశాక్షి

ఎంత మానాపతివి విన్నేమి చెప్పేది
మంతనములాడేవు మందెమునారసింహా[1] ॥ పల్లవి ॥

చేరి విడెమిమ్మంటే సిగ్గులువదేవు నీవు
వోరి నీసతెవ్వతైనా వున్నదా యీడ
గోర నిన్ను గీరఁగాను గొబ్బున వేఁడుకొనేవు
ఆరితు లెవ్వతైనా నిన్నాడుకొనీనా ॥ ఎంత ॥

---

1. 'సింహా' అని రేకులో గలదు.

మోముచూచి నవ్వితేను మొక్కుచును లోఁగేవు
 నీమగువ లీడ వచ్చి నిన్నుఁ జూచేరా
 కామించి మోవికెంపులు కలిగించితే మూసేవు-
 చూ; మరల నెవ్వతైనా సొలసి తిట్టినా ॥ ఎంత ॥

సారెకు మాటలాడితే సన్నలుసేసేవు నీవు
 దూరి నీమోహపుచెలి దొమ్మిసేసీనా
 యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
 కేరడాన నెవ్వతైనా కేలుచాఁచీనా ॥ ఎంత ॥ 214

సాళంగనాట

నవ్వేవారి నెఱఁగవు నాలుగువంకల నిన్ను
 జవ్వనమదముననే సాముసేసేవు ॥ పల్లవి ॥

యెంతైనా గద్దు నీయాస యేమి చెప్పే దిందరిలో
 కాంతవలపులకు గాదె నీమేను
 చెంతల నాకుచములు చేతులనే పట్టుకొని
 మంతుకెక్క నాపెతోను మాఁటలాడేవు ॥ నవ్వే ॥

తలఁచరాదు నీరతి తమకివి యిన్నిటాను
 జలజాక్షులెంగిలికంచము నీమోవి
 అలరి యధరామృత మందుకొంటా నాపెపొత్తు
 కలసి సన్నలుసేసి కాఁకరేఁచేవు ॥ నవ్వే ॥

పట్టరాదు నీవయసు పడఁతులకెల్ల రచ్చ-
 కొట్టమాయ నిదివో నీగొప్పపురము
 నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడి యట్టె
 కట్టుకొంటి వాపెపదకము నీమెడను ॥ నవ్వే ॥

గుండక్రియ

ఇది యేఁటిదయ్యా యెంత నేసితివి నీవు
చెదరనిదయతో విచ్చేయవయ్య యింటికి ॥ పల్లవి ॥

చెలులతో యేమని చెప్పెంపితివి
యెలమి నానవాలు యేమిచ్చితివి
కులికి యేమని యాసకొలిపితివి
చెలిని మన్నింతువు విచ్చేయవయ్య యింటికి ॥ఇది॥

చెప్పరానిసన్న లేమి నేసితివి
తప్పకేల కొనగోరఁ దాఁకించితివి
చొప్పుగా నేమని నీమోవి చూపితివి
చిప్పిలఁ గూడుదువు విచ్చేయవయ్య యింటికి ॥ఇది॥

నావద్దనుం డాపె నెట్టు నవ్వించితివి
యేవిధానఁ దొల్లేమని యేలుకొంటివి
శ్రీవేంకటేశ మాయింతిఁ జేరి కూడితి
నేవగొందువు మాచే విచ్చేయవయ్య యింటికి ॥ఇది॥ 216

రేకు 1337 పాడి

ఏవంక నేరిచితివో యింతేసి నీవు
దేవులచెరువుయేలేతిరువేంకటేశా ॥ పల్లవి ॥

సారెసారెకు నెత్తేవు సంగడాలా నాచన్నులు
టోరనఁ బట్టేవు చేయి బొందెకోలా
సారె [1] జారె ననెంటేవు చక్రాలా నాపిఱుఁదులు
నేరుతువోయి సాములు నెలఁతలతోడనె ॥ఏవం॥

1. జారెను+అని+అంటేవు.

కామించి పెనఁగే విట్టె కంబమా నాకంబుకంఠము
గోమునఁ గాఁగిలించేవు గోఁతమా మేను
ఆముకొని వొడ్డుకొనే వమ్ములా నాచూపులు
సాము నీకుఁ జెల్లినయ్యె సకియలతోడనె ॥ ఏవం ॥

కమ్మటి బుసకొట్టేవు గరిడా నాజవ్వనము
దొమ్మిఁ బట్టితీసేవు ద్రోణమా జడ
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిట్టె వన్నుఁ గూడితివి
తమ్మి సామమురెనోయి కాంతలతోడనె ॥ ఏవం ॥ 217

## ఆహిరి

ఇన్నాళ్లవాఁడవె కావా ఇంత వున్నదా నీకు
మన్ననతో నెట్లా మర్మము లంటెనో ॥ పల్లవి ॥

జలజాఁ జెమరించె సరసుఁడ నీమేను
కలికి యేమని యేతతమాడెనో
కిళలు నీమోమున గక్కున నిండె నిట్టె
అలరి మరి యేమని ఆనఇచ్చెనో ॥ ఇన్నా ॥

ముసిముసినవ్వు రేఁగె మించి నీసెలవులను
కొసరి ప్రియ మెంత నీకుఁ జెప్పెనో
సుసరాన మోమునకు సొంపువచ్చె నింతలోనె
పసమై నీ కెట్లు మోమువంచి మొక్కెనో ॥ ఇన్నా ॥

వెదవెదఁ బులకలు వెలసె నీ చెక్కులను
అదియాలపుగోర నెట్టదిమెనో
కదఁగి శ్రీవేంకటేశ కాంతఁ గూడి మమ్మేలితి
తడఁబడి సంతోసము తగ నా కేమనెనో ॥ ఇన్నా ॥ 218

శ్రీరాగం

ఇందాఁకా మనసెల్లా నెఱఁగము యీకీలు
ముందు సరసమాడక ముచ్చట వాయదు ॥ పల్లవి ॥

విక్కి విరహానమున్న నెలఁతకు పతి వచ్చి
చెక్కులు నొక్కినఁగాని సేద దేరదు
వెక్కసపుఁగాఁకల [1] వసిగినయందుకు
చొక్కపునవ్వునఁగాని సొంపురేఁగదు ॥ ఇందాఁ ॥

అగడుఁదమకమున నలసినయాపెకు
తగుమోవిచ్చినఁగాని దప్పిదేరదు
చిగురుఁగోరికలచే చిక్కువడినందుకు
మొగము చూపక ప్రియములు వెలవెట్టదు ॥ ఇందాఁ ॥

రాఁగినజవ్వనికి యీరతి శ్రీవేంకటేశుఁడు
కాఁగిట నించినఁగాని తళదేరదు
పాఁగినచెమటచేత పచ్చియైనయందుకు
చేఁగదేరఁ గొసరక చిత్తము గరఁగదు ॥ ఇందాఁ ॥ 213

మాళవి

తగుఁదగునయ్యా మీఇద్దరికి నేఁడు
చిగురువలపులెల్లా సేసలై నిలిచెను ॥ పల్లవి ॥

కూరిమి నిన్నుఁ గొసరికొసం తప్పకచూచీ
చేరఁదేసికన్నులచెలియ
మారుకుమారు నీవు మరి తప్పకచూచితే
బోరనఁ గలువలతో పూజలై నిలిచెను ॥ తగుఁ ॥

---

1. చూ. 208 పాటలో పాదపీఠిక(Foot Note).

వొట్టుక నిన్ను నొరసి వొరయుచుఁ జెనకీని
  పట్టెఁదేసిగుబ్బలపడఁతి
  అట్టడితనాన నీ వాఱడిఁ జేతులు చాఁచితే
  పొట్టఁబొరుగునఁ దమ్మిపూజలై నిలిచెను ॥తగుఁ॥

ముందుముందె మోవితేనె ముంచిముంచి అందియిచ్చె
  అందీ కొణిఁదెఁడుమోవిఅతివ
  కందువ శ్రీవేంకటేశ కలసి నీవూ నిచ్చితే
  పొందుల సంపెఁగపువ్వుపూజలై నిలిచెను ॥తగుఁ॥ 220

నాగవరాళి

చెక్కుటిచేయి దియ్యదు చింతతోడను
  చక్కఁబెట్టుదువు ప(స?)తి సరుగన రావయ్యా ॥పల్లవి॥

కొమ్మ నీతో నెఱఁగక కోపగించుకొంటినంటా
  వుమ్మడిఁ బొడిఁబడుచు నుసురసీవి
  యిమ్ముల నెంతసేసిన యీపె నీకు మేలుది
  సమ్మతించఁ జెప్పుదువు సరుగన రావయ్యా ॥చెక్కు॥

మగువ నిన్నపుడు బొమ్మల జంకించితినఁటా
  చిగురుఁబరితాపానఁ జింతించీని
  తగవులు దప్పినాను తరుణి పాయఁగలేదు
  జగడము దీరుతువు సరగన రావయ్యా ॥చెక్కు॥

సతి నీపై తమకాన చన్నుల నొత్తితినంటా
  మతిలో చిడుముడి నీరతి సేసీని
  యితవై శ్రీవేంకటేశ యేలితివి నీ వెందున్నా
  సతమైతి విట్లానే సరగన రావయ్యా ॥చెక్కు॥ 221

పళవంజరం

మనసుకు మనసే మరి తారుకాణవచ్చె
చెనకినచెనకులు చేచేత నున్నవి ॥ పల్లవి ॥

వలపులు సరివచ్చె వనిత నిన్ను మెచ్చె
పొలసి యిందాఁకా నాపె పొగడెనయ్యా
కలలు నిక్కములాయ కడుమర్మములు రాయ
కొలువులో నాపెవద్దఁ గూచుండవయ్యా ॥ మన ॥

నవ్వులు నెలవి మించె ననుపులు లోలో మించె
మవ్వముతో నిన్ను నాపె మరిగెనయ్యా
జవ్వనము సరిదూఁగె జగడములెల్ల దాఁగె
చివ్వన లోనికిని విచ్చేయవయ్యా ॥ మన ॥

చూపులఁ గళలు విండె సురతము పంటవండె
వోపిక నిన్నాపె నోరూరించెనయ్యా
యేపున శ్రీవేంకటేశ యిద్దరుఁ గూడితి రిట్టె
తీపుల నాపె నురము దించుకువయ్యా ॥ మన ॥ 222

రేకు 1338 భైరవి

అందుకు నిందుకు వింతలాయనయ్యా
అందాలుగాఁ జెప్పుదువు ఆడకు రావయ్యా ॥ పల్లవి ॥

అంగనకుఁ గస్తూరి అంపేనంటి వదేదయ్యా
చెంగట నింతలో మఱచితివా అయ్యా
ముంగిటిచెలులఁ జూచి ముందెఱఁగవా అయ్యా
యెంగిలాయ నీమోవి యిదేఁటిదయ్యా ॥ అందు ॥

సగమా కందుకొంటి వాసగమూఁ బుత్తెంచెనయ్య
వగలేమిఁ దలఁచక వచ్చితివయ్యా
బగివాసి ఇంతలోనే భ్రమసితివా అయ్య
చిగురువంటి నీమేను జీరలాయనయ్యా ॥ అందు ॥

పాటించినసగినాలు పనికివచ్చెనో అయ్య
గాఁటాన మగిడి ఇంతిఁ గంటివయ్యా
యీటున శ్రీవేంకటేశ ఇద్దరుఁ గూడితిరయ్య
నీటుఁజెక్కుల చెమట విండుకొనెనయ్యా ॥ అందు ॥ 223

వాడి

మగరూపు నాఁడురూపు మక్కళించి ఇట్టె తన్నుఁ
దగిలినవారికెల్ల తమిరేఁచీ నితఁడు ॥ పల్లవి ॥

సతిపయ్యదచెఱఁగే చక్కఁగానుఁ గప్పుకొని
కతగా నొక్కపక్కనే కాఁగిలించుక
చతురత చెక్కుఁజెక్కు జంటగా నదుముకొని
అతివలు కొలువుసేయఁగ నున్నాఁ డితఁడు ॥ మగ ॥

పడఁతి ముత్యాలపేరే మెడఁ దాఁ దగిలించుక
అడరి కలవినే మోవందుకొనీని
తొడతొడఁ దగిలించుక తుదలేనియాసలతో
తడివి చెలులతో నెత్తములాడీ నితఁడు ॥ మగ ॥

తరుణి మంచముదోమతెర మాటుసేసుకొని
సరి శ్రీవేంకటేశుఁ డిచ్చలఁ గూడీని
కరముల కరముల కందువఁ బెనచుకొని
దొరతన మింతులయెదుటఁ జూపీ నితఁడు ॥ మగ ॥ 224

దేశి

ఇట్టె తప్పులెంచేనంటే నెంత లేదు
కట్టు గాచుకొని వూడిగము నేసేఁగాక ॥పల్లవి॥

చిగిరించినట్టు నీవు నేసిననేఁతలకు
యెగసక్కేలాదేనంటే యెంత లేదు
మొగమోడి చేతులెత్తి మొక్కి నీవాడినట్లా
అగపడి నీకు నే నిల్లాల నైతిఁగాక ॥ఇట్టె॥

దిమ్మరివై నీవు గడుఁదిరిగేతిమ్మటలకు
యెమ్మెలు మెరసేనంటే యెంత లేదు
సమ్మతించి నీపట్టురు సాద నే నీచేతను
తమ్ములమందుక మరఁదల నైతిఁగాక ॥ఇట్టె॥

అడియాలమైననీయంగపుమచ్చాలు చూచి
యెదసి కోపించేనంటే యెంత లేదు
అదరి శ్రీవేంకటేశ అన్నిటా నిన్నుఁ గూడి
పుడివోక పురముపై నుండానఁగాక ॥ఇట్టె॥ 225

ముఖారి

గామిడివి నీవు కైలాటాలువెట్టేనవి
యేమరించఁజూచేవు యిద్దరము నొకటే ॥పల్లవి॥

మంతనాన నే నీతో మాటలాడినవియెల్ల
అంతరంగముగఁ జెప్పె ఆపె నాతోను
మంతుకెక్కినట్టినీమతకాలే వేరుగావి
ఇంతులము తొల్లే నేము నిద్దరము నొకటే ॥గామి॥

గుఱుతుగా నీవు నేనుఁ గూడినకూటములెల్లా
యెఱుకగా నాపె నీ(నా?)తో యెచ్చరించెను
నెఱవుగా నన్నిటాను నీవే కపటివిగాని
యెఱఁగ మామేలెల్లా నిద్దరము నొకటే ॥ గామి ॥

[1] చెప్పరానిమనలోని సేసుకొంటి బాసలెల్లా
చప్పిడించ కాపె నాతో నన్ను నేసెను
ముప్పిరి శ్రీవేంకటేశ మోహించితి విద్దరికి
యెప్పుడు నీపాలిటికి నిద్దరము నొక్కటే ॥ గామి ॥ 226

ఆహిరి

ఏమి మొగము చూచేవు యెన్నటికి నీదయ
చేముట్టి సరసమాడి సిగ్గుదేర్చరావా ॥ పల్లవి ॥

చెలి నీవద్ద నుండఁగ చెక్కులెల్లాఁ జెమరించె
వెలయ సురటిఁ గొని విసరరాదా
అలసె నీతో నవ్వి అప్పటి నింతటిలోనే
చలువనీమోవితేనె చవిచూపరాదా ॥ ఏమి ॥

సతి నీతో మాటాడఁగ జల్లుననుఁ బులకించె
గతిగూడ పచ్చడము గప్పరాదా
తతి మేను సోఁకఁగాను తమకములెల్ల రేఁగె
కత లెందాఁకాఁ జెప్పేవు కాఁగిలించరాదా ॥ ఏమి ॥

అంగన నేసవెట్టఁగ అయములెల్లఁ గరఁగె
సంగతిగాఁ గౌఁగిలించి చనవీరాదా
రంగుగ శ్రీవేంకటేశ రతిఁ గూడితి వీకెను
ముంగిటనే మోహించె ముచ్చటాడరాదా ॥ ఏమి ॥ 227

1. 'చెప్పరాని బాసలెల్లా సేసుకొంటిమి మనలో' అనుట మేలు.

బౌళి

మేము విన్నవించరాదు మీలోవిమర్శములు
ఆమనివలపు చల్లి అంగవించరాదా ॥ పల్లవి ॥

చిత్తడిచెమటతోడిసిగ్గులేల పతితోడ
చిత్తములోపలిమాట చెప్పరాదా
వత్తివలె మోవిమీఁది వసివాడులేమిటికి
పొత్తుకు వచ్చి యీతనిఁ బోదిసేయరాదా ॥ మేము ॥

ముంచినపులకలతో ముసిముసి నవ్వులేల
చుంచుల నీవేడుకలు చూపరాదా
అంచెల నిట్టూరుపులఅసురుసు రేమిటికి
మంచముపైఁ గూచుండి మరుపఁగరాదా ॥ మేము ॥

నిండుమోముకళలతో నిట్టచూపు చూడనేల
దండిగాఁ గాఁగిట నించి దైవారరాదా
అండనె శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్ను నలమె
కొండలవంటిచన్నుల(లఁ?) గుచ్చియెత్తరాదా ॥ మేము ॥ 228

రేకు 1339 గౌళ

ఎమ్మెలవాఁడవు నీతో నెదురాడవచ్చునా
సమ్మతించి బొమ్మలనే జంకిచుటగాక ॥ పల్లవి ॥

కోపగించవచ్చునా కొచ్చి నిన్ను సారెసారె
చూపులు నాఁటించి సాదించుటగాక
రాపుసేయవచ్చునా రావనుచు నింతలోనె
తీపులమోవివలువ తీసుటగాక ॥ ఎమ్మె ॥

అలయించవచ్చునా అట్టునిట్టుఁ దీసి నిన్ను
వాలిసి నాచనుగుబ్బల నొత్తుటగాక
బలిమిచూపవచ్చునా పైకొని సరసమాడి
గళలు రేఁచి వేడుక కైకొంటగాక ॥ఎమ్మె॥

పేసరించవచ్చునా వేగినంతా రతులను
ఆస చూపి నిన్ను మర్మా లంటుటగాక
నేసతో శ్రీవేంకటేశ చేఁదితి వాఁపవచ్చునా
లాసి నీకరుణెల్లా లాలించుటగాక ॥ఎమ్మె॥ 229

ముఖారి

చెలిమోము చూచిప్పుడు సిగ్గులువడేవు నీవు
తలఁపించనా నేను తక్కేఁచేవు గాక ॥పల్లవి॥

మించి చెలిసరసము మున్ననే విన్నవించనా
అంచెలఁ గొద్దికి లోనైతివిగాక
కంచపుపొత్తుకోరకే కానుక చేతికియ్యనా
మంచమెక్కి మచ్చికౌదివేమోగాక ॥చెలి॥

సలిగెచిత్తములెంత సన్ననే యెచ్చరించనా
అలముక బుజ్జగించవైతివిగాక
తలయువనుచు నీకు కడుఁ బ్రియముచెప్పనా
నలిరేఁగి కవకవ నవ్వితివిగాక ॥చెలి॥

అంగనఅలపులెల్లా నప్పుడే నీకుఁ జూపనా
అంగవించి పంతమిచ్చ్యవైతివిగాక
రంగుగ శ్రీవేంకటేశ రతి నెట్టె కూడితివి
యింగిత మెంచనా మెచ్చే వింతలోనేకాక ॥చెలి॥ 230

దేసాళం

ఇరువంకల నీకు నిందరము నున్నారము
తెరమఱుఁగునవ్వులు తెలుసుకోవయ్యా ॥ పల్లవి ॥

వేడుకకుఁ దోడువచ్చి వెనకతియ్యఁగరాదు
వాడికకుఁ జోటిచ్చి వద్దనరాదు
పాడిచెప్పేనని వచ్చి పక్షపాత మాడరాదు
తాడుపై తపసు నీవే తలఁచుకోవయ్యా ॥ ఇరు ॥

అట్టె తా పూఁటవడి అరవననఁగరాదు
పట్టి చవిగొంటా రోతపడఁగరాదు
చుట్టరికము సేయుచు సూడువట్టఁగరాదు
[1] చట్టురాతినారిది విచారించుకోవయ్యా ॥ ఇరు ॥

సేసవెట్టి పెండ్లాడి సిగ్గులువడగఁరాదు
[2] బాసగెవి(లి?)చినమీఁద బద్దనరాదు
యీసుదీర శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
వేసినముడియ ఇది విడువకువయ్యా ॥ ఇరు ॥ 231

హిందోళం

ఎంతవడి గుట్టుసేసే విక్కడనయ్యా
దొంతరవలపులకు తోవేదయ్యా ॥ పల్లవి ॥

కామినిచూపులు నీపై కలువదండలై నిండె
యేమయ్యా వూరకున్నాఁడ వెందాఁకాను
దోపటినవ్వులు కప్రధూళియై నీమేన(ను?) ముంచె
వేమరుముచ్చటలకు వేళ యెప్పుడయ్యా ॥ ఎంత ॥

1. చట్టు రాతినార + ఇది. 2. 'ఒక కాయో పండో' పందెముగా నొడ్డి, అది ఇతరుడు గెల్చిన తర్వాత నీకొకబద్ద ఇస్తాననడమా? లేక 'వద్దనరాదు' అనియా?

పడఁతిమొక్కులు నీకుఁ బల్లవపుఁబరపాయ
తడవవేమయ్య యెంతదడవాయను
జడిగొన్నవూరుపులు చల్లనిసురట్లాయ
జడియనిరతి కవసర మెప్పుడయ్యా ॥ ఎంత ॥

ముదితమాటలు నీకు ముత్యాలసేసలాయ
యెదురుకొనవలదా ఇఁకనైనాను
కదిసితి రిద్దరును గక్కన శ్రీవేంకటేశ
చదురులాడుటకును సమయమేదయ్యా ॥ ఎంత ॥ 232

వసంతవరాళి

ఐనపని కిఁకనేల అనుమానము
కానిమ్మని లోనుగాక కట్టుకునేదేమీ ॥ పల్లవి ॥

మొగముచూచినదాన మొక్కవద్దా నీకు నేను
యెగసక్కెమాడఁగాను యేమాయను
నగినదాన నీతో నంటున మెప్పించవద్దా
జగడమడిచి నిన్ను సాదించేదేమి ॥ ఐన ॥

చేరఁగవచ్చినదాన సేవలు సేయఁగవద్దా
యీరసాన జంకించఁగ నేమాయను
పేరఁబిలిచినదాన ప్రియములు చెప్పవద్దా
దూరి నిన్నుఁ దిట్టుఁగాను దొరతనమేమి ॥ ఐన ॥

సిగ్గులువడినదాన చెప్పినట్టు సేయవద్దా
యెగ్గులెంచి పెనఁగఁగా నేమాయను
వెగ్గళించి నన్నిదె శ్రీవేంకటేశ కూడితివి
బగ్గన నిన్నుఁగాదనేపను లిఁకనేమి ॥ ఐన ॥ 233

సౌరాష్ట్రం

పిసికితే పసురౌను ప్రియములెల్లా
    పొసఁగినవాటినే పొందవలెఁగాని ॥ పల్లవి ॥

సలిగెగద్దంటాను సారె నెత్తి కెక్కరాదు
    పిలిచేవంటా నీతో బిగియరాదు
    కలనేనంటా మేను కదుఁబిప్పి సేయరాదు
    వొలిసి మట్టుకుమట్టే వుండవలెఁగాని ॥ పిసి ॥

యిందు రమ్మనేవంటా యిల్లెల్లాఁ జేకొనరాదు
    మందెమేళమాయనంటా మారుకోరాదు
    యెందైనా వచ్చేవంటా యిలయెల్లాఁ దిప్పరాదు
    అంది సరవి మనసియ్యవలెఁగాని ॥ పిసి ॥

చెప్పినట్టు నేసేవంటా సేవలు గొనఁగరాదు
    వొప్పుగఁ గూడితివంటా వుబ్బఁగరాదు
    యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
    మెప్పించి సమరతుల మెచ్చవలెఁగాని ॥ పిసి ॥234

రేకు 1340 దేశాక్షి

ఏమే యెంతనేరుపరి వి దెఱఁగవా
    ప్రేమమతి కడతురా బెరయుటగాక ॥ పల్లవి ॥

కన్నుల మొక్కినమీఁద కాఁకలు చల్లుదురా
    సన్నలనే వలపులు చల్లుటగాక
    చన్నులు చేతికిఁ జిక్కి సారె నిఁక లోఁగుదురా
    వెన్నెలనవ్వులు నవ్వి వేఁడుకొంటగాక ॥ ఏమే ॥

పాదాలు చాఁచినమీఁద పంతాలు నెరపుదురా
సేదదేర సేవలు సేయుటగాక
ఆదిగొని కాఁగిలించె నానలు వెట్టుదురా
సాదువలె భోగములు చవిగొంటగాక ॥ఏమే॥

ఆయములంటినమీఁద అరగొరసేతురా
పాయనిసమరతులఁ బైకొంటగాక
యీయెడ శ్రీవేంకటేశుఁ దేలె సిగ్గువడుదురా
కాయములు సోఁక విట్టె కిలయుటగాక ॥ఏమే॥235

లలిత

ఎంచి చూడుమా నీ కెంత యితవైనాను
వంచన మీరి నవ్వవచ్చునా వోయి ॥పల్లవి॥

పాయలేక నీవెంత పచ్చిగా మోహించినాను
చేయరానిసేఁతలు చేయవచ్చునా
ఆయెడ నీ కటువంటి వలవాటు గలిగితే
చాయల మా కింతసేయ సంగతులా వోఇ ॥ఎంచి॥

వేడుకతో నీవెంత వెస నప్పణిచ్చినాను
ఆడరానిమాటలు నిన్నాడవచ్చునా
యీడనాడఁ దిరుగాడి ఇవి నీకుఁ చవులైతే
పాడిదప్ప మాకివి పనులా వోయి ॥ఎంచి॥

ఇప్పుడే నీవు నాకు నెంత ప(చ?)న విచ్చినాను
చెప్పరానిపని నీకుఁ జెప్పవచ్చునా
నెప్పున శ్రీవేంకటేశ నీకు నేను బాఁతైతే
అప్పటి మా కలఇంచ నందమా నిన్నోయి ॥ఎంచి॥ 236

## తోడి

ఇదె నేఁజేసినభాగ్య మేమిచెప్పేది
పొదిగొని వలపులె పోదిసేసేవు ॥పల్లవి॥

వంతులవాసులవారు వద్దఁ గాచుకుండఁగాను
చెంతల నాపై నేల చేయివేసేవు
సంతలో బేరములే సరసమే కురియఁగా
పొంతనుండి నాతోడి పొందుసేసేవు ॥ఇదె॥

కోటానఁగోటిసతులు కొలువులో నుండఁగాను
సూటిగాను నామొగమే చూచేవు
తేటచెలములవలె తేనెలమాట లాడఁగా
కూటమి కొడఁబిలిచి కొంగువట్టేవు ॥ఇదె॥

నేసలువెట్టినవారు నేనానేన లుండఁగాను
ఆసపడి నన్నుఁ గూడి ఆనదించేవు
బాసల శ్రీవేంకటేశ పాలవలె నవ్వఁగాను
రాసికెక్క నన్నే గరవించి మెచ్చేవు ॥ఇదె॥ 237

## కేదారగౌళ

చెలులాల మీరైనాఁ జెప్పరే బుద్ధి
చలములన్నియు మాని సరసమాడితిని ॥పల్లవి॥

యెప్పటికెప్పటిమాటలేల తలఁచుకొనీనే
చిప్పిలుచు లోలోనేల చెమరించీనే
తప్పులేదంటానేల తాకుకాణించవచ్చీనే
అప్పుడే అన్ని మరచి అందాలఁ గూడితిని ॥చెలు॥

యెక్కడికెక్కడిపనులేల నిలువఁబెట్టీనే
వుక్కుమీరి తానేల వుస్సురనీనే
నిక్కమిదంటానేల నిండా నానలు వెట్టీనే
చక్కనై అలుకదేరి చవిసేసుకొంటిని ॥చెలు॥

మేడనేదతగవులు యిందునేల కలపీనే
వోడక తానేల నాపై వొట్లువేసీనే
కూడి శ్రీవేంకటేశుఁడు గురుతులేల నించీనే
ఆడానీడాఁ దెలుసుక అన్నిటా నమ్మితిని ॥చెలు॥ 238

మాళవిగౌళ

[1]ఇన్నిటా ఘనుఁడు దాను యేమిచెప్పేరే
యెన్నుకొనీ నాగుణము లేమిచెప్పేరే ॥పల్లవి॥

చెంతఁ దనచెప్పినట్టు సేసితినంటా నిదె
యెంత నన్ను బుజ్జగించీ నేమిచెప్పేరే
అంతటాఁ దన కిచ్చకమాడితినంటా నిదె
ఇంతలో నన్నుఁ బొగడీ నేమిచెప్పేరే ॥ఇన్ని॥

వొట్టి తనపై పాటలు వొవరఁ బాడితినంటా
యిట్టె విడెమిచ్చీని యేమిచెప్పేరే
జట్టిగాఁ జన్నులతోడ సామునేయించితినంటా
యెట్టనెదుటనే మెచ్చీ నేమిచెప్పేరే ॥ఇన్ని॥

మనసుమర్మములంటా మంతనమాడితినంటా
యెనసి కాఁగిలించీ యేమిచెప్పేరే
చెనకి మొక్కితినంటా శ్రీవేంకటేశ్వరుఁడు
యినుమడిగా మన్నించె నేమిచెప్పేరే ॥ఇన్ని॥ 239

1. ఇది అన్నమయ్య జీవితరహస్యముగ తోచుచున్నది.

రామక్రియ

వట్టివేసాలు నేసుక వాదులకు దూరేవు
గుట్టు బాయిటను వేసి గురిగాఁ జేసితినా ॥పల్లవి॥

కొప్పు నే దువ్వితిఁగాక కోపగించి నిన్నేమైనా
ఒప్పుగ ముందటిపట్ల కొదిసితినా
విప్పక చేతులువట్టి వేఁడుకొంటిఁగాక నిన్ను
ముప్పిరి నొసలు మోపి మొక్కించుకొంటినా ॥వట్టి॥

కందువ లంటితిఁగాక కపటాన నిన్నేమైనా
కిందుపడ కొనగోర గీరితినా
అందుకొమ్మనుచు [1] మోవినాకు నీ కిచ్చితిఁగాక
చెందిఁ ఇప్పుడు నోరొగ్గించితినా యెంగిలికి ॥వట్టి॥

వలపు రేఁచితిఁగాక వడి నిన్ను నేమైనా
తులికి చన్నుల నొత్తి కుమ్మితినా
యెలమి శ్రీవేంకటేశ యెనసి మెచ్చితిఁగాక
పలుకులలో నే బూతుబందునఁ దిట్టితినా ॥వట్టి॥ 240

రేకు 1341 సాళంగనాట

మెలుఁతలందరును మెచ్చిరమ్మా
వలపు లొక్కమాఁటె పంచితివమ్మా ॥పల్లవి॥

మారుగొండ్లెక్కితివి మగనితో దెక్కితివి
నేరుపరి వౌదువు నీవమ్మా
సారె జారించి పయ్యెద చన్నులు చూపితివి
నీరపమాయ నింక నెరజాణవమ్మా ॥మెలుఁ॥

---

1. మోవిన్ + ఆకు.

బొమ్మలను జంకించి బుద్ధులెల్ల బోధించి
చిమ్మేటికోపము మానిచితివమ్మా
తమ్మిమోము మోము చేర్చి దప్పిదేర మోవి ఇచ్చి
కుమ్మరించితివి సిగ్గు గుణవతివమ్మా ॥ మెలు ॥

పాదము పాదానఁ దొక్కి పక్కన చెక్కులు నొక్కి
నేదదేర్చితివి నీకు చెల్లునమ్మా
ఆదిగావి శ్రీవేంకటమందు అహోబలేశ్వరు
సాదుఁ జేసితివి మంచిచక్కనిలక్ష్మివమ్మా ॥ మెలుఁ ॥ 241

మాళవిగౌళ

కోనతిరువెంగళేశ కోడెకాఁడా
అనించీ నీసతి నీపై అప్పటి వలపులు ॥ పల్లవి ॥

వేడుకకు నీతోను వేసారక మాటలాడి
పీడెము చేతికి నిచ్చి వెడ్డువెట్టీని
వాడికగా నీసొమ్ము వడిఁ దనమేనఁ బెట్టి
తోడనే మోపులుగట్టీ తొయ్యలి వలపులు ॥ కోన ॥

చెక్కునొక్కి నవ్వించి చిత్తము రా సన్న నేసి
మొక్కుమొక్కి ఆసవుట్ట మోవి చూపీని
వొక్కమాఁటే నీకొప్పుపువ్వులు దా ముడుచుకొని
చిక్కించి నీపై రాసిచేసీ వలపులు ॥ కోన ॥

కొంగువట్టి కొసరుచు కూరిమి కాఁగిట నించి
సంగతిగాఁ గూడికూడి చల్లీ నేస
రంగుగ శ్రీవేంకటేశ రతిని గంద మలంది
పొంగుచును కణఁజాలఁ బోసీ వలపులు ॥ కోన ॥ 242

దేసాళం

ఇంతితో నేఁటిబీరాలు యెందాఁకాను
సంతోసించి మచ్చికలు చల్లఁగరాదా ॥ పల్లవి ॥

చనవరికాంతగాన సతి నీపైఁ జేయిచాఁచె
కొనగోరు దాఁకెనంటిఁ(టాఁ?) గోపగింతురా
ననుపు గలదుగాన నవ్వులెల్లా నవ్వె నీతో
కనుఁగొని యందు కీకెఁ గాఁగిలించరాదా ॥ ఇంతి ॥

కూరిమివనితగాన కొప్పువట్టి విన్నుఁ దీసె
ఆరీతి జంకించెవంటా నదలింతురా
నేరుపుగలదుగాన నీకఁ(కం?)టే మితిమీరె
గారవించి అందుకిట్టె కాఁగిలించరాదా ॥ ఇంతి ॥

ఇచ్చకపుసతిగాన ఇటు విన్నుఁ జొక్కించె
పచ్చినేసెనంటా నిట్టె పదరుదురా
మచ్చికె గలదుగాన మరిగె శ్రీవేంకటేశ
కచ్చుపెట్టి అందు కిట్టె కాఁగిలించరారా ॥ ఇంతి ॥ 243

వేళావళి

ఇందాఁకానున్నభావ మేమి చెప్పేది
చెంది వేడుకతో మించె చెక్కునొక్కఁగాను ॥ పల్లవి ॥

చిగిరించెఁ జిత్తము చిరునవ్వులు మొనపె
మొగము కళలు నిండె ముదితకును
వెగటులన్నియుఁ బాసె వేడుకలు దైవారె
మగటిమితో నీవు మాటలాడఁగాను ॥ ఇందాఁ ॥

పొదలెను కుచములు భోగపుటాసలు రేఁగె
యెదిరించెఁ బులకలు యింతికిని
అదన నానంద ముబ్బె ఆయములు గరఁగెను
చదురుఁదనాన నీవు చనవియ్యఁగాను ॥ ఇందాఁ ॥

కొప్పు గదు వెడజారె గుట్టుఁ [1]దమకము నిండె
అప్పటి వలపు పండె నతివకును
కుప్పళించెఁ [2]దమకము కోరికలు దైవారె
నెప్పున శ్రీవేంకటేశ నీవు గూడఁగాను ॥ ఇందాఁ ॥ 244

సామంతం

ఎంతవాఁడవయ్య నిన్ను నేమనేము
సంతకూటములవాఁడ సంటటూరిచెన్నుఁడా ॥ పల్లవి ॥

సోగకన్నులనుఁ జూచి సొలపులమాట లాడి
వాగపుగొల్లెతలను వలపించేవు
జాగులనవ్వులు నవ్వి జాజరపాటలు వాడి
బాగుగా నప్పటిఁ గొంత భ్రమయించేవు ॥ ఎంత ॥

టింకపుసాములు సేసి బెట్టుగాఁ బువ్వుల వేసి
అంకెకు వచ్చినదాఁకా నాసరేఁచేవు
లంకెలనుఁ గూచుండి లలితో మర్మము లంటి
మంకుఁదనములవారి మరిగించేవు ॥ ఎంత ॥

చీరలకొంగులు వట్టి సిగ్గులు బయటవేసి
గారవించి కాఁగిటను కరఁగించేవు
యీరీతి శ్రీవేంకటేశ యిందరిని యేలుకొని
మేరమీరి చనవిచ్చి మెప్పించేవు ॥ ఎంత ॥ 245

---

1, 2 పునరుక్తి.

సామంతం

రావయ్య చూతువు రమణిని
దేవుల కిటువంటితెఱంగులు ॥పల్లవి॥

పలచవియెలుఁగులపాటలు
చెలపలచెలపలచెమటలు
పిలుపునివ్వెరగులపీటులు
కలిగె నేఁ డిదివో కలికికిని ॥రావ॥

సుదిగొవినయెదురుచూపులు
పుదుకపుడక నట్టె పూరుపులు
బడిబడిఁ దిరిగేటిబాగులు
అడియాలమయ్య నీయంగనకు ॥రావ॥

చేతిలో పిడికిటిసేసలు
రాతిరిఁబగలు రతిరహస్యములు
యీతల శ్రీవేంకటేశ యెనసితివి
లాతాయ మన్ననలు లలనకును ॥రావ॥ 246

రేకు 1342 రామక్రియ

ఒకటి కినుమ దయ్యా నుప్పు చింది
మొకము చూచీ నట్టె ముచ్చటాడనీవే ॥పల్లవి॥

చలివాసివున్నదాన సముకాన మున్నదాన
నలువంక వింకఁ గొంత నవ్వనీవే
తలఁపులోనిదాన తగులాయమైనదాన
ములువాఁడికొనగోరు మోపనీవే ॥ఒక॥

నేసకు లోనైనదాన సేవసేయుచున్నదాన
పోసరించి యింకఁ గొంత బోదించనీవే
రాసికెక్కినట్టిదాన రతి కియ్యకొన్నదాన
మోసపోనివలపుల ముంచనీవే ॥ ఒక ॥

కందువనే వున్నదాన కాఁగిలించుకొన్నదాన
యిందమని మోవి నాకు నియ్యనీవే
యిందరిలో శ్రీవేంకటేశ్వరుఁడు నన్నుఁ గూడె
మందలించి యింకానింకా మన్నించనీవే ॥ ఒక ॥ 247

కన్నడగౌళ

ఎప్పుడు దయదలఁచే వింక నీవు
దప్పిదేర మోవి యిచ్చి దక్కఁగొనవయ్యా ॥ పల్లవి ॥

నిలువెల్లఁ జెమరించె నీతో మాటాడరాఁగా
వెలఁదియలపుదీర విసరవయ్యా
నెలపై కొలువునేసి నివ్వెరగుతో నున్నది
యెలమి నీతొడమీఁద నిడుకొనవయ్యా ॥ ఎప్పు ॥

భారపుతురుము జారె పాదాలకు మొక్కరాఁగా
నేరుపున ముడిచి మన్నించవయ్యా
తేరకొన నిన్నుఁజూచి తిమురుచునున్నది
గారవించి కాఁగిటను కాఁగిలించవయ్యా ॥ ఎప్పు ॥

వెసఁ బోఁకముడి వీడె వీడెము చేతికిరాఁగా
పసగాను తెరవేసి పాలించవయ్యా
కొసరి శ్రీవేంకటేశ కూడె నిన్ను నింతలోనె
సుసరాన రతులకుఁ జొక్కి మెచ్చవయ్యా ॥ ఎప్పు ॥ 248

దేవగాంధారి

ఇంక నెంతగావలె యీవలపూ
యింకద్దు చెక్కుచెమట యిదెకాదా వలపు ॥ పల్లవి ॥

పెదవిపై పీదెపుఁబిసరు
అదన విన్నుఁజూచి యసురుసురు
పదరి పయ్యదకొంగుపై విసరు
యెదిగించీఁ జెలి నీపై నిదెకాదా వలపు ॥ ఇంక ॥

గక్కన మనసులోవికరఁగూ
మొక్కలపుసిగ్గులతో మొరఁగూ
మిక్కిలిమరుకళలమెరుఁగూ
యిక్కువలు చూపెఁ జెలి కిదిగాదా వలపూ ॥ ఇంక ॥

నసుపుతో సెలవుల నగవూ
పెనఁగేటికాఁగిటిబిగువూ
యెనసె శ్రీవేంకటేశ యింతి నిన్ను నూ
యెనుమడించెఁ దమక మిదిగాదా వలపూ ॥ ఇంక ॥ 249

కాంబోది

ఎవ్వతైనా వలచును యిటువంటిపనులకు
రవ్వపడినచేఁతల రతికెక్కితివిరా ॥ పల్లవి ॥

సొలపులాదిమనసు సోదించి చూచితి
చెలుకఁగాఁ బెనఁగి నేఁ జూచితివి
యెలమి నందుకులోనై ఇచ్చకమే సేసేవు
చలివానె నన్నిటాను జాణఁడ వౌదువురా ॥ ఎవ్వ ॥

కప్పిననీచేఁతలు సంగడిఁ జూపి చూచితి
చొప్పులెత్తి నవ్వు నవ్వి చూచితివి
వొప్పుకొని అందుకెల్లా నోడఁబడఁ జెప్పేవు
తప్పనిబొంకనియట్టిదంట వౌదువురా ॥ఎవ్వ॥

మిక్కుటపురతులను మెప్పించి చూచితి
చొక్కించి గోరగీరి చూచితివి
యెక్కడాను మోసపోవు యిన్నిటా నన్నేలితివి
యెక్కువైన శ్రీవేంకటేశుఁడ వౌదువురా ॥ఎవ్వ॥ 250

సామవరాళి

అన్నిటా గుట్టుతో నుండు టదిమేలు
తన్నుఁదానె వచ్చి యేల తడవేవు మమ్మును ॥పల్లవి॥

మనసురానిసతి మాఁటలెన్ని యాడినాను
వొనరివుండరు కడువగరై తోఁచు
కొనవేసి మరికొంత కొసరఁగఁబోతేను
[1]పెనపరాలకు వచ్చి పిప్పిగట్టును ॥అన్ని॥

యెరపరికపుచెలి యెంత నవ్వు నవ్వినాను
సరవితో నుండదు చప్పనై తోఁచు
పొరలించి మరికొంత పూఁచి కానుక వెట్టితే
కరఁగక లోలోనే గరివడును ॥అన్ని॥

నెమ్మిఁ దరితీపులేనినెలఁత యెంత మొక్కినా
వొమ్మి సమ్మతమై వుండదు వుప్పనై తోఁచు
కమ్మి శ్రీవేంకటేశ నేఁ గలసితి నింకెట్టన్నా
చెమ్మవుట్టి వలపులు చిగిరించును ॥అన్ని॥ 251

1. పెనపరాలు=వివాదములు. 'పెనపరి' శబ్దభావార్థకరూపమా?

సాళంగం

గొల్లదాన నింతే నేను; కొంగువట్ట దొరకానె
యెల్లవారుఁ జూడఁగాను యేమిసేతునే ॥పల్లవి॥

కన్నుల జంకించీని కైదండ వట్టీని
వున్నతపుకొనగోర నొత్తీని
చన్నులు చేతఁబట్టీని సరసములాడీని
యెన్నిచెప్పినా మానఁడు యేమిసేతునే ॥ గొల్ల॥

తీగెనవ్వు నవ్వీని తెరలోనికి రమ్మనీ
బాగుగాఁ దానే కస్తూరి పైఁబూసీని
వేగిరించి వలపులు వెల్లవిరిగాఁ జేసీని
యీగతి వీనిగుణము లేమిసేతునే ॥గొల్ల॥

మొక్కలానఁ గాఁగిలించి మోవి గంటిచేసీని
చిక్కుదీసి శిరసుపై సేసవెట్టీని
గక్కన శ్రీవేంకటాద్రిఘనుఁ డిట్టె నన్నుఁ గూడె
యెక్కువగా మన్నించీ నేమిసేతునే ॥గొల్ల॥ 252

రేకు 1343 రీతిగౌళ

మంచిమేలు గలిగితే మానవచ్చునా
యెంచక చేకొనవయ్య ఇంటిదాన నేను ॥పల్లవి॥

యిన్నియు నేరుచు నాపె యెగ్గుసిగ్గులేని దాపె
వన్నెల నింకా నాపెకు వలవవయ్యా
మన్ననతోదాన నేను మానాపతిని నేను
వున్నతిఁ దొల్లే సతమైవున్నదాన నేను ॥మంచి॥

యేమైనాఁజేసు నాపె యెమ్మెలెరగని దాపె
ప్రేమతో నాపె నింటికిఁ బిలువవయ్యా
నీమాటలోదాన నేను నిగర్వపుదాన నేను
కామించి నీ కెప్పుడునుఁ గలదాన నేను ॥ మంచి ॥

పనిలేనిపని దాపె పంతములొల్లని దాపె
ననుపున బాసలిచ్చి నమ్మించవయ్యా
చనవరిదాన నేను జట్టిగొన్నదాన నేను
యెనసితివి శ్రీవేంకటేశ యిట్టె నేను ॥ మంచి ॥ 253

పూర్వగౌళ

ఎంతలేదు రమణునియేలాటాలు
పంతపుమాఁటలకెల్లా బారలుచాఁచేవా ॥ పల్లవి ॥

చెలువుఁడు నవ్వుతాను చేఁతలేమో సేసెనంటా
చలములు నీవేల సాదించేవే
జలజలమనుచును జడివాన గురిసితే
కలచోటికెల్లా నీవు కట్టలు గట్టేవా ॥ ఎంత ॥

రమణుఁడు వేడుకతో రవళించి తిట్టెనంటా
గమకాన నంత యేల కాఁతాళించేవే
సమముగా నంతటా వేసవి యెండగాసితేను
భ్రమసి యేడనేడకై పందిళ్లువెట్టేవా ॥ ఎంత ॥

శ్రీవేంకటేశుఁడు నిన్ను చెంగలించి కూడితేను
ఆవేళ నీవేల వుసురసు రనేవే
కావరించి పొలమెల్లా గాలి విసరితేను
దావతి నెందుఁజూచినా దళ్లుగట్టేవా ॥ ఎంత ॥ 254

ఆహిరినాట

ఇదియే చాలు నాకు యేదలేవివెగటేల
పదిటి కొకమాఁటైనాఁ బలుకకుండేవా ॥ పల్లవి ॥

మంతనాన నీతోను మారుకొని మాటాడఁగ
పంతము వచ్చెనా నేఁడు పలుమారును
చింతతోడఁ దలవంచి చెక్కుచేతితో నుండఁగ
కొంతైనా నన్ను వేఁడుకొనకుండేవా ॥ ఇది ॥

గద్దించి నీతో నేను కమ్మటినిఁ బెనఁగఁగ
పెద్దరికమా నాకుఁ బెచ్చువెరిగి
కొద్దితోడఁ బానుపుపై గుట్టుసేసుకుండఁగాను
బుద్ది దలఁచుకొనైనా బొందకుండేవా ॥ ఇది ॥

నెలవై కాఁగిటిలోను నిన్ను నలయించఁగాను
కలిగెనా మేలు శ్రీవేంకటవిభుఁడా
చెలఁగి రాజసముతో చేరి సంగడి నుండఁగ
నలువంక నాతోనే నవ్వకుండేవా ॥ ఇది ॥ 255

శుద్ధవసంతం

పొగదేవు నన్నును పూఁచిపూఁచి పలుమారు
యెగసక్కెములకైతే యేమిబాఁతి నేను ॥ పల్లవి ॥

వలపు చవిగొంటేను వడిఁ జెప్పరానితీపు
బలిమి నొల్లకుంటేను బాఁతిగాదు
పిలిచి విడెమియ్యఁగాఁ బ్రియురాల నైతివి
యెలమి సంతకతొల్లి యేమి బాఁతి నేను ॥ పొగ ॥

రతివేడుక గలితే రసము లొలుకుచుండు
ఇతవుగాక వుండితే యెందూఁ బొందదు
తతి సరసమాడఁగా తగుచనవరినైతి
ఇతరకాంతలలోన యేమిబాఁతి నేను ॥ పొగ ॥

కాఁపురము నేసేనంటే కల్పవృక్షమై తోఁచు
వోపనంటే మోఁటుపడివుండు నూరకే
యేపున శ్రీవేంకటేశ యేలఁగా ఇల్లాలనైతి
యీపై చమ్మటూరఁ జూపే వేమిబాఁతి నేను ॥ పొగ ॥ 256

దేసాళం

నివ్వెరగుతో నుందాన నిన్నుఁ జూచి
జవ్వనపుసంపదలు సందు చూపరాదు ॥ పల్లవి ॥

మనసార నే నీతో మాటలాదేనంటేను
వినేయందు నీకైతే వేళలేదు
పనివడి యప్పటిని పాదాలు గుద్దేనంటేను
యెనసి కొలువేగాని యేకాంతము లేదు ॥ నివ్వె ॥

సారెసారె నీతోను సరసమాడేనంటే
కోరి నీవలపులకు గురిలేదు
గారవించి నిన్ను నంటి కళలురేఁచేనంటే
యీరీతినైన నీకు ఇంపులేదు ॥ నివ్వె ॥

గక్కన నిన్నుఁ గదిసి కాఁగిట బిగినేనంటే
తక్కరితనాన నీకు తనివిలేదు
అక్కరై శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
యెక్కువతక్కువ లెంచ యీరసము లేదు ॥ నివ్వె ॥ 257

దేసాళం

పోపో యెక్కడిసుద్ది పొద్దువోదా అయ్యా నీకు
యీపనులు మీకెకాక యిది మాకుఁ దగవా ॥పల్లవి॥

ఆకెతోడ నీవు నన్ను నాడుమన్నమాఁటలెల్ల
యేకతానఁ జెప్పఁబోతే యెట్టుండును
ఆకడనుఁ దనసరియాఁటదానిఁ బేరుకొంటే
యీకడ నీపెకు నేఁడు యితవయ్యీనా ॥పోపో॥

వువిదకు నీవంపినవుంగరాలు నే నిపుడు
ఇవలఁ జేతికియ్యఁగ యేమనునో
అవల నొకతెపాదాలందున్నమెట్టెలిచ్చితే
సవతులైనవారు యీజాడల కోరుతురా ॥పోపో॥

ఇంతిఁ బిలువుమనఁగా యీడకు రప్పించితిని
యింతలో గూడె ఇంకెంత యెగ్గువట్టునో
వింతగా శ్రీవేంకటేశ వేరొకతెయింటిలోన
బంతి యీపె వెట్టితే యీపనికి సహించునా ॥పోపో॥ 258

రేకు 1344 శుద్ధవసంతం

గెలువరాదు నీమాయ కేరడము లేమాదేము
కలిమి నింతటనైనఁ గరుణించవయ్యా ॥పల్లవి॥

చెలితోఁ జుట్టమువలె సేసితివి మేలుమేలు
వెలలేనిజాగారాలే వేగినంతాను
పలుమారు సుద్దులనే భ్రమలఁబెట్టితి విట్టె
కలలోనికూటములే కలిగినంతాను ॥గెలు॥

అనుక నిజమువలె నాడితివి మేలుమేలు
మాననిజోలిమాటలే మాపుదాఁకాను
సానఁబట్టి యాసలనే సంతోసాలు రేఁచితివి
వీనులపండుగలే విన్నంతాను ॥ గెలు ॥

పాడితివి పాటవలె బాసలే మేలుమేలు
యేడలేని వొడఁబా ట్లిందాఁకాను
వీడెమిచ్చి కూడితి శ్రీవేంకటేశ యీసతివి
వాడికవలపులే వలసినంతాను ॥ గెలు ॥ 259

## మధ్యమావతి

తనకంటె నేరుతుము తరవాతిపనులకు
చెనకెఁ జిగురుఁగొమ్మ చేఁగయయ్యీ ననరే ॥ పల్లవి ॥

చెప్పఁబోతే నెన్నియైనా చిగిరించీ మాటలు
వొప్పుగ మోనముతోడ నుండుమనవే
అప్పటనుండి వింటి నవె చాలు నేమన్నా
పిప్పిగట్టీ నీరుదియ్యఁ బేనువచ్చీ ననవే ॥ తన ॥

చేరి పెంచఁబోతేను చెంగలించీ నగవులు
వోరుచుక గుట్టునేసుకుండుమనవే
ఆరితేర కనుఁగొంటి నవె చాలు నిఁకమీఁద
గోరగిరితే మఱి గొప్పయేరా ననవే ॥ తన ॥

వొత్తి కాఁగిలించుకొంటే వూరీని చెమటలు
వుత్తలపడక కొంత వుండుమనవే
ఇత్తల శ్రీవేంకటేశుఁ డిట్టె తా నన్నుఁ గూడె
కొత్తమొలకచన్నులే కొండలాయ ననవే ॥ తన ॥ 260

ధన్నాసి

బడలె నీమేనెల్ల పవ్వళింతువు రావయ్య
తడయక నాకు చాలు తలగడబిల్లలు ॥ పల్లవి ॥

ఇంత పొద్దువోయి వచ్చే వేడనుంటి విందాఁకా
యెంతమాటలఁ బెట్టుక యెవ్వతుండెనో
పంతపుఁబందేలకు పగడసా లాడితివో
సంతజాణతనములు సతులెల్ల నాడిరో ॥ బడ ॥

తడఁబడి మాటాడేవు తలఁ పెక్కుడిపరాకో
బడిఁబెట్టు కెవ్వతైనా పనిగొనెనో
వెడయాసల నెఁ(నెం?)దైనా వేడుకకాఁడవైతివో
వడివెట్టి వాడవారు వలపులు చల్లిరో ॥ బడ ॥

నన్నుఁ గాఁగిలించి కూడి నలుదిక్కులు చూచేవు
సన్నల నెవ్వతైనా పంచకు వచ్చెనో
యిన్నిటా శ్రీవేంకటేశ యేమి సరసమాడేవో
కన్నవారెల్లా నీకీకందువ నేరిపిరో ॥ బడ ॥ 261

వరాళి

ఇద్దరము నున్నారము యెందువొయ్యేము
తిద్దుపడ్డననుపులే తెమలించీఁగాక ॥ పల్లవి ॥

సారెసారె నీతోను చలము సాదించనేల
కూరిములే కలిగితే కూరిచీఁగాక
కారములుగా నిన్ను [1]గంటెసాలాడఁగనేల
పేరడై తేఁ దమకము పెడరేఁచీఁగాక ॥ ఇద్ద ॥

---

1. 'గెంటనము౦'కు, 'గంటెసాటు' వ్యావహారికరూపము గాబోలు. ఇది యతి స్థానము గూడ; తిద్దుట లోగనిది.

పొలసిపొలసి విన్ను బొమ్మల జంకించనేల
చిలుకుఁజూపులే పెండ్లి సేసీఁగాక
పులివచ్చిచెనకుల నొత్తడిపెట్టఁగనేల
తలఁగరావిమర్మాలే తలఁపించీఁగాక ॥ ఇద్ద ॥

పెనఁగిపెనఁగి మేను బెండుపరచఁగనేల
చనుమొనలే నిన్ను నెచ్చరించీఁగాక
యెనసితివి శ్రీవేంకటేశుఁడ కొసరఁగనేల
తనివోనిమోవితేనె దప్పిదేర్చీఁగాక ॥ ఇద్ద ॥ 262

## హిందోళవసంతం

తక్కనవారికినేల తమక మమరు
వెక్కసపువారికివి వేడ్క లిదె యమరు ॥ పల్లవి ॥

చనవుగలవారికిని సరసమాడిన నమరు
నసుపుగలవారికివి నగవు లమరు
మనవిగలవారికిని మంతనంబులు నమరు
పనులుగలవారికిని పైకొనుట లమరు ॥ తక్క ॥

బలిమిగలవారికిని పంతమాడిన నమరు
వలపుగలవారికిని వాడికమరు
చలముగలవారికివి ఉంకెనలు కడు నమరు
తలఁపుగలవారికిని తగులాయ మమరు ॥ తక్క ॥

ఆసగలవారికిని అందనుండఁగ నమరు
వాసిగలవారికిని వన్నె లమరు
నేసతోఁ గూడితివి శ్రీవేంకటేశ నను
బాసగలవారికివి పనులెల్ల నమరు ॥ తక్క ॥ 263

తెలుఁగుఁగాంబోది

చేయెత్తి మొక్కితి చెక్కునొక్కితివి
ఆయెడ నీకెంత ఆసోదమో ॥ పల్లవి ॥

కప్పుర మిచ్చితి కాఁకలు చల్లితి
ముప్పిరిఁ జన్నులు మోపితిని
చెప్పర న న్నేమిసేయుమనే విఁక
అప్పటి నీకెంత ఆసోదమో ॥ చేయె ॥

మొగము చూపితిని ముచ్చటలాడితి
నిగిడి మోవితేనె యిచ్చితి
పగటులేలరా పచరించే విఁక
ఆగపడేవు యెంత ఆసోదమో ॥ చేయె ॥

కందువ చూపితి కాఁగిటఁ గూడితి
సందడి నీమేలు చవిగొంటి
చిందకురా సిగ్గు శ్రీవేంకటేశ్వర
అందరిలో నెంత యాసోదమో ॥ చేయె ॥ 264

రేకు 1345 శంకరాభరణం

ఇంటికి విచ్చేసె నీతఁ డిదె
జంటయియున్నాఁడు జంకింతురటవే ॥ పల్లవి ॥

తలఁచినతలఁపులు తలకూడె మరి
పలికినపలుకులు ప(ఫ?)లియించె
మలసి విభునిమేయి మచ్చము లుండినా
అలుగుదురటవే అంతటిపనికి ॥ ఇంటి ॥

విడువనివేడుకలు విరివాయ మరి
[1]గుడిగాను కూటమి కొనసాగె
యెడనెడ నాతఁడు యెవ్వతెఁ జూచిన
తడవుదురటవే దక్కినపనికి ॥ఇంటి॥

చేసినచేఁతలు చెల్లెను నీకిఁక
దాసినపెండ్లి తగులాయ
ఆసల శ్రీవేంకటాధిపుఁడు రతి-
సేసె నలతురటె చేకొన్నపనికి ॥ఇంటి॥ 265

### దేవగాంధారి

మెచ్చితి మప్పుడే నీకు మిక్కిలి మోహించితిమి
హెచ్చె నీసింగారాలు యెక్కడ చూచినను ॥పల్లవి॥

అరిదిచెక్కులమీఁది యంగనకస్తూరిపూఁత
కరఁగి నీచెంపలపై కారివుండఁగా
దొరతనాలు నేసేవు తొయ్యలులలోననెల్లా
యిరవాయ నీయెమ్మె యేమిచెప్పేది ॥మెచ్చి॥

కోమలిగుబ్బలమీఁదికుంకుమగందపుఁబూఁత
ఆముకొని నీవురాన నంటివుండఁగా
సాముసేసేవానివలె సతులకుఁ జూపేవు
నే మెఱఁగమా నీవు నెరజాణవౌట ॥మెచ్చి॥

పొలఁతిమైనలఁదినపొడికప్పురపుపూఁత
నెలకొని రతివేళ నీపై నంటఁగా
కొలువులో మాకుఁ జూపి కూడితివి మమ్మిందరి
తలఁచమా శ్రీవేంకటోత్తమ నీమహిమలు ॥మెచ్చి॥ 266

1. 'గుటి'కి 'గుడి' రూపాంతరమా? 'గుడిగాను'కు బదులు 'గుడిగొను' రూపము గూడ ఈవాఙ్మయమున పలుతావుల కలదు.

ఆహిరి

మన్నించవయ్య యిఁక మగువను
సన్నలనే మాకుఁ జెప్పి సంతము సేయుమని ॥ పల్లవి ॥

పయ్యదచెమటఁ దోఁగి బయటఁబడెఁ జన్నులు
ముయ్యేఁ(య్యఁ?)జొచ్చె సిగ్గువడి ముంజేతులను
కొయ్యతనాన నంతలో గోర గీరేవు చెక్కులు
ఇయ్యెడఁ దప్పించుకొనే వెంకుకొను చెలియ ॥ మన్నిం ॥

పూరుపుగాలికి చీర వొడిసి తొడ గాన్పించె
అరసి సిగ్గున మూసీ నరచేతుల
కేరడాన నంతలో గిలిగించేవు సందులు
యీరీతిఁ దప్పించుకొని [1]యెన్నికొఁ జెలియ ॥ మన్నిం ॥

పులకల నిబ్బరాన పోఁకముడి వీడెను
కులికి సిగ్గునఁ బట్టె కొవచేతుల
అలరి శ్రీవేఁకటేశ అంతలోనె కూడితివి
యెలమి నవ్వులు నవ్వె యేమిటికొఁ జ(జె?)లియ ॥మన్నిం॥267

వసంతవరాళి

ఇన్నిటా సంతోసించితి ఇదివో నేను
యెన్నఁగ నీవెఱఁగని వేమున్న విఁకను ॥ పల్లవి ॥

చెప్పకతొలుతే నీవు చేరి వింటి వామాట
విప్పుచు నేనిఁక విన్నవించేదేమి
అప్పుడే అందుకుఁగాదా అంగమెల్లఁ జెమరించె
కప్పిన నీవలపెల్లా కంటిని నేను ॥ ఇన్ని ॥

1. "ఎన్నిటికి" బదులు "ఎన్నికి" రూపము కాబోలు.

సేయకతొలుతే నీవు చేకొంటివి పూడిగము
కాయకముగా నేను కావించేదేమి
నీయందు నందుకేకాదా నిండె మోమునఁ గళలు
ఆయెడ నీపనులెల్లా అవునంటి నేను ॥ ఇన్ని ॥

కూడకతొలుతే నీవే కూడితివి కాఁగిటను
వోడక శ్రీవేంకటేశ వొరసేదేమి
యీడ నీ విందుకేకా ఇటు మేను చొక్కితివి
జాడతోడ నీమతికి సమ్మతైతి నేను ॥ ఇన్ని ॥ 268

సామంతం

ఏమి చెప్పేది నీసుద్దు లెంత లేదు
దామెన గట్టేవు బొంకు తారుమారుగాను ॥ పల్లవి ॥

చెప్పరాదు చూపరాదు సేసిననీచేఁతలైతే
అప్పటి బాసలు సేసే వందరిలోన
దుప్పటికొంగైతేను తొగరద్దినట్టున్నది
కుప్పళించేవు పంతాలు గుఱుతులుగాను ॥ ఏమి ॥

పట్టరాదు ముట్టరాదు పచ్చియైననీమేనైతే
పెట్టుకొనేవు ఆనలు పెద్దెఱఁగున
పట్టెమంచమయితేను పదనుగారుచున్నది
దిట్టకూళతనములు దిగుపారించేవు ॥ ఏమి ॥

వినరాదు అనరాదు వీనుల నీగుణములు
పొనరించేవు సాకిరు లోకటొకచే
చెనకి శ్రీవేంకటేశ చెక్కులైతేఁ జెమటూరీ
యెనసితివి ఆసోదా లింకా నాపైఁ జల్లేవు ॥ ఏమి ॥ 269

నాదరామక్రియ

ఏల పంతాలాడుకొనీ యెందాఁకాను
తాలి మెఱఁగము అట్టు తనకేలే ॥ పల్లవి ॥

సిగ్గువడేదానికేలే చెనకులు మరి
యెగ్గుపట్టేదానికేలే యేలాటాలు
అగ్గమైననను బోఁటి కందమౌఁగాక వట్టి-
తగ్గుమొగ్గ లెంచేటితనకేలే ॥ ఏల ॥

గుట్టుచూపేతనకేలే కొసరులు కడు
మట్టులేనితనకేలే మంతనములు
యిట్టె నావంటిదే యెఱుఁగుఁగాక
దట్టప్ప(పు?)గర్వము దిది తనకేలే ॥ ఏల ॥

కూడెఁ దొల్లె తనకేలే కొరతలు యిట్టె
వీడెమిచ్చేతనకేలే వేసాలు
యీడనె శ్రీవేంకటేశుఁ దేలె నన్ను
తాడుపొడవుగర్వము తనకేలే ॥ ఏల ॥ 270

రేకు 1846 ముఖారి

ఔనయ్య మంచివాఁడ వౌదువు నీవు
కానుకవట్టినమొక్కుఁ గాదెంఁ బోతురా ॥ పల్లవి ॥

పేరఁ బిల్చితే వచ్చితివి పెనఁగనేల చెలితో
గోరగీరేపని కిఁక గొడ్డవేఁటికి
సారపుమోవితీపుతో సరిపెట్టేవు తేనెలు
యేరు గుడిచి కాలువ యింత పొగడుదురా ॥ ఔన ॥

ఆసపడి చూడఁగానే ఆడించేవు యెదమాట
చేసన్నవచ్చేపనికి చెట్ట యేఁటికి
యీసతిఁ జూచి యెవ్వతో ఇటులావున్నదనేవు
పూసినగంధపుపూఁత పుప్పొడిఁ బోలుతురా ॥ ఔన ॥

నగినమాటలలోన నలుసులు వెదకేవు
తగులాటాలైనమీఁద తగవేఁటికి
జిగిమీరి కూడితివి శ్రీవేంకటేశ ఇంతిని
చిగిరించితే మరి చెట్టుగట్టకుండునా ॥ ఔను ॥ 271

రామక్రియ

ఏమాయ వింతలోనే యెగ్గులేల పట్టేవు
సాము సేయఁగా నూరుపు చల్లరాదా నేను ॥ పల్లవి ॥

యెగసక్కెలంటాను యేల నన్నుఁ దిట్టేవు
నగరాదా వూరకైన నాలోనను
వొగరాయనంటాను వురము దట్టుకొనేవు
మొగము నీవు చూచితే మొక్కరాదా నీకు ॥ ఏమా ॥

తివిరి కోపించెనంటా తెరవలతోఁ జెప్పేవు
చెమరించరాదా నాచెక్కులమీఁద
భ్రమసి నీకునీవే పంతములే నెరపేవు
సముకానఁ గానుక వొసఁగరాదా నీకు ॥ ఏమా ॥

అయ్యెడ సిగ్గువడితినంటానే కొసరేవు
ముయ్యరాదా చన్నులు నామునిగొంగున
నెయ్యపుశ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
చెయ్యంటఁగ విచ్చకము సేయరాదా నీకు ॥ ఏమా ॥ 272

బౌళి

పిలిచిన నెఱఁగవు ప్రేమపుఁబడాతున
చెలరేఁగి ఆదేవు చెల్లునయ్య ఇఁకను ॥ పల్లవి ॥

చొక్కపుఇంతిగుబ్బలే జూజపుసారెలు నీకు
విక్కినమంచిపురమే [1] నెత్తవలక
అక్కడిగోరిరేకలే అమర వ్రాసినయిండ్లు
చిక్కించు కాటలాదేవు చెల్లునయ్య యిఁకను ॥ పిలి ॥

మదనమందిరమే మచ్చికపులిజూజము
వుదుటుమొగపువ్రా లొడ్డినరాళ్లు
మొదలైనరతులెల్ల మూలదాంట్లు నీకు
చెదరవిఆటాదేవు చెల్లునయ్య యిఁకను ॥ పిలి ॥

పొలసి ముట్టి ముట్టాదేపోఁకముడి గుంతపోఁక
కొలఁదైననాభే యిక్కువైనగుంత
వెలయ శ్రీవేంకటేశ వెసఁ గూడి సారెసారె
చెలరేఁగి ఆదేవు చెల్లునయ్య యిఁకను ॥ పిలి ॥ 273

సౌరాష్ట్రం

ఎంత నిజమరివి నిన్నేమిచెప్పేది
బంతినే నోరూరించేబాగు లింతేకాక ॥ పల్లవి ॥

నెలఁతపై బత్తిగలితే నిన్న రాకవుందువా
పెలుచవై కన్నప్పటిబేఁటమేకాక
తలఁపులో నుండితేను తమకించకుందువా
పలికి కొసరేవేళ పచారాలేకాక ॥ ఎంత ॥

1. నెత్త+పలక.

చేరి కూడ వేడుకైతే సిగ్గులువడుదువా
పూరట నరసాలాదేవుళ్ళులుగాక
నారుకొన్నపనులైతే నవ్వులు నవ్వుదువా
పోరచి చుట్టరికాలపొందు లింతేకాక ॥ ఎంత ॥

ఆయములు గరఁగితే నండఁ బవ్వళింతువా
కాయకపుప్రియముల గచ్చులుగాక
యీయెడ శ్రీవేంకటేశ యింతలో నేలితి వీకె
చాయమరుఁదు పుట్టించేచవు లింతేకాక ॥ ఎంత ॥ 274

సింధురామక్రియ

నాటకాలు బూటకాలు నాతోనే వలెనా
నీటుతోడ నీసుద్దులు నే నెఱఁగనా ॥ పల్లవి ॥

తళుకున నాపెఁజూచి తలవంచుకొంటివివి[1]
వలన నాసపడనివానివలెనె
తలఁపులో నారూపు తలపోసి తలపోసి
నెలకొని కరఁగేది నే నెఱఁగనా ॥ నాట ॥

ఆకెమాట చెవుల విననట్టె మారుమాటాడవు
వాకు నా కొప్పగించినవానివలెనె
చేకొని యీపరాకున సిగ్గులమాట లూహించి
నీకునీకె సుకించేది నే నెఱఁగనా ॥ నాట ॥

నీమీఁద నాపె చేచాఁచ నీవు నాపైఁ జేచాఁచేవు
వాములుగా నన్నుఁ గూడేవానివలెనే
యీామై శ్రీవేంకటేశ యేలితివి నన్ను విట్టె
నీమన సాద నుండుట నే నెఱఁగనా ॥ నాట ॥ 275

1. ఈ 'వి'వర్ణ మెక్కువగదా? 'తలవంచుకొంటివి వీ-వలన' అని విరిస్తే అర్థ మంత సంగతమా ?

కేదారగౌళ

అడుగరే యీసుద్ది యౌనో కాదో
పడఁతులాల తనభావము దెలియను ॥ పల్లవి ॥

యెంతకు నంతేకాని యెక్కుడుబాఁతౌనటే
పంతాన ళాఁ బిలిచితేఁ బలికితిని
అంతలోనె సొలయుచు నప్పటినిఁ గొసరీని
వింతదాననా తనవిధము దెలియనా ॥ అడు ॥

కలది కలట్టేకాక కపటము నిజమటే
అలరి ఏడెమిచ్చితే నందుకొంటిని
బలిమిఁ బైకొననంటా పలుమారు దూరీని
సిలుగుదాననా తనచిత్తము దెలియనా ॥ అడు ॥

యెప్పటికప్పుడేకాక యిఁక సంగతౌనటే
మెప్పిరిఁ దాఁ జూచితేను మొక్కితిని
యిప్పుడె శ్రీవేంకటేశుఁ డెనసియు నాసపడీ
తప్పించేదాననా తగవు దెలియనా ॥ అడు ॥ 276

రేకు 1347 మేఘరంజి

అతనిమనసు నేనే అన్నిటా నెఱుఁగుదును
ఘాత లెంతచూపినా కరఁగ దెంతైనా ॥ పల్లవి ॥

చెలులాల మీరు బుద్దిచెప్పకురే పతికిని
వలపు వద్దనఁబోతే వడిఁబడును
తలఁచుక మాఇంటికి తనయంతనే రానీ
తెలుపఁబోతే మంకు దేర దెంతైనా ॥ అత ॥

చేయివట్టి తియ్యకురే చెలరేఁగి రమణుని
చాయ కొత్తితే గుణము చందిపడును
పాయక తానే వుండీఁ బట్టినచలమైతేను
పాయపుమదము మట్టుపడదు యెంతైనా ॥ అత ॥

అవిశము పైపైని ఆనలెల్లఁ బెట్టకురే
పెనఁగితే ప్రియములు పిప్పిగట్టును
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోఁ దానె నన్ను
వెనకటిపొందు యిఁక వింతగా దెంతైనా ॥ అత ॥ 277

ముఖారి

ఎమ్మెలు సేయఁగనేలే యేలుఁగాక
చిమ్ముగోరితాఁకులేలే చేకొనుఁగాక ॥ పల్లవి ॥

కన్నుల నవ్వినవాఁడు కాఁకలుసేయఁగనేలే
వన్నెతోనే మాయింటికి వచ్చుఁగాక
సన్నలుసేసినవాఁడు చలము సాదించనేలే
మన్నించి నాతోను మాటాడుఁగాక ॥ ఎమ్మె ॥

తప్పకచూచినవాఁడు తవివోనిజాగులేలే
కప్పురము నోటికిచ్చి కలయుఁగాక
కొప్పువట్టినట్టివాఁడు గుట్టుసేసుకుండనేలే
కప్పినపయ్యెద దీసి కాఁగిలించుఁగాక ॥ ఎమ్మె ॥

చెలిమిసేసినవాఁడు సిగ్గులువడఁగనేలే
సొలసి రతుల చవి చూచుఁగాక
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
వొలసినమోవితేనె లొసఁగుఁగాక ॥ ఎమ్మె ॥ 278

కురంజి

మానవుని వోజలు మరి యెవ్వరు చెప్పినా
నానఁబెట్టి యేతులు నడపేవుగాని ॥ పల్లవి ॥

నయగారితనమున నాలి నీమాటలకేల
ప్రియమంది మోహించి బేలనైతిని
క్రియ యెఱఁగక నీవు కిమ్ములవారిఁ దెచ్చి
బయలీఁదింపుచు మముఁ బఱచేవుగాని ॥ మాన ॥

మతకారిసరసపుమచ్చిక నీమాయకే
ఇతవుగాఁ బైకొని యెడ్డనైతిని
చతురతలేక నీవు సరిగా నెవ్వతోఁ దెచ్చి
కుతిలపెట్టి గోరాదిగానేవుగాక ॥ మాన ॥

సటకారి నీమోవిచాయలనవ్వులకే
తటుకున నినుఁగూడి దంటనైతిని
నటన శ్రీవేంకటనాయక నీవాకెఁ దెచ్చి
కిటుకుదీర మొక్కించి కేరించేవుగాని ॥ మాన ॥ 279

సామంతం

ఎందున్నవి నీనిజాలు యేమాయ నేఁడు
ముందుముందే నీకప్పటి మూరెఁడునోరు ॥ పల్లవి ॥

యెవ్వతెమాటలో కాని ఇప్పుడిట్టె వినవచ్చె
నివ్వటిల్లఁ బవళించె నీఇంటిలోన
దివ్వెవెలుఁగున నీడ దిష్టముగఁ గానవచ్చె
వువ్విళ్లూర నాకె వలచున్నాఁడ నందుపు ॥ ఎందు ॥

యెటువంటిదో కాని ఇదె వాసనలు వచ్చె
మటమాయదోమతెరమంచములోన
గటనఁ బన్నీ రందుండి కాలువలుగట్టి వచ్చె
ఇటు నాకెవయసు మీఁదెత్తితి నే నందువు ॥ ఎందు ॥

యెంతనేరుపరో కాని యెదురుగఁ దానె వచ్చె
సంతైననీయురముపచ్చడములోన
ఇంతలోనె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పొంత నీయేకాంతము యెప్పుడు దాఁచనందవు ॥ ఎందు ॥ 280

బౌళి

ఏమి నవ్వులు నవ్వేవు యెందాఁకా సరసము
తేమచెమటలు నిండె తెరవేయవయ్యా ॥ పల్లవి ॥

కోమలిని రమ్మంటా కొంగు నీవు వట్టితేను
మోము చూడఁగానే పోఁకముడి వీడెను
చేమంచి చేతఁబట్టి(ట్ట?)సిగ్గువడె నంతలోనే
కామించి నీపచ్చడము గప్పరాదా యిపుడు ॥ ఏమి ॥

పెనఁగి చుట్టరికాన ప్రియము నీవు చెప్పఁగా-
ననువుగ నప్పటి పయ్యద జారెను
వొనర వేరొకచేత నొగిఁ బట్టి సిగ్గువడీ
తనివోవివేడుకతో తలుపు మూయరాదా ॥ ఏమి ॥

చేయిచాఁచి రతికివి సేస నీవు వెట్టఁగాను
ఆయెదఁ జెంపపై తురు మటు జారెను
పాయక శ్రీవేంకటేశ పట్టరాక సిగ్గువడీ
యీయెదఁ గాఁగిటఁ గూడి ఇట్టె వుండు మిఁకను ॥ఏమి॥ 281

ఆహిరి

చాలుఁజాలు నిఁకనేల జాలిఁబెట్టేవు
యేలాటాలు యేనుగతో నింత నేరఁగలమా ॥ పల్లవి ॥

తగవులే నడపేవు తారుకాణకే వచ్చేవు
జగడము సాదించితే సారె నవ్వేవు
మొగము చూచితేను ముంచి యానలు వెట్టేవు
యెగసక్కెఁడవు నీతో నింత నేరఁగలమా ॥ చాలుఁ ॥

తేరకొనఁ జూచేవు తేనె లుట్టిపడించేవు
తారుచుఁ దిట్టితే జాణతనాలాడేవు
మారుమోపై వుండితేను మరియు వేఁడుకొనేవు
యీరీతివాఁడవు నీతో నింత నేరఁగలమా ॥ చాలుఁ ॥

కందువలే చూపేవు కాఁగిటనె కూడేవు
అంది వెంగెమాడితేను అట్టె మెచ్చేవు
ఇందరిలో శ్రీవేంకటేశుఁడ నన్నేలితివి
యిందరివాఁడవు నీతో నింత నేరఁగలమా ॥ చాలుఁ ॥ 282

రేకు 1348 శ్రీరాగం

పిలువవే ఇఁకనైనఁ బ్రియుఁ డితఁడే నీకు
పొలుపునఁ బాయరానిపొం దెంచవలదా ॥ పల్లవి ॥

అతిమోహములవారు అలుగఁగఁజెల్లునా
ఇతవుగ వేఁడుకొనే దింపౌఁగాక
ఇతరకాంతలకుఁగా నితనినేల కోపించ
పతి కిచ్చకములాదేపాడి యెంచవలదా ॥ పిలు ॥

చేతికిలోనైనవారు సిగ్గువడఁదగునా
కాతరానఁ బైకొంటే కందువగాక
దూతికపొందులకుఁగా దూరనేల రమణుని
నీతైనమొగనిసేవ నీ వెంచవలదా ॥ పిలు ॥

నేసవెట్టినవారికి చిరుముడి వొసఁగునా
వేసరనికూటములే వేడుకగాక
శ్రీసతివి గూడితివి శ్రీవేంకటేశ్వరుని
ఆస విన్నేలినవాని నట్టె మెచ్చవలదా ॥ పిలు ॥ 283

హిందోళం

[1] ఏపీ(దీ?) నీయందుఁ జూపు ఇందులో నొకటైన
ఆదిగొని విన్ను మెచ్చే నప్పుడే నేను ॥ పల్లవి ॥

తప్పక వలపులెల్ల తలకెక్కినప్పుడు
కప్పురమే నోటికి కారమై తోఁచు
వుప్పటిల్లుమదనాగ్ని వొడల రేఁగినపుడు
అప్పటి పన్నీరు వుడుకై తోఁచును ॥ ఏపీ ॥

కందువైనకాంతలు కన్నులఁదొట్టినప్పుడు
గంధమే బాసటమై కమ్ముకొనును
మందలించి తమకము మనసునిండినప్పుడు
విందుల నమృతమైనా వెగటై తోఁచును ॥ ఏపీ ॥

చిగిరింపుఁజింత చేయి చెక్కిట మోపినపుడు
మొగిఁ గొప్పువిరులెల్లా మొనలై నిక్కు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
నగిన నగవులెల్లా వనుపులై మించును ॥ ఏపీ ॥ 284

1. ప్రాసభంగము.

### ఆహిరి

ఆనతీవయ్యా నాకు నన్నియు వినేఁగాని
మోనముతో సిగ్గువడి మొక్కక వుందానను ॥ పల్లవి ॥

చెలులచే విన్నపముసేయింపించినమాటలు
తలఁగ కెప్పుడు నీచిత్తాన నున్నవా
వలపు రొమ్ములబంటి వాసులు యీఁతలబంటి
పలుకఁగ సిగ్గువడి భ్రమతో నుందానను ॥ ఆన ॥

కానుకగా నీకంపినకందువై నగుసుతులు
కానకమై బందారాన దాఁచివున్నవా
నానెను జవ్వనమెల్లా నవ్వులు మొలకలెత్తె
పూని యంట సిగ్గువడి పొంచుకవుందానను ॥ ఆన ॥

ఇంపులసన్నలనే యెచ్చరించినచేఁతలు
ముంపులై యిప్పుడు నీమోవి నున్నవా
వింపుల శ్రీవేంకటేశ నీమోవినే మరుముద్ర -
గుంపు నిన్నుఁగూడి సిగ్గు గుఱుతై వుందానను ॥ ఆన ॥ 285

### వేళావళి

నెరవాదిరమణుఁడ నీదే భాగ్యము
సారిమ నీకందరు పొక్కరైవున్నారు ॥ పల్లవి ॥

గరగరనియాఁటది గడుఁజేసూరై యుండితే
వరుసఁ గూడేటిమొగవానిభాగ్యము
ఇరవున యిటుగాక యెరవెరవై వుండితే
పరగ నందుకంటె పాపములేదు ॥ నెర ॥

చక్కనిరమణి రతిచవులు వుట్టించఁగాను
చొక్కమై కూడేటిసరసునిభాగ్యము
వెక్కసము యిటుగాక విరసాలు నెరపితే
పక్కన నందుకంటె పాపములేదు ॥ నెర ॥

పాయపుదానము నీపాదాలసేవ సేయఁగ
నీయందే మెచ్చఁగలిగె నీభాగ్యము
యీయెడ శ్రీవేంకటేశ యిటుగాక మరెవ్వరు
పాయమున్న నందుకంటె పాపములేదు ॥ నెర ॥ 286

భైరవి

నేరనివారము మాకు నేరుపవయ్య బుద్ధులు
మేరమీరి మాయంతనే మెప్పించఁగలమా ॥ పల్లవి ॥

వంతువాసులు వుట్టించి వనితల రప్పించి
సంతవలపులు రేఁచి జాజరాదేవు
బంతికూటివార మింతే పందేలువేసి నే మంత
దొంతులపొందులు చేసి తోడుచూపఁగలమా ॥ నేర ॥

వొక్కరికొక్కరు చూడ వొడివట్టి పెనఁగుచు
ఇక్కవచన్నులు ముట్టి జాజరాదేవు
ప్రక్కనుండేవార మింతే బలిమి నేసి నే మంత
పిక్కటెల్లేనీమోవి పిప్పి సేయఁగలమా ॥ నేర ॥

ఆయము లిందరి కంటి ఆసలెల్లాఁ బుట్టించి
చాయల సన్నలనే జాజరాదేవు
యీయెడ శ్రీవేంకటేశ ఇటు వన్ను నేలితివి
నోయగానఁ గొసరుచు నొలయఁగఁగలమా ॥ నేర ॥ 287

గౌళ

నే నెప్పుడు నెఱఁగుదు నీగుణాలు
కానీలే పనులకు తార్కాణలు గావలదా ॥ పల్లవి ॥

చేకొని చెమటలెల్లా చెక్కులనే కారఁగాను
ఆకెకు మోహించనంటా నానవెట్టేవు
నీకు నీబొంకులెల్లాను నిజమువలె నుండితే
వాకునఁ జూచినయట్టివారు మెచ్చవలదా ॥ నేనె ॥

మించిననిట్టూర్పులు ముక్కుకొన నుండఁగాను
అంచె నాకెఁ గూడనంటా నానవెట్టేవు
యెంచఁగ నీకపటాలు యియ్యకోలు నీకైతే
పొంచి పొరుగువారెల్లా పొగడఁగవలదా ॥ నేనె ॥

పోసరించి మేనిమీఁద పులకలు విందుండఁగా
ఆసపడ నాకెకంటా నానవెట్టేవు
రాసికెక్క శ్రీవేంకటరమణ నన్నేలితివి
నేసవెట్టినాకె కివి నెలవు గావలదా ॥ నేనె ॥ 288

రేకు 1349 దేసాళం

ఇంకనేల యీసుద్దు లెందాఁకాను
సంకె దీరె నన్నిటాను చలివానె నీకును ॥ పల్లవి ॥

పిలిచి పెక్కుసతుల పెండ్లియాడితివంటా
చలము సాదించేనా సారెసారెకు
తెలివిఁ జెక్కుల గోరు దీఇంచుకొంటివంటా
నెలకొన్న నిను నేఁడు నేరము లెంచేనా ॥ ఇంక ॥

తచ్చన కెవ్వతెచ్చీరో దట్టిగట్టుకొంటివంటా
మచ్చరించేనా నీతో మాటిమాటికి
మెచ్చుల కాపెసొమ్ములు మెడఁబెట్టుకొంటివంటా
తుచ్ఛములాడి నీపై దూరుగట్టేనా ॥ ఇంక ॥

ఆసపడి వాదవారి నట్టై చూచితివంటా
బాసగొనేనా నిన్నుఁ బలుమారును
సేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ నన్ను
చేసినసేఁతలకెల్ల సిగ్గువరచేనా ॥ ఇంక ॥ 289

వరాళి

ఇటమీఁద సతి విన్ను నేమి సేసునో
తటుకున మీఁదపెత్తు తలఁచుకో యిపుడు ॥ పల్లవి ॥

తెలువ కన్నుల నిద్రదేరేది మానిపేనఁటా
మఱి చన్నులు విసికి మలసితివి
జఱసి యందుకుఁగాను జంకించె ఆకెఁ(కె?) దిట్టితే
తఱి పూవులచెండునఁ దాఁకవేసె విదివో ॥ ఇట ॥

వవితయలఁతపరవశము మానిపేనంటా
కొనగోర చెక్కు చురుకున నూఁదితి
పెనచి యందుకు నాకె బిగియించి పట్టితేను
మొనసి యట్టై కప్రములు చల్లెవిదివో ॥ ఇట ॥

ఇంతి నిన్నుఁ గూడినచొక్కట్టై మానిపేనంటా
కాంతకెమ్మోవిమీఁద గంటిసేసితి
చెంత నందుకుఁగా నవ్వె శ్రీవేంకటేశ నిన్నాకె
పంతాన పన్నీరు పైపైఁ జల్లె విదివో ॥ ఇట ॥ 290

సాళంగం

కానవచ్చె నీగుణాలు కలవెల్లాను
నానవేసేవు పొందులు నవ్వుతానే యిపుడు ॥పల్లవి॥

నెట్టుకొన్న మోహమైతే నిన్న రాకవుందువా
వెట్టికిఁ గాఁగా నేఁడు విచ్చేసితివి
చుట్టమవైతే నీవు సుద్దులు చెప్పుదువా
బట్టబాయ లీఁదించేవు పనిలేనిపనికి ॥కాన॥

ఆయములు గరఁగితే నప్పుడే కూడవా
కాయకము గాఁగాను కాఁక చల్లేవు
చేయంకెకు వచ్చితేను సిగ్గులువడుదువా
మాయలెల్లాఁ జేసేవు మనసుపట్టలేక ॥కాన॥

వేడుక గలిగితేను విడెము చేతికియ్యవా
యీడుజాడ గాఁగాను యెమ్మె నేసేవు
పాడితో శ్రీవేంకటేశ పైకొని నన్నేలితివి
జోడుగూడ మన్నించేవు సొంపులెల్లా రేఁగను ॥కాన॥ 291

భైరవి

చాలదా నా కీభాగ్యము సతమాయను
కాలుదొక్కినప్పుడే కానిమ్మంటిఁగదవే ॥పల్లవి॥

మాఁటలు సారె నాడితే మందెమేళమయ్యీని
యేఁటికే గుట్టున నుందే దిది మేలే
చీకటి మాటికినేల చేరి యానలువెట్టీనే
చాటించి తొల్లె తనకు సతినైతిఁగదవే ॥చాల॥

చూపులు చూడఁజూడఁగ చులకఁదనములౌను
యేపున మాటున నుండు టిది మేలే
తోపునూకుడు సేసుక తొంగి యేల చూచీనే
వోపి తొల్లె సేసపెట్టి వుందానఁగదవే ॥ చాల ॥

నవ్వులు సారె నవ్వఁగ నసుపు మొగచాటయ్యీ
యవ్వలఁ గాఁగిట నించె నిది మేలే
రవ్వలేల సేసీనే రతి శ్రీవేంకటేశుఁడు
వువ్విళ్లూర దేవులనై వొప్పుగొంటిఁగదవే ॥ చాల ॥ 292

మాళవిశ్రీ

ఇట్టిపతితో వేసా లింకనేలే
చుట్టరికములే నీతోఁ జూచుకొనఁగదవే ॥ పల్లవి ॥

చెక్కులు నొక్కఁగాను చేయివట్టి తియ్యఁగాను
యెక్కుడుగాఁ బెనఁగేవు ఇది యేమే
యిక్కువ లంటఁగాను ఇయ్యకోళ్లు సేయఁగాను
మొక్కుమొక్కు కరఁగవు మంచి నీవదేమే ॥ ఇట్టి ॥

మంచిమాట లాడఁగాను మచ్చికలు చూపఁగాను
యెంచుకొనేవు నేరాలే ఇదియేమే
కంచపుమోవియ్యఁగాను కాఁగిలించుకొనఁగాను
ఇంచుకంత నవ్వు నవ్వి యెనయ విదేమే ॥ ఇట్టి ॥

పంతము లియ్యఁగాను బాసలెల్లఁ జేయఁగాను
యెంతైనాఁ గొసరేవు ఇదియేమే
వింతగా బుజ్జగించి శ్రీవేంకటేశుఁ డేలె విన్ను
దొంతిరతిఁ దనియవు తోడనే ఇదేమే ॥ ఇట్టి ॥ 293

లలిత

నీ వెఱఁగవా ఇంత నెరజాణవు
భావించి నవ్వంగానే పంతములాడు మరా ॥పల్లవి॥

చిత్తగించవమ్మా చెలి; నీవు చూచుదాఁకా
తత్తరించీ రమణుఁడు ;తలవంతురా
కొత్తలేఁటికమ్మా కొలువులోపల ;నీపై
బత్తితోడఁ బిలువఁగఁ బలుకకుందురా ॥నీవె॥

అందుకొనవమ్మా ఆతఁడు వీడెము చేత-
నందియ్యఁగాఁ జేకొనక అట్టె వుందురా
మందట లేలమ్మా మునసిచ్చి తనమోవి-
విందు నీకుఁ బెట్టఁగాను వీఁగుచు నుందుదురా ॥నీవె॥

మెచ్చు మెచ్చవమ్మా మేకొని శ్రీవేంకటేశుఁ-
డచ్చముగా నిన్నుఁ గూడె నలఇంతురా
తచ్చనేఁటికమ్మా తగినరతుల నీతో
మచ్చికలాడఁగాను మరపింతురా ॥నీవె॥294

రేకు 1350 శుద్ధవసంతం

ఎదురుబడి వలపు లిట్టుండవలదా
ముదురుఁబరువముతో మునుకొని నివిగో ॥పల్లవి॥

సిగ్గులనే తెర వేసి చిరునవ్వుఁదలఁబాలు
అగ్గలము నీపైఁ జల్లీ నతివ
వెగ్గళించి నీమై నవి చెమటముత్యాలై
దిగ్గన నలువంకల దిగుపారీ నవిగో ॥ఎదు॥

తీపుమోవి లిం(విం?)దువెటి తెలిగన్నులతేటల
చూపులవిదేలు వెటీ సుదతి
పైపై యవే నిమేనఁ బచ్చిపులకమోసులై
మోపులకొలఁదులతో ముంచుకొనీ నవిగో ॥ ఎదు ॥

కాఁగిటనే పీఁటవెట్టి కదురతుల వేడుకఁ
బాఁగుచునుఁ బెండ్లాడీ పడఁతి
చేఁగలై యవే శ్రీవేంకటేశ్వర
దాఁగనిమరుకళలై తమిరేఁచీ నవిగో ॥ ఎదు ॥ 295

మాళవిగౌళ

ఏమీ నవఁగఁజాల మింత నిన్ను
దీమసాన నీకునీవే తెలుసుటగాక ॥ పల్లవి ॥

కలికి వలచెనంటా కడల నాడుకొనేవు
నెలకొన్న నీమాఁటలు నీకే మెచ్చు
అలయింతురా మరి యంత సేసినవాఁడవు
నలఁగకుండాఁ బొందునదపుటగాక ॥ ఏమీ ॥

అప్పటి నవ్వు నవ్వేవు అందవాయదంటాను
నెప్పున నీచేఁతలు నీకే మెచ్చు
కొప్పువట్టి తీతురా గోమునఁ బెంచినవాఁడ-
వొప్పురతుల మెల్ల నే వోలార్చుటగాక ॥ ఏమీ ॥

సారె నిన్నుఁ గూడెనంటా సన్నలుసేసి చూపేవు
నేరుపు లిన్నియు నీవి నీకే మెచ్చు
జీరదీతురా యిట్టె శ్రీవేంకటమేలేవాఁడ-
వోరలేక యిచ్చకమై వుండుటగాక ॥ ఏమీ ॥ 296

బౌళి

ఉండనీవే తానెట్లనుండినాను నే నిమ్మ-
పండు గానుకిచ్చితేను పనులెల్లా నౌను ॥ పల్లవి ॥

యెఱుఁగనిపొందుల యెక్కడోవారికినైన
జఱుఁగుఁ బొ(బొం?)దైతేనే చవివుట్టును
మఱచి మమ్మదముతో మాఁకువలె నుండినాను
గుఱిగా గోరునోఁకితే కోరికలు రేఁగును ॥ ఉండ ॥

అగ్గలమై యించుక మోహములేనివారికైన
దగ్గరఁ గూచుండితేనే తమిరేఁగును
సిగ్గువడి తలవంచి చెక్కుచేతిలో నుండిన
వొగ్గి మాటలాడితేనే వొదఁబడు మనసు ॥ ఉండ ॥

అక్కజపువొట్లతో నలిగినవారికైన
చక్కఁజూచి నవ్వితేనే సమ్మతులౌను
యిక్కువెఱిఁగి శ్రీవేంకటేశుఁ డిటు నన్నుఁ గూడె
మొక్కిననామొక్కులెల్ల ముద్దులై తోఁచును ॥ ఉండ ॥ 297

రామక్రియ

ఇప్పుడుగా నీవు నాకు ఇచ్చకము సేసేవు
అప్పుడై తే నింతేసి అనువుకు వత్తువా ॥ పల్లవి ॥

చలము సాదించేవేళ సరసునితోడను
పలికినపలుకెల్ల పంతములౌను
యెలమి నీలాగెరిఁగి ఇందుకే వూరకుండితి
మలసి నీవంతలోనే మంచివాఁడవైతివి ॥ ఇప్ప ॥

---

క్రిగీత గంది చితమూరివది.

గోరబుసేసేటివేళ గోర గిరి యేపాటి -
సరసములాడినాను సాంతపులోను
ధరలో నీజాడెంగి తలవంచుక వుండితి
మరిగి నీవంతలోనే మంచివాండవైతివి ॥ ఇప్పు ॥

సిగ్గులువరచేవేళ శ్రీవేంకటేశ్వర నీ-
దగ్గరం గూచుండినాను తమకమౌను
వొగ్గి నీగుణ మెరింగి వొట్టుకై నిన్నుం గూడితి-
మగ్గపురతులవేళ మంచివాండ వైతివి ॥ ఇప్పు ॥ 298

నాదరామక్రియ

సేసపాలవారము చెల్లుబడి గలవి
తానువలె రతుల కిద్దరము నున్నారము ॥ పల్లవి ॥

మఱవదు మనసు మరి నీవాడినమాట
గుఱుతై మనసులో గుబ్బతిలీని
మఱి తెరమఱంగై తే మంచినయ్యా నన్నియును
తఱియైన పనో(ను?)ల కిద్దరము నున్నారము ॥ సేస ॥

పాయదు [1]నెం(నెం?)జెరివి పంతపు నిచేంతలకు
చేయంటినబిడ్డులె చిమ్మిరేంచీని
మూయికి మూయున్న దింతే మూసివాంచితి నీకు
దాయిదండై వేడుక కిద్దరము నున్నారము ॥ సేస ॥

పిదుపదు ఆసా కం(వం?)త నీకూటములకు
వుదివోసవలపులై వుమ్మగిలీని
చెదసిమేలైన దింతె శ్రీవేంకటేశ యెప్పుడు
తడయనిమొక్కుల కిద్దరము నున్నారము ॥ సేస ॥ 299

---

1. 'నెంటిలి' కి రూపాంతరమా? క్రీగీతలు గలవి చిలుమూరినవి.

సామంతం

నీకివి ప్రియములు నే నెఱుగుదును
జోకలాయ మెచ్చుము సతినయ్యా ॥ పల్లవి ॥

పొలపుఁజూపులలో బొమ్మలజంకెలు
సళుపుఁబ్రియములలో సాదింపులు
పలుసరసములలో పంతపుసణఁగులు
చెలి నెరపీ నదె చేకొనవయ్యా ॥ నీకి ॥

మక్కువపొంచులలో మందెమేళములు
మొక్కులలో గోరిమొన వాండ్లు
చొక్కుమాటలలో సొలపులకొసరులు
మిక్కిలి జరపీ మెఱఁగొనవయ్యా ॥ నీకి ॥

తఱితీపులలో తమకపుటాసలు
చిఱునవ్వులలో సిగ్గులును
నెఱితో శ్రీవేంకటనిలయ నిన్నెనసీ
మఱియు నాపె నను మన్నించవయ్యా ॥ నీకి ॥ 300

రేకు 1351 మంగళకౌసిక

తగవు తానే యెఱుఁగు తాఁ జేసినచేఁతకు
చిగురునవ్వులు రేఁచె చెక్కుచేతిచెలిని ॥ పల్లవి ॥

కొప్పు దువ్వుమనఁగదే కురులు గూడఁ జెలికి
ఇప్పుడే తాఁ బానుపుపై నింత సేసెను
దప్పికిఁ బన్నీరును తానె ఇమ్మనఁగదే
ముప్పిరిగా నలసించె మొక్కఁగానే చెలిని ॥ తగ ॥

పీదె మిమ్మనఁగదవే వెస నిచ్చకముగాను
యీడఁ దెరమఱఁగున నింత సేసెను
వాడువిడువ సురటి వడి విసరుమనవే
జోడై నిట్టూర్పులు రేఁచె చూడఁగానే చెలివి ॥ తగ ॥

గంద మిమ్మనఁగదవే కాఁగిట శ్రీవేంకటేశుఁ—
డిందుముఖిఁ జెమరింప నింత సేసెను
కందువాయ మోవికే కప్పుర మిమ్మనఁగదే
అంది కళలెల్లా రేఁచె నంటఁగానే చెలిని ॥ తగ ॥ 301

బౌళి

ఆతఁడుచేసినభాగ్య మది యెట్టిదో
చేతికి వచ్చినమేలై చెంతలనే నిలిచె ॥ పల్లవి ॥

చెలి నీవు పతితోడ నెలవి నవ్వినవ్వు
వెలయ నాతవిమతి వెన్నెలగాసె
నిలిచి కట్టెదురను నీవుండినభావము
తలకొన్న ముంగిటినిదా(ధా?)నమై నిలిచె ॥ ఆతఁ ॥

జాలకుండా రమణునిఁ జక్కఁగఁ జూచినచూపు
మీఁటి యాతనిమేనిపై మెఱుఁగులెక్కె
వేఱులేక నీవిప్పుడు వీడెమిచ్చినభావము
ఆఱడితో మదనుని అడపమై నిలిచె ॥ ఆతఁ ॥

తోడనే శ్రీవేంకటేశుతో నీవాడినమాటలు
జాడ నాతనిచెవులకు చవులు మించె
కూడితివి యింతలోనే కూరిమి నీరతి యిదె
పాడితో యింటిలోపలి బండారమై నిలిచె ॥ ఆతఁ ॥ 302

## పాడి

మందెమేళమై నీవు మన్నించరాఁగాను
యెందుకని విన్నవించే నీడ నుండేనయ్యా ॥ పల్లవి ॥

మంతనములాడఁగానే మరి దగ్గరవచ్చునా
ఇంతటనుండేదే మేలు ఇద్దరికిని
చెంతల నప్పటి నిన్ను చేఇ దాఁకించవచ్చునా
వింతలుగా నాకు నీవు పిడెమియ్యఁగాను ॥ మందె ॥

నవ్వులు మీరు నవ్వఁగా నడుము చొరవచ్చునా
వువ్విళ్లూర గుట్టుతోడ నుండుటే రీతి
జవ్వనమదముసోఁక చన్నులంటించవచ్చునా
పువ్వులు ముడువుమని పొందుసేయఁగాను ॥ మందె ॥

ఇట్టె మీరు గూడుండఁగ నెఱిఁగించుకోవచ్చునా
చుట్టుక మీవారమై మెచ్చుటే మేలు
రట్టుగా శ్రీవేంకటేశ ఇట్టె యాడుకోవచ్చునా
జట్టిగొనందుకు నీవు సన్నసేయఁగను ॥ మందె ॥ 303

## హిజ్జిజి

మానవచ్చునా నీవు మన్నించఁగా
సేనలుగా సేవలు సేసేమయ్యా ॥ పల్లవి ॥

పెనఁగఁగవచ్చునా ప్రియపడి నీవు రాఁగా
కినియఁగవచ్చునా కేలు చాఁగఁగ
అనుమానించవచ్చునా ఆయము నీవంటఁగాను
చెనకి నీచెప్పినట్లు సేసేమయ్యా ॥ మాన ॥

కసరఁగవచ్చునా కప్పురము నీవియ్యఁగ
 కొసరఁగవచ్చునా కూడేనవఁగ
 విసుగఁగవచ్చునా వేడుకతో మాటాడఁగ
 పసలుగా విన్నపై పాయకుండేమయ్యా ॥ మాన ॥

తలవంచవచ్చునా తిప్ప కిట్టె చూడఁగాను
 చలపట్టవచ్చునా చౌలు చూపఁగ
 యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్ను నేలితివి
 కలకాలమును నిన్నుఁ గడుమెచ్చేమయ్యా ॥ మాన ॥ 304

మధ్యమావతి

మాతో నేఁటికి నీవు మరిఁ బంతాలాడేవు
 ఆతలివారినే యిఁక నసరాదా నీవు ॥ పల్లవి ॥

పన్నుక నీచెక్కులపై పచ్చిచేఁతలతో వచ్చి
 నన్నుఁ దప్పకచూచేవు నగితివంటా
 యెన్నికమీరఁగ నేఁడు యింత సేసినఆపెను
 వన్నెలుగా నటు దూరవద్దా నీవు ॥ మాతో ॥

కుంకుమపూఁతచన్నులగుఱుతులతోనే వచ్చి
 సుంకుమోవఁ దిట్టేవు చూచితివంటా
 కంకిగా నిన్నింతారడిగాఁ జేసినాపెను
 వంకలొత్తి సాదించవద్దా నీవు ॥ మాతో ॥

పేరిచిననీమోవిపిడుచలతోనే వచ్చి
 మేరమీరి తిట్టేవు మెచ్చితినంటా
 యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్నాపెను
 వారించక బుద్దిచెప్పవద్దా నీవు ॥ మాతో ॥ 305

నాదరామక్రియ

ఎందాఁకా మంకుఁదన మింత గలదా
ఇందుచెప్ప నాతఁడు వేఁడుకపడీని ॥ పల్లవి ॥

చలపాదితనమేల సరసములాడఁగదె
అలరి వేఁడుకపడీ నాతఁ డందుకు
తలవంచుకుండనేల తప్పకచూడఁగదవె
నెలవున నీమొకమై నిలుచునాఁ(న్నాఁ?) డతఁడు ॥ ఎందాఁ ॥

పంతము లింతలోనేం పట్టఁగదవే విడెము
వింతగాఁ దమకించీని విభుఁ డిందుకు
చింతతో నుండఁగనేల చిమ్మిరేఁగి నవ్వఁగదె
చెంతనే కాచుకుండీ చెలఁగీ నతఁడు ॥ ఎందాఁ ॥

సిగ్గులువడఁగనేల చేకొని కూడఁగదవె
వెగ్గళించీ శ్రీవేంకటవిభుఁ డిందుకు
తగ్గనియాసోదమేలే తనిసి మెచ్చఁగదవే
విగ్గుల నిన్నేలి మేలు నిండించీ నతఁడు ॥ ఎందాఁ ॥ 306

రేకు 1352 వరాళి

వినఁగదవే చెలులవిన్నపము లిఁకనైన
మనసిచ్చి నీకాతఁడు మరిగినాఁ డిపుడు ॥ పల్లవి ॥

సిగ్గులకుఁ దుదయేది చేయి చాఁచఁగదవే
వొగ్గి విడిమిచ్చీ నాతఁ దొడిఁబెట్టుక
కగ్గివున్నదెల్లఁ దేరె కన్నుల మొక్కఁగదవే
అగ్గలమై నీకు నాతఁ డాసపడీ నిపుడు ॥ వినఁ ॥

గుట్టునేయ నెదయేది కొంగు వొడ్డఁగదవే
వొట్టి సొమ్ములిచ్చి నాకఁ దొడిఁబెట్టుక
చిట్టకములెల్ల మానె చెవియొగ్గఁగదవే
[1]అగ్గలమై(అట్టియగా?) నీకు నాతఁ డాసపడీ నిపుడు ॥ వినఁ ॥

తప్పించుకోఁ బనిలేదు కొప్పు వంచఁగదవే
వొప్పుగఁ బువ్వులు నించీ నొడిఁబెట్టుక
తప్పు లిన్నియునుఁ బాసె తగిలి మోవియ్యఁగదే
ఇప్పుట శ్రీవేంకటేశుఁ దేలె నిన్ను నిపుడు ॥ వినఁ ॥ 307

దేశాక్షి

ఏమేమి నీవు నేసినా నింపే నాకు
యీమేకులకు నే లోనే యిఁకనేల సిగ్గులు ॥ పల్లవి ॥

మూసీఁ దనచేత నోరు ముసిముసినవ్వు రాఁగా
నేసినచేఁత నీవే చెప్పుకొనఁగ
అసుద్దులు వినవేడుకయ్యీ నాపెచేత నాకు
యీసరిఁ గూచుండఁబెట్టు మిఁకనేల సిగ్గులు ॥ ఏమే ॥

విట్టదూపులనుఁ జూచీ విన్వెరగు గాఁగాను
నెట్టన నీవిఁజములు నెరపఁగాను
గట్టిగా నడిగేను విక్కము నాపెను నేను
యెట్టైనా దప్పించు నీ కిఁకనేల సిగ్గులు ॥ ఏమే ॥

మెచ్చీఁ దనవేలను మేనెల్లఁ గళలుబ్బఁగ
చెచ్చెర సన్న నేయఁగ శ్రీవేంకటేశ
తచ్చి నన్నేలితి విది తలపోసే నాపెతోడ
యిచ్చకములెల్లఁ జూపు మిఁకనేల సిగ్గులు ॥ ఏమే ॥ 308

1. ప్రాసభంగము.

మేచబౌళి

ఇందాఁకావలెఁ గాదు యిదేమి నీవు
సందుగొవి సారెసారె సరసమాడేవు ॥ పల్లవి ॥

నీమాట సరివచ్చెనో నీ వేమి దలఁచితివో
నామోము చూచి యిట్టె నవ్వు నవ్వేవు
కాముఁడు మరి యేసెనో కాంతలమాట వింటివో
గోమునఁ బెంచినచన్నుఁగొండ లంటేవు ॥ ఇందాఁ ॥

ఇచ్చకములు చూపేవో యెగసక్కెము చేసేవో
మచ్చికచేయుచు నాతో మాటలాడేవు
ముచ్చటాడెనో కీరాలు మోహము నీకుఁ బుట్టెనో
పచ్చితేనెమోవికి పైకొనేవు ॥ ఇందాఁ ॥

వన్నెలు చూపవలసో వాడికలు సేసేవో
కన్నులఁ దప్పకచూచి కాఁగిలించేవు
వెన్నెలచంద్రుఁ దేఁచెనో వేడుకో శ్రీవేంకటేశ
మన్ననరతులకె మచ్చు చల్లేవు ॥ ఇందాఁ ॥ 309

ఆహిరినాట

ఆయనాయ రావయ్య అంగనవద్దికి నేఁడు
పాయపునీదేవి యింత బాఁతిపడఁగాను ॥ పల్లవి ॥

మాటలెవ్వి లేవు మాపుదాఁకా నాడితేను
కూటమి నీమన్ననలే గుఱుతుగాక
నే(నేఁ?)టనె తప్పెనా నీనేరుపులే పచరించ
ఆఁటది నీవిరహాన నట్లుండఁగాను ॥ ఆయ ॥

నవ్వే లెన్ని లేవు ననుపులు జరపితే
యివ్వలఁ గరుణించుటే యెన్నికెగాక
రవ్వగా నిందువంకనా రాజసము నిలిపేది
జవ్వని నీయాసల లోఁగఁగాను ॥ ఆయ ॥

మొక్కు లెన్ని లేవు మోపులుగాఁ గట్టితేను
యిక్కువ పిట్టె కూడిన దెక్కుడుగాక
నిక్కము శ్రీవేంకటేశ నీజాడ లిట్లానా
చక్కనమ్మ నీపొందు సారెఁ జేయఁగాను ॥ ఆయ ॥ 310

శుద్ధవసంతం

ఏల తమకించేవు యింతలోఁ దప్పిన దేమి
ఆలికిఁ బంపునేసితే నందరును నవ్వరా ॥ పల్లవి ॥

పంతములాడినయాకె పలుకకుండీనా
రంతులఁ దిట్టినయాకె రాకుంతునా
యింతలోనె నీవు లోఁగి యేల ప్రియాలు చెప్పేవు
కాంతకుఁ గిందుపడితే కడవారు నవ్వరా ॥ ఏల ॥

మారుకొనివుండినాపె మాటలాడకుండీనా
బీరమాడినాపె ప్రేమ పెంచకుండీనా
ఆరీతి యిందుకునేల అట్టె కాఁతాళించేవు
కోరి సతికి బఁ(బం?)టైతే కొమ్మలెల్ల నవ్వరా ॥ ఏల ॥

అలుకదేరినయాపె అట్టె కూడకుండీనా
కలసె విన్నాపె ఇఁకఁ గాదనీనా
యెలమి శ్రీవేంకటేశ యిటె నన్ను నేలితివి
తొలుతాపెకు మొక్కితే దొడ్డవారు నవ్వరా ॥ ఏల ॥ 311

శ్రీరాగం

ఇప్పుడే నీరమణుఁడు యెనసీ విన్ను
చిప్పిలఁగ నప్పటివి నేదదేర్చవలెను ॥ పల్లవి ॥

నెలవంకచందురులు నీచన్నుపై నుండఁగ
పలుమారు విరహతాపములేలే
కలువరేకులు నీకన్నులై వుండఁగాను
చలిమందులవుపచారములేలే ॥ ఇప్ప ॥

మదనరేకలు నీకు మరి చెక్కుల నుండఁగా
అదన పువ్వుటమ్ముల కలుకనేలే
చెదరనికప్పురము నెలవుల నుండఁగాను
యెదుటనున్నకాఁకలు యేమినేసీనే ॥ ఇప్ప ॥

ముంచినచుక్కలు నీమోవిపై నిండివుండఁగా
యెంచి[1]పగలంటి విద్రిరించేవేలే
అంచెల శ్రీవేంకటేశుఁ డంతలోనే విన్నుఁ గూడె
ఇంచుకంతా చీఁకటి ఇఁకనేడదే ॥ ఇప్ప ॥ 312

రేకు 1353 సామంతం

నీచిత్తమే యెరుఁగు నెలఁతలలాగులెల్ల
యేచి నీమేన గురుతు లింత నించఁగలరా ॥ పల్లవి ॥

పంతములు నీతోను పలుమారు నాడఁగాను
యెంతటిదని చిత్తాన యెట్టుండునో
సంతలోకూటమువలె సతులెందరు గూడినా
వొంతనే నీశిరసున పూవై వుండఁగలరా ॥ నీచి ॥

---

1. పగలిపూట విద్రించుటయా ?

బీరములు నీముందర బెట్టుగాఁ జూపఁగాను
యేరీతుల నీచిత్త మెట్టుండునో
వూరఁగూటములవారు వొద్ద నెంత వుండినాను
యేరా నీవీఁపుమీఁద నెక్కివుండఁగలరా ॥ నీచి ॥

నవ్వులు నీపై నిట్టె నయమున గుప్పఁగాను
ఇవ్వల నీచిత్త మెట్టుండునో
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
యెవ్వరు నావలె వురమెక్కి వుండఁగలరా ॥ నీచి ॥ 313

నారాయణి

మచ్చికగలపతివి మంచిదయ్యాని
ఇచ్చకము సేసుకొని యెనయరాదా ॥ పల్లవి ॥

చిగురుమోవితోడిచెలి మాటలాడితేను
వొనరై వుండక వేరే వుప్పనుండునా
యెగసక్కెలంటానేల యెగ్గుపట్టేవు
సగమందుఁ బంచదార చల్లుకోరాదా ॥ మచ్చి ॥

వసమై కెందామరలవంటికనుచూపులు
దెసల నెఱ్ఱనుండక తెల్లనుండినా
యెసఁగి కోపమంటాను యేల దూరేవు
బొసఁగఁ గప్రము గొంత పొదుపుకోరాదా ॥ మచ్చి ॥

సరుస కొండలనంటినచన్నులకాఁగిలి నీకు
ధర గట్టుగాక మెత్తన అయ్యీనా
యిరవై శ్రీవేంకటేశ యేలితి వింతలోనె
వురమునఁ బూదండ లొత్తుకోరాదా ॥ మచ్చి ॥ 314

దేసాళం

మొకదాకిరిదానను మొదల నేను
వెకలివైతివి యిట్టె వెలయవయ్యా ॥ పల్లవి ॥

తేనెగారీ నీమాటల తేటలూరీ నీచూపులను
అనుకొని యేమవి ఆదే నిన్ను
నానుపుఁజెమటలను ననలైనపులకలు
సోనల నీమేన నివె చూచుకోవయ్యా ॥ మొక ॥

రసముబ్బీ నవ్వులను రాసివడీ మొక్కులను
దొసకులేమని దూరే నిన్ను
పసిమి మోముకళలు బచ్చనమైసులుతులు
సుసరాన నీకునివే చూచుకోవయ్యా ॥ మొక ॥

చిగిరించీ సిగ్గులను చిమ్మిరేఁగీ వేడుకల
తగవుల నేమని తడవే నిన్ను
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
సొగసులు నీకునివే చూచుకోవయ్యా ॥ మొక ॥ 315

మాళవిగౌళ

నీచలము నీకుఁ జెల్లె నేరుపులేల
చేచేత నీవంటఁగాను సిగ్గు లిఁకనేల ॥ పల్లవి ॥

మొగము చూచి నీకు మొక్కినయప్పుడే తొంటి-
జగడములెల్లఁ బాసె జంకింపులేల
చిగురుమోవి యెత్తి చేరి మాటాడినపుడె
పగయెల్లాఁ దీరె మరి పంతములేలా ॥ నీచ ॥

చనవుసేసుక నీసంగడిఁ గూచున్నప్పుడె
కినుకలిన్నియుఁ దీరె కేరడాలేల
చెనకి నీకు నేను సేవలు సేసినప్పుడె
వెనక కోపము దీరె వేఁడుకొననేలా ॥ నీచ ॥

కైవశమై విన్ను నేనుఁ గాఁగిలించుకొన్నప్పుడె
యేవలెల్లా ముగిసెను యెన్నికెలేల
శ్రీవేంకటేశ నీపై నేస నేఁ బెట్టినప్పుడె
చేవలు నిండె రతుల చిఱునవ్వులేలా ॥ నీచ ॥ 316

## సింధురామక్రియ

నే నిట్టె కొసరితేను నీ వెఱఁగేవా
కానుకలు చూపనేల కమ్మటి టీరములు ॥ పల్లవి ॥

చెంతలఁ గూడేయప్పుడే చెప్పేఁగాక బుద్ధి
పంతమాడనేల నీతో పలుమారును
మంతనమైనపుడే మహిమలు చూపేఁగాక
దొంతివెట్టనేల నీతో తోడనే గర్వములు ॥ నేని ॥

వీడెమిచ్చేయప్పుడే వేడుక సేసేఁగాక
పాడివెట్టనేల నీతో బలిమిసేసి
యీడుజోడైనప్పుడే యెరుకసేసేఁగాక
కూడఁగట్టనేల నీతో గుంపెనసొలపులు ॥ నేని ॥

నవ్వేయప్పుడే విన్ను నంటున మెచ్చేఁగాక
రవ్వసేయనేల విన్ను రచ్చలోనను
యివ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వువ్విళ్లూరించఁగనేల వొక్కపరే యాసలు ॥ నేని ॥ 317

తెలుఁగుఁగాంబోది

ఏల జోలిసేసేవు యెందాఁకాను
యీలీల నన్నివినోదా లింటిలోనే వున్నవి ॥ పల్లవి ॥

జలజాక్షి నవ్వులైతే చల్లు వెదలు
కలికితనములు పోఁకకుఁ బుట్టెఁడు
నిలువుఁజక్కఁదనము నిండుబండారు
కలిగె నీకు రావయ్య కందువల నిపుడు ॥ ఏల ॥

తరుణిపలుకులె తంగేడుజున్ను
బెరసేటివిన్నపము పెల్లిచెట్టు
అరుదైనవలపెల్లా నట్టెకొటారు
దొరకె నీకు రావయ్య తొడిఁబడ నిపుడు ॥ ఏల ॥

వనితకాఁగిటిరతి వాడనిపువ్వు
తనివోనిమోవి దొంతరబోనము
యెనసితివి శ్రీవేంకటేశ యీకెను
వొనగూడీ రావయ్య వొద్దికతో నిపుడు ॥ ఏల ॥ 318

రేకు 1354 రీతిగౌళ

చెలువుని కిచ్చకమే సేయఁగదవే
అలుగుదురా వట్టిఅలిగా నిపుడు ॥ పల్లవి ॥

పిలిచి తెచ్చినవేళ ప్రియము చెప్పఁగవలె
బలిమి చూపుదురా పతితోను
చెలిమిసేసేటివేళ చెక్కులు నొక్కఁగవలె
చలము సాదింతురా సంగతిగా దిపుడు ॥ చెలు ॥

నవ్వులు నవ్వేటివేళ నయము చూపఁగవలె
రవ్వలు సేయుదురా రమణునిని
పువ్వులుముడిచేవేళ పొందవు సేయఁగవలె
దువ్వుచునే గోరనూఁదుదురా ఇపుడు ॥ చెలు ॥

ఆసలఁ గూడేటివేళ అట్టె బుజ్జగించవలె
వేసరింతురా శ్రీవేంకటేశ్వరు
బాసలుగొనేటివేళ భ్రమయించఁగవలె
వాసు లెక్కించుక తలవంతురా ఇపుడు ॥ చెలు ॥ 319

వసంతవరాళి

వెలవక లోనికి విచ్చేయవయ్యా
యెలపరికము లాపె యేమిసేసీ నీఁకను ॥పల్లవి॥

నగినయందాఁకానే నాతులకినుకలు
మొగము చూచుదాఁకానే ముంగోపాలు
తగిలినదాఁకానే తలపోఁతలిన్నియును
యెగసక్కె లాపె నిన్ను యేలాడీ నీఁకను ॥ వెల ॥

వొద్దికి వచ్చుదాఁకానే వొట్లును సత్యములు
ముద్దుమాటాఁడుదాఁకానే మొఱఁగులెల్లా
చద్దిమో విచ్చుదాఁకానే సాదింపులన్నియును
ఇద్దెస మొక్కితే నాపె యేల తిట్టీ నీఁకను ॥ వెల ॥

పీడెమిచ్చుదాఁకానే వెక్కసములన్నియును
వాడికైనదాఁకానే వాసులెల్లాను
కూడితి యింతలోనే కూరిమి శ్రీవేంకటేశ
యీడనే వున్నాఁడ వాకె యేల దూరీ నీఁకను ॥ వెల ॥ 320

పాడి

నే నంతదాననా ఇంత నీవేకాక
తానకపునునుపులే తగులమి రేఁచును ॥ పల్లవి ॥

నేరిచిన నేరకున్న నీకా బాఁతి నేను
అరితేరినట్టినీయిల్లాలఁ గనక
యీరీతి నెంత మెచ్చేవు యిచ్చకురాలనంటా
సారపుమోహములన్నీఁ జవులు వుట్టించును ॥ నేనం ॥

యియ్యకున్న మారుకొన్న ఇంకా నీకే బాఁతి నేను
ఇయ్యెడ నీవూడిగపుటింతిఁ గనక
నెయ్యాన నెంతవేఁడుకొనేవు ఇతవరినంటా
యెయ్యెడ నీకరుణే ఇంపులు వుట్టించును ॥ నేనం ॥

ఆసపడ్డ నలసిన అట్టె నీకె బాఁతినేను
నేసవెట్టికూడినచెలిఁ గనక
యీసరి శ్రీవేంకటేశ యేలనవ్వే వంటినంటా
బాసతోడినీభోగమే పనికి రప్పించును ॥ నేనం ॥ 321

శ్రీరాగం

ఎదురుచూచీఁ జెలి యెఱుక నీకు లేదా
సదరాన రావయ్య చలపట్ట కిపుడు ॥ పల్లవి ॥

కలికిగుబ్బలనేటికమలపుమొగ్గలు
యెలమితో నీకు మీఁదెత్తుకున్నది
తలఁప మోవితేనె [1]తరివట్టుకున్నది
పిలువుమనె రావయ్య పెనఁగక ఇపుడు ॥ ఎదు ॥

1. తరివట్టుకున్నది=అవకాశము తారవిడువక కాచుకొనియున్నది కావచ్చు.

కడివోవిమాటలనేకప్పురపుఁబలుకులు
బడిబడిఁ గానుకగాఁ బట్టుకున్నది
వెడనవ్వుచిలుపాలుష్టవిందువెట్టె నమన్నది
వొడికాన రావయ్య వోసరించ కిపుడు ॥ ఎదు ॥

కలయుఁగాఁగిలనేటికమ్మనివులుపా నీకు
సొలయుచు సూదిదెగాఁ జూపుకున్నది
అలరి శ్రీవేంకటేశ అంతలోనె కూడితివి
నెలవుకొని రావయ్య నీయంతనే యిపుడు ॥ ఎదు ॥ 322

సామంతం

చెయ్యరావిచేఁతల వో చెన్నకేశ్వరా
[1]చేయం(చెయ్యం?)టేవు గండికోటచెన్నకేశ్వరా ॥ పల్లవి ॥

బగ్గవ నీవు నాపయ్యద వట్టి తియ్యఁగా
సిగ్గులువడఁగరాదా చెన్నకేశ్వరా
వొగ్గి యెవ్వతోమెట్టెలు వొట్టి నావేలఁ బెట్టఁగ
యెగ్గులువట్టఁగరాదా ఇటు చెన్నకేశ్వరా ॥ చెయ్య ॥

సిరులతో నీవు నన్నుఁ జెనకులు చెనకఁగా
శిరసైన నూఁచరాదా చెన్నకేశ్వరా
తెరలోనఁ బెట్టుకొన్నతెరవను మొక్కించఁగ
వొరిమఁ దిట్టఁగరాదా వో చెన్నకేశ్వరా ॥ చెయ్య ॥

వేవేలుగా మన్నించి వేడుకపడఁగా నీకు
సేవలు నేయఁగరాదా చెన్నకేశ్వరా
యీవల శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
తావుకొని మెచ్చరాదా తగుచెన్నకేశ్వరా ॥ చెయ్య ॥ 323

1. ప్రాసభంగము.

సామవరాళి

ఏఁటి కొదఁబరపించే వింత నీ బోంట్లచే
పాటించితే నాఁటదానిపంత మేమున్నది ॥ పల్లవి ॥

చూపులకు లోనైతే సురతపుటాస పుట్టు
చేపట్లకు వచ్చితే సిగ్గులు వుట్టు
దాపుగా వద్దనుండితే తలపోఁతలోనఁ జిక్కు
పైపైనే ఆఁటదానిపంత మేమున్నది ॥ ఏఁటి ॥

మాటలకు లోనైతే మర్మములు గరఁగును
కూటువకతలకే గుఱుతులంటు
యీటుకు వచ్చితేనే యిరవౌను పనులెల్లా
పాటించితే నాఁటదానిపంత మేమున్నది ॥ ఏఁటి ॥

నగవుకు లోనైతే నంట్లు మిక్కుటమౌను
మొగమోట గలిగితే ముచ్చట దీరు
జిగిఁ గూడె విన్ను నీకె శ్రీవేంకటేశ్వర
పగటున నాఁటదానిపంత మేమున్నది ॥ ఏఁటి ॥ 324

రేకు 1355 ఆహిరి

ఇంకనేల దాఁచేవు యెఱిఁగినపనులకు
కంకియైననీమేననే కంటిమి నే మిపుడు ॥ పల్లవి ॥

మంతనాన నీవు నాకె మాటలాడుకొంటిరట
అంతలోఁ జూపులవే ట్లాడితిరట
పంతములన్నియు మీలోఁ బచరించుకొంటిరట
వింతలు మీసుద్దులెల్లా వింటిమి నే మిపుడు ॥ ఇంక ॥

నటనల నిద్దరును నవ్వులు నవ్వితిరట
గుటుకలు మోవులఁ జేకొంటిరట
తటుకన కిందటమీఁదట లాడితిరట
విటతనములు మీవి వింటిమి లే(నే?) మిపుడు ॥ ఇంక ॥

మొక్కుచును మీరు మోములు చూచుకొంటిరట
ఇక్కువరతులఁ గూడి యేలితిరట
గక్కన శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
వెక్కసపుమీలాగులు వింటిమి నే మిపుడు ॥ ఇంక ॥ 325

దేవగాంధారి

కానీవోయి అందుకేమి కడపరాయ
కానవచ్చె నీపనులు కడపరాయా ॥ పల్లవి ॥

కప్పురమియ్యఁగదోయి కడపరాయ
కప్పవోయి పచ్చడము కడపరాయ
కప్ప మివే మాచన్నులు కడపరాయ నీకు
కప్పులు మోవి నున్నవి కడపరాయ ॥ కానీ ॥

కాలు దాఁకించకు మంత కడపరాయ
గాలపుచూపులు మావి కడపరాయ
కాలమందె నీవారము కడపరాయ। మాలో
జైలాటాలు వెట్టకుమీ కడపరాయ ॥ కానీ ॥

కందులేవివలపులకడపరాయ
గందము మామేన నిదే కడపరాయ
కందర్పజనక వోకడపరాయ
కందువ శ్రీవేంకటాద్రి కడపరాయా ॥ కానీ ॥ 326

శంకరాభరణం

నెలఁతభాగ్య మిఁక నీచేతిది
తొలఁకీ సిరులు నీవు తొంగిచూచినపుడే ॥ పల్లవి ॥

తరుణికి నీవలపు దాకొన్నతలపోఁత
మరుగుటే నీమంచిమరులూ
తొరలినమోవులదోమటి పెనువిందు
విరతితో గుఱుతాయ నీవు ముట్టితేనే ॥ నెలఁ ॥

మగువకు నీతో నవ్వు మానరానితరితీపు
వగయెఱఁగనివిడువనిజోలి
తగువైనమంచితెల్లఁదామరపూవులపూఁజ
అగపడె నీ వీకె నాయమంటినపుడే ॥ నెలఁ ॥

సతికి నీకూటమి సారె నాగవల్లిపెండ్లి
మతకపురతులకు మానవిబిడ్డు
తతి శ్రీవేంకటేశ్వర దక్కినరత్నాలసొమ్ము
జితమాయ నీవిపుడు చేకొనేలినపుడే ॥ నెలఁ ॥ 327

బౌళి

ఎన్నెన్నిమేళ్లుగలవో యింకా నాపెవల్ల
సన్ననేసి యేకతాన జరయవయ్యా ॥ పల్లవి ॥

సంగడి జాణతనాలు సారెకు నాదీ నాపె
జంగిలివావులకుఁ జేచాఁచీ నీకాపె
గుంగిలి సరసముల గురులు సోఁకించీ నాపె
కొంగువట్టి నీవింకాఁ గొసరవయ్యా ॥ ఎన్నె ॥

బయలునవ్వులు మరిఁ బైపై నవ్వి నాపె
దయివారుఁజూపులఁ గాఁతాళించీ నాపె
నయగారివలపులు నానఁబెట్టీ నీపై నాపె
ప్రియమునఁ జెక్కునొక్కి పెనఁగవయ్యా ॥ ఎన్నె ॥

మూఁటగట్టువినయాల మొక్కులు మొక్కీ నాపె
వాఁటపుమోవితేనెలు వంచీ నాపె
యీటువెట్టి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
జూటుఁదనము లాపెను సొలయవయ్యా ॥ ఎన్నె ॥ 328

## రామక్రియ

గజరున నంతానేల కలయఁబెట్టుకొనేవు
గుజగుజతో నవ్వుకొంటా నుండరాదా ॥ పల్లవి ॥

ఇంతితో నే మాటాడితే నేల పూనుకవచ్చేవు
సంతసతులెల్లా నీకు సమమేకాదా
పంతపుసవతులము [1]పడితళించుకొంటేను
కొంతగొంత నీవు నవ్వుకొంటా నుండరాదా ॥ గజ ॥

నెలఁతఁ దప్పువట్టితే నీవేల దిద్దవచ్చేవు
సళుపుగొల్లెత లింతా సరియేకాదా
వలపుదొడ్డివారము వంతువాసు లెంచుకొంటే
కులికి నీవు నవ్వుకొంటా నుండరాదా ॥ గజ ॥

అంగన నే సాదించితే ఆకెనేల మొక్కించేవు
జంగిలివారెల్లా నీకు సరియే కదా
యెంగిలి శ్రీవేంకటేశ యే నలమేల్మంగను
కుంగక కూడితి నవ్వుకొంటా నుండరాదా ॥ గజ ॥ 329

---

1. పడితరమునకు రూపాంతరమా? వ్యావహారికమా? పడితరము=భాగము, వంతు. దాని భాయార్థముగ వరుస లేర్పాటుచేసుకొనుట కావచ్చు.

శ్రీరాగం

[1] బంగారుమేడలలోన పరమాత్ముఁడు వాఁడే
సింగారాలు మీఁదమీఁద సేయరే చెలులు ॥ పల్లవి ॥

తట్టుపుణుఁగుల నూనె తగ నిండా నంటుకొని
గట్టిగాఁ గస్తూరి యట కలివెట్టి
మట్టులేనిపన్నీట మజ్జనమాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు ॥ బంగా ॥

కప్పురపుగందవొడి కడు నిట్టె మెత్తుఁకొని
కొప్పు దువ్వి ముడిచెను గొట్టంగలెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేన సొమ్ములెల్లా
దప్పిదేర విడెమీరే తలకొని చెలులు ॥ బంగా ॥

అలమేలుమంగ నురమందు నిట్టె నించుకొని
తలసిదండలు మోఁచె నిలువునను
చెలరేఁగి యారగించె శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువున్నాఁడు మోహాలు గుప్పరే చెలులు ॥ బంగా ॥ 330

రేకు 1356 దేవగాంధారి

యెశోద నీబిడ్డ నేమందుము
రాశికెక్క మమ్ము రక్షించుమనవో ॥ పల్లవి ॥

వుట్లమీఁదటనున్నపాలు వెన్నా
చట్లతోడనె సాదించీ
కొట్లుగొట్టుచు గోపాళులుఁ దాను
అట్లు తోడనే యారగించీని ॥ యెశో ॥

1. చెలులను సంబోధించి చెప్పుట మాత్రమే శృంగారచిహ్నము. తక్కినదంతా ఈపాట అధ్యాత్మఛాయలోనిదే.

జిడ్డు గాకుండ చిలుపాలుఁ దేనె
తెడ్లతోఁ దినీ దేవి దేవి
గుడ్లకొలఁది కోరి మెసఁగుచు
దిడ్లకంతలఁ దిరుగాడీని ॥ యెళో ॥

పండ్లుఁ గాయలును బానలు పీదుల
దొండ్లుగాఁ జేసి దొబ్బి దొబ్బి
బండ్ల శ్రీవేంకటపతి యలమేల్‌మంగతో
యిండ్లిండ్ల వాకిండ్ల నేఁగే రదివో ॥ యెళో ॥ 331

సాళంగనాట

సంతోసించితిమి నిన్ను చల్లఁగాఁ బెండ్లాడితివి
యింతటివాఁడ వైతివి యేమనేము నిన్నును ॥ పల్లవి ॥

వొఱపైనజాణఁడవు వొక్కఁడవే యింతటికి
గుఱి నీ వలపులైతే కోటానఁగోటి
పఱపుపైఁ జూచితేను పదారువేలు దేవుళ్లు
యెఱఁగము నీమహిమ లేమనేము నిన్నును ॥ సంతో ॥

వొలసితే నొకతెను పురమెక్కించుకొందువు
పిలిచి వొకతె నెత్తిఁబెట్టుకొందువు
తలుపు దెఱచితేను దండనెల్లా గొల్లెతలే
యిల నిన్ను గెలువలే మేమనేము నిన్నును ॥ సంతో ॥

గొందిఁ బవ్వళించితేనే గోవిందరాజవు నీవు
కందువ నిలుచుంటే శ్రీవేంకటపతివి
అందుకొంటేనే యిద్దరంగనలు పాదాలొద్ద
యిందరిలో మమ్మేలితి వేమనేము నిన్నును ॥ సంతో ॥ 332

హిజ్జిజి

ఏకతానఁ జేయరాదా ఇటువంటి సుద్దులెల్లా
యీకడాకడవారి కెమ్మెలై తోఁచును ॥ పల్లవి ॥

చెలరేఁగిచెలరేఁగి చెప్పె నీ కాపె సుద్దులు
నలువంక నీవూ నవ్వే వందుకు
మెలఁగి మీసుద్దు లివి మీకే చవులుగాని
కెలని సవతులకు గేలియై తోఁచును ॥ ఏక ॥

దగ్గరిదగ్గరి ఆపె తగ సేవసేసీ నీకు
అగ్గమై నీ వందుకెల్లా ఆనందించేవు
యెగ్గు సిగ్గులేక మీకే యితవులై వుండుఁగాని
వొగ్గిన నీలేమలకు వొరటులై తోఁచును ॥ ఏక ॥

కమ్మటిఁగమ్మటి నాపె కాఁగిలించి కూడఁగాను
సమ్మతించి నీవందుకు చనవిచ్చేవు
ఇమ్ముల శ్రీవేంకటేశ యింపు మీకేయౌఁగాని
దొమ్మిగాఁ గూడినమాకు తోడునీడై తోఁచును ॥ ఏక ॥ 333

మంగళకౌసిక

అలుకలు దీరెను అంగన నీకు మొక్కెను
వెలయఁగఁ జెలికి విడె మియ్యరాదా ॥ పల్లవి ॥

నగవెంత నవ్వేవు నాలి యంత సేసేవు
జిగి నాపె చెప్పినట్టు సేయరాదా
మొగ మెందాఁకాఁ జూచేవు ముట్టిము ట్టేమాదేవు
వెగటుదీరఁ జేతికి విడె మియ్యదా ॥ అలు ॥

మాట లెంతేశాదేవు మనసు లేలొరసేవు
యీటున నీకెకుఁ జనవియ్యరాదా
పాటలెన్ని వాదేవు పరాకేల సేసేవు
వేటుఁబువ్వుల చేతికి విడెమియ్యరాదా ॥ అలు ॥

మక్కువెంత సేసేవు మర్మమేమి యంటేవు
పిక్కటిల్ల నిఁక సేసవెట్టరాదా
గక్కన శ్రీవేంకటేశ కలసితి వీకె విట్టె
వెక్కసమై చేతికి విడెమియ్యరాదా ॥ అలు ॥ 334

సౌరాష్ట్రం

ఏల వేఁడుకొనేవయ్య యింకా నీవు
చాలుకొని మొక్కే నాకు జాలి యాడది ॥ పల్లవి ॥

తగిలి నీరూపము తలఁపులో నుండఁగాను
వెగటైన విరహపువేద నేడది
పగటున నీపై పాటలు నోట నుండఁగా
చిగిరించేమతిలోనిచింత యేడది ॥ ఏల ॥

సొరిది నీవిచ్చినట్టిసొమ్ము నామేన నుండఁగా
కరకరఁబెట్టు మరి కాఁకలేడవి
వెరసి నీసుదులెల్ల వినేవీనుల(లః?) నుండఁగా
అరుదైనఅడియాస అలపేడది ॥ ఏల ॥

కలసినయిప్పటినీకాఁగిలి నా కుండఁగాను
బలిమిఁ బెనఁగేయట్టిపంతా లేడవి
నెలవై శ్రీవేంకటేశ నీవే నేనై యుండఁగాను
కులికి కులికి మరి కొస రేడది ॥ ఏల ॥ 335

శంకరాభరణం

నీసాజ మిట్లానే నీవద్ద నుండఁగాను
వేసాలెల్ల నాముందర వేమారుఁ జూపేవు ॥ పల్లవి ॥

వరుసకువచ్చినాపె వద్దఁ గాచుకుండఁగాను
యెరవులయాఁటదాని నేల తెచ్చేవు
సరవితో సొమ్ము నీమైచందమై వుండఁగాను
పరులసొమ్ముల కెంత బాఁతిపడేవు ॥ నీసా ॥

ముందుపెండ్లాడినాపె నీమొగము చూడఁగాను
కందువనున్నాఁటదానికడ చూచేవు
చిందుచు గందము నీజిగిమేన నుండఁగాను
అందుకోలుగందానకు నాసపడేవు ॥ నీసా ॥

[1] చేకొనూడిగపుటాపె చెవిలో విన్నవించఁగా
ఆకడాఁటదానిమాట లాలకించేవు
యీకడ శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
నేకరించి యిపుడుగా చెలరేఁగేవు ॥ నీసా ॥ 336

రేకు 1357 సామంతం

మాతోనేల బీరాలు మాపుదాఁకా నెరపేవు
ఆతరుణి పిలిచితే నౌఁగాదనఁగలవా ॥ పల్లవి ॥

రంతులెంత సేసినాను రాజసము చూపినాను
చెంతల నింతికి నీవు చేతికిలోనే
పంతము లెన్నాడినాను పైపై నెంతపెనఁగినా
మంతనానఁ జెలితోను మారుకొనఁగలవా ॥ మాతో ॥

---

1. చేకొని+ఊడిగపుటాపె.

[1] దీకొనెంతతిట్టినాను దిమ్మరివై వొరసినా
చేకొన్నసతికి నీవు చేతికిలోనే
బూక లెంత సేసినాను బుద్దులెన్ని నేరిచినా
మేకొన్న యీవనితను మితిమీరఁగలవా ॥ మాతో ॥

కోరి యెంత జంకించినా గుబ్బ లెంత పిసికినా
చేరికూడినకాంతకు చేతికిలోనే
యీరీతి శ్రీవేంకటేశ యింకా నెట్లుండినా
సారెకు నీలేమతోడ సరిదూఁగఁగలవా ॥ మాతో ॥ 337

కురంజి

వెంగెమాడ నెంత లేదు వేగినంతాను
అంగవించి మఱచేవా అంతటినావలపు ॥ పల్లవి ॥

సాదించ నెంత లేదు జంకెనబొమ్మల విన్ను
సోదించ నెంత లేదు చొప్పు నీమేన
కాదనము రావయ్య కడ నీ వెందుండినాను
పాదుకొని మఱచేవా బత్తితో నావలపు ॥ వెంగె ॥

నవ్వు నవ్వ నెంత లేదు నాలిసేసి విన్నిపుడు
రవ్వసేయ నెంత లేదు రమణులతో
రువ్వి తిట్టము రావయ్య రుచు లెందు చూచినాను
చివ్వనను మఱచేవా సేవతో నావలపు ॥ వెంగె ॥

అలయించ నెంత లేదు అట్టె రతుల విన్ను
వెలయించ నెంత లేదు వేడుకతోడ
సొలయము రావయ్య సొంపగు శ్రీవేంకటేశ
కలసితి మఱచేవా కందువనావలపు ॥ వెంగె ॥ 338

1. దీకొని + ఎంత.

లలిత

ఏమయ్యా నే నటువంటియెరవులదాననా
వోముచు నప్పటి నన్ను వొడఁబరచేవు ॥ పల్లవి ॥

మనసు చూడవలసి మాటాడ కూరకుండితే
కినిసితినంటా వచ్చి కేలువట్టేవు
చనవుమెరసి నిన్ను జంకించి చూచితేను
పెనఁగుచు నాకు నెంతో ప్రియముచెప్పేవు ॥ ఏమ ॥

తమి రేఁచవలసి నేఁ దలవంచుకొంటేను
అమరఁ గోపించెనంటా ఆయాలంటేవు
భ్రమయించవలసి నేఁ బంతములాడుకొంటే
చెమటచేతుల నన్నుఁ జెక్కునొక్కేవు ॥ ఏమ ॥

బలిమిఁ గూడవలసి పానుపుపై నుండితేను
అలిగినజాడలంటా నాదరించేవు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్నింతలో
వలపెక్కుడాయనంటా వన్నెమో విచ్చేవు ॥ ఏమ ॥ 339

ఆహిరి

ఎప్పటివలె నుండరే యెరవులు మీకేల
కుప్పలుఁదెప్పలునాయ గురుతైనవలపు ॥ పల్లవి ॥

మచ్చికకు వెల లేదు మాటలకుఁ దుద లేదు
గచ్చులేల సేసేవే కాంతునితోను
ఇచ్చకమాడినదాన వెగసక్కెలాడనేల
పచ్చివెచ్చిఁ జేయకువే పాయనినీవలపు ॥ ఎప్ప ॥

చూపులకు వంత లేదు సొంపులకు వేళ లేదు
పైపై నలుగుదురా పతితోను
చేపట్టినదానవు సిగ్గులువడుదురా
ఆపసోపాలఁ బెట్టకు అందపునీవలపు ॥ ఎప్ప ॥

కూటమికి గురి లేదు కోరికకు కొద్ది లేదు
[1] గాటారింపులేలే శ్రీవేంకటేశుతోను
చాటి కూడినదానవు జడియఁగనేమిటికి
[2] తూఁటతాఁటల దాఁచకు తోరపునీవలపు ॥ ఎప్ప ॥ 340

నాగవరాళి

ఇద్దరికిఁబోదు యెంతకెంత సేసేవు
ముద్దరాల యతనితో మొగమోట వలదా ॥ పల్లవి ॥

సరసమాడేయప్పుడే చలము సాదించేవు
తెరమరఁగై తేనే తిట్టు దిట్టేవు
సరుగ నెదుటనుంటే సారెఁ గొప్పు వట్టేవు
మురిపేన, మొగవితో మొగమోట వలదా ॥ ఇద్ద ॥

పెనఁగేటియప్పుడే బెట్టిగోరు దాఁకించేవు
కనుఁగొన్నయంతలోనే గద్దించేవు
చనవు నీకిచ్చితేనే సదమదము సేసేవు
మొనసి యీతనితోను మొగమోట వలదా ॥ ఇద్ద ॥

కెలసి నవ్వేయప్పుడే కిందుపడ వేసేవు
కలికి మోవియ్యఁగానే గంటిసేసేవు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
మొలకవయసుదాన మొగమోట వలదా ॥ ఇద్ద ॥ 341

---

1. గాటు=కారము, గాటారించు=గాటు కలుగునట్లు చేయుట?
2. తూఁటతాఁటలు=తుంటరి మోసములు?

హిజ్జిజి

అందుకే మెచ్చవద్దా అతివ నీవు
పొందెఱిఁగినవానితోఁ బోర మరి తగవా ॥ పల్లవి ॥

పిలిచినప్పుడే వచ్చె పెనఁగితే లోనాయ
చలమేల సాదించేవే సరసునిని
వెలి నెంత సేసినాను వేళ దప్పనియ్యఁడు
తలఁపులోనున్నవాని తప్పు లెంచఁదగవా ॥ అందు ॥

నవ్వినప్పుడే నవ్వె ననుపున మెచ్చఁజేసె
రవ్వలేల సేసేవే రమణునిని
యెవ్వతెఁ బెండ్లాడినాను యిరవు నీనగరే
వువ్విళ్లూరించేవారి నొద్దనఁగఁదగవా ॥ అందు ॥

కూడినప్పుడే కూడెను కూరిమికి సంతోసించె
వీడనేలాదేవే శ్రీవేంకటేశుని
వీడె మెవ్వతిచ్చినాను విడువఁడు నీకాఁగిలి
జోడయివుండినవాని సోదించఁదగవా ॥ అందు ॥ 342

రేకు 1358 కుంతలవరాళి

వట్టియాసఁ బొరలేము వలచి పాయఁగలేక
చిట్టకపుఁజేతులకే చిక్కేవా ॥ పల్లవి ॥

వుంకువైన బాసలును వొట్లుఁ దలఁచవట
జంకించి నేఁ జూచితేను జడిసేవా
పొంకమైనసేవలును పొందులు మఱచితివి
కంకణాలచేయి వేసితే కరఁగేవా ॥ వట్టి ॥

గాఁటపుసివలపులు కందువలుఁ జూడవట
మాఁటలసొలపులకు మనసిచ్చేవా
వాఁటపునాప్రియములు వాసులు నెంచవైతివి
తేటలనానవ్వులకు తెమలేవా ॥ వట్టి ॥

మన్ననలు నాగుణాలు మరి తలఁచితివట
చన్నులతాఁకుల కోర్చి సమ్మతించేవా
యిన్నిటా శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
యెన్నియైనా నాకోరిక లియ్యకూడేవా ॥ వట్టి ॥ 343

లలిత

ఇంకాఁ గొన్ని దలఁచుకో యిటువలెనే
పొంక మెఱుఁగుదువయ్యా పొందులు సేయఁగను ॥ పల్లవి ॥

బీరాన నొకతెపేరఁ బిలిచేవు నన్ను విట్టె
నేరుతువయ్యా మాఁటలు నిన్నేమనేను
చేరి యొకతెవిడెము చిమ్మి నాచేతి కిచ్చేవు
దూరుకు వెరవవయ్యా తొలుత నీవు ॥ ఇంకాఁ ॥

బొబ్బిల నొకతెఁ జూచి సొరిది నన్నుఁ జూచేవు
గబ్బిచేఁతలు నీయందె కలవయ్య
వుబ్బున నొకతె నంటి వొళ్లు నాపై వేసేవు
నిబ్బరా లమరునయ్యా నీయందే యెపుడు ॥ ఇంకాఁ ॥

నంటున నొక్కతె గూడి నన్ను నట్టె కూడేవు
గొంటవయ్యా అన్నిటాను గుంపించరాదు
ఇంటిలో శ్రీవేంకటేశ ఇందరి జంటనేసేవు
వింటివయ్యా నీసుద్దులు వివరముగాను ॥ ఇంకా ॥ 344

పాడి

పదరుదురటవే పలుమారును
కుదురై మజ్జాతి(రే?) సేసుకొనఁదగుగాక ॥ పల్లవి ॥

కాఁపురాలు సేసేవారు కడు నొట్టువెట్టుదురా
కోపమెఁ(మెం?)తైనా నోర్చుకొందురుగాక
యేపురేఁగి రమణుఁడు యెంతమీరితిరిగినా
కోపుల మెల్లనే వంచుకొనవలెఁగాక ॥ పద ॥

ఇల్లాండ్లనువారు యెగసక్కెలాడుదురా
వుల్లాన గుట్టుసేసుక వుందురుగాక
వెల్లవిరై మగవాఁడు వేరేపనులు సేసితే
మెల్లనే వోజకుఁదెచ్చి మేకొందురుగాక ॥ పద ॥

కడుఁజుట్టాలైనవారు గక్కున నలుగుదురా
బెడిదపురతుల మెప్పింతురుగాక
అడరి శ్రీవేంకటేశుఁ డందరిఁ గూడి వచ్చితే
పడి నీవూఁ గూడి ఇట్టె వఁపింతురుగాక ॥ పద ॥ 345

గౌళ

మేమింత యేఁకరఁగాను మేలా వోయి
నాములెక్క వలపించి నవ్వేవా వోయి ॥ పల్లవి ॥

యింటికిఁ బిలువఁగాను యెఱఁగనట్టే పోయి
దంటపై ఆడఁ గూచుండఁదగునా వోయి
వెంటవెంట నే రాఁగా వెలఁదులచేతను
కంటకములాడించ సంగతులా వోయి ॥ మేమిం ॥

కప్పురము నే వియ్యఁగా కదఁబెట్టి యొక్కతెను
దప్పికి నీళ్లడిగేవు తగవా వోయి
కొప్పువట్టి నేఁ దియ్యఁగా గొబ్బున ముసుఁగిడుక
యిప్పుడే పవ్వళించేవు ఇదిగొంతా వోయి ॥ మేమిం ॥

కదఁగి శ్రీవేంకటేశ కాఁగిలించి నేఁ గూడితే
తడవుకుఁ గరఁగేవు తగవా వోయి
తడవి నే మొక్కఁగాను దయఁజూచితివి నీవే
చిడుముడి నింతరట్లు సేతురా వోయి ॥ మేమిం ॥ 346

## శ్రీరాగం

ఇంతి చెలువం బెంచ వితరులకు వసమౌనా
ఇంతయునుఁ దలపోసి యెరిఁగించవలదా ॥ పల్లవి ॥

చిగురైనమోవిపై చిలుకవోట్లు నిండె
తగుఁ గోవిలకుఁగాక తనకేల
మొగమైనతామరకు మొగి విచారము లేదు
తగవు లివి యేర్పరచి తా దిద్దవలదా ॥ ఇంతి ॥

వలుదజక్కవచన్నుల వంకలచంద్రులు వొడమె
జలధందుఁ గాక ఇచ్చట నమరునా
కలికిమేనై నతీగకు విచారము లేదు
తలకొన్నయీతగవు తా దిద్దవలదా ॥ ఇంతి ॥

మఱి గజకరపుఁదొడల నఱిదిఁ బగడపులతలు
అఱుంట్లందము గాక అందుకేలా
యెఱిఁగి శ్రీవేంకటేశు కీవిచారము లేదు
తఱిఁ గూడి నీతగవు తా దిద్దవలదా ॥ ఇంతి ॥ 347

బౌళి

ఎదుటనే వున్నవాఁడు యేలమమ్ము గేలిసేసీ
    అదను వదనుఁ గూడ నడుగరే యతని ॥ పల్లవి ॥

తలఁపులోపలిమాట తానే యెఱుఁగుఁగాక
    యెలమి మమ్మడిగితే నేమనేమే
    తలఁపు గొల్లెతలెల్లా తగఁ బంచుకొన్నారు
    అలరి మిగులఁ గద్దా అడుగరే యతని ॥ ఎదు ॥

తన నవ్వినట్టినవ్వు తానే యెఱుఁగుఁగాక
    యెనసి మమ్మడిగితే నేమనేమే
    తననవ్వు మధురలో తరుణు లందుకొంట
    అనువై మిగులఁ గద్దా అడుగరే యతని ॥ ఎదు ॥

శ్రీవేంకటేశుఁడు తనచేఁత తానే యెఱుఁగుఁగాక
    యీవల మమ్మడిగితే నేమనేమే
    సేవఁ దనకాఁగిలి చేరి నేనే కైకొంటి
    ఆవల మిగులఁ గద్దా అడుగరే యతని ॥ ఎదు ॥ 348

రేకు 1359 కన్నడగౌళ

అంగన వింతటనైనా నలపుదీర్పరాదా
    సంగతెఱిఁగిననెరజాణఁడ విన్నిటాను ॥ పల్లవి ॥

చెమరించె నుదురెల్లా చెదరెఁ గస్తూరిబొట్టు
    జమళిపాదాలు ఇంతి సారె గుద్దఁగా
    తమిఁ దురుము జారె గందపుబేంట్లెత్తె మేన
    గుమితాన నీకు విట్టె కుంచెవేయఁగా ॥ అంగ ॥

పైపై నిట్టూర్పులు రేఁగె బాయిటఁబడెఁ జన్నులు
యేపున నాకుమదిచిఇయ్యఁగాను
తీపులమోవి వాడె తెట్టలై పూవులు రాలె
ఆపొద్దుననుండి జవ్వా దలఁదఁగాను ॥ అంగ ॥

కన్నుల విద్దుర దేరె కళలు మోమున నిండె
ఇన్నిటాఁ గాఁగిట ని న్నెనయఁగాను
వున్నతి శ్రీవేంకటేశ వొడి నిండె వలపులు
చెన్నుమీర నీకు నిట్టె సేవసేయఁగాను ॥ అంగ ॥ 349

ఆహిరి

[1]బొదువే జాణవు నీవు అన్నిటాను
సాదవా నీవును తొల్లె జాణఁడవురా ॥ పల్లవి ॥

ఆకసపుఁగొలనిపై వంటుఁదామరలు వుట్టె
యీకత చెప్పఁగదవే యింతిరో నీవు
మేకొని మరువింటికి మిట్టెకోలలై యవి
కూకులు వత్తులుగా నీగురి దాఁకురా ॥ బొదు ॥

అలరినళశిబింబమందు తేనెపెర వుట్టె
కల విరుచఁగదే విక్కముగా నీవు
చలమున నిదియె చంద్రకళలోనితేటై
నెలకొన నీనోరు నిండుకొనురా ॥ బొదు ॥

[2]అమనెరఁటులపై రావాకుబదనికె వుట్టె-
నేమందుకు వచ్చును నా కెరిఁగించవే
గోమున శ్రీవేంకటేశ కూడినయారతివేళ
వేమరు నాతో నీవు విద్యలాడవచ్చురా ॥ బొదు ॥ 350

1. ఇది వ్యాకోవాక్యము. 2. అమని+అరఁటులు.

శుద్ధవసంతం

చెలులకుఁ దగుఁగాక చలము నీకుఁ దగునా
పెలుచుఁదనానసేల పెనఁగేవు నీవు ॥ పల్లవి ॥

చనవుసేసుకొని సతి నిన్నుఁ దిట్టితేను
పనివి ఆపెతోనేల పంతాలాడేవు
మనసు రంజిల్ల నీపై మరి చేయివేసితేను
కినిసి యేల జంకించేవు నీవు ॥ చెలు ॥

నగవుసేసుకొని వలినాక్షి గోరంటితే
తగవులఁబెట్టేవేం తరుణులతో
మొగమోటతో నీమోవి గంటిసేసితేను
చిగురుఁబాదమునఁ జిమ్మేవు నీవు ॥ చెలు ॥

గుట్టుసేసుకొని గొప్పకుచముల నదిమితే
అట్టె యందుకు రతి నలయించేవు
యిట్టె శ్రీవేంకటేశ యెనసి రా కొట్టితేను
దట్టముగ నోరినిండాఁ దమ్ములమిదేవు ॥ చెలు ॥ 351

సామంతం

కోరికెలెల్లా నీడేరె గోవిందరాజా
యీరీతి సతుల నెనయఁగఁగలిగె ॥ పల్లవి ॥

చిడుముడి నీవు నాల్గుచేతులతో మెరసేది
వుడివోక మాకు నొక్కవుపమ వుట్టె
పడఁతులిద్దరు నీకుఁ బాదము లొత్తఁగాను
కడఁగి నీ వొకమాటే కాఁగిలించఁగలిగె ॥ కోరి ॥

గక్కున కఠినమైనకౌస్తుభమాణికము
 అక్కునఁగట్టిన దొకఅనువచ్చె
చక్కఁగా నిద్దరినాల్గుచనుఁగొండ లొక్కమాఁటే
 వుక్కుమీర నొరయఁగ నోరువఁగఁగలిగె ॥కోరి॥

తావై శ్రీవేంకటేశ వొత్తగిలి పవ్వళించేది
 వోవరిలో నిది యొక్కవుపమకెక్కె
యీవలనావల భూమి ని(యిం?)దిర వీఁపు నురము
 చేవమీరి చేకొనఁగ జిగిఁ గూడఁగలిగె ॥కోరి॥ 352

## పూర్వగౌళ

ఇటువంటిది గలదా యేలికవు నీవు మాకు
 యిటులా నూడిగము నేయించుకొంటగాక ॥పల్లవి॥

నవ్వు లెన్ని లేవు నీవు నాతోనే జరపేవి
 పువ్వు లెన్ని లేవు నాపైఁ బూఁచి వేసేవి
యివ్వలనే లోనౌదునా యెంత చెప్పినా నీకు
 జవ్వనపుమాయేలికసాని వుంతఁగాను ॥ఇటు॥

మాట లెన్ని లేవు నీవు మంతనాన నాడేవి
 చీటు లెన్నిలేవు నీవు వ్రాసి చేతికిచ్చేవి
పాటించి ఇయ్యకొందునా పచ్చిగా నీపనులకు
 చాటువగా మాయేలికసాని వుండఁగా ॥ఇటు॥

చూపు లెన్ని లేవు నీవు సొలయుచుఁ జూచేవి
 తీపు లెన్ని లేవు సాదించి చల్లేవి
యేపున శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
 చాపఁమీదనే యేలికసాని వుండఁగాను ॥ఇటు॥ 353

దేసాళం

ఇంతులకు నింతగుట్టు యిత్తురా నీవు
పంతము మెరసేయట్టిబలువుఁడవు ॥ పల్లవి ॥

ముచ్చట నెవ్వతెకైనా మోహము చెప్పుదురా
పచ్చిగా నంతలో కిందుపడుదురా
మచ్చికై సిగ్గువిడిచి మాఁటలాడుదురా
అచ్చపై బూమేలేటినాయకుఁడవు నీవు ॥ ఇంతు ॥

వెస నాఁటదానికి వెంటవెంటఁ దిరుగుదురా
పసగా నూడిగాలు పైపైఁ జేతురా
నసలుగ సారెసారె నవ్వులు నవ్వుదురా
రసికుఁడవై వట్టిరాజసపునీవు ॥ ఇంతు ॥

దిగ్గనఁ గాఁగిటికిముందే బారచాఁతురా
తగ్గక కూడితి విట్టె తమకింతురా
అగ్గలమై యలసిట్టె అసురుసురౌదురా
యెగ్గులేనిశ్రీవేంకటేశుఁడవు నీవు ॥ ఇంతు ॥ 354

రేకు 1360 లలిత

ఇంకా నిట్లానే గడియించుకొనవయ్య ధనము
సంకెలేక చిత్తమనేజాళెఁ బోసుకొందువు ॥ పల్లవి ॥

తెలిసె నీసుద్దులెల్ల తేటలెల్లమాయను
వల పినుమడిగాను వడ్డికిచ్చేవు
యెలమి నందుకు సాక్షి యిరుమేలా నున్నావారు
బలిమిఁ బంచబాణాలు [1]పంచారూడిపత్రము ॥ ఇంకా ॥

---

1. పంచాయితీనామావంటిది పంచారూఢపత్రము. వ్రాసినవాడు, వ్రాసిచ్చువాడు, ముగ్గురుసాక్షులుగల అప్పుపత్రము పంచ+రూఢిపత్రము. వ్యావహారికముగ పంచారూఢి పత్రము కావచ్చు.

కంటిమి నీజాడలెల్ల కడుదిష్టమాయను
నంటువావులు ముమ్మడినాఁగు కిచ్చేవు
దంటతనానఁ గొలువ తలపోఁతే కుంచము
అంటినగొల్లెతలెల్ల నప్పులవారు ॥ ఇంకా ॥

మెచ్చితిమి నీకూటమి మీఁదమీఁద మేలాయను
పెచ్చురతి నలుమడి బేరమాడేవు
ఇచ్చకుండ శ్రీవేంకటేశ నీవే లాబగాఁడ-
వచ్చపుగోరొత్తులెల్లా నన్నిటికీ లెక్కలు ॥ ఇంకా ॥ 355

వరాళి

ఇప్పుడే నేరుచుకొంటి వేదలేనికుచ్చితము
చిప్పల నద్దముచూచి సింగారించుకొనేవు ॥ పల్లవి ॥

కాంత విన్న వేఁడుకొనీ కతలు చెప్పఁగరాదా
ఇంతలో నిద్రించేనంటానేల పవ్వళించేవు
అంతలోనే విడెమిచ్చి హస్తము చాఁచరాదా
పంతాననేల చిత్తరుప్రతిమఁ జూచేవు ॥ ఇప్పు ॥

సతి వేడుకపడీని చదురంగమాడరాదా
తతిఁ బాడేనంటానేల దండె మీటేవు
రతిఁ బూలుముడిచీ శిరసువంచరాదా నేఁడు
కతలుగా సొమ్ములు లెక్కలువెట్టేవు ॥ ఇప్పు ॥

వెలఁది బాఁతిపడీని వినోదాలు చూపరాదా
సొలసి కూడి యెంతని చొక్కించేవు
అలరి శ్రీవేంకటేశ అదె మొక్కీఁ జూడరాదా
మెలఁగి ఇందుకె సారె మెచ్చులు మెచ్చేవు ॥ ఇప్పు ॥ 356

### పాడి

నాతో దాఁచక చెప్పవే నాతిరో నీవు
యీతనువుసోఁకినవాఁ డెంతభాగ్యవంతుఁడే ॥ పల్లవి ॥

చక్కనివెన్నెలవూట సతి నీనవ్వులతేట
మొక్కలలోనిమొఱఁగు మోవితెఱఁగు
రెక్కతుమ్మిదలవొప్పు నిక్కవనీపెద్దకొప్పు
యిక్కువ విన్నెలినవాఁ డెంతభాగ్యవంతుఁడే ॥ నాతో ॥

అలచందురునిదీము అతివ నీనెమ్మోము
కలువలమైబాగులు కన్నుసోగలు
లలి శంకముకులము లక్షణపునీగళము
యిల నీమగఁడైనవాఁ డెంతభాగ్యవంతుఁడే ॥ నాతో ॥

విరతిఁ గొండపొదవు నీచన్నులవడువు
మరునికొలువు నీమర్మపువిలువు
సిరులఁ గూడె విన్నట శ్రీవేంకటేశుఁడట
యిరవై నీవుగలవాఁ డెంతభాగ్యవంతుఁడే ॥ నాతో ॥ 357

### ముఖారి

అతఁడు నేసేటివినయమునకా నీబిగువు
చేతికి లోనై వుండఁగా చిదుముడి దగునా ॥ పల్లవి ॥

చెలువుఁడు వీడెము చేతఁబట్టుకున్నవాఁడు
అలుక లెందాఁకాను అందుకోరాదా
వెలలేనివెన్నెలలు వేగినంతాఁ గాయఁగాను
వెలి నుండే యెవ్వరికి వెట్టఁబడఁదగునా ॥ అతఁ ॥

వచ్చివచ్చి రమణుఁడు వాకిటఁ గాచుకుండఁగా
పెచ్చువెరిగే వెందాఁకాఁ బిలువరాదా
యెచ్చరించి దగ్గరనే యేరు వారుచుండఁగాను
కుచ్చితాన లోలో దప్పిగొనఁదగునా ॥ అతఁ ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి కాఁగిలించినాఁడు
లావు లెందాఁకాఁ జూపేవు మోవియ్యరాదా
భావించి వలపులపంట వండి వుండఁగాను
ఆవటించి రతిఁ దనియక వుండఁదగునా ॥ అతఁ ॥ 358

భైరవి

నిరతి వెరగయ్యీని నీవిధము చూచి నాకు
తెరమఱఁగున సాదించితివో పనులు ॥ పల్లవి ॥

సతి నిన్నుఁబై తలఁచఁగానే విచ్చేసితివి
తతి వేగువెట్టుక ఇందాఁకా నుంటివో
అతివలమనసులఅదనెల్లఁ దెలుసునో
అతనుఁడు నీ కేపొద్దు నన్నియునుఁ జెప్పునో ॥ నిర ॥

మాట నోర నుండఁగానే మారుమాట లాడితివి
యీటున నేమైనా మంత్ర మెఱుఁగుదువో
మూటగా నిట్టె పుస్తకమున వా(వ్రా?)సుకుందితివో
నాఁటనుండియు నవధానములు నేరుతువో ॥ నిర ॥

కలగనినట్లనే కాఁగిలించి కూడితివి
యెలమి నిద్దరిదేహా లేకములో
వెలయ శ్రీవేంకటేశ విద్యలు సాదించితివో
బలిమి నీ విందరిపాలిటిదేవరవో ॥ నిర ॥ 359

సామంతం

ఏమి నేర్చితివి యిటువంటిపనులు
కామినిమోహము గైకొనరాదా ॥ పల్లవి ॥

మలయుచు నూరక మగువ వుండఁగా
చెలరేఁగి యేల చెనకేవు
తలుపుమాఁటునను తలవంచుకొనఁగ
పలుకుల నూరక భ్రమయించేవు ॥ ఏమి ॥

చిఱునవ్వులతో చెలియ వుండఁగా
చెఱఁగువట్టి గురిసేసేవు
పఱపుమీఁదనే పాదము లొత్తఁగ
కఱకుల నిటు చనుఁగవ యంటేవు ॥ ఏమి ॥

సేవలుసేయుచు శ్రీసతి యుండఁగ
మోవి మోవితో మోపేవు
శ్రీవేంకటేశ్వర జిగిఁ గూడె వనిత
భావఁబులఁ గడుఁబస రేఁచేవు ॥ ఏమి ॥ 360

రేకు 1361 సౌరాష్ట్రం

ఆసలనే బడలితి నట్టె రావయ్య
యీసులేదు నీకు నాకు వింటికి రావయ్యా ॥ పల్లవి ॥

మొగమెల్లఁ జెమరించె మించి నీపై తమకాన
తగవులఁబెట్టక ఇంతట రావయ్య
చిగిరించె చిత్తమును చెక్కునఁ జేయి మోఁచె
యొగసక్కేలు సేయక ఇంటికి రావయ్యా ॥ ఆస ॥

చెక్కులెల్లఁ బులకించ(చె?) చెలువపునిన్నుఁ జూచి
తక్కులఁబెట్టక ఇంతట రావయ్య
ముక్కున నూర్పులు మించె ముంగురులు కడుజారె
యెక్కువతక్కువ లెంచ కింటికి రావయ్యా ॥ ఆస ॥

శిరసునెరులు జారె సిగ్గులు పలచనాయ
తరితీపులేల ఇంతట రావయ్య
గరిమ శ్రీవేంకటేశ కలసితి వికడనె
యిరవైతి వింక మాయింటికి రావయ్యా ॥ ఆస ॥ 361

## సాళంగం

బుద్ధిచెప్పవయ్యా నీపొలఁతికివి
ఇద్దరికి సరేకావా యెన్నుకొన్నసిగ్గులు ॥ పల్లవి ॥

మంచముమీఁద మనము మాటలాడఁగా
పొంచులు దా వినెనట పొలఁతొకతె
వంచన లేకానుద్దులు వారివీరితోఁ జెప్పి
కంచుఁబెంచు నేసి అట్టె కాకునేసె నదివో ॥ బుద్ధి ॥

పీఁటమీఁద నిద్దరము పెనఁగులాడఁగాను
మాఁటుననే చూచెనట మరియొకతె
గాఁటముగ నాపములు కన్నవారితోఁ జెప్పి
చాటుచు సారెసారె జాతులఁబెట్టీని ॥ బుద్ధి ॥

యెంగిలిమోవిచ్చి నన్ను ఇంటిలోఁ గూడినది
ఇంగిత మెఱిఁగెనట ఇదియొకతె
అంగపుశ్రీవేంకటేశ అందరితో నాడుకొని
రంగుమీర నంతటాను రవ్వలు నేసీని ॥ బుద్ధి ॥ 362

### వేళావళి

బుద్దిచెప్పేవార మింతే పొద్దువొద్దుకు
ఇద్దరు సంతమౌట కియ్యకొనవయ్యా ॥ పల్లవి ॥

తరుణి యలిగెనంటే తమక మాఁపఁగలేదు
మరిగివుంటే కోపము మానఁగలేదు
సొరిది నెంచితే నీసుద్దు లెన్నైనాఁ గలవు
ఇరవై ననీచెలుల మేమి సేతుమయ్యా ॥ బుద్ది ॥

ముదిత దూరెనంటే మొగమోట మానలేదు
వొది గూరకుండెనంటే వోరువలేదు
వెదకితే నీయందు వేవేలు నెరుసులు
యెదుట నిలుచున్నార మేమి సేతుమయ్యా ॥ బుద్ది ॥

కాంత కరఁగించెనంటే కడు నలయించలేదు
మంతనపురతు లివి మానఁగలేదు
ఇంతలోనే శ్రీవేంకటేశ నీవే యేలితివి
యింతటిసంతోసాన కేమి సేతుమయ్యా ॥ బుద్ది ॥ 363

### కేదారగౌళ

ఆఁటది రాజ్యమేలితే అది మంచిదేకాదా
చాటువగా మాకు విన్న సాదించనేఁటికి ॥ పల్లవి ॥

పీఁటపై నున్న దాపె ప్రియుఁడవు నిలుచుండి
మాఁటలాడే వాపెతోను మంచిదేకాదా
గాఁటముగా వంచ నెంత గలిగి మెలఁగినాను
యీటున నీవే బదికే వేమిననేఁటికి ॥ ఆఁట ॥

పదఁతి పవ్వళించఁగా పాదాలకాడ నుండి
మదిచిచ్చే వాకు నీవు మంచిదేకాదా
పుడుగక నీవెంత పూడిగాలు నేర్చినాను
కడు నీకే లాభమయ్యా కాదనఁగనేఁటికి ॥ ఆఁట ॥

పురముపై నున్న దాకె వొగి నిట్టే కిందుపడి
మరులుగొంటివి నీవు మంచిదేకాదా
ఇరవై శ్రీవేంకటేశ యెంత మోపెత్తుకొనినా
మఱిగి నన్నేలితివి మచ్చరించనేఁటికి ॥ ఆఁట ॥ 364

భల్లాటి

అప్పటి మానవు బీరా లందరిలోనా
చెప్పనేల లోలో నీకే సిగ్గువడవలనా ॥ పల్లవి ॥

అదె మోవి గంటిరేఁగీ నానలేల పెట్టేవు
యెదిరివా రిందుకెల్లా నెట్టు నమ్మేరు
మదిమది నీచేఁతలే మచ్చము పట్టియ్యఁగాను
చెదరక నీకునీవే సిగ్గుపడవలదా ॥ అప్ప ॥

వేలిమట్టె లొరసీని వెసఁ జెక్కేల నొక్కేవు
ఆలిరిచెలు లిందుకు అట్టె నవ్వేరా
సోలి నీసింగారాలే చొప్పులెత్తిఇయ్యఁగాను
జీలుగుబెండాయ గుట్టు సిగ్గువడవలదా ॥ అప్ప ॥

అలమేలుమంగ వొత్తి వదేల కాఁగిలించేవు
వలచినవారికి వాసివుట్టదా
బలుశ్రీవేంకటేశ నీభావమే పట్టియ్యఁగాను
చెలఁగి నన్నేలితివి సిగ్గువడవలదా ॥ అప్ప ॥ 365

పాడి

ఏమిచూచేవు నాదిక్కు యెంతవడిదైనాను
యీమేరలనే నిన్ను యెగసక్కేమాడేనా ॥ పల్లవి ॥

ప్రియురాలు నీవును పెండ్లాడఁగాఁ జూచి
నయగారితనమున నగె నొకతె
క్రియగా నాపెయెరుకఁ గెర లేమి సేసితివో
నియతానఁ దారుకాణించుకోవయ్యా ॥ ఏమి ॥

చెలరేఁగి యాపె నీవు నేసవెట్టుకోఁగాఁ జూచి
సొలసి కేరడముగాఁ జూచె నొకతె
కలఁకలేవినీవోళ్లఁ గపటమేమైనాఁ గద్దో
తిలకించి యాసుద్దులు తెలుపుకోవయ్యా ॥ ఏమి ॥

అలమేల్మంగతో బువ్వమారగించేనిన్నుఁ జూచి
మెలుపునఁ బొగడుచు మెచ్చె నొక్కతె
అలరి శ్రీవేంకటేశ ఇందరి మమ్మేలితివి
కలిగిన నమ్మికలిక్కడఁ జూపవయ్యా ॥ ఏమి ॥ 366

రేకు 1362 వేళావళి

చల్లఁగా బదుకవయ్య సాదించేమా నిన్ను నేఁడు
చెల్లు నీకు నన్నియును చెప్పిచూపనేఁటికి ॥ పల్లవి ॥

బాసనేయనేరుతువు పవిగొననేరుతువు
ఆసగొలుపనేర్తువు అఁటదానిని
సేసేవారివూడిగాలు సేయించుకోనేరుతువు
నీసుద్దు లేమిచెప్పేవు నేఁడు మాకుఁ గొత్తలా ॥ చల్లఁ ॥

పొంద నిందుకుఁ గలవు పొరుగుకునుఁ గలవు
సందడిఁ గాలుదొక్కి మించఁగఁగలవు
యెందు నీవు నవ్వుతానే యెదము గైకోఁగలవు
దిందుపడఁ దొల్లె నేము తెలియవిపనులా ॥ చల్లఁ ॥

మొక్కి మొక్క నోపుదువు మోహించ నోపుదువు
వొక్కటిగాఁ గూడివుండనోపుదువు
అక్కర శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యెక్కువై మమ్మేలితివి యెఱఁగమా నేము ॥ చల్లఁ ॥ 367

సౌరాష్ట్రం

ఎవ్వరును తమవలె నెంచవద్దా
రవ్వకెక్కి సవతుల రాఁపునేతురు ॥ పల్లవి ॥

ఆతఁ డింటికి రాకుంటే నాడితివి వెంగేలెల్లా
చేతికిలోనై తేనే చెలఁగితివి
నీతులు చెప్పేవు నేము నీవంటివారమే కామా
యేతులకు మాకు బుద్ధులేల చెప్పేవు ॥ ఎవ్వ ॥

వెక్కసమై తిరిగితే వెసఁ గోపగించితివి
చెక్కు నిన్ను నొక్కితేనే చేకొంటివి
నెక్కొని నోరదిమేవు నేము నీవలెనేకాదా
యెక్కువతగవులు మాకేల చెప్పేవు ॥ ఎవ్వ ॥

మఱచి వూరకుండితే మర్మాలు సోఁకించితివి
మఱి యట్టె యలమేలుమంగ మెచ్చితి
నెఱతనాలు నేర్పేవు నీవంటివారమే కామా
మెఱయ శ్రీవేంకటేశు మెచ్చి పెండ్లి సేసేవు ॥ ఎవ్వ ॥ 368

బౌళి

ఎంత చనవిచ్చితివో యీపె నీపై వెదచల్లీ
కొంతపుఁజూపుల చూడికుడుతనాచారు ॥ పల్లవి ॥

మెప్పిరిఁ దా మనసార ముడిచినదండలు నీ-
కొప్పున ముడిచీఁ జూడికుడుతనాచారు
తప్పులేక నిన్నుఁ జనుఁదామరమొగ్గలు మోవ
గుప్పి నిన్నిదివో చూడికుడుతనాచారు ॥ ఎంత ॥

చేరఁదీసి నీమీఁద చెమటపయ్యద గప్పి
కూరిమి గొసరీఁ జూడికుడుతనాచారు
చేరి వేఁడుకొని వేరుసేయకుమని నీచెక్కు-
గోరనొత్తీ నిదె చూడికుడుతనాచారు ॥ ఎంత ॥

అంకెల శ్రీవేంకటేశ అదె నీమైఁ దనమేని-
కుంకుమ పూసీఁ జూడికుడుతనాచారు
అంకపురతులఁగూడి అలమేలుమంగె తానై
కొంకుదేర్చె నిన్నుఁ జూడికుడుతనాచారు ॥ ఎంత ॥ 369

ముఖారి

అందుకేపో యెమ్మెలంటా నాడుకొనేరు
సందడిలో గందవాడి చాతుకొనేవు ॥ పల్లవి ॥

చేరలంతలుగన్నులచెలి నిన్నుఁ జూడఁగాను
తీరుగాఁ గస్తూరిబొట్టు తిద్దుకొనేవు
నేరుపుగలిగినావె నీవద్దనే వుండఁగాను
గారవించి వలపులకతలు చెప్పేవు ॥ అందు ॥

కొండలంతలుగుబ్బలకొమ్మ నిన్ను నొరయఁగా
మెండుగఁ గప్పురధూళి మెత్తుకొనేవు
నిండుసింగారాన నాపె నీతో సరసమాడఁగా
అండనే తట్టుపుణుఁగు అలఁదుకొనేవు ॥ అందు ॥

పెద్దకొప్పులమేల్మంగ పేరురముపై నుండఁగా
నిద్దపుసొమ్ములు మేన నించుకొనేవు
గద్దరి శ్రీవేంకటేశ కాఁగిట నాపె గూడఁగా
కొద్దిమీర నారగించి కొలువై వుండేవు ॥ అందు ॥ 370

కాంబోది

కామినిసరసములే కామధేనువులు గావా
రామఁతిట్ల కింత రవ్వ సేయఁదగవా ॥ పల్లవి ॥

వెలఁదనవ్వులవెన్నెలలు గాసీ నీపై
చెలువుఁడ చిత్తానఁ జీఁకటేలయ్యా
ములువాఁడికొనగోరు మోపినయందు కేమాయ
వలపు లింతేసి నీకు వడిఁ బెట్టఁదగునా ॥ కామి ॥

వనితచెమటలనేవానలు గురియఁగాను
వెనకటియలుకలవెట్ట యేలయ్యా
వెనుకొని పూబంతిని వేసితే నందుకేమాయ
చనవులు నీ వింత చంకిపెట్టఁదగునా ॥ కామి ॥

అలమేల్మంగ కాఁగిట నామనియై వుండఁగాను
అలరతిఁ దనియుని తక్కరేలయ్యా
పిలిచి శ్రీవేంకటేశ పెనఁగితే నేమాయ
మొలకసిగ్గు లిప్పుడే మూఁటగట్టఁదగునా ॥ కామి ॥ 371

పాడి

అటుగాన నీపాదాల కన్నియ విన్నవించితి
తటుకునఁ దెలుసుకో తగినట్టు నీవు ॥ పల్లవి ॥

నంటున నీమోము చూచి నవ్వులు వచ్చీనాకు
సొంటులు సోదించద్దము చూచుకోరాదా
ఇంటిలో తననేరమి యెఱఁగరాను తనకు
కంటకమై యెదిరికిఁ గానవచ్చుఁగాని ॥ అటు ॥

వింతైననీమాట విని వెరగయ్యీ నాకైతే
అంతయు పద్దిచెలుల నడుగరాదా
దొంతినే తనకల్లలు తోఁచవు తనకెపుడు
వంతులఁ దగవు చెప్పేవారికిఁగాని ॥ అటు ॥

తరితీపునారతులు తెలఁపయ్యీ నాకైతే
సురతపునీవదవు చూచుకోరావా
గరిమ నలమేలుమంగను శ్రీవేంకటేశ నీ-
వరుదై నన్నేలితివి యాపె నేలరాదా ॥ అటు ॥ 372

రేకు 1363 ముఖారి

అప్పటి నీనేరమికి నది చాలునా
చెప్పాని సేవలెల్లాఁ జేతువుగాక ॥ పల్లవి ॥

పంతపుమాటలయాపె పలికీనా నీతోను
వింతలుగా నీవెంత వేఁడుకొన్నాను
చెంతనుండి నీవు నిన్నఁ జేసినచేఁతలకు
మంతనపుమొక్కుల సమ్మతిసేతువుగాక ॥ అప్ప ॥

నాలిచలపాదియూపె నవ్వీనా నీతోను
యీలీల జాణతనా లెంతాడినాను
కోలుముందై నీమేన గుఱుతులుండినందుకు
యేలికెపై నా కందిఇత్తువుగాక ॥ అప్ప ॥

రాతిగుండెలమేల్మంగ యీతల నిఁక లోఁగీనా
కాతరాన నాడి యెంత కదిమినాను
యేతుల శ్రీవేంకటేశ యెమ్మెలు చూపివందుకు
యీతల రొమ్ముపై నాపె నిడుకొందుగాక ॥ అప్ప ॥ 373

## రామక్రియ

నాకు వెఱవఁగనేల నాలితనాన
యీకడ మోనాననుండే వెందాఁక నీవు ॥ పల్లవి ॥

వెలఁదియాడేమాఁట వింటివా వోయి
మలసి తానట నీకు మఱఁదలట
కలువదండ ఇచ్చుట కద్దా వోయి
కలది గలట్టై తారుకాణించుకోరాదా ॥ నాకు ॥

కామినినేసేసన్నలు గంటివా వోయి
రామను నీ విక్కడికి రమ్మంటివట
ఆమించునీవుంగరము ఆపెదా వోయి
దీమసాన నాపె నీవుఁ దెలుసుకోరాదా ॥ నాకు ॥

యింతి నిన్నుఁ గూడెఁ జనవిచ్చితా వోయి
జంత శ్రీవేంకటేశ తా సవతియట
యింతట నలమేల్మంగ నన్నేలితివి
వింతగా నాపె నీవు విచారించుకోరాదా ॥ నాకు ॥ 374

## సౌరాష్ట్రం

ఇదివో మంచివేళ యింకనెన్నఁడు
యెదుటనే మరుని జయించవచ్చు నిప్పుడు ॥ పల్లవి ॥

కాంతనిలువెల్లా నీకు కనకపురథము
బంతినున్న పిఱుఁదులే బండికండ్లు
పొంతనున్న కుచములే పూవులగుత్తులు నీకు
ఇంతటను మరుని జయించవచ్చు నిపుడు ॥ ఇది ॥

వెలఁదిపయ్యదకొంగు విజయధ్వజము నీకు
చెలువపుబొమ్మలే సింగిణివిండ్లు
అలరినచూపులే అక్షయబాణములు
యెలమి మరుని జయించవచ్చు నిపుడు ॥ ఇది ॥

అలమేల్మంగకాఁగిటి హస్తములే పగ్గాలు
చెలఁగినపెనుఁగొప్పే శిఖరము
నెలవై శ్రీవేంకటేశ నీవే రథికుఁడవు
యిలలోన మరుని జయించవచ్చు నిపుడు ॥ ఇది ॥ 375

## శ్రీరాగం

దేవతలు సేవించఁగా దివ్యదుందుభులుమ్రోయ
శ్రీవల్లభునిభావము చెలులెల్లఁ జూడరే ॥ పల్లవి ॥

నిండుసింగారముతోడ నిలువుగోణము గట్టి
అండఁ బన్నీటిమజ్జన మవధరించి
దండిగా శిరసున తడిసూడులు చుట్టుక
వుండెడిదేవునిభావ మువిదలు చూడరే ॥ దేవ ॥

కప్పురకాపు మేన కలయఁగ మెత్తి మెత్తి
చిప్పిలఁ దట్టుపుణుఁగు చికిలిసేసి
చొప్పుగా నవరత్నాలసొమ్ములు మేనఁ జాతి
ఇప్పుడున్నహరిభావ మింతులెల్లఁ జూడరే ॥ దేవ ॥

అలమేలుమంగ నురమందు నెలవుకొలిపి
తలకొన నంతటాఁ బాదండలు వేసి
చెలరేఁగి యారగించి శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువై వున్నభావము కొమ్మలెల్లఁ జూడరే ॥ దేవ ॥ 376

పాడి

ఎఱఁగవుగాక మీఁదపెత్తు నీవు
కఱకరించి తిట్టితే కాదనఁగఁగలవా ॥ పల్లవి ॥

పొద్దు వోదా నీకదేమి పొరుఁగున నుండఁగాను
కొద్దిమీరఁ జెఇ చాఁచి కొంగువట్టేవు
సుద్దులెల్లా మాని నేను సూఱు నిన్నుఁ బట్టితేను
వొద్దికఁ బంతమియ్యక వూరకుండవచ్చునా ॥ ఎఱఁ ॥

యెగసక్కెమా నాతో ఇంటిలో నే నుండఁగాను
అగడైన మాటలెల్లా నాడవచ్చేవు
మొగమోటములు మాని మోవ నిన్ను నాడితేను
తగవున నూఁకొనక తలఁగఁగవచ్చునా ॥ ఎఱఁ ॥

చలములా నాతోను అలమేల్మంగా రమ్మని
నెలవై నీవురముపై నించుకొనేవు
సొలపులెల్లా మాని సొంపుగ శ్రీవేంకటేశ
కలసితి నిఁక నీవు కాదనఁగవచ్చునా ॥ ఎఱఁ ॥ 377

సాళంగం

ఏల వేఁడుకొనినే నే నెఱుఁగుదు నంతయును
కాలమందే నాపైఁ దనకరుణ యెఱఁగనా ॥ పల్లవి ॥

మఱవరానిమాటలు మనసున నుండఁగాను
యెఱకతోడితగుల మేల పాసీనే
గుఱుతైనయటువంటికొంగుము ళ్లుండఁగాను
తెఱవమఱఁగున చింతించనేఁటికే ॥ ఏల ॥

సేసినతనసుద్దులు చెవి నిండియుండఁగాను
యీసులేల పుట్టినే యెర వేడదే
బాసలు తా నిచ్చినవి బండారాన నుండఁగాను
వాసు లెంచుకొని వట్టిపసివాదు లేఁటికే ॥ ఏల ॥

పొసరి తనకాఁగిలి పురము నిండుండఁగాను
గుచిసి శ్రీవేంకటేశుఁ గొసరనేలే
తనినెలమేల్మంగను తానే నేనై యుండఁగాను
పెనఁగి తను నింకాను పెరరేఁచనేఁటికే ॥ ఏల ॥ 378

రేకు 1364 రీతిగౌళ

రమణి గుట్టున నుండే రవ్వసేయనేఁటికి
మమత మాపైఁ గలితే మగుడి రారాదా ॥ పల్లవి ॥

మొఱఁగుసిగ్గులతోడ మొలకచన్నులతోడ
మఱఁగున నుండి నీతో మాటలాడీని
చెఱఁగువట్టి యేల తీసేవు వెలుపటికి
తెఱవమనసు నీవే తెలుసుకోరాదా ॥ రమ ॥

జమళియాసలతోడ సళుపుఁజూపులతోడ
సముకాననే నీతో సన్న సేసీని
క్రమ మెఱుఁగక యేల గరిసించే పీడ విన్నే
తిమురుచు, యేకతానఁ దెలుసుకోరాదా ॥ రమ ॥

మొగముకళలతోడ మోహపుఁజెమటలతోడ
తగిలితగిలి నిన్నుఁ దమిరేఁచీని
నగి శ్రీవేంకటాద్రిపై నన్ను నాపె నేలితివి
తెగడి గోవిందరాజ తెలుసుకోరాదా ॥ రమ ॥ 379

అమరసింధు

ముందుముందుగా నీవే మొక్కవయ్యా
అందుఁగాని తీరదు యీయంగననెంజెరివి ॥ పల్లవి ॥

అంతరంగమున నీవేమని యానతిచ్చితివో
యింతి యేల అలిగెనో యెఱఁగమయ్యా
పంతగాఁడవు నీవై తే బలిమి నేయఁగరాదు
యెంతైనా బలు వీకెవంతువాసులు ॥ ముందు ॥

అటిమటి నేమి సేయ నవధరించితివో
తెఱవేల కోపించెనో తెలియదయ్య
మఱి నీవు దొర వింక మాకు బుద్ధి చెప్పరాదు
నెఱవుగ నాకెకై తే నీకంటే రాజసము ॥ ముందు ॥

శ్రీవేంకటేశ నీ వెట్టు చెంది మన్నించితివో
అవనిత మెచ్చె నరుదందితిమయ్యా
దేవుఁడవు విన్నాకరు తిద్దరాదు కూడితివి
దేవులాకెకై తే నెడతెగనిసంతోసము ॥ ముందు ॥ 380

## ఆహిరి

వనితలసొలపులె వలపులపంటలు
పెనఁగులాట గలితే ప్రియములే కావా ॥ పల్లవి ॥

తివిరి మగవానికే తీపులై యుందురుగాక
సవతులు తమలోన సంతమయ్యేరా
తవిలి నీవేల ఇందరి నొక్కటిసేసేవు
జవళి నీ కామేకులు చవులు గావా ॥ వని ॥

మొగిఁ బెండ్లిపీఁటమీఁద మోనాన నుందురుగాక
వెగటై లోవికివస్తే వెంగేలేకావా
జగడాలు మానుమని సారె బుద్ధులు చెప్పేవు
నగుతా నీకివియెల్ల ననుపులు గావా ॥ వని ॥

శ్రీవేంకటేశ్వర నిన్నే చెంది కూడుదురుగాక
తావుల తమలోనిపంతాలు మానేరా
యీవేళ నీ వేలితివి యెపుడు వారొక్కటే
యీవిధములెల్ల నీకు యితవులు గావా ॥ వని ॥ 351

## మాళవిగౌళ

ఇచ్చకములాదేటిఇల్లాలను
పచ్చిగా నొకరివలె భ్రమయించనేరను ॥ పల్లవి ॥

తలఁచుకొమ్మనవే తా నాడినమాటలు
తెలుసుకొమ్మనవే చింతించి బుద్ధులు
నిలుచున్నాఁడు వాకిటనే తనతో నేమనేను
పలికి వొకరివలె భ్రమయించనేరను ॥ ఇచ్చ ॥

చదువుకొమ్మనవే సారె మరుశాస్త్రిలు
వెదకుమనవే తనవింత సేఁతలు
యెదుట నుండఁగ తన కిట్టె నే మొగమోడితి
పదరి వొకరివలె భ్రమయించనేరను ॥ ఇచ్చ ॥

సిరులఁ జూడుమనవే సేవ లిందరివిని
కరఁగుమనవే తనగట్టిమనసు
యిరవై శ్రీవేంకటేశుఁ డెనసె నేనే మెచ్చితి
పరగ నొకరివలె భ్రమయించనేరను ॥ ఇచ్చ ॥ 382

సాళంగనాట

అనఁలసినమాఁట అంటిమిగాక
గుడిసి యప్పటి నేల కొసరేము ॥ పల్లవి ॥

వలపు నీవు చల్లఁగ వచ్చివచ్చి వేఁడుకోఁగా
చలము నీతో నేల సాదించేము
తలుపు నీవు మియ్యఁగ దండనుండి చెనకఁగ
పెలుచుఁదనాననేల పెనఁగేము ॥ అన ॥

సరసము నీవాడఁగ చల్లనిచూపు చూడఁగ
గొరుబు నేసి నిన్నేల కోపగించేము
సొరిది నీవు నవ్వఁగా చుట్టరికాలు చెప్పఁగా
ఓరసాన నిన్ను నేల వెంగెమాడేము ॥ అన ॥

కందువ మోవియ్యఁగాను కాఁగిలించి కూడఁగాను
నింద పైపై వేసి యేల నేరమెంచేము
యిందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కిందటినీచేఁతలెల్లా కెరలించేమా ॥ అన ॥ 383

హిందోళవసంతం

నిన్నుఁ జూచి నవ్వ వచ్చీ నేఁడు నాకు నిందుకే
యెన్ని చూచితే నీకు యెదు రీడఁ గలదా ॥పల్లవి॥

చేముట్టి నీతో నవ్వితే చెలరేఁగి తిట్టేవు
భామతో మారుకొనఁగఁ బంతమా నీకు
నాములువేసేటియట్టినసలు వాండ్లైతేను
భూమిలోనఁ గోపగించేపురుషులు గలరా ॥నిన్నుఁ॥

గోర నిన్ను నూఁదితేను గొబ్బన సూడువట్టేవు
కీర మింతిపైఁ జూపేది పెద్దరికమా
కోరి వురముమీఁదికి కుచములు వేఁకమైతే
బోరన నింతిఁ గోపించేపురుషులు గలరా ॥నిన్నుఁ॥

కందువ నిన్నుఁ గూడితే కరఁగేవు మనసెల్లా
మందలించి యీకెమీఁదిమచ్చికా ఇది
అంది శ్రీవేంకటేశుఁడ అధరమూ దీపనుచు
పొందితివి నీకంటె పురుషులు గలరా ॥నిన్నుఁ॥ 384

రేకు 1365 శంకరాభరణం

మాటలేమి గలిగినా మరి విన్నవించేను
నీటుతోడినిన్నుఁ జూచి నే నేమనేను ॥పల్లవి॥

చేయిమీఁదఁ జేయివేసి సిగ్గుదేర మాటలాడి
చాయలు సన్నలుసేసి చలివాపేవు
మాయలెల్లా నేరుతువు మర్మము లెరుఁగుదువు
నీయెడ కియ్యకొనక నే నేమనేను ॥మాట॥

వాడివట్టి కాలఁదొక్కి వాదఁబరచుకొంటాను
మడుపువవ్వులు నవ్వి మట్టుపెట్టేవు
కడువేగిరకాఁడవు గర్వమెల్లా నీసొమ్ము
నిడివిగా మన్నించఁగ నే నేమనేను ॥ మాట ॥

చెలఁగి కాఁగిలించుక చెక్కులు గోర నొక్కి
సొలపి రతులనెల్లఁ జొక్కించేవు
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా జాణఁడవు
నెఱకొని పెండ్లాడఁగ నే నేమనేను ॥ మాట ॥ 385

## సామవరాళి

ఇప్పటి కేమైనాను యియ్యకొనవే
చొప్పులన్నియును మరి సోదించేవేకదవే ॥ పల్లవి ॥

సిగ్గులువడకువే చెలువుఁడు మాటాడఁగ
వొగ్గి యేమిటికైనా వూఁకొనవే
వెగ్గళించి యందేమైనా వెలుతులు గలిగితేను
యెగ్గుతో గేలిసేయవే ఇన్నియు వెనకను ॥ ఇప్ప ॥

కమ్మి వాసులెంచకువే ఘనుఁడు నీతో నవ్వితే
యెమ్మెల కెందుకైనాను ఇచ్చగించవే
నెమ్మి నందులో నేమైనా నెరుసులు గలిగితేను
నెమ్మది గేలిసేయవే నిక్కుచు వెనకను ॥ ఇప్ప ॥

చింతలో లోఁగకువే శ్రీవేంకటేశుఁ డంటఁగ
చెంతలఁ గాఁగిటఁ గూడి సేవసేయవే
పొంతఁ గూడితి వందులో వింతేమి గలిగినాను
బంతినే గేలిసేయవే పచ్చిగా వెనకను ॥ ఇప్ప ॥ 386

### లలిత

మంచివాఁడ వౌదువయ్య మానవు నీబేఁటము
ఎంచి నే మొకటిసేయ నీ వొకటి సేసేవు ॥పల్లవి॥

కొలువుసేసి యలసి కొమ్మ పవ్వళించితేను
చెలులము పాదాలొత్తి సేవసేయఁగా
చెలఁగి అంతలో వచ్చి సేదదేర్చేనంటా
పెలుచుఁజన్నులు వట్టి పిసికేవు నీవు ॥మంచి॥

మఱి నీతోఁ బెనఁగి కోమలి యాఁకలిగొంటే
చెఱకుఁబిచ్చెలు నేము చేతవియ్యఁగా
నెఱి నంతలో వచ్చి నేను తోడయ్యేనంటా
మొఱఁగి మోవి తీపు మోవి కందిచ్చేవు ॥మంచి॥

ఇన్నిటా నిన్నుఁ గూడి ఇంతి జలకమాడితే
కన్నెలము తడిసూళ్ల కడునొత్తఁగా
సన్నల నంతలో వచ్చి సందడి శ్రీవేంకటేశ
వున్నతపుకొనగోర నొత్తేవు నీవు ॥మంచి॥ 387

### అహిరి

ఆనతియ్యఁగదవే అడియు మాపంతోసమే
పూనినసిగ్గుని వింత పొరలఁగనేఁటికే ॥పల్లవి॥

చెలరేఁగిచెలరేఁగి చెలులతో మాటాడేవు
మలసి యాతఁడు నిన్ను మన్నించెనటే
నెలవులనే నవ్వులు చిమ్మిరేఁగి వున్నవి
అలమి అన్నిటా నిన్ను నాదరించెనా ॥ఆన॥

భావించిభావించి యట్టె పాటలెల్లాఁ బాడేవు
 సేవలకు మెచ్చాతఁడు చెక్కునొక్కీనా
 కావిరి వేడుకలనుఁ గడునుబ్బీ నీమేను
 మోవియిచ్చి యాతఁడు నీమోహాము చేకొనెనా ॥ ఆన ॥

చొక్కిచొక్కి తమకాన సొరిదిఁ బులకించేవు
 యెక్కువ శ్రీవేంకటేశుఁ డిట్టె కూడెనా
 పుక్కిటివిడెముతోడఁ బొదలుచు మురిసేవు
 చక్కనియాతఁ డింతేసి చన విచ్చెనా ॥ ఆన ॥ 388

సాహంతం

చాలదా యీ భాగ్యము సరివారిలోనెల్ల
 తాలిమితోఁ గంటిమి సంతసమాయ మాకును ॥ పల్లవి ॥

ముద్దులు నీతో గునిసి మొగమిచ్చమాటలాడి
 కొద్దిమీర నినుఁ జేకొవఁగా యాకె
 వొద్దిక సేవలుసేసి వొడివట్టుకొని నవ్వి
 దిద్దుకొని పనులకుఁ దిప్పేఁగా ఆకె ॥ చాల ॥

నోయగపుచూపు చూచి చొక్కి నీమీఁద నొరగి
 ఆయములు గరఁగఁ బాలార్చేఁగా ఆకె
 చాయలు సన్నలుఁ జూపి సంగడినే కూచుండి
 చేయంటి వలపులఁ జిక్కించెఁగా ఆకె ॥ చాల ॥

కమ్మరాను నెలయించి కాఁగిట విన్నుఁ గూడి
 కిమ్ములను విన్ను మరిగించెఁగా ఆకె
 ఇమ్ముల శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
 యెమ్మెలతో నిందు కప్పణిచ్చేఁగా ఆకె ॥ చాల ॥ 389

దేసాళం

మేమును నీవారమే మేనవారమే
సాములునేసి వలపు చల్లవయ్యా ॥ పల్లవి ॥

యెక్కడలేవి పరాకు [1]యేఁ(యెం?)తైనాఁ గద్దు నీకు
చొక్కపుఁజూపుల మమ్ముఁ జూడవయ్యా
తక్కక జూజమాదేతమి యెంతైనాఁ గద్దు
అక్కరై మాతో మచ్చటలాడవయ్యా ॥ మేము ॥

కన్నచోటనే చుట్టరికము లెంతైనాఁ గద్దు
చిన్నదాన నాపొందు సేయవయ్యా
పన్నినకితలమీఁదిబాఁతి యెంతైనాఁ గద్దు
విన్నపాలు మాచేతివి వినవయ్యా ॥ మేము ॥

కూరిమిసతులతోడి కూట మెంతైనాఁ గద్దు
కోరి నన్ను రతులఁ జేకొనవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మేరలు మీరక యిట్టె మెచ్చవయ్యా ॥ మేము ॥ 390

రేకు 1366 రామక్రియ

కాముకుఁడైనవానికి ఘనము గొంచెము లేదు
యేమీ ననఁగరాదు ఇదివో నీసుద్దులు ॥ పల్లవి ॥

అఁటదియైతేఁజాలు నంటుకొనేవు గక్కన
వాఁటమైనసూదిరాతివలెనే నీవు
కూటమిలో గొల్లవారిగొల్ల నీకు నితవాయ
యీటువెట్టి చూడఁబోతే నిదివో నీసుద్దులు ॥ కాము ॥

---

1. పాట అంతటా ఇట్లే వ్రాత. ఈ రేకుల వ్రాతలో 'ఎంత్తై' 'పొంద్దై' 'ఇంప్పై' మొదలగుస్థలములలో చాలచోట్ల ద్విత్వము కానరాదు. ద్విత్వత్వములకు వ్రాలములేమి కారణము గాబోలును.

ముక్కు మొకముఁ జూడవు ముదితై తేఁ జేకొనేవు
ఒక్కనతృణగ్రాహిసీలమువలె
గక్కన నంగడిదావిగందము నీకితవాయ
ఇక్కువఁ దెలుపఁబోతే ఇదివో పీసుద్దులు || కాము ||

నెలఁతనుఁ బట్టపుదేవులఁగాఁ జేసుకొంటివి
వెలలేనట్టిపరుసవేదివలె
కలగంపపెండ్లిండ్లు కన్నచోట నితవాయ
యెలమి శ్రీవేంకటేశ ఇదివో నీసుద్దులు || కాము || 391

ఆహిరినాట

వట్టివేసాలు సేసేవు వనితలెల్లాఁ జూడఁగా
మట్టివచ్చితే నీవు మూఁకలో నౌకతెవు || పల్లవి ||

కాంతుఁ డింటికి రాఁగాను గక్కున మానుపవద్దా
ఇంతకర్త వైనదాన వెందు వోతివే
చెంత రమణుఁడు నీకు చేతికి లోనాయనట
ఇంతులు నగరివిండా యేదనుండి వచ్చిరే || వట్టి ||

చేరి విడెమియ్యఁగాను చేఇ వట్టుకొనవద్దా
యీరీతి బలిమిదాన వెందు వోతివే
ఆరయ నాతఁడు నీకు ఆడినట్టె ఆడునట
సారెకు నాతఁడు మాతో వరస మెట్లాడీనే || వట్టి ||

సమ్మతి నన్నునేలె సన్న సేయవలదా
యెమ్మె లింతగలదాన వెందు వోతివే
నెమ్మి శ్రీవేంకటేశుఁడు నీమదిలో నుండునట
కమ్మర మమ్మెట్లాను కరుమన్నించితిరే || వట్టి || 392

### పాడి

ఒకటంటే వొకటన[1] కొద్దు దోసము
మొకమిచ్చలాడక మొరయవచ్చితినా ॥ పల్లవి ॥

చలములు నీతోను సాదించవచ్చితినా
వలపులు పచరించవచ్చితిఁగాక
తొలితొలి నిను నిట్టె దొమ్మి సేయవచ్చితినా
చెలరేఁగి సేవలెల్లాఁ జేయవచ్చితిఁగాక ॥ ఒక ॥

పంతముల నీతోను పదిగొనవచ్చితినా
వంతులకు విడిమియ్యవచ్చితిఁగాక
మంతనాన నీతోను మచ్చరించవచ్చితినా
వింతలెల్లా నీకు విన్నవించవచ్చితిఁగాక ॥ ఒక ॥

ఆసలఁబెట్టి నిన్ను నలయించవచ్చితినా
వాసితో నీవు గూడఁగా వచ్చితిఁగాక
బాసతో శ్రీవేంకటాద్రిఁ బాయని గోవిందరాజ
మోనపుచ్చవచ్చితినా మొక్కవచ్చితిఁగాక ॥ ఒక ॥ 393

### సామంతం

నిన్ను నిఁక నేమందు నన్ను నే దూరుటగాక
కన్నుల నవ్వు నవ్వేవు ఘనమైనమోహమా ॥ పల్లవి ॥

చిగురునామోవిగంటి చిత్తగించి చూడవయ్య
యెగసక్కెలకు నీవే యెంత సేసితి
తగిలి సారెకు రాఁగా తెగి ఇటువలె నీవు
అగడు సేసితిగాక అది నాపై మోహమా ॥ నిన్ను ॥

---

1. ఒకటవటు(ము)+ఒద్దు:

జాడల నాచన్నులపై చందురులఁ జూడవయ్య
యేడలేనిచలముల ఇంత సేసితి
వేడుకై వద్దనుండఁగా వేసరి ఇందరిచేత
ఆడుకోఁ జేసేవుగాక అది నాపై మోహమా ॥ నిన్ను ॥

వుమ్మడి నాముఁ(ముం?)జేతుల కుమ్మె లిటు చూడవయ్య
యెమ్మెల నీకూటముల యింత సేసితి
నెమ్మది శ్రీవేంకటేశ నీకాఁగిటఁ జొక్కితేను
అమ్ముద వించేవుగాక అది నాపై మోహమా ॥ నిన్ను ॥ 394

బౌళి

వెద్దువెట్టి నేమెల్లా వేసరితిమి
ఆద్దివెట్ట కిప్పుడే రావయ్య లోనికిని ॥ పల్లవి ॥

వదరేటివాఁడవు పంతగాఁడవు మొదల
యెదుటనుండినప(స?)తి నేమంటివి
మదిమదిఁ బవ్వళించి మాటలాడ దెవ్వరితో
అదె వేఁడుకొందువు రావయ్య వొద్దికిని ॥ వెద్దు ॥

కోపకాఁడవు మరి కోడెకాఁడవు మొదల
యేపురేఁగి యేకతాన నేమంటివి
ఆపొద్దుననుండియును ఆరగించకున్నది
యీపాటినే రావయ్య ఇచ్చకము సేతువు ॥ వెద్దు ॥

శ్రీవేంకటేశుఁడవు చెలికాఁడవు మొదల
యీవిధానఁ గూడుతానే యేమంటివి
సేవలు నేము సేయఁగా సిగ్గుంతో నున్నది
యీవు లిత్తువు రావయ్య ఇన్నిటా నేర్పరివి ॥ వెద్దు ॥ 395

వరాళి

వద్దువద్దు వలపులు వాఁటములు సేయక
తిద్దుకో మాగుణము దినదిన[1]బెంబడి ॥ పల్లవి ॥

పంతములాడి నీతో పచారించి సొలయఁగా
వింతవారమా నేము వేమారును
చెంతల నీవూడిగముసేసి బల్లిదుల మింతే
వంతులేల పట్టేవు వారివీరితోడను ॥ వద్దు ॥

కరకరిఁబెట్టి నీతో గామిడితనాలు చూప
పొరుగువారమా నేము పొద్దుపొద్దును
అరుదుగా నీకు విచ్చలాడి బల్లిదుల మింతే
తొరలించనేమిటికి దొమ్మివారితోడను ॥ వద్దు ॥

నెయ్యములు చూపి నీతో నేరుపులు వచరించ
వియ్యపువారమా నేము విచ్చనవిడి
కొయ్య శ్రీవేంకటేశ్వర కూడి బల్లిదుల మింతే
ఇయ్యకొల్ప వింతేఁటికి ఇంటివారితోడను ॥ వద్దు ॥ 396

రేకు 1367. సాళంగనాట

కంటిఁగంటి నీవిద్యలు కానీలేరా
కంటమాల యిచ్చేవు కానీలేరా ॥ పల్లవి ॥

చోప్పులెత్తి నీవంక చూడఁగానే నామీఁద
కప్పురము చల్లేవు కానీలేరా
చెప్పరానినీమేనిచెనకులు వెదకితే
కప్పేవు నీపచ్చడము కానీలేరా ॥ కంటిఁ ॥

1. 'బెందడి', కి రూపాంతరమా? బెందడి=గచ్చు. గార అని, అం—భా.

రతిరాజతంత్రాలరహస్యా లడిగితే యే-
కతములాడవచ్చేవు కానీలేరా
యితరపుసొమ్ము లివి యేడవని అడిగితే
కతలెల్లాఁ జెప్పేవు కానీలేరా ॥ కంటిఁ ॥

యిక్కువ నీమతకము లెఱఁగి నే నవ్వితేను
గక్కనఁ గాఁగిలించేవు కానీలేరా
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
కక్కసించితే మెచ్చేవు కానీలేరా ॥ కంటిఁ ॥ 397

నాదరామక్రియ

ఎదురు చూచిచూచి యేఁకారితిని
యిదివో నీవిట్లానైతే యేమనఁగవచ్చును ॥ పల్లవి ॥

పిలిచితే రారాదా ప్రియుఁడను నాకంటా
చెలరేఁగిచెలరేఁగి చెప్పుకొందువు
అలరి యమ్మేదొకటి నసిమలో దొకటైతే
వెలఁదుల కెటువలె వేగించవచ్చును ॥ ఎదు ॥

చెప్పినట్టు సేయరాదా చేతిలోనివాఁడనని
అప్పటప్పటికి నీవు ఆడుకొందువు
ఒప్పిల విత్తొకటివి చెట్టొకటీ నై తేను
తప్పనిసతుల కెట్టు దరియించవచ్చును ॥ ఎదు ॥

చేరి కాఁగిలించరాదా శ్రీవేంకటేశుఁడ నీ-
పీరీతిఁ గూడితినని యెంచుకొందువు
నేరుపరలమేల్మంగ నేనూ నీవూ నొక్కటైతే
ఆరీతి కాంతలకెట్లు అవుఁగాదనఁగవచ్చును ॥ ఎదు ॥ 398

## పాడి

చెలిమిఁ బాయకుండేటిచెలికత్తెను నేను
వలనై నీచిత్తము వచ్చుఁగదా యిపుడు ॥ పల్లవి ॥

మఱవరానిమాట మగువ నీతో నాడె
గుఱుతుగాఁగఁ దలఁచుకొందువో లేదో
యెఱుకలు సేయుమనె యెచ్చరించుమనె నన్ను
కఱకుమాట లాడుట గాదుగదా నిన్నును ॥ చెలి ॥

సేయరానిచేఁతలు చెలియ నీమీఁదఁ జేసె
చేయంటి చూతువో లేదో సిగ్గువడక
కాయము పిన్నంటుమనె కందువ దెలుపుమనె
రాయడించితినని దూరవుగదా ఇపుడు ॥ చెలి ॥

నగరానినవ్వు నీతో నవ్వె నలమేల్మంగ
అగడై శ్రీవేంకటేశ అవునో కాదో
విగిడి కూడితి విట్టె నీతో నన్ను మెచ్చుమనె
జగతిఁ గేరడమై తోఁచదుగదా యిపుడు ॥ చెలి ॥ 399

## భైరవి

ఇన్నిటికి నీకు మొక్కే మెటిఁగి మన్నించవయ్యా
వన్నెలమా సేఁత లెట్టువలసినా వచ్చు ॥ పల్లవి ॥

సరసపుమాటలు సారె నీతో నాడుదుము
యెరవుల నీకవి యెగ్గులో తప్పో
పురిగొనేయాసలను బొమ్మల జంకింతుము
వరుసల నీచిత్తము వచ్చునో రాదో ॥ ఇన్ని ॥

కొదలుచు నేము నీకొంగువట్టి తీతుము
యిది దెలియదు నీకు నితవో కాదో
పదిమారులు నిన్ను భావించి నవ్వుదుము
వుదుటున సమ్మతింతువో సమ్మతించవో ॥ ఇన్ని ॥

ఘనముగ నిన్ను నట్టె కాఁగిలించి కూడుదుము
వెనక నెఱఁగ మది వేడుకో వెట్టో
తనిసి శ్రీవేంకటేశ దాయక పాయకుందుము
యెనసితి వింకా నీకు యింపో సొంపో ॥ ఇన్ని ॥ 400

ఆహిరినాట

ఏల కైలాటాలువెట్టే విదేమోయి
పేలరివై మామీఁదఁ బెట్టేవా వోయీ ॥ పల్లవి ॥

బుద్ధులు చెప్పితినట పొంచి నీకు నేనంటా
గద్దించీ యాకె నన్ను కద్దా వోయి
వద్ద వుండకుండా నేనే వలలఁబెట్టితినట
అద్దుకొని మాఁటలాడీ నది గద్దా వోయి ॥ ఏల ॥

గెర వా(వ్రా?)సితినట యాకెఇంటికి నేఁగకుండా
కరకరించీ నాపె కద్దా వోఇ
కొరకొర కాను కందుకొనకుండాఁ జేసితినట
ఆరసీఁ దానే మర్మాలు అవునా వోయి ॥ ఏల ॥

సన్నలు సేసితినట సారె నన్నుఁ గూడుమని
కన్నుల నవ్వీ నాపె కద్దా వోయి
యెన్నఁగ శ్రీవేంకటేశ యిద్దరి మమ్మేలితివి
నిన్ను నే సాకిరిగోరే విజమా వోయి ॥ ఏల ॥ 401

వరాళి

చాలుఁజాలు నూరకుండు సతులెల్లా నవ్వేరు
కేలుచాఁచి తిట్టేటిఫేలరిఁడు గలఁడా ॥పల్లవి॥

యెగసక్కెలకుఁ జెలు లేమైనా నాడుదురు
పగటున బీరములు పచరింతురు
పొగరున, నీ వందుకు బుజ్జగించవలెఁగాక
మగువతోఁ గోపగించేమగవాఁడు గలఁడా ॥చాలుఁ॥

కామించి రమణులు కడుసేఁతలు సేతురు
ప్రేమమున పంతములు బెరయింతురు
వేమరు నిట్లఇతే వేఁడుకొనవలెఁగాక
రామలతో నలిగేటి రమణుఁడు గలఁడా ॥చాలుఁ॥

ఆలవోకగా నెలఁత లన్నిటాను నవ్వుదురు
బలిమి శ్రీవేంకటేశ పైకొందురు
కలిసితి విటువలెఁ గరుణించవలెఁగాక
చెలులతో నెగ్గులెంచేచెలువుఁడు గలఁడా ॥చాలుఁ॥ 402

రేకు 1368 శుద్ధవసంతం

సంగతెఱఁగవద్దా జాణలకును
చెంగట నొకరిచేత చెప్పించుకోనేఁటికి ॥పల్లవి॥

చేయెత్తి మొక్కఁగఁబోయి సిగ్గువడీఁ జెలియ
చాయల పయ్యదకొంగు జారీనంటాను
వేయరాదా తెర నీవు వెలఁదిసిబ్బితి వాయ
ప్పాయపుమదాన వింత పచ్చిసేయనేఁటికి ॥సంగ॥

వూడిగాలు చేయఁజూచి వొగ్గి కొంకీఁ దెలియ
వేడుకతో పోఁకముడి వీడీనంటాను
మేడలోని కేఁగరాదా మెలుఁతవెరపు దీర
కోడెతనమున వింత గోరసేయనేఁటికి ॥ సంగ ॥

చేపట్టి తియ్యఁగఁబోయి చింతించీఁ దెలియ
పూవులకొప్పు వదలి పొరలీనంటా
వోవరిలోఁ గూడరాదా వువిద సంతసించఁగ
శ్రీవేంకటేశుఁడ ఇంత చిమ్మిరేఁచనేఁటికి ॥ సంగ ॥ 403

## ఆహిరి

ఊరకుండుటే నాకు వుచిత మీవేళ; గాక
యీరసాన సారెసారె యెట్టు సాదించేను ॥ పల్లవి ॥

కపటాన ఇంతులఁ గలసినవాఁడవు
నెపములు చెప్పఁగనేరవా నీవు
కపురై నీమోమున కళలు నిండుకుండఁగ
అపరాధాలు నిన్ను నేమని యెంచేను ॥ ఊర ॥

వలచి కాముకుఁడవై వచ్చినట్టివాఁడవు
మలసి ఆనవెట్టక మానేవా నీవు
మెలుపుమచ్చెములు నీమేన నిండివుండఁగ
తలమోచి యెన్నెన్ని తప్పులు వట్టేను ॥ ఊర ॥

గరిమఁ గాఁగిట నన్నుఁగలసినవాఁడవు
నిరతమై ఇన్నిటా మన్నించవా నీవు
తెరలి శ్రీవేంకటేశ దిష్టమై నీవుండఁగ
కురులంటేసీయం దెట్టు కొఱత లెంచేను ॥ ఊర ॥ 404

గౌళ

మమ్మునెట్టు దలఁచేవు మనసునను
యెమ్మెల నెక్కుడౌతా నెఱఁగక వుంటివి ॥పల్లవి॥

కలకల నవ్వునవ్వి కప్పురము చేతికిచ్చి
మొలకచన్నులవాఁడిమొనలు మోపి
కలికితనాల నిన్ను కరఁగించఁగా నట్టె
యెలమి నిన్ను నీ వెఱఁగకవుంటివి ॥మమ్ము॥

అందపుమాటలాడి ఆయములు గోరనంటి
పొందికల పరపుపై పొద్దులు వుచ్చి
పందెములాడుచు నాపె భ్రమయించఁగా నట్టె
యెందునుఁ గిందునుమీఁదు నెఱఁగక వుంటివి ॥మమ్ము॥

పెనఁగి సారెసారెకు బిగ్గిఁ గాఁగిలించుకొని
వొనర శ్రీవేంకటేశ వొద్దికఁ గూడి
అనువునఁ దాఁ దవిసి అప్పణియ్యఁగా, మమ్ము
యెనసితి విఁదాఁకా న దెరఁగక వుంటివి ॥మమ్ము॥ 405

శంకరాభరణం

కంటివిగా వోయి నీకాంతలాగులు
వెంటవెంట వచ్చి యేల వేసాలు నేసీని ॥పల్లవి॥

చెంగట నీతో నవ్వి చెక్కులు నొక్కితినంటా
యింగితాన నీకె నాతోనేల పోరీని
కొంగువట్టుకొని నిన్నుఁ గొసరితినంటాను
జంగిలిగా దూరి యేల సాదించీని ॥కంటి॥

పరగ నిన్నుఁ గాఁగిటఁబట్టి పెనఁగితినంటా
విరసాన నీపె యేల వెంగెమాడీని
కరఁగించి నాపయ్యదఁ గప్పితి నీమేనంటా
సరికిబేసికి నేల జంకించీని ॥ కంటి ॥

గుట్టున నే నిన్నుఁ గూడి కొసరితి నంటాను
వుట్టిపడ నీపె యేల వుప్పటించీని
అట్టె శ్రీవేంకటేశ ఆపెఁ గూడితివి తొల్లె
నట్టనడుమఁ దానేల నవ్వు నవ్వీని ॥ కంటి ॥ 406

నాదరామక్రియ

రమణునితోడనే నీరాజసమెల్లాఁ జూపేవు
సముకాననే వలపు చల్లవద్దా నీవును ॥ పల్లవి ॥

గద్దరిచూపులు చూచి కాఁకలేల సేసేవు
అద్దుకొని పతి కిచ్చకా లాడరాదా
పెద్దరికాన నతఁడు ప్రియములు చెప్పఁగాను
సుద్దుల మంచితనము చూపవద్దా నీవును ॥ రమ ॥

వెక్కసపు నవ్వు నవ్వి వెంగెము లేలాడేవు
చెక్కునొక్కి కడుఁబొందు సేయరాదా
చక్కఁదనాల నతఁడు చనవులు మెరయఁగా
ఇక్కువైనమోవితేనె ఇయ్యవద్దా నీవును ॥ రమ ॥

ఆరీతిఁ బంతములాడి ఆనలేల పెట్టేవు
తారుకాణగా రతులఁ దనుపరాదా
యీరీతి శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నింతలోనె
మేరమీర కిపుడిట్టె మెచ్చవద్దా నీవును ॥ రమ ॥ 407

రామక్రియ

ఏమి నీవాళ్లఁ గల్లలేమైనాఁ గలవో
చేముంచి కొనరరాఁగా శిరసువంచేవు ॥ పల్లవి ॥

యెదురుగా వచ్చి నీకే యితవు సేయరాఁగా
చెదరుచు నీవేల చిన్నఁబోయేవు
వెదకి వచ్చి నీకు విడెము నే నియ్యరాఁగా
పెదవులు దడిపి సిబ్బితిఁ బొందేవు ॥ ఏమి ॥

వొద్దనే కూచుండి విన్ను వుపచరించరాఁగా
అద్దుక ప్రియాలు చెప్పే వప్పటి నీవు
సుద్దులు చెప్పుచు నీతో చుట్టరికానకు రాఁగా
కొద్దిమీర నీకునీవే కొంకి లోఁగేవు ॥ ఏమి ॥

కాఁగిలించుకొని నీతో కాఁపురము సేయరాఁగా
మాఁగినమోవిగంటికి మరఁగిదేవు
చేఁగదేరఁ గూడి మొక్కి శ్రీవేంకటేశ నే రాఁగా
[1] వేఁగాటిపిఱుఁదు చూచి వెరగందేవు ॥ ఏమి ॥ 408

రేకు 1369 కన్నడగౌళ

వాపితో బ్రదికేయట్టివనిత నేను
సేసవెట్టినవాఁడవు సేపినట్టు సేయరా ॥ వల్లవి ॥

సాటివెట్టవద్దు[2] గానిసతులతోడుత నన్ను
పాటించి నీతొత్తుఁజేసి పనిగొనరా
మాటల కోరువఁగావిృమనసులోఁగలట్టెల్ల
చీటికిమాటికి నీవు చేఁతలెల్లఁ జేయరా ॥ వాపి ॥

---

1. వేఁగు అయిన అమనర్థములో 'వేఁగాటి', 'పొదుగాటి' వలె వ్యావహారికము కాతచ్చు.
2. 'సాటిబెట్టవద్దుగాని' అని కూడ మార్చవచ్చును. కాని అంత రుచి కనపడలేదు.

వంకలాడవద్దుగాని వంతులసతులలోన
కొంకులేక నీపాదాన కోరి చిమ్మరా
బొంకులకు నోపఁగాని పొరుగిరుగులు మెచ్చ
సంకెలేక నీయిచ్చలం సాదించరా ॥ వాసి ॥

మేకుసేయవద్దు గానిమెలఁతలయెదుటను
పైకొని నీబలిమెల్ల పచరించరా
యీకడ శ్రీవేంకటేశ యెననితి విట్టె నన్ను
చీకాకులకుఁ జాల చేకొని మన్నించరా ॥ వాసి ॥ 409

## మంగళకౌసిక

తరుణికి మేర మీరఁ దగవౌనటే
వొరసి యాతఁడు గాఁగా నోరిచె నింతేసికి ॥ పల్లవి ॥

చలము సాదించేవు సరసములాడుతానే
చెలువుఁ దేమో తొల్లి సేసెనంటాను
మెలఁగి పెనఁగఁగానే మేనెల్ల జీరలువారె
వొలసి యాతఁడు గాఁగా నోరిచె నింతేసికి ॥ తరు ॥

నారువేసేవు కోపము నవ్వులు నవ్వుతానే
తేరకత్తె నెవ్వతెనో తెచ్చెనంటాను
చేరి మాటలాడఁగానే చిల్లులువోయఁ జిత్తము
పూరకే యాతఁడుగాఁగా నోరిచె నింతేసికి ॥ తరు ॥

గయ్యాళించేవు రతులఁ గాఁగిటఁ గూడుతానే
నెయ్యపువిద్య లేదనో నేర్చెనంటాను
ఇయ్యెడ శ్రీవేంకటేశుఁ డెనయఁగా నేలసే-
వొయ్యనే అతఁడుగాఁగా నోరిచె నింతేసికి ॥ తరు ॥ 410

దేసాళం

ఏమయ్యా రట్టుసేసే వింతకుఁ గలమా నేము
    జాముజాముకు నిన్ను జరసేటివారమా ॥ పల్లవి ॥

చవవియ్యఁగా నీతో నరి మాటాడితిఁగాక
    కివిసితే నిన్ను పలికించఁగలమా
    వవితలము కొసరేవార ముంతేకాక
    పెనఁగి బత్తి గొట్టానఁ బెట్టఁగలమా ॥ ఏమ ॥

చెక్కు నొక్కఁగా నీతో నెలవి నవ్వితిఁగాక
    దిక్కరించితే వోజకుఁ దేఁగలమా
    ఇక్కువ నున్నవారము ఇచ్చాడఁగలముగాక
    గుక్కక వట్టివేడుక [1]కొనవేయఁగలమా ॥ ఏమ ॥

నీవే నన్నుఁ గూడఁగాను నిందుకవుండితిఁగాక
    దేవరవలె నుంటే బోధించఁగలమా
    శ్రీవేంకటేశ నేము సిగ్గుతోవారము గాక
    వోవరిలోపలిపొందు వాడఁబెట్టఁదగునా ॥ ఏమ ॥ 411

శ్రీరాగం

చుట్టిచుట్టి మొగమేమి చూచేవు నీవు
    దిట్టవై నీలో నీవు దెలుసుకోరాదా ॥ పల్లవి ॥

మగఁడ వెంతసేసినా మచ్చరము నాకు లేదు
    నగవు రాకమానదు నాసెలవికి
    అగడు సేసితివంటా అందుకు నీవు దూరేవు
    విగిడిన నీచేఁతలు నీవు మానరాదా ॥ చుట్టి ॥

1. 'కొనవాఱు' వలె 'కొనవేయు' చిగురించుట అర్థము.

కొంక కెవ్వతెఁ దెచ్చినా కోపము నాకు లేదు
జంకించక మానవు నాజంటబొమ్మలు
అంకెకత్తె నైతినంటా అప్పటి నుప్పతించేవు
సంకెదీర నీకునీవే సాదవు గారాదా ॥ చుట్టి ॥

వలపెందుఁ జల్లినాను వైరము నాకు లేదు
సొలయక మానవు నాసూటిమాఁటలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి గబ్బివంటా
తొలుతనే యీసుద్దులు తలపెట్టరాదా ॥ చుట్టి ॥ 412

మాళవి

ఇందరిలోనానైతే యేమనీ నాపె
కందువ నడుగరాదా కానుక లిచ్చీని ॥ పల్లవి ॥

వోరసివోరసి నీవు వొకటొకటాడఁగాను
శిరసువంచుక చెలి సిగ్గువడీని
గరిసించ యీడనేల కాంక్ష నీకుఁ గలితేను
తెరలోని కేఁగరాదా తెలిపి చెప్పితిని ॥ ఇంద ॥

నడుమనడుమ నీవు నవ్వులెల్లా నవ్వఁగాను
చిడుముడితో నాపె సిగ్గువడీని
పెడరేఁచ ని(విం?)తయేల ప్రియము నీకుండితేను
వడిఁ బాన్పు చేరరాదా వన్నెలునేసీని ॥ ఇంద ॥

చెలఁగిచెలఁగి నీవు చేఁతలెల్లాఁ జేయఁగాను
జిలిబిలితనముతో సిగ్గువడీని
వలపు నీకుఁ గలితే కలసి శ్రీవేంకటేశ
తలుపు మూసుకోరాదా దైవారీఁ బనులు ॥ ఇంద ॥ 413

సాళంగం

ఒకటుండఁగాను వేరొకటి సేసేవు నీవు
ప్రకటించి వింతవారు పైపై నిన్నాడరా ॥ పల్లవి ॥

నానఁబెట్టి నానఁబెట్టి నాతో మాఁటలాడేవు
కానుకిచ్చినట్టియాపె కాచుకుండఁగా
వూనినవలపులతో వొడివట్టి పెనఁగేవు
మేనుమేనుసోఁక(కి?)నాపె మెరసివుండఁగాను ॥ ఒక ॥

చిరుముదితోడుత చేఇవట్టి తీసేవు
కడుఁబాదాలొత్తేయాపె కాచుకుండఁగా
వడియుఁజెమటలతో వలపులు చల్లేవు
బడిబడినున్నయాపె బాఁతిపడఁగా ॥ ఒక ॥

నమ్మించి శ్రీవేంకటేశ నన్ను నిట్టె యేలేవు
రొమ్ముమీఁదనున్నయాపె రుచులియ్యఁగా
చిమ్ముచు మోవితేనెలు సేనలుగాఁ జిందేవు
రమ్మనిపిలిచినాపె రతియియ్యఁగాను ॥ ఒక ॥ 414

రేకు 1370 దేశాక్షి

అవిభునికిఁ జెప్పకు మంగనరో యీసుద్దులు
యీవల తానే తెలిసీ యెరిఁగించవలెనా ॥ పల్లవి ॥

సతి నీవు పొఁ(పొం?)దైతే సగఁబాలిదాన నేను
అతనితో చండివోరేయట్టిదాననా
ఇతవుగా నవ్వితే విందుకులోనే నేను
మతకాన సాదించి మట్టుపెట్టఁగలనా ॥ అవి ॥

తొయ్యలి సేసవెట్టితే తొలుతటిదాన నేను
గయ్యాళించి యాతని గాతసేసేనా
ఇయ్యకొని మొక్కితేను ఇందుకులోనే నేను
కొయ్యతనమున రేఁగి కొంగంటఁగలనా ॥ అవి ॥

కొమ్మ నీవు గూడితేను కుడిపక్కదాన నేను
రమ్మవి శ్రీవేంకటేశు రచ్చవేసేనా
ఇమ్ములఁ గలపితివి ఇందుకులోనే నేను
యెమ్మెల కాతవితోడ యెడవాయఁగలనా ॥ అవి ॥ 415

నారాయణి

కామివి విధానమై కలిగె నీకు
నేమెల్లాఁ బొగడఁగా నీదివో బదుకు ॥ పల్లవి ॥

మొగము చూచి నవ్వి మొనగోరు దాఁకించి
చిగురుమోవితేనె చిమ్మిరేఁగఁగా
వొగరుమాట లాడి వొడివట్టితీసె నాపె
నెగడినజాణఁడవు నీదివో బదుకు ॥ కామి ॥

విరులదండ వేసి వేడుకతో సన్నసేసి
పరగ నీమీఁదటిపాటలు వాడి
పరిమళములు పూసి బలిమితోఁ బెనఁగె
విరతి నెరజాణవు నీదివో బదుకు ॥ కామి ॥

పీదెము చేతికిచ్చి పీఁపుమీఁదఁ జేయివేసి
వాడుదేరఁ గూడె నాపె వన్నెలుసేసి
యీడనె శ్రీవేంకటేశ యెనయించె నన్ను నీతో
నీడనుండే సుకించేవు నీదివో బదుకు ॥ కామి ॥ 416

రామక్రియ

నేము నీ కితవైనట్టే నేరుచుకొనేమయ్యా
మోము చూచి మంచితనములకు లోఁగావు ॥ పల్లవి ॥

వొక్కమాటే యాపె నీతో వుద్దండాలు నేసినేసి
మొక్కలానఁ దిట్టితేనే మోహింతువు
వెక్కసాన నేమెంత వినుతులు నేసినాను
కక్కసమేగాని మతి గరఁగదు ॥ నేము ॥

వాసిరేఁచుకొని యాపె వచ్చినప్పుదే విన్న
చేసోఁక నవ్వితేనే చెలఁగుదువు
సేసవెట్టి నేమెంత సేవలెల్లాఁ జేసినాను
ఆసలు పైపైనేకానీ ఆయములు సోఁకవు ॥ నేము ॥

అట్టుగా నాపె కాఁగిట నట్టె రసము లొలుక
చుట్టి పట్టి కూడితేనే చొక్కుదువు
యిట్టె శ్రీవేంకటేశ యితవుగా నేఁ గూడితి
గట్టిప్రియములేకాని కాదనఁగఁజాలవు ॥ నేము ॥ 417

వరాళి

మంకుఁదన మేమిటికి మగువలకు
అంకెకు వచ్చి యిచ్చకమాడరాదా యిపుడు ॥ పల్లవి ॥

నగేటిపతితో మాకు నగక వుండితేను
యెగసక్కెమై వుండదా యెవ్వరికైనా
వెగటేమి గలిగినా వెనక సాదింతుగాని
మొగము చూపి చేయెత్తి మొక్కరాదా యిపుడు ॥ మంకుఁ ॥

పలుమారుఁ బిలువఁగఁ బలుకకవుండితేను
అలిగినట్టుండదా అందరికిని
మలసి నీచలమెల్లా మాపు చూపుదువుగాని
యెలమిఁ జేతికి పీడెమియ్యరాదా యిపుడు ॥మంకుఁ॥

ఆతఁడు గాఁగిలించఁగా నట్టె కాఁగిలించకుంటే
యేతులని యెంచరా యింతులెల్లాను
యీతల శ్రీ వేంకటేశు నింకాఁ గూడుదువుగాని
చేతనైనపాటి సేవసేయరాదా యిపుడు ॥మంకుఁ॥ 418

పాడి

ఏమి చెప్పేరే బుద్ధులు ఇద్దరు నొక్కటే తాము
సాము లెంత సేసినాను చనవులై వుండు ॥పల్లవి॥

చెలువపురమణుఁడు సేఁత లేమిసేసినాను
యెలమి మోహించువింతి కింపులై వుండు
తలఁచుకొంటే నవే తగులాయములై వుండు
కలిమితో మేనికి సింగారములై వుండు ॥ఏమి॥

ననుపైననాయకుఁడు నవ్వులెవ్వి నవ్వినాను
యెనసినకామినికిఇంపులై వుండు
తనివోనివేడుకకుఁ దరితీపులై వుండు
పెనఁగినప్పుడెల్లాను ప్రియములై వుండు ॥ఏమి॥

యీరీతి శ్రీవేంకటేశుఁ డెంత కాఁగిలించినాను
యీరసములెల్లా మాని ఇంపులై వుండు
తారుకాణలై వుండు తమకములై వుండు
వూరేటియమృతమెల్లా వుట్టిపడి వుండు ॥ఏమి॥ 419

లలిత

అద్దమరాతిరికాఁడ అలపు చూడక వచ్చె
  వొద్దికతోఁ బీఁటపైఁ గూచుండఁబెట్టుకోవయ్యా ॥ పల్లవి ॥

సారె జాఱుఁదురుముతో సతి సీఁతఁటికి రాఁగా
  జీరల చెమటగారీఁ జెక్కులవెంట
  చేరి సురటి విసరి చెంగలువలు ముడిచి
  గారవించి పరపుపైఁ గాఁగిలించుకోవయ్యా ॥ అద్ద ॥

పయ్యదకొం గెదలఁగఁ బరువున రాఁగాను
  కయ్యమడిచీఁ జన్నులు కదలఁగను
  చెయ్యి వురమున మోపి చెంగావిదుప్పటి గప్పి
  వుయ్యాలమంచము మీఁద వొద్దికచూపవయ్యా ॥ అద్ద ॥

గందపుబొట్టు గరఁగ కలసి విన్నంటరాఁగా
  చిందేటిమోవితేనెలు చిప్పిలీని
  కందువ మోవి యాని కస్తూరి నుదుటఁ బూసి
  పొందుల శ్రీవేంకటేశ పొసఁగించుకోవయ్యా ॥ అద్ద ॥ 420

రేకు 1371 ద్రావిళభైరవి

మందాటా లిఁకనేల మాపుదాఁకాను
  వుండినయట్లనే వొనగూడుమనవే ॥ పల్లవి ॥

మనసులో కపటాలు మతకరిమాటలు
  కనుఁగొన్నయప్పుడే కానరాదా
  తనకేఁటియానలు తగదనే వారెవ్వరు
  మనలో చుట్టరికాన మన్నించుమనవే ॥ మందా ॥

తిరిగేటితిమ్మటలు తెమలనివేసాలు
గరువపునవ్వులోనే కానరాదా
సిరినేల వొడఁబాటు [1]చాలున(చెల్లద?)నేవారెవ్వరు
కరుణగలిగినట్టే కయికొనుమనవే ॥ మందా ॥

రాఁగినచలములు రమించేవలపులు
కాఁగిటిలోననే కానరాదా
మాఁగఁబెట్టనేల మోవి మరిగి నన్నిటు గూడె
దాఁగక శ్రీవేంకటేశు దయఁజూడమనవే ॥ మందా ॥ 421

మంగళకౌసిక

వెసఁ గాఁపురము సేయ విచ్చనలి(వి?)డి
ముసగసలేఁటికి ముదితలతోడను ॥ పల్లవి ॥

గరిమ గుఱుతు చెప్పఁగానే చుట్టరికమాయ
తెరమఱుఁగుకు రాఁగా తేరె వావి
తరుణికి నీకును తగులు కాముఁడే సేసె
శిరసువంచుక యేల సిగ్గువడేవు ॥ వెసఁ ॥

తప్పకచూడఁగానే దైవారెఁ బొంతనాలు
చిప్పివి విడేలియ్యఁగాఁ జేకూరెఁ బెఁడి(బెండ్లి?)
కప్పురగందికి నీకుఁ గంతుఁడే వొజ్జలాయ
అప్పటి ఇంకానేల అనుమానాలయ్యా ॥ వెసఁ ॥

పానుపుపైఁ బండఁగానే పలియించె సంసారము
నానె శ్రీవేంకటేశ నీనవ్వులమోవి
మానవతికివి నీకు మరుఁడే సేస లందిచ్చె
పూనిపట్టి మరియేల బోదించ నిపుడు ॥ వెసఁ ॥ 422

1. యతిభంగము.

పాడి

గడుసవంటా విన్ను కన్నవారెల్లా నాదేరు
జడిగొని యాదరించఁగవద్దా నీవు ॥ పల్లవి ॥

చెలఁగి తొలుత నీతో సెలవుల నవ్వె నాకె[1]
కలువపువ్వుల వేసె కమ్మటి నాకె
పిలిచి పెదవులవే(నేఁ) ప్రి(బ్రి?)యములు చెప్పె నాకె
మెలఁగి యిఁ(యిం?)తటనైనా మెచ్చవద్దా నీవు ॥ గడు ॥

సారెకు మోవి చూపి చవులుసేసె నాపె
కూరిమి గొసరి గోరగీరె నాపె
ఆరీతి వేరుసేయకుమని విడెమిచ్చె నాపె
నీరతులఁ దవిపి మన్నించవద్దా నీవు ॥ గడు ॥

గక్కనఁ గాఁగిటఁ గూడి కడుఁ బచ్చిసేసె నాకె
లక్కవలెఁ గరఁగించి లాలించె నాకె
యెక్కువ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
విక్కమును నీదయే నించవద్దా నీవు ॥ గడు ॥ 423

వరాళి

పచ్చలాయకట్టినట్టు బయలు వందిలైనట్టు
గచ్చులెన్నైనాఁ గలవు కైకొనేముగాక ॥ పల్లవి ॥

మచ్చిక నీమాఁటలు దీమపుమెకమువంటివి
కుచ్చితాన మెల్లనే తగులఁదీసేవు
పచ్చివెచ్చియైయుందు పడఁతులకెల్లాను
యెచ్చరి నీవాడినట్టె యియ్యకొంటగాక ॥ పచ్చ ॥

---

1. పాదాంతమందలి గీత లేదు.

మాయల నీ నవ్వు లివి మచ్చుమేపులవంటివి
చాయల సన్నల నాసాని(న?)లఁ బెట్టేవి
మూయక మూసినట్టుండు ముద్దరాండ్లకెల్లాను[1]
తోయక నీకిచ్చలాడదొరకొంటగాక ॥ పచ్చ ॥

చెనకేనీకాఁగిలి జిగురుఁగందెవంటిది
అనువుగాఁ జొక్కించి అంటుకొనేది
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
తనిసి వేడుక లోలో దైవారుటగాక ॥ పచ్చ ॥ 424

## మాళవిగౌళ

ఎవ్వ రేమవిరి నిన్ను యేల వేగిరపడేవు
జవ్వనపు మంకులేల చాలు నుండవయ్యా ॥ పల్లవి ॥

పంతపుమాటలకేమి పైపై నీ మోహము చూచితే
కాంతుఁడ నీగుణమెల్లాఁ గానరాదా
అంత కోపకాఁడవా అన్నిటా మంచివాఁడవే
సంతరొాదలేల యీడఁ జాలు నుండవయ్యా ॥ ఎవ్వ ॥

వొట్టులు వెట్టుకోనేల వొట్టే నించుక వుండితే
యిట్టె నీసరితలెల్లా నెఱఁగరాదా
గట్టువాయవాఁడవా కడునేరుపరివే
జట్టి తరితీపులేల చాలు నుండవయ్యా ॥ ఎవ్వ ॥

నేమము వలుకనేల నేఁడు నిన్నుఁ గూడితిమి
దీమసపునీవలపు తెలియరాదా
గామిడివాఁడవా శ్రీవేంకటగిరి దేవుఁడవే
సాములు బిగువులేల చాలు నుండవయ్యా ॥ ఎవ్వ ॥ 425

---

1. పాఠాంతమందలి గీత లేదు.

ఆహిరి

కన్నియ ముద్దరాలు కదుఁబిన్న
    యెన్నిక నీకాతరాన కింత కోపునా ॥ పల్లవి ॥

చెక్కులవెంటఁ గారీ చెలియకుఁ జెమటలు
    అక్కరతో రతి నెంత యలయించితివో
    ముక్కున విట్టూర్పులు మునుకొని రేఁగెను
    పెక్కువిధముల నెంత పెనఁగితివో ॥ కన్ని ॥

మదమెలదాఁకా వీదె మగువ నెరిఁగురులు
    తడవి యెంత సదమదము నేసితో
    కదఁగి కస్తూరి బొట్టు కదుఁజిందువందులాయ
    అదరి మర్మము లెంత అంటితివో ॥ కన్ని ॥

చిమ్ముచుఁ గన్నుల నదె చిందీ నిద్దుర లింతి
    యెమ్మె జాగర మెంత నేయించితివో
    కమ్మి శ్రీవేంకటేశుఁడ కాఁగిలింపించుకొంటివి
    కిమ్ముల సిగ్గు లెంతేసి కెరలించితివో ॥ కన్ని ॥ 426

రేకు 1372 పళవంజరం

ఏల కోపగించి చూచే వీతవిదిక్కటే నీవు
    తాలిమి నేసుకొంటేఁ బంతముదప్పీనా ॥ పల్లవి ॥

వెక్కసపుఁగొ ప్పతఁడు విడిచితే నేమాయ
    పెక్కునెరిఁదుమ్మిదలు బెదరీనటే
    పిక్కటిల్లఁగుచములు పిసికితే నేమాయ
    యిక్కువ నందలిబిగు వింతలో మానీనా ॥ ఏల ॥

వొప్పుగా నాతఁడు నీవొడివట్టితే నేమాయ
మప్పిరి నీపోఁకముడి ముద్రదప్పినా
అప్పటిఁ బిరుఁదు చేతనంటితే నేమాయనే
గొప్పతన మంతలోనే కొంచమయ్యీనా ॥ ఏల ॥

శ్రీవేంకటేశుఁడు గోరఁ జెనకితే నేమాయ
వోవల నీపులకసనులు వంగినా
కైవశముసేసుకొని కలసితే నేమాయ
నీ వలమేల్మంగ వాతవికి జంటగాదా ॥ ఏల ॥ 427

పూర్వగౌళ

అందరివలెనే చూచే వప్పటి నన్ను నీవు
సందడి మందమిరేలు చల్లఁగా నేను ॥ పల్లవి ॥

సరసములాడుతానే చలము సాదించె నాపె
యిరవై తి నింతసేయ నే నోపఁగా
తరుణి పాదాలొత్తుతా తానే తాఁకించే గోరు
వొరసి మేరలుదప్ప నోపఁగా నేను ॥ అంద ॥

కదిసి మాటాడుతానే కాఁకలురేఁచె నాపె
యిదివో నేనై తేను ఇంతకోపఁగా
చదురంగమాడుతానే సారెసారె నిను దిట్టె
వుదుటున గాతసేయ నోపఁగా నేను ॥ అంద ॥

గారవానఁ గూడుతానే గంటిసేసె మోవి యాపె
యీరీతి నిన్ను జరయ నింతకోపఁగా
కోరి శ్రీవేంకటగిరిగోవింద నన్నేలితివి
వూరకే నిన్ను దూరనోపఁగా నేను ॥ అంద ॥ 428

మంగళకౌసిక

ఆకెఱుఁగు నీవెఱుఁగు దంతేసి మాకననేల
సాకిరి యడిగితేను సముకాన నాదేము ॥ పల్లవి ॥

చలములు నీతోను సాదించ నాకేమిటికి
[1] చెరి(లి?)వద్దికిఁ బోరాదా చెప్పీఁగాని
యెలమి నీ వెక్కడనో యేమేమో నేసితివట
కొలఁదితో నవీఁ గొన్ని కొంతగొంత వింటిమి ॥ ఆకె ॥

యెదుటనే మోవిచొప్పు లెత్తఁగ మాకేమిటికి
సుదతి నడుగరాదా చూపీఁగాని
బెదరించనేల నీకు ప్రేమ మెందో వున్నదట
అదనఁ బొరుగువారు ఆడఁగానే వింటిమి ॥ ఆకె ॥

వేమారు విన్ను మాకు వెరపించనేమిటికి
కోమలికి మొక్కరాదా కూడీఁగాని
నేమపుశ్రీవేంకటేశ నీవే యాకె నేలితట
కామిను లిందరునుఁ బొగడఁగా వింటిమి ॥ ఆకె ॥ 429

తెలుఁగుఁగాంబోది

ఇంతి నీకు మీఁదెత్తి ఇట్టే వలపు
కాంతుఁడ చేకొనవయ్య కడలేనివలపు ॥ పల్లవి ॥

చిగురుఁగత్తిపైదార చిమ్మిరేఁగేవలపు
బిగువునామనివేళ పెడరేఁచేవలపు
మొగిలు కన్నులఁ గంటే మొనచూపేవలపు
విగిడి పూవుటమ్ముల విండువాఁడివలపు ॥ ఇంతి ॥

1. ప్రాసభంగము.

చూపులంటితేనే వొళ్లు జుమ్మురనేవలపు
యేపుమాటలనే నాములెక్కేటివలపు
పైపై నెలవినవ్వుల భ్రమయించేవలపు
కాపైనవెన్నెలలోవికడువేఁడివలపు ॥ ఇంతి ॥

పానుపుపైఁ గూడితేనే పచ్చి చూపేవలపు
పూవినమోవితేనెకు పొత్తుసేసేవలపు
కానుకై శ్రీవేంకటేశ కాంత విట్టె యేలితివి
నానీ నీమన్ననలను ననుపైనవలపు ॥ ఇంతి ॥ 430

నాదరామక్రియ

మట్టుమీర నేమిటికి మాకు నీసేవే చాలు
చుట్టాలమే యెట్టుండినా సొరిది నీ కెపుడు ॥ పల్లవి ॥

చిల్లర పొందులెల్లాను జీరలై నీమేన నంటె
వెల్లవిరిఁ దుడిచితే వెసఁ బోవునా
పల్లదాన నాకొంగు పట్టేవు నీ వప్పటివి
వొల్లమయ్య అంటించుకోనోపము నీమేనివి ॥ మట్టు ॥

కిమ్ములవారిమాటలు కెంపులై నీమోవి నంటె
అమ్మరో యెంతదాఁచినా నణఁగుండీనా
చిమ్ముచు మాతో నీవు చేరి నవ్వే వప్పటివి
వొమ్మునా మాకింతేసి నీవొళ్లిసింగారములు ॥ మట్టు ॥

చిత్తజరతు లేదవో చెమటలై మేనఁ గారీ
వొత్తి యెంత దుడిచినా వూరకుండీనా
ఇత్తల శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
వుత(త్త?)ఱుపై వుండీనా నీవొద్దినయాసలకు ॥ మట్టు ॥ 431

గౌళ

మీకిద్దరికే తెలుసు మీరివచ్చేపనులు
సాకిరి వితరులకు చక్కఁబెట్టరాదు ॥ పల్లవి ॥

చలపాదివాని నంత వంచపెట్టఁబనిలేదు
చెలరేఁగి ఇచ్చకమే సేయవలెను
వెలకొన్న రమణివి నీవు నట్లానైతేను
పొలఁతుల కింక మరి బుద్ధిచెప్పరాదు ॥ మీకి ॥

మంకువోజవానితోడ మచ్చరించఁబనిలేదు
అంకెకు వచ్చివట్టెల్లా నాదవలెను
సంకెలేక నీవూ నాజాడలనే మెలఁగితే
పొంకపుఁజుట్టాలకు బుద్ధిచెప్పరాదు ॥ మీకి ॥

దొరపాటివానితోడ దూరఁగఁబనిలేదు
యిరవై శ్రీవేంకటేశుఁ దేలె నిన్నును
సరిగా నీవూ నట్టే సమరతి నొత్తితేను
పొరుగిరుగువారికి బుద్ధిచెప్పరాదు ॥ మీకి ॥ 432

రేకు 1373 ముఖారి

ఇదివో ఇప్పటిమాట ఇంకా నేమేమి గలవో
యెదుట నే నిట్టే పంతమిచ్చితినంటివట ॥ పల్లవి ॥

మచ్చికతో నీవు నాకె మంతనము లాడుకోఁగా
వచ్చి నాతో పొంచువిన్నవారు చెప్పిరి
ఇచ్చి నీచెక్కులమీఁద గోరుదీయిమంటివట
వచ్చి యాపెకే నీవు వలతునంటివట ॥ ఇది ॥

పన్ని నీవు నాపెను బానలు సేసుకోఁగాను
కన్నవారే నాతో నీకడఁ జెప్పిరి
సన్నల నెదురాడవిచవ విస్తినంటివట
చిన్నైనాఁ బెద్దదేవులఁ జేసేనంటివట ॥ ఇది ॥

అడ నాపెఁ గూడి నాకై అప్పణ లిప్పించుకోఁగా
వూడిగపువారే నావొద్దఁ జెప్పిరి
జాడల శ్రీవేంకటేశ సరిగా నన్నేలితివి
వోడక యిందూ నందూ వుండేనంటివట ॥ ఇది ॥ 433

సాళంగనాట

ఇది యెంతగా బోదించె యెవ్వతో నీకు
అదనాయఁ దెరలోని కంకెల రావయ్యా ॥ పల్లవి ॥

పాదాలుపిసికేదాన పైపై నిందలాడేనా
లేదుసుమీ నీగుణాలు లెక్కవెట్టితి
సాదనై మొక్కేచేత సారె గోరుదీసేనా
సేదదేర మేలుతోడ చెక్కులు దువ్వితిని ॥ ఇది ॥

నీకు నాలనైనదాన నేఁ బంతాలు చూపేనా
వాకున సత్తువచూడవలె నంటివి
కైకొని మోవియిచ్చి కారములు చూపేనా
కోకొమ్మవి తేనెలకు గుంటలు సేసితిని ॥ ఇది ॥

వూడిగపుదాన నీపై వొగిఁ బాదము చాఁచేనా
వాడికరతుల నిన్ను వలపించితి
కూడితి శ్రీవేంకటేశ కొసరులు నెరపేనా
పీడెములోనివిందులు పీడుదోడాడితివి ॥ ఇది ॥ 434

హిందోళం

నీకేల వెఱపు నిన్నెవ్వ రేమని రీఁద
పోకలఁబో కాపె నిట్టె బోగించరాదా ॥ పల్లవి ॥

అంగన మాటలాడితే గాయములు గరఁగేవు
చెంగలించి చూచితేనే చెమరించేవు
ముంగిట విలిచితేను ముంచి పులకించేవు
పొంగినాస నీ కాపెను బోగించరాదా ॥ నీకే ॥

కందువల నవ్వితేను గక్కన భ్రమసేవు
అంది కానుకలిచ్చితే నలసేవు
సందడి నీకు మొక్కితే సారె నునురనేవు
పొందులుసేసు కీపెను బోగించరాదా ॥ నీకే ॥

వావులు నీకుఁ జెప్పితే వలపులు రేఁగేవు
చేవట్టి తీసితేనే చిక్కువడేవు
శ్రీవేంకటేశ్వరుఁడ చేరి నన్ను నేలితివి
బూవానఁబెట్టు కాపెను బోగించరాదా ॥ నీకే ॥ 435

సామంతం

ఒక్కపానుపుమీఁదనే వున్నార మిద్దరము
పక్కన వలపు యెట్టు పంచియిచ్చేవు ॥ పల్లవి ॥

కోరి నే మాటడుగఁగ గోర నాపె వూఁదఁగాను
యీరీతి విద్దరినంది నెట్టు చిక్కితి
నేరుపు చూతము నీవు నెరజాణఁడ వందురు
బారపువలపు యెట్టు పంచియిచ్చేవో ॥ ఒక్క ॥

నవ్వులు నే నవ్వఁగాను నాట నాపె మొక్కఁగాను
ఇవ్వల విద్దరిసంది నెట్టు చిక్కితి
జవ్వనపువాఁడవు చతురత నేరుతువు
పవ్వళించి వలపెట్టు పంచియిచ్చేవో ॥ ఒక్క ॥

సారె మోవి నే నానఁగ చన్నుల నాపె వొత్తఁగ
యీరీతి విద్దరిసంది నెట్టు చిక్కితి
కోరి శ్రీవేంకటేశుఁడ కూడితివి మమ్మిద్దరి
పైరులవలపు యెట్టు పంచియిచ్చేవో ॥ ఒక్క ॥ 436

## మధ్యమావతి

ధర నెఱఁగవా యీతగవు జాణఁడవు నీవు
సరసము విరసము సరిపెట్టఁదగునా ॥ పల్లవి ॥

కొసరికొసరి నిన్ను కొఁ(కొం?)గువట్టి తియ్యఁగాను
విసరి పూవులఁగావి వేసేవు
అసురుసురై యట్టె ఆఁటది వలచిరాఁగా
రసికుఁడు మొగవాఁడు రాయిడించఁదగునా ॥ ధర ॥

కలసి మెలసి నేను కందువకుఁ దియ్యఁగాను
వెలుపల నుండి నీవు విఱ్ఱవీఁగేవు
అలరుచు నాఁటది యీనలు పైఁజల్లఁగాను
బలిమిని మొగవాఁడు పంతమాడఁదగునా ॥ ధర ॥

కైవశమై నే నిన్ను కాఁగిటఁ గూడఁగాను
శ్రీవేంకటేశుఁడ నీవు సిగ్గువడేవు
చేవదేర నాఁటది చేరి మోవి ఇయ్యఁగాను
కావరించి మొగవాఁడు గంటిసేయఁదగునా ॥ ధర ॥ 437

ముఖారి

ఏఁటికి వేసాలు నేసే వెందాఁకాను
ఆఁటదాని దయఁజూచి యాదరించరాదా ॥పల్లవి॥

రతికి వేడుకపడి రమణి వద్దనుండఁగా
కతలేమి చేప్పేవు జాగరముగాను
యితవుగాకుంటే నానతియ్యరాదా వొకమాట
చతురత నాడీఁగాని చదరంగమైనను ॥ఏఁటి॥

జవ్వని మోవితేనె సారెసారె నడుగఁగ
నవ్వులేమి నవ్వేవు నాఁటకానను
చివ్వన నీవియ్యనంటే చేత వా(వ్రా?)సి చూపరాదా
తవ్వి వానగుంతలైనా తా నాడీఁగాని ॥ఏఁటి॥

చక్కనింతి గాఁగిలించి చన్నుల విన్నొత్తఁగాను
మొక్కులేమి మొక్కేవు మోపులుగాను
ఇక్కువ శ్రీవేంకటేశ యేలితి పందెమీరాదా
పక్కన నాడీఁగాని పగడసారైనను ॥ఏఁటి॥ 438

రేకు 1374 మేఁచబౌళి

అలిగివుండిననన్ను ఆయములంటీఁ దాను
నెలకొన్నకూటమికి నేనూఁ గావలెనా ॥పల్లవి॥

చుట్టరికములు సేయ సుదతు లెందరు లేరు
ఇట్టె పాదాలు వినుక నెందరు లేరు
వట్టనడుమ నవ్వులు నవ్వఁగ నెందరు లేరు
నెట్టుకొన వేఁడుకొనీ నేనూఁ గావలెనా ॥అలి॥

అంచెల సేవలుసేయ నప్పటి నెందరు లేరు
యెంచఁగ బంతికూటికి నెందరు లేరు
మించి విడేలందుకొను మెలుఁత లెందరు లేరు
నించి చెక్కులు నొక్కని నేనూఁ గావలెనా ॥ అలి ॥

పలచి దినదినము వరుస కెందరు లేరు
యెలమిఁ దన్నుఁబొగడ నెందరు లేరు
అలరి శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
నెలకొవి బుజ్జగించె నేనూఁ గావలెనా ॥ అలి ॥ 439

వరాళి

తాను సేసినపనులు దక్కవలెనంటాను
నావఁబెట్టుక లోలోనే నవ్వులు నవ్వీనే ॥ పల్లవి ॥

తగవులు చెప్పరాను తనను నేమీ ననరాను
మగువ సవతిగాఁగా మాటాడితినే
అగడు సేసితివంటా అదె నెపము సేసుక
పగటున పానుపుపై పవ్వళించియున్నాఁడే ॥ తాను ॥

వలపులు రేఁచరాను వాదులు వెట్టుకోరాను
చెలికత్తెగాఁగా నటు చెనకితినే
చలము సాదించెనంటా సాకిరు లందరిఁబెట్టి
వెలయఁగ దోమతెర వేసుకవున్నాఁడే ॥ తాను ॥

కల్ల మోపరాను తన్ను కరకరించరా నాకె
చెల్లెలుగాఁగాఁ బెండ్లి నేసితినే
ఇల్లిదె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను మీరెనంటా
పల్లదానఁ గాఁగిలించి పాయకున్నాఁడే ॥ తాను ॥ 440

సామంతం

ఏల సిగ్గులువడేవు యేమోయి
వేళతోఁ జనవిచ్చి వెసఁ గొనవోయి ॥పల్లవి॥

చెక్కుచేతితో నొకతె చింతలచిగురులమ్మీ
గుక్కకిట్టె వెలవెట్టి కొనవోయి
ముక్కుమీఁదివేలితోడ మోవిపండ్లమ్మీని
నెక్కొన్నవలపుతోడ నీవు గొనవోయి ॥ఏల॥

చలికప్పుచేతులతో సతి విమ్మపండ్లమ్మీ
కొలచినందె కొలచి కొనవోయి
వులివచ్చిసిగ్గులు వొడిఁబెట్టు కమ్మీని
విలుపుసరసమువ నీవు గొనవోయీ ॥ఏల॥

కమ్మకొన్ననవ్వులను కప్పురపులప్పలమ్మీ
కొమ్మను కాఁగిటిరతిఁ గొనవోయీ
నెమ్మది శ్రీవేంకటేశ నీవు వన్నెలితి వాకె
నేమ్మనములోనఁ గొంత నిండుకొనవోయీ ॥ఏల॥ 441

దేసాళం

వేతొకటిగాఁ జూడకు వేడుక నావూడిగము
మీటి నే విన్నవించి మెప్పించితి నిపుడు ॥పల్లవి॥

కోపగించుకోకుమీ గోరుదీసితినంటా
చేపట్టి రతెచ్చురక నేసితివింతే
చాపలానఁ గసరకు చన్నుల నొత్తితినంటా
రాపాడి నీవురము సింగారించితి నిపుడు ॥వేతొ॥

ముంచి యెగ్గుపట్టకుమీ మోవి గంటిసేసెనంటా
　　కొంచక బూవపుబొత్తు గూడితివింతే
　　పంచల జంకించకుమీ పట్టిపెనఁగితినంటా
　　పెంచపుసీసిగ్గు విడిపించితి నే విపుడు ॥ వేతొ ॥

గక్కున వలయకుమీ కాఁగిటఁ గూడితివంటా
　　పెక్కువిధముల మేలు పెంచితివింతే
　　పక్కన శ్రీవేంకటేశ పాయకుమీ దూరెనంటా
　　వెక్కసపునవ్వులు నవ్వితి నే విపుడు ॥ వేతొ ॥ 442

## శుద్ధవసంతం

ఇంక నోఁజకువచ్చినా యెంత బుద్ధిచెప్పినాను
　　బింకపుమోహాన రట్టు పెట్టితివి యీపెను ॥ పల్లవి ॥

వుంకించి నీవాడివట్టి వొకటొకటె విన్నాడీ
　　మంకుది; నీతో నెంత మందెమేళము
　　జంకించి నే నెడచొచ్చి సారెవద్దన్నా మానదు
　　తెంకి నింత రాఁగఁజేసితివి నీవే యీకెను ॥ ఇంక ॥

కొప్పువట్టి నిన్నుఁ దీసి కొసరీఁ గూరిములెల్లా
　　ఇప్పుడే నీతోడి; [1]నీకెంతగర్వము
　　చెప్పుచు నేఁ గసువన్నసేసినాఁ దా నెఱఁగదు
　　చిప్పిల గట్టువాయఁ జేసితివి నీ వీపెను ॥ ఇంక ॥

గోర గీరి కాఁగిలించి కుచముల నిన్నునొత్తి
　　తారసిల్లీ; తన కెంతదంటతనము
　　చేరి నిన్ను నెనసి సిగ్గువరచినఁ బోదు
　　మేరలు శ్రీవేంకటేశ మీరించితి వీపెను ॥ ఇంక ॥ 443

1. 'నీకె కెంత' అని యుండవచ్చునేమో.

**కుంతలవరాళి**

చదివితినందువు జాణనందువు
యెదుటఁ గొంచేవు రాజ్య మెట్ల నేలితివో ॥ పల్లవి ॥

ఆఁటదియైతేఁజాలు నట్టె చూచి భ్రమతువు
యీటుతోడ యెగ్గుసిగ్గు లెంచవు నీవు
పాటలువాడితేఁజాలు భ్రమసి చొక్కుదువు
వాఁటముగఁ; దొల్లి దొడ్డవాఁడ వెట్లనైతివో ॥ చది ॥

మొగము చూచితేఁజాలు మొక్కులే మొక్కుదువు
సొగిసి నవ్వేవారిఁ జూడవు నీవు
పొగడి మెచ్చితేఁజాలు పొందులెల్లాఁ జేతువు
తగవుతోఁ దొల్లి దొరతన మెట్లఁ జేతువో ॥ చది ॥

సరుసఁ గూచుంటేఁజాలు చలపట్టి కూడుదువు
సరవితో దొడ్డు గొంచము లెంచవు
గొరబై శ్రీవేంకటేశ కూడితివి వన్ను విట్టె
పొరిఁ దొల్లి గొల్లెతలభోగమెట్లఁ జేతువో ॥ చది ॥ 444

రేకు 1375 సౌరాష్ట్రం

అతివ నింత సేతురా అవునయ్యా
తతితో నవ్వులు రాఁగా తలవంచుకొనెను ॥ పల్లవి ॥

సింగారించుకొవి రాఁగా చిమ్మనఁగోవినీరు
అంగనపైఁ జిమ్మితివి అవునయ్యా
చెంగావిదువ్వటము చిప్పిలి యంటుకొంటే
అంగాలెల్లఁ గానరాఁగా నట్టె సిగ్గువడెను ॥ అతి ॥

కిన్నెర మీటుతా రాఁగా గిన్నెలఁ గప్పురధూళి
అన్నిటా ముంచిపోసితి వౌనయ్యా
వున్నతపుఁగొప్పు వీడి వొగిఁ గాళ్లఁ దొడరఁగా
కన్నులుమూసుక నిన్నుఁ గాఁగిలించుకొనెను ॥ అతి ॥

చెంది నీ కొప్పంటరాఁగా చెంగలువరేకులను
అందియంది వేసితివి అవునయ్యా
గొందినె శ్రీవేంకటేశ కూడి మేను చొక్కరాఁగా
సందడి నీపచ్చడము సరిఁ గప్పుకొనెను ॥ అతి ॥ 445

కాంబోది

ఇంతి నీవూ నాడుకోఁగా నేకాంతములెల్ల వింటి
దంతపుటింటిలోనివి దాఁచక చెప్పవయ్యా ॥ పల్లవి ॥

పూసగుచ్చినట్టుచెప్పేబుద్ధులెల్లా వింటివా
సేసవెట్టినట్టిపాలు చేకొంటివా
బాసడిగినట్టెల్లాఁ దప్పక నీవిచ్చితివా
ఆసుద్దులు వినవేడుకయ్యీఁ జెప్పవయ్య ॥ ఇంతి ॥

పాదా లాపె పిసుకఁగ పరిణామించితివా
ఆదిగొని పాడఁగాను ఆలించితివా
పాదులు గిలిగించఁగా పక్కన నవ్వితివా
కాదుకూడదన నేను కలట్టే చెప్పవయ్యా ॥ ఇంతి ॥

నరసములాడఁగాను చనవులిచ్చితివా
మెరసి వూడిగాలెల్ల మెచ్చితివా
యిరవై శ్రీవేంకటేశ యిటు వన్ను నేలితివి
అరుదాయ నాపెచేఁత లవియుఁ జెప్పవయ్యా ॥ ఇంతి ॥ 446

## ఆహిరి

చెక్కునొక్కి వేడుకొని చేతులెత్తి మొక్కే నీకు
నేక్కొన్నసీసతి నేను నేరము లెంచే(చ?)కుమీ ॥ పల్లవి ॥

మనసు నొవ్వదుగదా మగువను జంకించితే
ఘనమోహ మాపెమీఁదఁ గలదు నీకు
కనుఁగొంటే సవతులు గరిసించక మానరు
పనివడి అవెల్లా నీపైఁ బెట్టుకోకుమీ ॥ చెక్కు ॥

సిగ్గులువడవుగదా చెలి నేతువలెత్తితే
అగ్గలమై నీకెపుడు నాపె ప్రాణము
దగ్గరఁ గూచుంటే పడితలింతురు ఆఁడువారు
దిగ్గన నవెల్లా నీమీఁదికిఁ దీసుకోకుమీ ॥ చెక్కు ॥

సూడులువట్టవుగదా సుదతి నే పంగించితే
యీడ శ్రీవేంకటేశ నీకీపె చుట్టము
కూడితివి నను నిట్టె పాడి యెంతురు కాంతలు
వేడుకలవెల్లా నీవు వేసరుకోకుమీ ॥ చెక్కు ॥ 447

## రామక్రియ

అప్పుడే మఱతురా అంగనసేసినమేలు
చొప్పులెత్తఁగా నణఁచుట నీవెఱఁగవా ॥ పల్లవి ॥

ఆకడ నెవ్వతో విన్న నట్టె తుటారాలాడఁగ
యీకె సన్నసేసి మాన్పె నిదెఱఁగవా
పైకొని యప్పటి నీపయిఁ జేయిచాఁచఁగాను
చేకొని నీకడ్డమువచ్చినది యెఱఁగవా ॥ అప్పు ॥

కదఁగి యొకతె నీపై గట్టిపూబంతి వేయఁగా
యెదచొచ్చి పట్టుకొనె నిదెఱఁగవా
జడియ కంతలో నిన్ను సరిఁ గిందవేసుకొంటే
బెడిదాన నిన్ను మీఁదఁబెట్టినదెఱఁగవా ॥ అప్పు ॥

వొద్దనున్నచెలి నిన్ను వొగిఁ గాఁగిటఁ గూడితే
తిద్ది తానూఁ గలసినది యెఱఁగవా
యిదరూ నుండఁగానే యిటు నన్ను నేలితివి
[1]బద్దుల శ్రీవేంకటేశ పాడి నీవెఱఁగవా ॥ అప్పు ॥ 448

మంగళకౌసిక

అడుగరాదా బుద్ధి ఆపెనే నీవు
కడనుండేవారికిఁగాఁ గాఁకలఁబడుదురా ॥ పల్లవి ॥

మేనవారితోడనే మేలమాడుదువుగాక
నానవిజాణతనాలు నాతో నేఁటికి
కానికిచ్చేయాపెకే కప్పుర మిత్తువుగాక
తానకమైవుండేనాకుఁ దమ్ముల మిడుదురా ॥ అడు ॥

మునుపటిదేవులనే మోవఁజెనకుదుగాక
వనచవినగవులు నాతో నేఁటికి
పనులు నేసేయాపెనే పైపై మెత్తువుగాక
మనికై వుండే నన్ను మన్నించవలెనా ॥ అడు ॥

పమ్మి రొమ్ముపై యాపెకే బాసలు సేతువుగాక
నమ్మికయానలువెట్టి నాతో నేఁటికి
కమ్మర నాపెనే శ్రీవేంకటేశ కూడుదుగాక
యెమ్మెకు నన్ను నేలితి వింత సేయఁదగవా ॥ అడు ॥ 449

1. బద్దు=బొంకు అని వా.ని. ఇక్కడ భద్రశబ్దభవము కావచ్చు. క్షేమములనిచ్చు అని యర్థము.

తెలుఁగుఁగాంబోది

చేచాఁచవయ్యా నీకుఁ జిక్కెఁ గానికె
కాచినపూచినకలగంపలతో కానికె ॥పల్లవి॥

చెనకినగోరొత్తులచేకానికె
మొనలచన్నులు నీకు మునుగానికె
చనవులనవ్వు దరిశనకానికె
కనుచూపులే మంచికప్పురపుఁగానికె ॥చేచాఁ॥

వలపులమొక్కు దీపావళికానికె
కలయికమాఁటలు వుగాదికానికె
వెలలేనిమోవిపండు విందుకానికె
కిలికిసిగ్గులు మించుఁగప్పురకానికె ॥చేచాఁ॥

ననుపులకూటమి కట్నముకానికె
పౌనుఁగుమోవిసోఁకులు బూమికానికె
యెనసితివి శ్రీవేంకటేశ నన్నును
పవిగానేరతులు పైపై తొల్లైకానికె ॥చేచాఁ॥ 450

రేకు 1376 మాళవశ్రీ

మమ్మునేమియడిగేవు మాపుదాఁకాను
సమ్మతిగా సేసలు చల్లుకోరాదా ॥పల్లవి॥

చెలికి వలతువట చెప్పనేల నీముద్దులు
కలయ నీవాడకు గక్కన రారాదా
కలిమిని యాపెవుంగరము నీచేతనుంచె
తెలుపనేల వావి గద్దియపై నుండరాదా ॥మమ్ము॥

అంగనకు దానయి స్తివట మరేల సిగ్గులు
యింగిత మెఱిఁగి విడెమియ్యరాదా
ముంగిటనీమోవిమీఁద [1] మొల చాపెగురి వుంటే
సంగతిగ నట్టే పంపు సారెఁ జేయరాదా ॥ మమ్ము ॥

అతివఁ గూడితివట అప్పటినేల మరపు
రతులచవులెల్లా మరపఁగరాదా
యితవై శ్రీవేంకటేశ ఇద్దరూ నెనసివుంటే
సతమై రాజ్యమేలుచు చనవియ్యరాదా ॥ మమ్ము ॥ 451

సాళంగనాట

అయ్య జియ్యలువెట్టేనీయాఁడువారము
పయ్యదకొంగునఁ గట్టేపాటివారమా ॥ పల్లవి ॥

కాంతలయడాటాన కాఁకదేరినవాఁడవు
చెంతల వలపించనేర్చినవాఁడవు
దొంతిమోవుల దోమటిదొడికినవాఁడవు
పంతాలు నీతో నాడేపాటివారమా ॥ అయ్య ॥

సరసపుమాటలనే పంతవెట్టినవాఁడవు
సరి నవ్వుఁగప్పురాలే చల్లేవాఁడవు
తొరలింపుసిగ్గులకు దోసిలొగ్గినవాఁడవు
పరగ నీకాళ్లు దొక్కేపాటివారమా ॥ అయ్య ॥

కొలఁదిమీరినచనుఁగొండలలోవాఁడవు
మెలుపుశ్రీవేంకటాద్రిమీఁదివాఁడవు
అలమేల్మంగను నే నన్నలమినవాఁడవు
కలసినరతులు పొగడేపాటివారమా ॥ అయ్య ॥ 452

---

[1] మొలచి + అపె

ఆహిరి

ఇంతితోటియేలాటా లెందా(కాను
చింతదీర చెక్కునొక్కి సేదదేర్చవయ్యా ॥ పల్లవి ॥

చలము లేమిటికయ్య సతితోను
వలచినమేలు చూడవద్దా నీవు
జలజల( జమరించె చందపుమేను
కలసి కాఁగిటిలోనె కాఁకదేర్చవయ్యా ॥ ఇంతి ॥

పంతము లేమిటికయ్య పడఁతితోను
యింత(తి?)నేసినవూడిగా లెంచఁగవద్దా
మంతనాన సిట్టూర్పుల మలసీ విదె
పొంతనే మరుతంత్రాల బుజ్జగించవయ్యా ॥ ఇంతి ॥

గుంపెన లేమిటికయ్య కోమలితోను
యింపులు దలఁచవద్దా యిప్పుడైనాను
పెంపున నలసె నీతో బెరయుచును
అంపక శ్రీవేంకటేశ ఆదరించవయ్యా ॥ ఇంతి ॥ 453

శ్రీరాగం

వినరమ్మ యీసుద్దులు వెలఁదులాల
కొనబుకాఁడుగదమ్మ గోవిందరాజు ॥ పల్లవి ॥

పీడెము లందియ్యఁగాను వింజామరలు వేయఁగా
వోడక చెలులు పాదాలొత్తఁగాను
మేడలోనఁ బవళించి మెత్తవిపరపుమీఁద
కోడెనేఁతలు సేసీని గోవిందరాజు ॥ విన ॥

అట్టె నాట్యములాడఁగ అంకించిపాడఁగాను
ఇట్టునట్టు వీణలు వాఇంచఁగాను
వొట్టుక మలఁగుమీఁద నొద్దోలగమై యున్నాఁడు
గుట్టుతోడివాఁడుగదె గోవిందరాజు ॥ విన ॥

పరిమళాలు వూయఁగ పలువిందులు వెట్టఁగ
సిరియు భూమియుఁ బెండ్లిసేస చల్లఁగా
తిరుపతిలోన నొద్దిక శ్రీవేంకటేశుఁడై
గొరబై నవ్వీఁగదె గోవిందరాజు ॥ విన ॥ 454

పాడి

నీకంటెఁ జలమరి నెలఁతకుఁ జెప్పరాదు
దాకొని నీవు నవ్వితే తానే కాఁగిలించీని ॥ పల్లవి ॥

పయ్యదమీఁద నీవు పన్నీరు చల్లఁగాను
వొయ్యనే లోలోనే తిట్టె వువిద నిన్ను
కయ్యపుదిచీ విందుకుఁగా కాఁకలఁ బొరలనేల
వుయ్యాలపైకి రారాదా వొక్కటిసేసేను ॥ నీకం ॥

పువ్వుల చెండునఁగొని వూఁచి నీవు వేయఁగాను
జవ్వని బొమ్మల విన్ను జంకించెను
అవ్వల నిందుకుఁగాను అసురుసురననేల
పవ్వళించరాదా వద్ద పంతాలు దిద్దేను ॥ నీకం ॥

శ్రీవేంకటేశ నీవు చెలిగుబ్బ లంటఁగాను
కావరించి యాకె మోవి గంటిసేసెను
చేవదేర నిందుకుఁగా సిగ్గులువడఁగనేల
భావించి కప్రమీరాదా బత్తి నేఁ జూపేను ॥ నీకం ॥ 455

సామంతం

తగునయ్య నీకిన్నియు దైవపురాయ
మొగమునఁ గళవిందె మోహనరాయా ॥ పల్లవి ॥

మీఱుచు మాటలాడి మెలఁత చెక్కులవెంట
జాఱించితిగా చెమట జాణరాయ
ఆఱడిమాఁటలాడి అట్టె పట్టి నీవు
చూఱగొంటివిగా సిగ్గు సుగుణరాయ ॥ తగు ॥

మంతనాన నవ్వుతానే మర్మములు గరఁగించి
వింతలు నేసితివిగా విటరాయ
అంతలోనే పైకొని అధరపుఁదేనె లిచ్చి
చెంతఁ జొక్కించితివిగా చెలువరాయ ॥ తగు ॥

పులకలు పెదరేఁచి పొంకములెల్లాఁ జేసి యీకెఁ
జెలరేఁగించితివిగా సింగారరాయ
బలురతుల నోలార్చి పలుమారు మన్నించి
చిలికితివిగా మేలు శ్రీవేంకటరాయా ॥ తగు ॥ 456

రేకు 1377 వరాళి

కూడినవేళనే బాసగొనవలెను
వాడలు దిరిగితేనే వంచరాదుసుమ్మీ ॥ పల్లవి ॥

సిగ్గులువడకువే చేపట్టి తీసితేను
వెగ్గళించినవ్వకువే వేఁడుకొంటేను
అగ్గమై నీయింటికి రమ్మనవే రమణుని
ఏగ్గులవెనక మరి నేరరాదుసుమ్మీ ॥ కూడి ॥

కొంచకువె నీతోను కోరి మాటలాడితేను
వంచకువే శిరసు నీవాఁడననఁగా
మంచము వేయవే నీమగనికిఁ బవ్వళించ
యించుక మఱచినాను యేఁకరేవుసుమ్మీ ॥కూడి॥

తరితీపు సేయకువే తగఁ గాఁగిలించుకొంటే
వరుస వెరగేఁటికే వావి చెప్పఁగా
ఇరవై శ్రీవేంకటేశుఁ దేలె నిన్నిఁక మెచ్చవే
వొరసితే రతులిఁక వుడివోవుసుమ్మీ ॥కూడి॥ 457

ఆహిరినాట

అండనుండవే నామారు; ఆతనికి నాకుఁబోదు
దండిగా నాపై దయను తానే వచ్చీఁగాని ॥పల్లవి॥

మనసులో నాబత్తి మఱవకుమనఁగదే
వనితలు పెక్కుఁగలవాఁడు తాను
ఆసశము నాకానికె అందుకొమ్మనఁగదవే
ఘనమైనసంపదలు గలవాఁడు తాను ॥అంద॥

తగిలిన నాసేవ తలఁచుకొమ్మనఁగదే
మగటిమితో పొత్తులమగఁడు తాను
సొగిసి నాలేకలు చూచుకొమ్మనఁగదే
అగపడి అట్టే లోలుఁడై వుండుఁ దాను ॥అంద॥

సోఁకిననాగోరితాఁకు చూచుకొమ్మనఁగదే
వాఁకపురతిసాములవాఁడు తాను
యేఁకట శ్రీవేంకటేశుఁ డిట్టె తా నన్నుఁ గూడె
పోఁకవెట్టి పెండ్లాడినపురుషుఁడే తాను ॥అంద॥ 458

బౌళి

ఇందుకా నీదొరతన మిందరిలోన
కందువల నిండు నేమి గట్టుకొంటివయ్యా ॥ పల్లవి ॥

సెలవుల నే నవ్వితే సరసమాడేవు నీవు
కలదా యేమైనాను కల్ల నీమేన
నిలువు నూరు వండీని నీసంత చూచితేను
తొలుసారే యేపనికి దొరకొంటివయ్యా ॥ ఇందు ॥

చేసన్న నేఁ జేసితేను సిగ్గులువడేవు నీవు
మూసి దించి నింద నీపై మోచెనా నేఁడు
ఆసఁ దేనె లుట్టిపడినట్టె నీతో మాటాడితే
వోసరించ [1]కెంతవని కొడిగట్టితివయ్యా ॥ ఇందు ॥

కామక నే నిచ్చితేను కాఁగిటఁ గూడేవు నీవు
వూని యిందుకే కాచుకున్నాఁడవో
ఆనుక శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
నీనేరుపు లెంతెంత నేరిచితివయ్యా ॥ ఇందు ॥ 459

సాళంగనాట

ఇప్పుడే వేగిరమేల ఇన్నిటికిని
కప్పురమిచ్చేవేళ కనిపించేఁగాని ॥ పల్లవి ॥

కాంతమీఁద నీకు నిట్టె కడుమోహమై వుండఁగా
యెంత నే విన్నవించినా యితవయ్యీనా
ఇంత గలితే నీవు మాఇంటికి వచ్చేవేళ
దొంతరనానేరుపులు తోడుచూపేఁగాని ॥ ఇప్ప ॥

1. ఎంత+పని.

వుమ్మడి నాపె నీవును వొడివట్టి పెనఁగఁగ
తమ్మని నేఁ బిలిచితే రతికెక్కినా
సమ్మతై తేఁ గనక నీసరసమాదేటివేళ
పమ్మి నాప్రియములెల్లఁ బచరించేఁగాని ॥ ఇప్పు ॥

మరిగి మఱఁదలిపై మనసువెట్టుకుండఁగ
గరిమ నేఁ బైకొంటే కనుపట్టినా
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యిరవై నన్నేలితివి యిఁక మెచ్చేఁగాని ॥ ఇప్పు ॥ 460

రామక్రియ

ఆవధరించవయ్యా ఆపెకలికిచేఁతలు
తివిరి చెమటమంచు దిగుపారించీని ॥ పల్లవి ॥

తేనెగారేమోవితోడ తేటమాట లాడుతాను
కానుకిచ్చి యాపె నిన్నుఁ గరఁగించీని
సావఁబట్టేచూపులను చలములు రేఁపుతాను
వీనులపండువగా విన్నపాలు సేసీని ॥ అవ ॥

జంకెనబొమ్మలతోడ సరసములాడుతాను
లంకెలపొందుల నాపె లళి రేఁచీని
కుంకుమగుబ్బలమీఁదిగురుతులు చూపుతాను
కొంకునుఁ గొసరు లేక కొంగులు వట్టీని ॥ అవ ॥

వెన్నెలనవ్వులతోడ వేడుకలునెరపుతా
కిన్నెరమీఁట్ల నాపె గిలిగించీని
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పన్నుల నిన్నుఁ గూడితే చవులు తా నించీని ॥ అవ ॥ 461

సామంతం

ఇదివో నాభాగ్య మేమిచెప్పేది
మదనగురుఁడు నన్ను మన్నించెను ॥ పల్లవి ॥

జాణతనాలాడఁగాను సరసుఁ డందుకు మెచ్చి
అణిముత్యములకంఠహార మిచ్చెను
వీణె నేను వాయించఁగ వేడుకతోడ నట్టె
రాణించినసతులలో(తో?) రతికిఁ జెప్పించెను ॥ ఇది ॥

ఇచ్చకములు సేయఁగా యీతఁడే అందుకు మెచ్చి
పచ్చలకడియము లప్పటి నిచ్చెను
పచ్చితోడ తనమీఁదిపాటలెల్లాఁ బాడఁగాను
పచ్చడముకొంగు నాపైఁ గప్పెను ॥ ఇది ॥

చేరి కాఁగిటఁగూడి శ్రీవేంకటేశుఁడు మెచ్చి
పేరుకలనీలాలపెండె మిచ్చెను
నేరి చలమేల్మంగను నేఁ దన్నుఁ బొగడితేను
సారెసారె నన్ను నేలి చనవిచ్చెను ॥ ఇది ॥ 462

రేకు 1378 లలిత

ఎక్కడ పరాకునేనే వెందాఁకాను
వెక్కసపుఁదమకాన విడెమియ్యరాదా ॥ పల్లవి ॥

చిడుముడినవ్వుతోడ చెలి నిన్నుఁ గొసరఁగా
తొడపైఁ బెట్టుకోరాదా దొరవు నీవు
వడియుఁజెమటతోడ వలపులు చల్లఁగాను
తుడువరాదా నీవు దుప్పటికొంగునను ॥ ఎక్క ॥

వాలుకచూపులతోడ వనిత నీకు మొక్కఁగా
పాలించి పైకొనరాదా పతివి నీవు
మేలములాడుచు నీతో మేనరికము చెప్పఁగా
అలిఁగాఁ బెండ్లాడరాదా ఆదరముతోడను ॥ఎక్క॥

అలమేలుమంగ నిన్ను నట్టె కాఁగిలించుకోఁగా
చెలఁగి మోవియ్యరాదా శ్రీవేంకటేశ
చలిమిబలిమి నీకు చవులు పుట్టించఁగాను
పలుమారు మెచ్చరాదా భావము దెలియను ॥ఎక్క॥ 463

## దేసాళం

జాణతన మెంచవద్దా సతులయడాటాన
వీణె వాయించినదాఁకా వేగిరమా ॥పల్లవి॥

మొగముచూడఁగానే మొక్కులుమొక్కేయాపెను
అగడునేసి పెనఁగి యలయించేతురా
తగిలి యదియుఁగాక తమకించి యంతలోనే
బిగువుకుచము లిట్టె పిసుకుదురా ॥జాణ॥

సిగ్గుతోడ విన్నపాలునేనేటియాపెను
బగ్గనను గోర గీరి పచ్చిసేతురా
విగ్గున నంతటఁబోక నీయేతులెల్లా మెరసి
వెగ్గళించి పోఁకముడి వీడఁజేతురా ॥జాణ॥

గుట్టుతోడ వీడెమిచ్చి కూడేటియాపెను
అట్టునేసి నేర్పు రచ్చనట్టె వేతురా
ఇట్టె శ్రీవేంకటేశ యీ యలమేలుమంగను
గట్టిగా నేలితి వింత కందువఁ జొక్కింతురా ॥జాణ॥ 464

### పాడి

అట్టె కానీలేవే ఆతఁ[1]డింతేయిత్తసేసె
నెట్టన నే నిన్నాళ్లు నిన్నెఱఁగనా ॥పల్లవి॥

జడియుచు మరిసేవు సవతులయెదుటనే
కదలేవిసంపదలగర్వమా యిది
ఒదిబడి నందరిలో పంతములే నెరపేవు
వొడలిలో వుప్పతిల్లేవుడుటా యిది ॥అట్టె॥

దొరకొని కెలసేవు తోడివారు వినఁగానే
మరుతంత్రములలోనిమదమా యిది
పరగ బంగారుపీఁటపయి వీట్టిపీఁగేవు
కరఁగినమనసులో గజరా యిది ॥అట్టె॥

కూడి శ్రీవేంకటపతిఁ గొసరేవు మాయెదుట
జాడల నీతఁడిచ్చినసలిగా యిది
వోదక యక్కచెల్లెండ్ల[2]రొమ్మ సమ్మతిసేసేవు
నీడల నీనేర్చిననేరుపా యిది ॥అట్టె॥ 465

### మాళవి

ఎప్పుడూఁ దనవారమే యేదనున్నాను
వొప్పాయ వలపు బూరకుండుమనఁగదవే ॥పల్లవి॥

సరసములాడఁబోతే సరి నలపులు చిక్కు
కరకరించఁగఁబోతే కాఁకలు రేఁగు
తెర దియ్యఁగఁబోతే తరితీపులే కడుమించు
వొరయనేఁటికి వూరకుండుమనఁగదవే ॥ఎప్ప॥

---

1. ఇంత+ అయిత్త అనియా? 2. చెల్లెండ్లరు+ఒమ్మ అనికావలెను. లేకున్న యతిభంగము. ఒమ్మ = సరిపడు అని శ.ర. 'ఇది నా కొమ్మదు'. అనియు వ్యవహారము.

చలము సాదించఁబోతే చండితనములు పుట్టు
బలిమి చూపఁగఁబోతే పంతాలు హెచ్చు
గిలిగించఁబోతేను గీరలు వొళ్లెల్లా నిండు
వులివచ్చిసేయ కూరకుండుమనఁగదవే ॥ ఎప్పు ॥

బట్టబయలీఁదించఁబోతే భావము చిక్కులువడు
గుట్టులు చూపఁగఁబోతే కుప్పలౌఁ దమి
ఇట్టె శ్రీవేఁకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వొట్టు చెల్లె నిఁక నూరకుండుమనఁగదవే ॥ ఎప్పు ॥ 466

బౌళి

ఔనటవే ఇంకా నేమందునే నేను
వైనవైనాలుగా నన్నీ వా(వ్రా?)సిత్తునటవే ॥ పల్లవి ॥

చెల్లునే తాఁజేసినచేఁతలెల్లాను
వెల్లవిరాయఁ బనులు వేగినంతాను
కల్లలూఁగావే తన చక్కనిమాఁటలూ
పల్లదాన నన్నిటాను పంతగాఁడే తాను ॥ ఔన ॥

మెచ్చిరే యందరూఁ దనమేకులెల్లాను
పచ్చితనమెల్లా బంగారాయనే
తచ్చనలూఁగావే తన తగవులునూ
వొచ్చెములేనిగుణాలవారపరే తానూ ॥ ఔన ॥

దక్కెనే తనకు మంచితనమెల్లాను
మొక్కినట్టే వరమిచ్చె ముమ్మాటికివి
యిక్కువతో నన్నుఁ గూడి యిచ్చె మేలెల్లా
వెక్కసపుశ్రీవేంకటవిభుఁడే తానూ ॥ ఔన ॥ 467

ఆహిరినాట

ఆఁడువారి నీ వింత ఆగడాలు నేతురా
పోఁడిమిఁ జెమటఁ దోఁగె పొంచి పయ్యెదెల్లాను ॥ పల్లవి ॥

కొప్పువెట్టుకొనఁగాను కొమ్మకరమూలములు
తప్పకచూచి నీ వంతలో నవ్వఁగా
చిప్పిలుసిగ్గున నాకె చేతు లదుముకొంటేను
ముప్పిరిగొని మోముపై ముంచుకొనె నెరులు ॥ ఆఁడు ॥

కోక గట్టుకొనఁగాను కొమ్మెరుఁగైనతొడలు
జోకలుగా నీవట్టె చూచి నవ్వఁగా
కాకరిసిగ్గునను మో కారించుక కూచుంటే
ఆకెమొలనూలిగంట లట్టె కుప్పవడెను ॥ ఆఁడు ॥

హారములు వెట్టుకోఁగా నందపుచన్నులు చూచి
నేరిచి శ్రీవేంకటేశ నీవు నవ్వఁగా
ఆరీతి సిగ్గున నిన్ను నట్టె కాఁగిలించుకొంటే
కూరిమితోఁ బులకలు కోరి జాజుకొనెను ॥ ఆఁడు ॥ 468

రేకు 1379 భైరవి

ఇటువంటిచెలినేల యెలయించేవు
తటుకునఁ గాఁగిలించి దయఁజూడవయ్యా ॥ పల్లవి ॥

యేపొద్దు నీతో నవ్వ నెఱుఁగు నింతేకాని
కోపగించ నెఱుఁగదు కొమ్మ యఁ(యం?)తైనా
చూపుల విమఁజూచి చొక్కఁగ నెఱుఁగుఁగాని
యేపునఁ దలవంచఁగ నెఱఁగ దెప్పుడును ॥ ఇటు ॥

చలపట్టి నీతో సరసమాడ నెఱుఁగుఁగాని
యెలమిఁ బలాఁకుఁడ నెఱఁగ దీకె
వలచి ప్రియము చెప్పి వంచుకో నెఱుఁగుఁగాని
అలఁగఁగ నెఱఁగ దెఁ(దెం?)తైనా నీతోను ॥ ఇటు ॥

పానుపుపైఁ గాఁగిలించి పైకొననెఱుఁగుఁగాని
అనలువెట్టినాఁ బాయనెఱఁగదు
యీనెపాన శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి
తేనెమో వెఱుఁగుఁగాని తెగువ యెఱఁగదు ॥ ఇటు ॥ 469

పాడి

[1] చిట్టకీనివలెఁ దాను చిన్నచేఁతలెల్లాఁ జేసీ
యెట్టు దెలియఁగవచ్చు నెఱఁగనే నేను ॥ పల్లవి ॥

కప్పుర మిచ్చేనంటా కంమవకుఁ జేయి చూపి
తప్పించి కండచక్కెరలప్పు వెట్టెను
విప్పక విజమనుచు విడెములో వేసుకొంటిఁ
గప్పి తములము తీపుగాఁగా నుమిసితినే ॥ చిట్ట ॥

ఇదె నూరినకస్తూరి ఇచ్చేనంటా ముందు చూపి
మెదిగిన మిరియము మేపి కిచ్చెనే
పుదుటున నౌనంటా వొడల నేఁ బూసుకొంటి
సదరాన వెట్టగాఁగా జలక మాడితినే ॥ చిట్ట ॥

విరుల పాన్పిచ్చేనంటా వెసఁ బెద్దరాశి వోసి
యెరవులేకుండాఁ దాను ఇటు దాఁగెనే
పరగఁగా విమ్మనుచుఁ బవ్వళించితే నందు
తరి శ్రీవేంకటేశుఁడు తాఁ గూడె మొక్కితినే ॥ చిట్ట ॥ 470

1. 'చిట్టకము' శబ్దముపై కుతుకార్థక తద్ధితము. చిట్టకము=పరిహాసము, శృంగార చేష్ట.

## సామంతం

విన్నవించితిమి నీవిద్యలెల్లాను
అన్నియుఁ జెప్పేఁగాని ఆకె నీకు బుద్ధులు ॥పల్లవి॥

వెలలేనివలపులవేడుకకాఁడ
పలుసరసంబులపగిడికాఁడ
నిలువులమెమ్మెలనీటుకాఁడ
పిలిచీ రావయ్య ప్రియురాలు ॥విన్న॥

చల్లేటికర్పూరపుజాజరకాఁడ
గొల్లెతలమానములకొల్లకాఁడ
చల్లువెదనవ్వులనటకాఁడా
యిల్లిదె పిల్చీ రావయ్య యితవురాలు ॥విన్న॥

వంకచందురులచెక్కువన్నెకాఁడా
కొంకక కూడె నిన్నాపె కోడెకాఁడా
అంకెల శ్రీవేంకటాద్రిఆసోదకాఁడా
బింకానఁ బిలిచీ రావయ్య బిత్తరాలు ॥విన్న॥ 471

## శుద్ధదేశి

మాతోఁ బంతాలాదేవు మరి నీవు
కాతరాన నాపెకు కడుఁగిందుపడవా ॥పల్లవి॥

మగువ మోవికి యాకు మడిచి నీవందియ్యఁగా
జిగిఁ గొనగోరు ఆపె చెక్కు దాఁకెను
పగటున నంమకుఁగాఁ బలుమారు దిట్టితేను
మొగము చూచి చేయెత్తి మొక్కవా నీవపుడు ॥మాతోఁ॥

చెలియకుఁ బత్తితోడ సేవలెల్లాఁ జేయఁగాను
కొలువులో నాపె కట్టుకొంగు జారెను
కులికి యంతలోన కూరిమిఁ గోపగించితే
పెలుచుఁదనాలు మాని ప్రియములు చెప్పవా ॥ మాతోఁ ॥

కాఁతను నీవు గూడి కప్పురము నోటికీఁగా
వింత పలునొఁకులు వెల్లవిరాయ
పొంతనే శ్రీవేంకటేశ బొమ్మల జంకించితేను
బంతినే కానుకలిచ్చి బంటనయ్యేననవా ॥ మాతోఁ ॥ 472

దేసాళం

నే నెఱఁగినవే తొల్లి నీసుద్దులు
మానఁగదవయ్య నీమతకము లెల్లను ॥ పల్లవి ॥

నీవున్న యిక్కు లెఱఁగి నెలఁత యీడకే వచ్చే
సేవసేయ రమ్మని చెప్పింపితివో
వోవల నీవప్పటిని వొట్లెల పెట్టుకొనేవు
దేవరవు గావా నీవు దిమ్మరితనానకు ॥ నేనె ॥

తప్పులేక నీవన్నట్టె తారుకాణమాట లాదె
వొప్పుగఁ బదరుకొంటివో తొలుతే
కప్పికప్పి నీవేల కడునొదఁబరచేవు
యెప్పుడు రాజవుగావా యీవిద్దెలకును ॥ నేనె ॥

నెక్కొని శ్రీవేంకటేశ నీవు నవ్వినట్టె నవ్వె
యెక్కడఁ గూడితిరో యింతకముందే
చెక్కులేల నొక్కేవు చిప్పిల నన్నిట్టె కూడి
గక్కనను గురువవుగావా యీయెమ్మెలకు ॥ నేనె ॥ 473

వరాళి

ఇవి గొన్ని నేర్చితివి యీడానాడఁ దిరిగాడి
తవిలి యొక్కటొక్కటే తలఁపునఁ బారునా ॥ పల్లవి ॥

వంతులేల వెట్టేవు వాసులేల రేఁచేవు
పొంతమండి నీకదేమి పొద్దువోదా
బంతికేల పిలిచేవు బాసలేల సేసేవు
కాంతల గన్నప్పుడే కడునెమ్మె వచ్చునా ॥ ఇవి ॥

చేతులేల చాఁచేవు సిగ్గులేల తడవేవు
రాతిరిఁబగలు నీరపమాయనా
ఘాతలేల సేసేవు కన్నులనేల మొక్కేవు
జాతుల నీకాఁడువారు సదరములయిరా ॥ ఇవి ॥

గుబ్బలేల చెనకేవు గురులేల వ్రాసేవు
వుబ్బి మదనకళలు వొళ్లు నిండెనా
విబ్బరాన శ్రీవేంకటనిలయ నన్నేలితివి
అబ్బురపుసతులమే యంత నీకుఁ బ్రియము ॥ ఇవి ॥ 474

రేకు 1380 కాంబోది

తొలుతనే మంకువారు [1] దొడ్డివారు
చలములు సాదించితే జడుతురా చెలులు ॥ పల్లవి ॥

సిగ్గువడి యుండఁగాను చెలి యలిగెనంటాను
యెగ్గులువట్టి తిట్టేవు యేమయ్యా
తగ్గక నీచేసినచేఁతలూఁగాక అందుమీఁద
వెగ్గళించితేఁ జెలులు వెఱతురా యిపుడు ॥ తొలు ॥

1. దొడ్డివారు = గొల్లవారు.

పవ్వళించి వుండఁగాను పదఁతి మాటాడదఁటా
ఇవ్వల రవ్వసేసే వేమయ్యా
కువ్వలై నీమేనిమీఁద గురుతులూ నుండఁగాను
జవ్వనాన ఁంకించితే సైఁతురా ఇందుకు ॥ తొలు ॥

పట్టి కాఁగిలించుకోఁగా బలిమిసేసీనంటా
ఇట్టునట్టుఁ బెనఁగేవు యేమయ్యా
గుట్టున శ్రీవేంకటేశ కూడితివి మగువను
వెట్టికిఁ గొసరిశేను విడుత(తు?)రా పంతము ॥ తొలు ॥ 476

శంకరాభరణం

వేగిరమేల వేమునీవోలా
ఆగతులెల్లాను అయ్యేఁగాని ॥ పల్లవి ॥

వలవనిజోలి వలపువిరాలి
యెలమివి జరపే వేమిటికి
తెలిసితి నేనూ దిష్టముగాను
చెలిమి నిజమయితేఁ జెప్పేఁగాని ॥ వేగి ॥

గరివడ్డపెనరు కందువకొసరు
యెఱిఁగినపనులే యేమిటికి
గుఱియాయ నాకు గుదిగొన్నకాకు
తఱి వచ్చినప్పుడే తలపించేఁగాని ॥ వేగి ॥

కొండలనునుపు గొనకొన్నననుపు
యెండలు నీడలు యేమిటికి
అండనె శ్రీవేంకటాధిప నన్నేలితివి
పండుమోవి తేనె పరపేఁగాని ॥ వేగి ॥ 476

నాదరామక్రియ

మెత్తనిమనసుదాన మిక్కిలి నేనూ
హత్తి నీవాడినట్టెల్లా నాదేవయ్యా ॥ పల్లవి ॥

యిప్పటినీనవ్వు లివి యెన్నిటికైనావచ్చు
వుప్పతించనోప నూరకుండవయ్యా
దప్పిదేరె నిన్నుఁజూచి దయవుట్టీ నంతలోనె
చెప్పేటిప్రియాలు నాకే సెలవాయనయ్యా ॥ మెత్త ॥

రొక్కపునీమాటలు రొంపిలోనికంబాలు
యెక్కడికెక్కడ మరి యేఁదాఁకొనయ్యా
మొక్కేటినీవేసాలకు మొగమోట గనమాయ
మక్కువనీచేఁతలు నమ్మకైనట్టే అయ్యా ॥ మెత్త ॥

కందువనీరతు లివి కట్టినమంచిచద్దులు
చెంది నిన్నుఁ గూడితి తనిసితినయ్యా
అందపు శ్రీవేంకటేశ ఆసవుట్టీఁ గమ్మటివి
చందపునీమోవిలోనే చలిగొంటినయ్యా ॥ మెత్త ॥ 477

ధన్నాసి

ఇందరిలో నీసుద్దులు యేమిచెప్పేవు
కందువతో నేకతానఁ గరుణించరాదా ॥ పల్లవి ॥

చెంగలువకన్నులను చెలి నిన్నుఁ జూచితేను
అంగమెల్లఁ బులకించెనని యాదేవు
యింగితాన వలపులు ఇంత నీకుఁ గలిగితే
కంగుదీర నీకె నిచ్చె కాఁగిలించరాదా ॥ ఇంద ॥

కప్పురపుఁబలుకులకాంత నీతో మాటాడితే
అప్పుడే నే భ్రమసితినని యాదేవు
ముప్పిరిగఁ దమకము ముందు నీకింత గలితే
కప్పి పచ్చడముతోనే కాఁగిలించరాదా ॥ ఇంద ॥

వెన్నెలనవ్వులతోడ వెలఁది నిన్నుఁ గూడితే
అన్నిటాను భ్రమసితినని యాదేవు
మన్నించి శ్రీవేంకటేశ మనసు లేకములైతే
కన్నప్పుడెల్లా విట్టె కాఁగిలించరాదా ॥ ఇంద ॥ 478

రామక్రియ

కాదనేమా నేము నీ గయ్యాళితనములకు
ఆదెసనీదెసను నీవాడినట్టే అయ్యీని ॥పల్లవి॥

పంతమాడి నిన్ను నంత పరచఁగ నోపుదుమా
చెంత నుండి నీసేవ సేసేముగాక
యింత నీకు [1] వేడుకైతె నెందువో యేమిఁక నేము
అంత వేగిరించకుమీ ఆడినట్టె అయ్యీని ॥ కాద ॥

సరికిబేసికి నిన్ను సాదించ నోపుదుమా
పెరరేఁచి చిత్తము రప్పించేముగాక
కరుణ నీకుఁ బుట్టితే కానిమ్మనఁగవలదా
అరుదుగాఁ గోరకు నీవాడినట్టె అయ్యీని ॥ కాద ॥

శ్రీవేంకటేశ నిన్ను జీరదియ్య నోపుదుమా
మూవంకఁ గూడితి మిఁక మొక్కేముగాక
యీవల మన్నించితేను యెప్పుడూ నీవారమే
ఆవిధాన నింకా నీవాడినట్టె అయ్యీని ॥ కాద ॥ 479

1. వేడుకైతి+అని+అందువో

దేవగాంధారి

రావయ్యా వో రావయ్యా
తావుకొని నిన్నుఁ దలఁచీని ॥ పల్లవి ॥

చిప్పిలుఁజెమటలు చెక్కులవెంటాఁ
గుప్పళించీ విదె కోమలి
దప్పిదేరుచును తనపెదవుల
పిప్పిగట్టి నిన్నుఁ బిలిచీని ॥ రావ ॥

చల్లఁబులకలు చన్నులవిండా
జల్లన నించీని జనరాలూ
వెల్లి విట్టూర్పులు వెలయ నీయింటి—
కల్లదె వచ్చి వి న్నడిగీని ॥ రావ ॥

సిగ్గులమొక్కులు చేతుల రెంటా
వొగ్గుచు నీకిచ్చీ నువిద
యెగ్గుల శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి
అగ్గలపురతు లవే కొసరీని ॥ రావ ॥ 480

రేకు 1381 సింధురామక్రియ

మేలే యెట్టుండినాను మేవవారము
జాలిఁబెట్టి నిన్ను మరి చండిసేసేనా ॥ పల్లవి ॥

కూరిమి గలితేఁజాలు కొసరితే నేమాయ
యేరా నీతో నే నెగ్గుపట్టేనా
గారవించితేఁజాలు కడనుంటే నేమాయ
రారా నిన్నంతేసి రవ్వసేసేనా ॥ మేలే ॥

కూడామాడా సంకేతాలు గోరగీరితే నేమాయ
ఆదరా యేమైనా మాట లవుఁగాదనేనా
వేడుక గలితేఁజాలు వెక్కసమైతే నేమాయ
పాడిదప్పకుర నీతో పంతమాడేనా ॥ మేలే ॥

నవ్వులు నవ్వితేఁజాలు నాలిసేసితే నేమాయ
జవ్వనమద మిదౌరా సాదించేనా
ఇవ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నివ్వటిల్లెరా మన్నన నీకెదురాడేనా ॥ మేలే ॥ 481

ఆహిరి

నెలఁత మేనియలపు నీదిగాదా
అలి నివియల్లాఁ జూచి లాలించవలదా ॥ పల్లవి ॥

వలపులవసివాడు వనితకు నుండఁగాను
చలము లింకానేల సరసుఁడవు
చెలపచెమటలు చెక్కులపై నుండఁగాను
కలఇకరతులను కరుణించవలదా ॥ నెలఁ ॥

వెదయాస పులకలు వెలఁదికి నుండఁగాను
బెదసుఁబరాకులేల ప్రియుఁడవు
తదఁబదేతమకము తలఁపులో నుండఁగాను
అదరి మోవి ఇచ్చి ఆదరించవలదా ॥ నెలఁ ॥

కూడినసంతోసము కోమలికి నుండఁగాను
గాదఁబెట్టనేల శ్రీవేంకటేశుఁడవు
వోడక నిట్టూర్పులు వొగిఁ బుక్కిట నుండఁగ
నీడలను నిలిచి మన్నించఁగవలదా ॥ నెలఁ ॥ 482

## శంకరాభరణం

కొంకకువే యిఁకఁ గోమలి
పొంకమయినట్లఁ బొసఁగీఁగాని ॥పల్లవి॥

ధరలోపల మతి తమకము గలిగిన
సరసపుమాఁటలు చౌలౌను
ఒరసి చూడవే వోపిక గలిగిన
పయిసకు రమణుఁడు వచ్చీఁగాని ॥కొంక॥

మునుకొని పైపై మోహము గలిగిన
చనవులు మనవుఁ చవులౌను
పెనఁగవె వొకపరి ప్రియము గలిగితే
చౌనిపి విభుఁడు దయఁజూచీఁగాని ॥కొంక॥

సేవసేయఁగా చిత్రము గరఁగిన
యేవేళ రతులు యితవౌను
వావి దెలుపఁగా వచ్చి నన్నెనసె
శ్రీవేంకటేశుఁడు చెలఁగీఁగాని ॥కొంక॥ 483

## మాళవిగౌళ

వెంగెమాడేనా నిన్ను వేగినంతాను
సంగతిగా మొదల నిచ్చకురాల నేను ॥పల్లవి॥

పగచాటేనా నీతోఁ బక్కన నవ్వేఁగాక
యెగసక్కేలకు నీవు యెంత సేసినా
తెగనాడేనా నీవే దేవరవనేఁగాక
పగటున నీమోవి పచ్చియై వుండినను ॥వెంగె॥

కోపగించేనా విన్ను గుట్టున మెచ్చేఁగాక
మాపుదాఁకా నీవెంత మట్టుమీరినా
రాఁపునేసేనా విన్ను రసికుఁడవనేఁగాక
తోపునూకుదుగ నెంతదూరు నీపై నుండినా ॥ వెంగె ॥

బొమ్మల జంకించేనా పొగడుచు నుండేఁగాక
దిమ్మరివై నీవెటు దిరిగినను
యెమ్మెలెంచేనా శ్రీవేంకటేశుఁడ వనేఁగాక
సమ్మతించి నన్నుఁగూడి సదమదమైనను ॥ వెంగె ॥ 484

## ముఖారి

ఊరకే కరఁగునా పుక్కురాతిగుండె నీది
సారెకు విన్నవించఁగా సమ్మతించితివి ॥ పల్లవి ॥

చెప్పరానియటువంటి సేవలెల్లాఁ జేయఁగాను
తప్పకుండా నేఁడు నీ చిత్తము వచ్చెను
వొప్పుగా నెప్పుడు నీవొద్ద విట్టె వుండఁగాను
కప్పి యన్నిటా నీవు కరుణించితివి ॥ ఊర ॥

నోఁడలేనియటువంటిఇచ్చలెల్లా నాడఁగాను
వాడలోననెల్లా నాకె వలచితివి
జాడతోడ రేపుమాపు సారెసారె మొక్కఁగాను
యీడులేనివచనవులు యిచ్చితివి నీవు ॥ ఊర ॥

మిక్కిలిరతులఁ గూడి మీఁదమీఁద మెప్పించఁగా
మక్కువదేవులఁగా మన్నించితివి
నిక్కపుశ్రీవేంకటేశ నీవె యిన్నియును నేర్పి
వొక్కటై నన్నేలి మోవి వొసగితివి ॥ ఊర ॥ 485

పాడి

ఇంతి యివి చూచితేను యేమనునో
అంతటిలో నొకవుపాయము చూచుకోవయ్యా ॥పల్లవి॥

కూరిమితోడుత విన్నుఁ గొమ్మ పిలువఁగనంపె
చేరి మాయింటికివి విచ్చేయవయ్యా
జీరలు నీబుజముల సేనగా నున్న వివిగో
గారాబానఁ బచ్చడము కప్పఁగదవయ్యా ॥ఇంతి॥

కమ్మరాను యెదురుగాఁ గానుక లప్పటి నంపె
వుమ్మడివి మేడలోఁ గూచుండవయ్యా
సొమ్ములు వింతలు నేఁడచ్చుగా నీమేన వివే;
నెమ్మది నందుకు మాట నేరుచుకోవయ్యా ॥ఇంతి॥

బత్తితోడుతను నీకు పానుపు వరచె విదె
కొత్తగా శ్రీవేంకటేశ కూడఁగదయ్యా
హత్తి పెరవాసనలు అవిగో శ్రీసతి యంపె
బత్తితో నేలితివి కప్రము పూసుకోవయ్యా ॥ఇంతి॥ 486

రేకు 1382 దేసాళం

తానెరుఁగు నేతతపుతనచేఁతలు
యీవిజములెల్ల మీయెదుటనేకాక ॥పల్లవి॥

తప్పులేదవి మంచితగవులే చెప్పివి
అప్పుడాడినమాట లాడెనటవే
దప్పి మోమునఁ దేర దయలు వుట్టించీవి
యిప్పు డిందాఁకాఁ దా నిట్టుండెనా ॥తానె॥

నడుమ నూరక ఇచట నవ్వులే నవ్వీని
పుడివోవియాచలము లున్నవటవే
విడువ కిటు నాయెదుట వేసాలు నేసీని
అదరి తనవోజ నే నది యెఱఁగనా ॥ తానె ॥

మొగమోటమునఁ దాను మోహములే చల్లీని
వగకాఁడు అపుడిట్ల వచ్చెనటవే
తగిలి శ్రీవేంకటోత్తముఁడు నన్నిటు గూడె
వెగటుఁగూరిమి లపుడు వెలయించెనా ॥ తానె ॥ 487

## ముఖారి

ఈమేలు దలఁచుకో యెప్పుడును నీమతిలో
సాములుసేసి నీతో చలము నెరపదా ॥ పల్లవి ॥

కొంతగొంత నాచెక్కు గోర నీవు గీరితేను
పంతములాడితినా పదరితినా
రంతుల వేరొకతై తే రవ్వ సేసి నీమేను
యెంతైనా నొకటికి యినుమడి సేయదా ॥ ఈమే ॥

పలుమారు నామోవిపై పలుసోఁకులు నించితే
బలిమి సేసితినా పదరితిగా
వెలయ వేరొకతై తే వింతలుగా ని న్నప్పటి
యెలయించి వొకటికి యినుమడి సేయదా ॥ ఈమే ॥

చందపుశ్రీవేంకటేశ చన్నులొత్తి కూడితివి
పందెములు గొంటినా పదరితినా
విందులవేరొకతై తే వేసాలెల్లాఁ జూపి
యిందరిలో వొకటికి యినుమడి సేయదా ॥ ఈమే ॥ 488

గౌళ

చేకొవి నీసేవలెల్లాఁ జేసేఁగాని
యీకడ విచ్చై నీవు మాయింటికి రావయ్యా ॥పల్లవి॥

గొల్లెతలు వలచిరి కోరినట్టె నేసితివి
చెల్లునయ్య నీచేసినచేఁతలెల్లాను
మెల్లనే నీవంటుకోఁగా మేమిఁకఁ గాదనేమా
ఇల్లిదివో వున్నది మాయింటికి రావయ్యా ॥చేకొ॥

పదియారువేలింతులపతివైతి వెమ్మె మించె
యెదురు లేదయ్య నీకు నేమిటాను
వుదుటునఁ జెనకఁగా వోపననేమా నేము
యెదిగెఁ జన్ను లిదె మాయింటికి రావయ్యా ॥చేకొ॥

పట్టపుదేవులు గద్దు పనులెల్లాఁ జక్కనాయ
తొట్టుకొంటివయ్య మేలు వొమ్ము నీకును
గుట్టున శ్రీవేంకటేశ కూడితి వేఁటికనేమా
యిట్టె నీపొరుగే మాయింటికి రావయ్యా ॥చేకొ॥ 489

దేశాక్షి

కానీవయ్య అందుకేమి కావచ్చె నీసుద్దులు
గోనాలగొందుల వింత గుట్టుసేసుకొంటివా ॥పల్లవి॥

పెనఁగి సారెకు విన్ను ప్రియురాలు విలువఁగ
కొవగానలనే నీవు కొంకేవు
చెనకులు నీమేనఁ జేసెనో యెవ్వతెయైనా
విసుఁ గల్ల మోవకుంటే నీవిట్లాఁ జేతువా ॥కానీ॥

వొగ్గుచు గందము నీకు వువిద వుయ్యారాఁగాను
సిగ్గులువడుచు చెక్కు చేతఁబెట్టేవు
వెగ్గళమై నీమేన వింతవాసన లున్నవో
యెగ్గులచేఁత లేకుంటే యింతేసి లోఁగుదువా ॥ కానీ ॥

మొక్కి యింతి గూడి నీకు మోవితేనె లియ్యఁగాను
అక్కమోవఁ దలవంచి అట్టె నవ్వేవు
పక్కన శ్రీవేంకటేశ పలుసోఁకు లున్నవో
తక్కు లింతేసి లేకుంటే తప్పించుకొందువా ॥ కానీ ॥ 490

ఆహిరినాట

అలిగితినా నీతో అవుఁగాదని యంటినా
తలఁపులో నున్నాఁడవు దయఁజూడరా ॥ పల్లవి ॥

అనలేల పెట్టేవు ఆసలేల రేఁచేవు
మోవమున నున్నదాన ముద్దరాలనే
కానీలేరా నావంటికాంతలు నీకుఁ గలరు
దానికేమి అట్లానే దయఁజూడరా ॥ అలి ॥

చెక్కులేల నొక్కేవు సిగ్గులేల పుట్టించేవు
ఇక్కడనే వున్నదాన హితురాలనే
దిక్కులను మరి నీవు తెచ్చుకొంటి వింతులను
తక్కక నన్నట్లానే దయఁజూడరా ॥ అలి ॥

యేల కాఁగిలించేవు యెంత వొడఁబరచేవు
యీలాగుల నున్నదాన యిల్లాలనై
అలరి శ్రీవేంకటేశ ఆండ్లఁ బెండ్లాడితివి
తాలిమి నన్నట్లానే దయఁజూడరా ॥ అలి ॥ 491

### బౌళిరామక్రియ

ఇందుకేల లోఁగేవు యెప్పుడూ నీకుఁ గలదే
మందలించి దూరను మరిగితి నిన్నును ॥ పల్లవి ॥

చిగురుమోవిగంటికి సిగ్గులువడఁగనేల
మొగము చూడవయ్య మొక్కే నేను
అగడుసేసినదావి ననవయ్య; నేము విన్ను
యెగసక్కేలాడేమా యేల నీకు వెఱపు ॥ ఇందు ॥

బదలిక గాకుండా పలుకకుండఁగనేల
కదుఁ జేయి చాఁచవయ్య కానుకిచ్చేను
ఐదియ నలయించినసతినే అనుటగాక
సడిఁబెట్టేనా నిన్ను సారెనేల వెఱపు ॥ ఇందు ॥

అంగపువాసనకుఁగా అందకు రాకుండనేల
కొంగి శ్రీవేంకటేశ కూడితి నేను
అంగడిఁ బెట్టినదావి ననరా; నే నలమేలు-
మంగను నన్నేలితివి మరి యేల వెఱపు ॥ ఇందు ॥ 492

రేకు 1383 శంకరాభరణం

ఇందుకు జంకించనేలే తాను
సందడి నావల్ల చల మున్నదా ॥ పల్లవి ॥

వొద్దమండఁగా వొరసీఁ జన్నులు
పెద్దరికానకుఁ బెనఁగేనా
సుద్దులు చెప్పఁగా సోఁకె నాకెమ్మోవి
వుద్దండము లిందుకు నున్నవచే ॥ ఇందు ॥

పీడె మియ్యఁగా వెస గోరు సోఁకె
జాడతో తను నే సాదించేనా
పాడఁగానే తనపైఁ జెమట చిందె
యీడనే పంతాలు హెచ్చెనటే ॥ ఇందు ॥

సరసమాడఁగా సమరతు లబ్బెను
నెరపి దొరతనము వించితినా
కరుణించి శ్రీవేంకటేశుఁడు గూడె
గురుఁడు మరునికిసిఁ గొంకెనటే ॥ ఇందు ॥ 493

ఆహిరినాట

దొరవు సారెకు విన్ను దూరవచ్చునా
యిరవై నీవే మమ్ము నేలేవు గాక ॥ పల్లవి ॥

మనసువచ్చితే నీవే మన్నించేవుగాక మమ్ము
యెనలేక కొసరఁగా నేమి వచ్చీవి
వనములతీగెలు వసంతకాలమునాఁడు
ఘనమై పూచినపాటే కాచీఁగాక ॥ దొర ॥

కరుణ నీకుఁ బుట్టితే కలసేవుగాక నేఁడే
వరుసఁ బెనఁగఁగాను వచ్చేదేమి
గరిమ నేరులు వానకాలమున మేఘాలు-
కురిసినపాటి నీళ్లు పారుఁగాక ॥ దొర ॥

యేలితి శ్రీవేంకటేశ యాదేరించేవుగాక
కాలమెల్లాఁ గోరఁగాను కలిగేదేమి
తాలిమితోఁ జెఱకులు తతికాలమునాఁడు
చాలా ముదిరినపాటి చవిపుట్టుఁగాక ॥ దొర ॥ 494

నాగగాంధారి

నాకు నీవే గురి నీకు నేనే సాక్షి
దాకొని నన్ను నిట్టె దయఁజూడఁగదరా ॥పల్లవి॥

యేరా నీమాఁట లెందాఁకా నాదేవు
గారవించి నాకుఁ గాఁగిలీరా
చేరి చూడఁగానే చెక్కులెల్లాఁ జెమరించె
తారుకాణాయ వలపు దయఁజూడఁగదరా ॥నాకు॥

జఱపులఁ బెట్టఁగానే సరివొద్దులాయను
మఱి పచ్చడము గప్పి మన్నించరా
చిఱునవ్వు నీది చూచి చిమ్మిరేఁగెఁ బులకలు
తఱి నీకే తెలుసును దయఁజూడఁగదరా ॥నాకు॥

గక్కన నీవు గూడఁగా గనమాయ కోరికలు
మొక్కేఁగాని నాకు మోవియ్యరా
విక్కి శ్రీవేంకటేశుఁడ నినుఁజూచి దప్పిదేరె
దక్కితివి నన్ను విట్టె దయఁజూడఁగదరా ॥నాకు॥ 495

నాదరామక్రియ

ఎటువలె నమ్మించీనే యిఁకఁ దనచిత్తము
అటమటముల కోప వడఁగరే అతని ॥పల్లవి॥

మొగము చూచునందాఁకానే మంచినయెడమాటలు
నగినదాఁకానే నంటునేర్పులు
తగులైనదాఁకానే తలపోఁతలెల్లాను
అగపడ్డదాఁకానే ఆసలన్నియును ॥ఎటు॥

ననుపై నదాఁకానే నయగారితనములు
మనసుగన్నదాఁకానే మంతనములు
చనవిచ్చుదాఁకానే సముకపుఁగొలువులు
యెనసినదాఁకానే యిచ్చకములు ॥ ఎటు ॥

తతి గూడుదాఁకానే తరితీపులన్నియును
రతిఁ జొక్కుదాఁకానే సమ్మతిమొక్కులు
యితవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
సతమైనదాఁకానే చవులెల్లాను ॥ ఎటు ॥ 496

## హిందోళవసంతం

మంచికాలమాయ మరునిరాజ్యాన
కొంచక యీతనిఁ గొనియాడరే ॥ పల్లవి ॥

సరసమాడఁగఁ జవులు పుట్టెను
గరిమ నావిభుఁ గంటిరటే
తెరదియ్యఁగానే తేనెమోవీ నూరె
కరుణ నామీఁదఁ గలిగెనే ॥ మంచి ॥

కానుక లియ్యఁగఁ గాంక్షలు పుట్టెను
వీనినేరుపులు వింటిరటే
నానుపుఁజెమట నవ్వులు రేఁచెను
మానక నిన్నిట్టె మరిగెనే ॥ మంచి ॥

పూవుల వేయఁగఁ బొందులు గూడెను
శ్రీవేంకటేశు మెచ్చితిరటే
చేవట్టి తియ్యఁగ చెలఁగెఁ గళలు
వావితో నాకిట్టె వలచెనే ॥ మంచి ॥ 497

నాగవరాళి

భోగించవయ్యా మంచిభోగములెల్ల
తీగెసాగినమోహమే దిష్టసంపదాయను ॥ పల్లవి ॥

పలుకుఁదేనెలు నీపైఁ బలుమారుఁ జిందఁగాను
కలిమిఁ బన్నీటిజలకములాయను
కలికి నవ్వులు నట్టె కలయఁగఁ జల్లఁగాను
అలరి కప్పురకాపునై మించెను ॥ భోగిం ॥

జిగి సింగారరసము చేరి నీపై నొలుకఁగా
పొగరుమించుల తట్టుపుణుఁగాయను
మగువకాంతులు నిన్ను మచ్చికతో నొరయఁగా
సొగసుగాఁ జాతుకొన్న సొమ్ములాయను ॥ భోగిం ॥

అలమేల్మంగ నీవురమందు నెలవుకొనఁగా
బలిమి నన్నిటా నీభాగ్యమాయను
యెలమి శ్రీవేంకటేశ యీకె నినుఁ గూడఁగాను
కలకాలమును నిట్టె కాణాచాయను ॥ భోగిం ॥ 498

రేకు 1384 దేవగాంధారి

నీయంతవట్టుకు నీవు నెరవాదివి
పాయపుసతులమేవిబడలి కెఱఁగవు ॥ పల్లవి ॥

తగవు జెప్ప జాణవు తరుణులకై తేను
యొగసక్కెపునీచేఁత లెంచుకొనవు
మొగము చూచితే నీకు మోవినే నవ్వులు వచ్చు
అగడైనకాంతలు అలసే దెఱఁగవు ॥ నీయం ॥

అందాలు సేయనేర్తువు అంగనలమాటలు
విందుల నీసుద్దులెతే విచారించవు
చెంది నీకు మొక్కితేను సిగ్గులు పైపైనే వుండు
గందువ చెలులలోనికాక నీవెఱఁగవు ॥ నీయం ॥

వొక్కటి సేసునోపుదు వొరసైనసవతుల
తక్కరి శ్రీవేంకటేశ తరి యెంచవు
మిక్కిలి కూడితే నలమేల్మంగనని చొక్కవు
దక్కినట్టివనితలతచ్చన లెఱఁగవు ॥ నీయం ॥ 499

వరాళి

తనంతనే మంచివయ్యీ తగవాతిపనులెల్లా
యెనసి యాతని వంక లెట్టు దిద్దే మిపుడు ॥ పల్లవి ॥

మలసి వొడఁబరచ మనవనమా ఆతఁడు
తెలిసి మాటలనే పందిలి వెట్టీని
కలికి చెనకితేనే గడుసు విడుచుఁగాక
చెలుల మీతని నేమినేయఁగల మిపుడు ॥ తనం ॥

తాటించిపెనఁగ మనతరములా యీతఁడు
తేటలనేరుపులు గాదెలఁబోసీని
నాటించేయింతిగోరికె నయానకు వచ్చుఁగాక
యేటతోఁ జెలుల మింతే యేమినేసే మిపుడు ॥ తనం ॥

చిమ్మిరేఁచనోపుదుమా శ్రీవేంకటేశ్వరుఁడు
ముమ్మడిఁ దననిజమే మొలపించీని
పమ్మి యలమేలుమంగ పైకొనఁగాఁ గూడెఁగాక
ఇమ్ముల నిద్దరిభావ మెట్టుమెచ్చే మిపుడు ॥ తనం ॥ 500

పాడి

బంతిపక్షములనే బదుకదొరకొంటివి
వింతవింతచవులే వెదకేవు ॥ పల్లవి ॥

ఆపె చేపట్టుకుండఁగా అట్టె నాతో మాటాడేవు
తీపులను జంకించి తిట్టదా నిన్ను
యేపున నొకతె నీకు నేఁకారఁగానే నీవు
పైపైనే మాకింత బత్తిసేసేవు ॥ బంతి ॥

కన్నుల నాపె మొక్కఁగా కడు నాతో నవ్వేవు
సన్నల ముందలవట్టి సాదించదా
మున్నిటనుండి యొకతె మొగము చూడఁగానె
వన్నెలుగా నామీఁద వలపు చల్లేవు ॥ బంతి ॥

విందువెట్టి యాపె నీకు విడెము చేతికియ్యఁగా
కందువఁ గూడుతా నన్నుఁ గాఁగిలించేవు
అంది నే నలమేల్మంగ నాపె నీకుఁ జొక్కఁగాను
పొంది శ్రీవేంకటేశుఁడ భోగించేవు ॥ బంతి ॥ 501

లలిత

ఎంత తాలిమిగలది యీమగువ
వింతలు సేయక నిన్ను వేఁడుకొనెను ॥ పల్లవి ॥

యెనలేనిచేఁతలు నీవేమేమి సేసినాను
ననుపుసేసుక ఆపె నవ్వు నవ్వెను
కొనబుతనాన మరి గురు లెన్నియుండినాను
చనపుసేసుక మోవి చవిగొనెను ॥ ఎంత ॥

కడనుండి యెందరేసికాంతలఁ దెచ్చుకొన్నాను
బడిబడి నీమీఁద బత్తిసేసెను
తడవుగా నాడనుండి తగ విప్పుడు వచ్చినా
వొడివట్టి తీసి నీతో నొనగూడెను ॥ ఎంత ॥

పోరచి తమ్ములము నీపుక్కిటనే వుండఁగాను
గారవించి కాఁగిటఁ గలసె నిన్ను
యీరీతి శ్రీవేంకటేశ యెంత రతిసేసినాను
ఆరయ నోపననక అట్టె సమ్మతించెను ॥ ఎంత ॥ 502

మంగళకౌసిక

చెప్పఁగదరా నాతో సిగ్గువడక
చొప్పులెత్తి చొప్పులెత్తి సొలసి యేమనెరా ॥ పల్లవి ॥

పంతాన మాయింటికి పలుమారు రాఁగాను
యింతి నీమొగము చూచి యేమనెరా
చెంతల నేఁ దప్పటి నీచెక్కులరేకలు చూచి
మంతనానఁ జెవిలోన మఱియు నేమనెరా ॥ చెప్పఁ ॥

చెచ్చెర నీవు నాచేతికి లోనై వుండఁగా
యెచ్చుకుందులాడి యాపె యేమనెరా
పచ్చిచెమటలమేను బాఁతిపడి కాఁగిలించి
విచ్చనవిడివి నీతో వెంగేన నేమనెరా ॥ చెప్పఁ ॥

మఱఁగులేక నీవు నామంచముపై నుండఁగాను
యెఱిఁగి కొసరి నిన్ను నేమనెరా
యెఱుకతో శ్రీవేంకటేశ యేలితి విద్దరి
జఱసి నిన్ను మెచ్చి [1] సమ్మతించేమనెరా ॥ చెప్పఁ ॥ 503

1. సమ్మతించి + ఏమనెరా.

సామంతం

రాఁగదే నీవొప్పు రమణుని కిట్టె
చేఁగలుదేరియు చిగురాయనే ॥ పల్లవి ॥

చెక్కులచేఁత(చేతు?)లు సిగ్గులమొక్కులు
అక్కరతో నీకమరెనే
అక్కజమై పతి కివి చూడఁజూడ
తక్కక తలపోఁతలై మించెనే ॥ రాఁగ ॥

పలచనినవ్వులు పయ్యదకప్పులు
చెలియ నీకైతే సింగారమే
నెలవై నీవిభునికి నివియెల్లా
అలరి సందించి ఆసలాయనే ॥ రాఁగ ॥

కారేటిచెమటలు కాఁగిలింపులును
నేరుపుతోడుత నీభాగ్యమే
యీరీతి శ్రీవేంకటేశ్వరుని కివి
సారపురతికిఁ జవులై వున్నవే ॥ రాఁగ ॥ 504

రేకు 1385 రామక్రియ

ఎవ్వరు గలిగినాను యింత నేరరు
నివ్వటిల్లినదొరవు నీవౌదువే ॥ పల్లవి ॥

మఱి వలపించితివి మచ్చికతో రమణుని
మెఱసి నేర్పరులలో మేఁటివౌదువే
వెఱపించుకంతా లేక వెంటవెంటఁ దిప్పితివి
నెఱతనపుజాణవు నీవౌదువే ॥ ఎవ్వ ॥

చొక్కించి విభునిమేనిసొ మ్మిప్పించుకొంటివి
నెక్కొన్నభాగ్యజీవివి నీవౌదువే
చెక్కు నొక్కి నీపనులు సేయించుకొంటివి
నిక్కముఁబంతకత్తెవు నీవౌదువే ॥ ఎవ్వ ॥

ఇయ్యెడ శ్రీవేంకటేశు నిన్నిటానుఁ గూడితివి
నెయ్యపువాసికత్తెవు నీవౌదువే
వొయ్యనే ఆతని నన్ను నొనగూరిచితి విట్టె
[1]నియ్యందే దయగలదః నీవౌదువే ॥ ఎవ్వ ॥ 505

తెలుఁగుఁ గాంబోది

పిన్నతనాలే సేసేవు పెద్దవెరిగి
విన్నపములెల్లాఁ జేసి వేసరితి ॥ పల్లవి ॥

యిదివో నీ విందాఁకా నేడ నుంటివయ్యా
వెదకివెదకి విన్ను వేసరితి
వదలక పనపెటువలె నంటెనయ్యా
కదిసి తోమి తోమి కడిగి వేసరితి ॥ పిన్న ॥

యిటువలె పనులు నీవేమి నేసితివయ్యా
విటతనా లివి చూచి వేసారితి
ఘటన నెవ్వతె నేస్తకాఁడ వైతివయ్యా
అటమటాలెల్లా దిద్ది అప్పుడే వేసరితి ॥ పిన్న ॥

వాడిక నెవ్వతె యలవాటు సేసెనయ్యా
పీడెపుమోవి యిచ్చి వేసారితి
యీడనే శ్రీవేంకటేశ యేలుకొంటి వౌనయ్యా
కూడిన నీరతు లెంచికొవి నే వేసరితి ॥ పిన్న ॥ 506

1. నీ+అందే. ఇది వింత్రిక సంధి.

## నాదరామక్రియ

అవునయ్యా మంచివాఁడ వౌదువయ్యా
యివలానవలా విన్ను నింతసేయఁజెల్లునా ॥ పల్లవి ॥

అంగనచే నొకమాఁట అప్పణ యిప్పించరాదా
చెంగట నీచెప్పినట్టు సేసేఁగాని
ముంగిటను నీవూడిగమున కంపినంతలోనే
యెంగిలిగా నీకు నే నింతసేయఁజెల్లునా ॥ అవు ॥

చెలిచేతఁ దనకిది సెలవనిపించరాదా
అలరి నీతోఁ బెండ్లాడేఁగాని
కలికి నాచేత నీకు కాని కంపినంతలోనే
యెలమి విన్నంటుకొని యింతసేయఁజెల్లునా ॥ అవు ॥

వనితచేత నాకు వంతు పెట్టించుకోరాదా
వొనర శ్రీవేంకటేశ వూఁకొనేఁగాని
చెనకి నీతో మాట చెప్పి రమ్మన్నంతలోనే
యెనసితివి నన్ను నే నింతసేయఁజెల్లునా ॥ అవు ॥ 507

## శంకరాభరణం

పొంచి నీతొల్లిటిపొందులు చూతము
మించి నిజమైతే మెచ్చేనయ్యా ॥ పల్లవి ॥

తెరమఱఁగున తెలివ మాఁటాడె
అరుదంది నీవు ఆలించేవు
తాతెయ్యౌ అరసి యెఱుఁగుదువా ఆపె యెవ్వతెయ్యౌతా
శిరసెత్తి నాతోఁ జెప్పవయ్యా ॥ పొంచి ॥

చేయిచాఁచి విన్ను చెండున వేసెను
సోయగాన నట్టె చూచేవు
దాయకపాయక తలఁచుకొంటివా
యీయెడ నా కానతియ్యవయ్యా ॥పొంచి॥

గక్కనఁ బైకొని కాఁగిలించుకొనె
చిక్కి ధ్యానములు సేసేవు
యిక్కువ శ్రీవేంకటేశ నన్నేలితు
చొక్కి నవ్వేవు నాసుద్దు లివయ(యా?) ॥పొంచి॥ 508

శుద్ధవసంతం

కపటాలు వద్దుగాక కాంతలతోను
యిపుడు చెల్లదా నీకు యెంతసేసినాను ॥పల్లవి॥

తమకాన నాపెపేరు తడవితి వింతేకాక
మమకారము నామీఁద మఱచేవా
భ్రమసితినంటా నాతో బాసలు సేయఁగనేల
జమళి నెందరైనా దోసములా నీకేమీ ॥కప॥

ననుపున నాతోఁడ నవ్వితి వింతేకాక
యెనసి నన్ను మన్నించ కేల మానేవు
పనిపరాకంటా నొడఁబఱచఁగ నింతయేల
తనివి చాలకుండితే తగదా నీకేమీ ॥కప॥

సొలసి మొక్కఁగా నాపెఁ జూచితి వింతేకాక
కలసితివి నన్ను నీకద మున్నదా
తొలుతటిపొందులంటా తొరలించ విపుడేల
చెలితో శ్రీవేంకటేశ సిగ్గా నీకేమీ ॥కప॥ 509

సింధురామక్రియ

మేలు మేలయ్యా నిన్ను మెచ్చితిమి
తాలిమితోడుత నేఁడు తగ వెఱఁగితివా ॥పల్లవి॥

సముకాన మెచ్చేవు సారెసారెఁ బొగడేవు
రమణిగుట్టెఱఁగవా రతులఁ దొల్లి
చెమటలు దుడిచేవు చేసురటి విసరేవు
నెమకి చుట్టరికము నేఁ డెఱఁగితివా ॥మేలు॥

చెక్కులిట్టె నొక్కేవు శిరసిట్టె దువ్వేవు
చక్కఁదనములు నీ వెంచవా తొల్లి
అక్కరతోఁ బొదిగేవు ఆసలెల్లాఁ జూపేవు
యిక్కువతో వలపులు యిప్పుడెఱఁగితివా ॥మేలు॥

కందువలు చూపేవు కాఁగిటను వించేవు
పొందులు యివెల్లాఁ దలపోయవా తొల్లి
అంది శ్రీవేంకటేశుఁడ అంగనఁ గూడితి విట్టె
అందపువేడుకలు నేఁడట్టె యెఱఁగితివా ॥మేలు॥ 510

రేకు 1386 ముఖారి

వెలయఁ బెండ్లాడితివి వెఱపేఁటికి
వెలకా వేగు నుండఁగా వెఱపేఁటికి ॥పల్లవి॥

పాదిపంతము లెరిఁగి బ్రదికించేమొగఁడవు
వేడుక నీవు సేయఁగ వెఱపేఁటికి
వాడికసతులలోన వలసినయట్టు మన్నించి
వీడెము నియ్యఁగాను వెఱపేఁటికి ॥వెల॥

ఆస యిచ్చినవాఁడవు ఆదరించిననామీఁద
వేసితివి నీచేయి వెలిపేఁటికి
యీసుద్దులెల్లా వివి యెదుటనే నీవుండి
వేసారక బాసియ్యఁగ వెలిపేఁటికి ॥ వెల ॥

ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిలించి నన్ను నేలి
వెనుబలమై యుండఁగా వెలిపేఁటికి
పనితోడ రతులను పంతమిచ్చి సారెసారె
వినయాలు సేయఁగాను వెలిపేఁటికి ॥ వెల ॥ 511

రామక్రియ

నయమున నెంతయినా నవ్వవయ్యా
జయముగా నీకుఁ జేయిచాఁచితే నేమాయను ॥ పల్లవి ॥

వేడుకై తేఁజాలు నీకు వేమారుఁ బువ్వులను
వీడుపడకుండా నన్ను వేయవయ్యా
కోడెకాఁడవు మొదల కొమరెవయసుదాన
యీడనే పంతము నేను యిచ్చితే నేమాయను ॥ నయ ॥

చలము చెల్లితేఁజాలు సరుగఁ బన్నీటను
చలువగా వసంతము చల్లవయ్యా
బలిమికాఁడవు నీవు బత్తిగలదాన నేను
వాలిసి నీచేఁతలకు నోర్చితే నేమాయను ॥ నయ ॥

కావలసితేఁజాలు కాఁగిలించి నీవు నన్ను
యీవల విన్నిటాను యేలవయ్యా
శ్రీవేంకటేశుఁడ నీవుచేకొన్నయాలను నేను
మోవరాని వలపుతో మొక్కితే నేమాయను ॥ నయ ॥ 512

## పాడి

చూతముగా నేఁడు నీసుగుణతనములెల్లా
యేతులతు నెంచితే వూరెల్లా గొల్లెతలే ॥ పల్లవి ॥

వంతుల కింతులు నీపై వలపులు చల్లేరు
యెంతవి మోచేవయ్యా ఇప్పుడు నీవు
దొంతులువెట్టే రప్పటి దొడ్డదొడ్డకుచముల
అంతటి కీపురమెట్టు అనుకొనీనో ॥ చూత ॥

మోవులెత్తుకొ నిందరు మోవితేనె లొసఁగేరు
యేమి సేసేవయ్యా నీవు యీఁతామోఁతలు
వాములు వేసేరు నీపై వడిగా రేపల్లెవారు
వోముచు నీతురుమెట్టు వోరుచుకొనీనో ॥ చూత ॥

సొలసి కన్నుఁగలువ చూపులనుఁ బూజించేరు
కొలఁదెట్టు పెట్టేవయ్యా కుప్పలాయను
అలమి విన్నుఁ గూడి అందరముఁ బిలిచేము
వెలయ శ్రీవేంకటేశ వీను లెట్టు వొందీనో ॥ చూత ॥ 513

## భైరవి

ఏమి గలిగిన నేనే యిముడుకొందుఁగాక
వేమారును నీగుట్టు వెలివేతునా ॥ పల్లవి ॥

చెలరేఁగి నీవు నాతో చెప్పినమాటలెల్లా
అలరి తెరమాఁటున నాపె వినెను
చెలువుఁడ నేనే చెప్పితినంటా నీవు
పలికేవు నే విన్ను బయలుపరతునా ॥ ఏమి ॥

ననిచి నాతో [1]నాపెను నవ్వీన నవ్వులెల్లా
తనకుఁదానే యెట్టో తాఁ జూచెను
ఇనుమడిగా నేనే యెరిఁగించితినంటా
గునిసేవు నే విన్ను కొరత లెన్నుదునా ॥ ఏమి ॥

ఆపెనేసినగుఱుతు లట్టె చూపినవెల్లా
వైపుగాఁ దెలిసె నెవ్వరు చెప్పిరో
యేపున శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
రూపించేవు నే విన్ను రొచ్చులు సేయుదునా ॥ ఏమి ॥ 514

మాళవిగౌళ

తఱితో నీచేతిదింతే ధర్మపుణ్యము
యెఱుఁగుదు మన్నియు విన్నేమనేమయ్యా ॥ పల్లవి ॥

చెక్కుటిచేతితోడ సిగ్గులనవ్వులతోడ
తక్కక చెలి యింటిలో తా నున్నది
చొక్కటాలాడేవు నీవు సుదతులతో యీడ
యిక్కడ విందరము విన్నేమనేమయ్యా ॥ తఱి ॥

సింగారభావాలతోడ చెంపచెమటలతోడ
అంగన మేడలోన ఆసాస నున్నది
ముంగిట నీవై తేను కమ్మక రచ్చలు సేసేవు
ఇంగితము గంటిమి నిన్నేమనేమయ్యా ॥ తఱి ॥

కన్నులతేటలతోడ కదుఁదమకముతోడ
యెన్నిక నీకాఁగిటిలో యింతి వున్నది
మన్నించి శ్రీవేంకటేశ మంచముపై నున్నాఁడవు
యిన్నిటాను జాణఁడవు నిన్నేమనేమయ్యా ॥ తఱి ॥ 515

1. ఆపెను = ఆపెయును అనియా? ఆపెను తరువాత 'నీవు' అనియుంటే అన్వయము సులభమే మో?

దేసాళం

ఏల తప్పులువట్టేవు యిట్టె నన్ను మన్నించు
తాలిమితో నుండితేనే తగ నీ కుచ్చితమా ॥పల్లవి॥

నీటున వచ్చి విధాలా నీచేత నేఁ దనిసితి
మాటలాడకుండితేనే మంకుఁదనమా
చీటికిమాటికి లోలో సిగ్గులనుఁ దలవంచి
గాఁటానఁ జూడకుండితే గర్వమా ఇది ॥ఏల॥

మలగుపై నొరగుండి మరి నీవు రాఁగాను
తలుపు మూయవచ్చితే దంటతనమా
పొలసి నీవు నన్నుఁ బూవులను వేయఁగాను
కలఁగక వుండితేనే గట్టువాయినా ॥ఏల॥

రట్టుగాను నీవు మాటలిట్టె నాతో నాడఁగాను
గుట్టుతోడ నుండితేనే గొంటుఁదనమా
యిట్టె శ్రీవేంకటేశ యేలి కాఁగిలించితివి
నెట్టన విన్ను మెచ్చితే నిండినరాజసమా ॥ఏల॥ 516

రేకు 1387 ఆహిరి

మంచివాఁడ వౌదువయ్య మగువ నింత యేఁతురా
అంచెల నిప్పుదే నీవు ఆదరించవలదా ॥పల్లవి॥

మగవాఁ డేమిసేసినా మాటలే పెంతురుగాక
తగవులఁబెట్టుదురా తరుణులు
సొగిసి నీ వెఁతేసిజూజగాఁడవై నాను
తగులువిరిపందేలు తరుణు లాడుదురా ॥మంచి॥

చలము సాదించేవాని జంకింతురుగాక
బలువులు చూపుదురా పడఁతులు
వెలలేనివలపులవేఁటకాఁడవు నీవైతే
చలివాసి తమగాలు సకియ లెక్కుదురా ॥ మంచి ॥

చేవలు మీరినవానిఁ జేవట్టి తీతురుగాక
వావాతఁ దిట్టుదురా వనితలు
శ్రీవేంకటేశ యీపెను చేరి నీవెంత గూడినా
కావిరిఁ దమగుట్లు కాంతలు చెప్పుదురా ॥ మంచి ॥ 517

బౌళి

ఇట్టె ఆదరించరాదా ఇఁకనైనాను
అట్టాయ నిందరిలోన నెట్టన యీరమణి ॥ పల్లవి ॥

పట్టెమంచముపై నీవు పవ్వళించి వుండఁగాను
బట్టబయ లాపె వచ్చి పాదాలొత్తీని
గుట్టున నీవది యెఱుఁగుదువో యెఱఁగవో
వెట్టిసేవలు సేసెను వెలఁది యిందాఁకను ॥ ఇట్టె ॥

సందడిఁ బరాకై నీవు చదురంగమాడఁగాను
అంది యీకె చెవిలో నేకాంతమాడీని
విందువలె నీ వవి వింటివో వినవో కాని
మందుల నూరె మగువ యిందాఁకను ॥ ఇట్టె ॥

కొండపై శ్రీవేంకటేశ కొలువై నీ వుండఁగాను
నిండుఁజన్నుల నొత్తీవి నిన్ను నాపె
అండనే నన్నేలితివి అది చూచితివో లేదో
బందుసేసె నిన్నిటాను పడఁతి ఇందాఁకను ॥ ఇట్టె ॥ 518

## సామంతం

అనతీవయ్యా అనుమానించక
　దానికేమి యింకఁ దప్పుగాదు ॥ పల్లవి ॥

రవ్వలు సేసిటు రాపై తివి నిన్న
　నవ్వులు నవ్వఁగ నమ్మితివి
　యెవ్వరో చెప్పఁగ నీఁడ నున్నాఁడవు
　చివ్వన వలపులు చేచిక్కీనా ॥ అన ॥

అగడుగ నాకెఅండనే వుంటివి
　మొగము చూడఁగా మొక్కితిని
　వెగటుదీరఁగ వీడెమిచ్చే వీఁడ
　తగవుతో దయదలఁచితివా ॥ అన ॥

దీ(ధీ?)రత వెంటనే తెచ్చితి వొకతెనుఁ
　గోరి మన్నించఁగఁ గూడితివి
　యీరీతి శ్రీవేంకటేశ చొక్కితి విందు
　యేరా చనవెల్లా నిచ్చితివా ॥ అన ॥ 519

## హిందోళం

నీవల్ల వచ్చినమేలు నీకే తెలుసును
　ఆపటించి నేను వినే నానతీవయ్యా ॥ పల్లవి ॥

తక్కక నిన్ను విట్టె తప్పకచూచితేను
　చెక్కునఁ జేయివెట్టుక సిగ్గువడేవు
　చక్కని నీమేనికి మచ్చములేమైనా వచ్చెనో
　అక్కరతో నే నెఱఁగ నానతీయవయ్యా ॥ నీవ ॥

నెయ్యముతోడుత విట్టె నీమీఁదఁ జేయివేసితే
వొయ్యనే చేతులెత్తి వొద్దుకొనేవు
నెయ్యాన మరుముద్రలు నెలఁతలెల్లా వించిరో
అయ్యెడఁగలసుద్దులు ఆనతీవయ్యా ॥ నీవ ॥

ముచ్చట శ్రీవేంకటేశ మోవితేనె లడిగితే
రచ్చల నవ్వుతాను శిరసువంచేవు
యెచ్చరి నన్నుఁగూడితి వింకా నేమిదలఁచేవో
అచ్చలాన నాకిట్టె ఆనతీవయ్యా ॥ నీవ ॥ 520

ముఖారి

ఏమీ ననకురే యిచ్చకములే యాడరే
చేముంచి నవ్వకురే సిగ్గువడీ నాతఁడు ॥ పల్లవి ॥

గందము మేనఁ బుయ్యరే కప్పురము నోటికీరే
యెందుండి వచ్చెనో విభుఁ డింత యలసి
విందువలె మరి నేను వెసక మాటాడేఁగాని
చెంది మీరు మాటాడరే సిగ్గువడీ నాతఁడు ॥ ఏమీ ॥

దప్పికిఁ బన్నీరియ్యరే తామరలు ముడువరే
కప్పి యేపనిసేసెనో కడునలసి
చప్పుడుగాక వెనక నంగడిఁ గూచుండేఁగాని
చిప్పిల మీరుండరే సిగ్గువడీ నాతఁడు ॥ ఏమీ ॥

చేసురటి విసరరే శ్రీవేంకటేశుఁడు నేఁడు
రాసికెక్క నన్నుఁ గూడె రతి నలసి
వేసరక యీసేసలే వెనకఁ బెట్టేఁగాని
సేసలు మీరు వెట్టరే సిగ్గువడీ నాతఁడు ॥ ఏమీ ॥ 521

సాళంగం

పాయపువాఁడవు నీకు పచ్చిసేఁతలు బాఁతా
ఆయములు దెలిసియు నడిగేఁగాక ॥పల్లవి॥

చెక్కులఁ గళలు నిక్కి చేవదేరెఁ గెమ్మోవివి
యెక్కుడఁ గలిగెనయ్య యివి నీకు
చక్కనిరమణులతో సాముసేసేవాఁడవు
అక్కరా నీకివి పూర కడిగేఁగాక ॥పాయ॥

చెంగలించె నీకన్నులు చెమరించె మేనెల్లా
అంగవించి యేడఁజేరెనయ్యా నీకు
అంగడివలపులకు ఆసపడేటివాఁడవు
అంగమేకాదా విన్ను నడిగేఁగాని ॥పాయ॥

ముంచెఁ గాఁగిట వాసన మూఁపులు మూఁడాయను
కొంచక యెందు నంటించుకొంటివయ్యా
యెంచుకొని శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అంచల నీసాజమే అడిగేఁగాక ॥పాయ॥ 522

రేకు 1388 రామక్రియ

కపటపునీసుద్దులు కన్నవేకావా
నెపమున నీనేరుపు నెఱపఁగవలెనా ॥పల్లవి॥

నేనూ నాతఁడూ నొకటే నీవేమి చెప్పేవే
కానీలేవే యింతయేల కాఁతాళించేవే
దానికేమే సవతివౌత యెఱఁగరా నిన్ను
సోనలుగా వలపులు చౌరవేయవలెనా ॥కప॥

అతఁడు నన్ను మన్నించు నందు కేమిసేసేవే
రాతిరిఁబగలునేల రాఁపుసేసేవే
గాతల నీకుఁ బొత్తుగలుగుట చూపనేల
యీతరవాతనే నీవు యింత నవ్వవలెనా ॥ కప ॥

శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జెనకి కాఁగిటఁ గూడె
కావించి నీవిట్టె ఇచ్చకములాడవే
వావి నీకుఁ గలుగుట వాదవారే యెఱఁగరా
దేవరవలెనే ఇంత తెలుపఁగవలెనా ॥ కప ॥ 523

## పాడి

ఇటువంటిదే పో యెదిరిఁజేసినచేఁత
ఘటన నట్టె తనకుఁ గలుగక పోదు ॥ పల్లవి ॥

వలపులు కడుఁజూపి వాడికలు పచరించి
పలుమారు రమణుని భ్రమఇంచేవు
బలిమినే నీవిట్లా పంతాలు మెరయఁగానే
చెలపచెమటలు నీచెక్కుల్ల నిండెఁగదా ॥ ఇటు ॥

తమకములు గొనవేసి తాలిములు రూపించి
జమళివలపులఁ బతి సాదించేవు
సమకాన నీబింకాలు సారెకు నెరపఁగానే
కొమరెమదము నిన్ను గొబ్బున ముంచెఁగదే ॥ ఇటు ॥

భావించి చూపు చూచి పైపై వినయాలు చేసి
శ్రీవేంకటేశ్వరుఁ గూడి చిత్తగించేవు
సావధానమున రతిసాములు సేయఁగానే
నీ వలమేల్మంగవు నేర్చితివిగదవే ॥ ఇటు ॥ 524

లలిత

ఏమి విన్నవించేము ఇంకా నీకు
కాముని( గన్నతండ్రివి కరుణించవయ్యా ॥ పల్లవి ॥

వేమరు( దరుణిమీ(ద వెల్లావిరి సేసేవు
కామువిగరిడిలోనికా(తాళము
గోమున నీసుద్దులకు గొల్లెత లెట్టోరిచిరో
గామిడివిద్యలకెల్లా ఘను(డవుగావా ॥ ఏమి ॥

పొను(గక వొకమా(టే పోగులుగా( బోసేవు
వనితమీ(దటను జవ్వనమదము
యెనసి పదారువేల నెంతయెలఇంచితివో
వినుపై నయానోదము నీసొమ్మెకాదా ॥ ఏమి ॥

బత్తితోడ సేసలుగా పడ(తిపై( జల్లేవు
చిత్తములోపల( బులిసినగజరు
యిత్తల శ్రీవేంకటేశ యింతి నిన్నెట్టు కూడెనో
వుత్తము(డ వీపనుల కొక్క(డవే నీవు ॥ ఏమి ॥ 525

ముఖారి

ఎక్కుడేమిసేసినాను యెట్టువచ్చునో పనులు
చక్కనిసతులతోడ సంతముగావయ్యా ॥ పల్లవి ॥

చెందివనీసతులలో చిగురు(గొమ్మా చే(గే
యెందరితో సాముసేసే వేమయ్యా
అందరును సరసములాడినట్టే నీవాడి
సందడి గుట్టుసేసుక చక్కనుండవయ్యా ॥ ఎక్కు ॥

కొమ్మలమోవులలోన కొనమొదలును తీపే
యెమ్మెలకు గరిసించే వేమయ్యా
యిమ్ముల విచ్చకముల కిచ్చకములే సేసి
సమ్మతి నడిగినట్టై చనవియ్యవయ్యా ॥ ఎక్కు ॥

యీడసున్న సతులము ఇందరు నీకొక్కవారే
యేడ గొలఁది గూడితి వేమయ్యా
జోడై యలమేల్మంగనుఁ జూచినట్టే కృపఁ జూచి
వోదక శ్రీవేంకటేశ వొద్దనుండవయ్యా ॥ ఎక్కు ॥ 526

శుద్ధవసంతం

వరుసగానివరుస వత్తురా తాను
అరసి నీవొకమాటు అడుగరాదా ॥ పల్లవి ॥

మిక్కిలి నీతో నేను మేలములాడఁగాను
అక్కరతోఁ జూడవచ్చీ నాపె యెవ్వతో
ఇక్కువచెప్పి నీవే యీడకు రమ్మనంటివో
యెక్కువైనతనవొళ్ళి యెద్దతనమో ॥ వరు ॥

పొందుల నీవు నాపొత్తుల నారగించఁగా
విందులు చెప్పఁగవచ్చీ వెలఁదెవ్వతో
యిందుకు నీవు ఆసలేమైనాఁ బెట్టితివో
దిందుపడి తనలోనిదిట్టకూళతనమో ॥ వరు ॥

నే నలమేల్మంగనై నిన్నుఁ గూడివుండఁగాను
కానుక లియ్యఁగవచ్చీఁ గాంత యెవ్వతో
పూని శ్రీవేంకటేశుఁడ పొంది నీమతకమో
తానే నేరుచుకొనినదంటతనమో ॥ వరు ॥ 527

పాడి

నీకే తెలుసుఁగాక నెరజాణతనమెల్లా
  పైకొవి విన్నుఁ గొసరేపాటివారమా ॥పల్లవి॥

పంతమాడేవారితోడ ఁలువు చూపుటగాక
  మంతనాన నవ్వఁగాను మన్నించవద్దా
  వింతవాఁడవా నీవు వెలఁదిలా గెఱఁగవా
  వొంతనుండి విన్నవించి వోదిసేయఁగలమా ॥నీకే॥

చలపట్టినవారితో సాదించుటగాక
  మలసి మొక్కేటివారి మన్నించవద్దా
  పెలుచుమనసా నీది ప్రియము నీ వెఱఁగవా
  తలఁపించి నీమీఁదితరవుకత్తెలమా ॥నీకే॥

గరివించినవారితో గరిసించవలెఁగాక
  మరిగి కూడినవారి మన్నించవద్దా
  అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
  వురముపై నుండఁగా విన్నొదఁబఱచేమా ॥నీకే॥ 528

రేకు 1389 ఆహిరినాట

పిగ్గువడ వించుకంతా చెలరేఁగేవు నీవైతే
  యెగ్గులుపట్టేవారెల్లా నేమందురో ॥పల్లవి॥

ఇంతి నీవు నందలాన యెదురుబడి నెక్కి
  వింతలుగా నేఁగేవు వీదివీదుల
  కంతలనోరణగండ్ల కడమవారెల్లాఁ జూచి
  యెంతేసియీాసులతోడ నేమందురో ॥పిగ్గు॥

సరిగా గుఱ్ఱముమీఁద సతియు నీవును నెక్కి-
వరుసలను నేఁగేరు వాడవాడల
విరతితో మేడలెక్కి నీసతులెల్లాఁ జూచి
యెరవులకాఁతాళాన నేమందురో ॥ సిగ్గు ॥

అలమేలుమంగఁ గూడి అట్టె పల్లకిమీఁద
చెలరేఁగి యేఁగేవు శ్రీవేంకటేశ
కొలిచివచ్చేటినీకొమ్మలెల్లా నట్టె చూచి
యెలమి వేడుకపుట్టి యేమందురో ॥ సిగ్గు ॥ 529

## మాళవిగౌళ

ఒకరిఁ దడవితేను వోరుతురా
మొకము చూడఁగానే [1] మొరతురు గాక ॥ పల్లవి ॥

చేతనొద్దించుకోఁగానే చెలిని పువ్వుల వేసే-
వేతుల కిందరిలోన నిదేమయ్యా
కాతరించి యాపె నిన్నుఁ గసరుచుఁ దిట్టఁగాను
నీతరుణులెల్లాఁ జూచి నిన్ను నవ్వే రిదివో ॥ ఒక ॥

సిగ్గుతోడఁ గొంకఁగానే చెనకుచు కొనగోర
అగ్గలమై చన్నులంటే వదేమయ్యా
బెగ్గిల నాపె నీపెదవి గంటిసేయఁగా
విగ్గుల నీవనితలు నిన్ను నవ్వే రదివో ॥ ఒక ॥

అలమేలుమంగ వచ్చె ననఁగానే కొంగువట్టె-
వెలమి శ్రీవేంకటేశ యేమయ్యా
కలసి ఆపె నిన్నుఁ గళలంటి చొక్కించఁగా
నెలకొన్నకాంతలెల్ల నిన్ను నవ్వే రదివో ॥ ఒక ॥ 530

1. 'మొరయు' ధాతువా?

సామంతం

ఇప్పటి కెఱఁగరాదు యెంత నేము చెప్పినాను
తప్పు నీపై మోచితేనే తలవంచేవుగాని ॥ పల్లవి ॥

ఆపె చెప్పినమాట లన్నె తారుకాణవచ్చె
యేపున నాతో బాసలేల సేసేవు
ఆపనుల నీమోవి అద్దములోఁ జూడరాదా
నీపట్టుకు సిగ్గువడి నిజమాదేవుగాని ॥ ఇప్ప ॥

అందరు విన్నారుకొనే వవి నేఁడు విజమాయ
చెంది యమరించవేల చెల్లఁబెట్టేవు
సందడి నీచెక్కు లవి చమరి చూచు కోరాదా
అందపురేకలకు నీ వటు నవ్వేవుగాని ॥ ఇప్ప ॥

దొడ్డికాడిగొల్లెతలదూరులు దిష్టములాయ
వొద్దుకోనేల శ్రీవేంకటోత్తమ నీవు
జిడ్డు చూచుకోరాదా [1]చెలెలమేలుమంగను
అడ్డము లే కేలితివి అట్టు మెచ్చేవుగాని ॥ ఇప్ప ॥ 531

సాళంగనాట

నీవు గడించినమేలు నీవే యెఱుఁగవలె
నోవల విదే దిష్టము చూచుకొనవయ్యా ॥ పల్లవి ॥

అలమేలుమంగమేనియౌవనరాజ్యమున
మొలకలపులకలు మొలచెను
బలిమితో వలపులపంటలునుఁ బండె నిదె
కలలెక్కలు విందువు గక్కన రావయ్యా ॥ నీవు ॥

1. చెలి+అలమేలుమంగ.

లంకెలై యీకామినిలావణ్యజలధిలోన
వుంతువకోరికలు వోడల వచ్చెను
సంకెలేక తమకపుసరకులు పచారించె
సుంకపుటాదాయము లెంచుకొవఁగదయ్యా ॥ నీవు ॥

రచనల నీకెసింగారములతోఁటలోన
కుచముల బంగారు కొప్పెర లుండె
వుచితాన శ్రీవేంకటోత్తముఁడ నిన్నుఁ గూడె
ఇచటనే దాఁచుకొని యిట్టె బదుకవయ్యా ॥ నీవు ॥ 532

## దేశాక్షి

ఏలినవాఁడవు నీఇచ్చలోవివారము
యేలాగున నడిపినా ఇంతా సంతోసమే ॥ పల్లవి ॥

మలసి నీమాటలకు మారుమాట లాడనేల
వొలిసి వూఁకొంటాను వుండుదుఁగాక
చలపాదివాఁడవు నీజాడలు విడువ వెందు
చెలరేఁగి ఇట్టె చవిసేసుకొనే విన్నియు ॥ ఏలి ॥

చేసుకొన్నబాసల నీచేఁతకు చేఁత మాకేల
వోసరించి నీకు లోనై వుండేఁగాక
ఆసోదకాఁడవు విన్నవిన్నిటాఁ దమపరాదు
వాసితోనే మెచ్చి సేవలుసేసే విపుడు ॥ ఏలి ॥

చేవదేరెఁ గూడితివి సిగ్గుకు సిగ్గిఁకనేల
వోవరిలో నవ్వుకొంటా నుండేఁగాక
శ్రీవేంకటేశుఁడవు చెల్లుబడి విడువవు
భావించి నీవారమై బతికేము నేము ॥ ఏలి ॥ 533

పూర్వగౌళ

చెప్పవయ్య వినేఁగాని చెవులు చల్లఁగా నేఁడు
దప్పిదేరి నీమనసు తమకించెనా ॥ పల్లవి ॥

వలపులనీసుద్దులే వడిగాఁ జెప్పేవు నాతో
వెలయ నింకా నవి వేడుకయ్యీనా
మొలకలు చన్నులంటా ముందరనే పొగడేవు
అలర నందుపై నీకు ఆసలు పుట్టీనా ॥ చెప్ప ॥

నావద్దనే కూచుండి నవ్వులెల్లా నవ్వేవు
చేవదేరి నీమదము చిమ్మిరేఁగెనా
భావించి నేఁ బండుండఁగా పక్క నిట్టె పండుండేవు
కావలసి నామీఁద కరుణ వొడమెనా ॥ చెప్ప ॥

తప్పకిట్టె నామోము తతిగొని చూచేవు
ముప్పిరి నాకింత మోహించితివా
కప్పి శ్రీవేంకటేశుఁడ కాఁగిలించి కూడితివి
యెప్పుడు నాకీచనవు లియ్యదొరకొంటివా ॥ చెప్ప ॥ 534

రేకు 1390 వరాళి

ఇంకానేల మఱఁగులు ఇద్దరికిని
పంకించక సోబానఁ బాడేము నేము ॥ పల్లవి ॥

సురటి విసరి నీకుఁ జూదరాదా అపె దిక్కు
శిరసువంచుక యేల సిగ్గువడేవు
ఇరవుగా నెరిఁగిరి ఇందరు నీసుద్దులు
పరగఁగ సోబానఁ బాడేము నేము ॥ ఇంకా ॥

ఆకుమడిచిచ్చీ నీకు నంది పుచ్చుకొనరాదా
చేకొని మరినేల సిగ్గువడేవు
కోకల మైగుఱుతులు సొరిది బాఇటఁబడె
పైకొలిపి సోబానఁ బాడేము నేము ॥ఇంకా॥

వూడిగము సేసేయాపె నొనగూడి మెచ్చరాదా
చేడెలు చూడఁగానేల సిగ్గువడేవు
కూడితివి నన్ను నిట్టె కోరి శ్రీవేంకటేశుఁడ
పాడితోడ సోబానఁ బాడేము నేము ॥ఇంకా॥ 535

### శ్రీరాగం

[1]చిత్తమురా విన్నపము సేసేఁగాని
తత్తరించ కివ్వలికి దాఁటిరావయ్యా ॥పల్లవి॥

వలపు లీఁతలబంటి వాసులు రొమ్ములబంటి
పొలసితే మాటలు పుక్కిటిబంటి
అలసి అవ్వలనుండి అడిగేవు మాగుట్టు
తలపోఁతయేరులు దాఁటిరావయ్యా ॥చిత్త॥

చింతలు చెక్కులబంటి సిగ్గులు పెందొళ్లబంటి
మంతనా లన్నియుఁ జీలమండలబంటి
బంతి నెదురురేవుల పైకొని లోఁతరసేవు
దంతపుమేడకు నిట్టె దాఁటిరావయ్యా ॥చిత్త॥

కూటమి చంకలబంటి కోరికె చన్నులబంటి
మూటగట్టు సరసాలు మొలబంటి
యీటున శ్రీవేంకటేశ యెనసి నన్ను మెచ్చేవు
తాటించి నీవిట్లానే దాఁటిరావయ్యా ॥చిత్త॥ 536

1. 807 రేకు. 24 సం. 37 వ పాటను పోలినది.

పాడి

చేయివట్టినంటానేల చెలువునిఁ దిట్టేవు
ఆయములు గరఁగఁగా ఆసపడవలదా ॥ పల్లవి ॥

చిక్కనితేనెలతో నీచిగురాకుమోవి చూచి
వుక్కన నీపతికి నోరూరకుండునా
గక్కన నీమోము చంద్రకళదేరఁగాఁ జూచి
పక్కన నీకు నచ్చె బాఁతిపడవలదా ॥ చేయి ॥

పట్టెఁదేసివట్టువనీబంగారుచన్నులు చూచి
చుట్టి యాతనిచూపులు సోఁకఁదగదా
జట్టిగ నందవునీజఘనచక్రము చూచి
రెట్టించి వలపులు రేఁగఁగవలదా ॥ చేయి ॥

సావధానముల నీచక్కఁదనములు చూచి
యీవేళ శ్రీవేంకటేశుఁ డెనసె నౌనె
తావుల నీకొప్పును విత్తరిచూపులునుఁ జూచి
యీవులిచ్చి నిన్ను నురమెక్కించుకోవలదా ॥ చేయి ॥ 537

ఆహిరి

నిన్ను మెచ్చఁగలఁగాని నిష్ఠూరాన కోపను
విన్నటివలెనే నేఁడు విల్పఁగరాదా ॥ పల్లవి ॥

యెన్ని లేవు నీసుద్దులు యిప్పుడు చెప్పేనంటేను
వున్నతి మొకదాకిరి సుంవానఁగాక
పన్ని యప్పటి నాతో బాసలేం నేసేవు
యెన్నఁగ గుట్టుతో నుండనియ్యఁగరాదా ॥ విన్ను ॥

నాకుఁ గొత్త నీనేఁతలు నమ్మి ఇయ్యకొనేనంటే
చేకొని వెల్లావిరులు సేయఁగాక
సాకిరేల తెలిపేవు సతులనందరిఁ దెచ్చి
తూకొని తొల్లిటివెల్లా దొంతిఁబెట్టేవు ॥ విన్ను ॥

కావరావా నీగుణాలు కమ్మటిఁ బొగడేనంటే
నానఁబెట్టి కొంతగొంత నవ్వేఁగాక
పూని శ్రీవేంకటేశుఁడ పొందితివి దూరనేల
మాని పంతమిచ్చితివి మన్నించరాదా ॥ విన్ను ॥ 538

కాంబోది

ప్రియముచెప్పేదే మేలు విగియనేఁటికి
క్రియగూడుమామాటలఁ గృపసేయవయ్యా ॥ పల్లవి ॥

పంతగారినతి విన్నుఁ బట్టినదెల్లాఁ దప్పె
యెంతని వుత్తరమిచ్చే వేమయ్యా
వింతగా చేతులువట్టి వేఁడుకొని విడెమిచ్చి
పొంతనే యేకతమాడి బుజ్జగించవయ్యా ॥ ప్రియ ॥

చెందినవాసికత్తె సేసినదెల్లాఁ జేఁతే
యెందాఁకాఁ దారుకాణించే వేమయ్యా
కందువ నవ్వులు నవ్వి కదుఁ బచ్చడము గప్పి
ఇందరిలో గారవించి ఇచ్చలాడవయ్యా ॥ ప్రియ ॥

మానవతులైనవారిమాటలెల్లాఁ దగవులే
ఆనలేల పెట్టుకొనే వదేమయ్యా
ఔను కడపరాయఁడవై శ్రీవేంకటేశుఁడ
తానకమై దూరితివి దండనుండవయ్యా ॥ ప్రియ ॥ 539

మాళవి

ఎందాఁకా వంకలుదిద్దే వీతవినుద్దులు నాతో
పందెగాఁడై తానిట్లా బదుకనీఁగదవే ॥ పల్లవి ॥

చెల్లుబడిగలవారు సేసినదెల్లాఁ జేఁతే
అల్లదె వొఁగాదని ఆడఁగనేల
పల్లదాన నేఁ దప్పులు పట్టేటిదాననా
బల్లిదుఁడై తానిట్లా బదుకనీఁగదవే ॥ ఎందాఁ ॥

పంతగాండ్లైనవారు పట్టినదెల్లా మాఁటే
యెంతకెంత తనగర్వా లెంచఁగనేల
వొంతమండి నేఁ దనకు బుద్దినేరిపేదాననా
బంతి నుండి తానిట్లా బదుకనీఁగదవే ॥ ఎందాఁ ॥

కూరిమిగలుగువారు కూడినదెల్లాఁ గూటమి
సారెకుఁ గొసరి యింతజాలియనేల
యీరీతి శ్రీవేంకటేశుఁ డెనసె వీఁకఁ బాసేనా
బారకుఁడై తానిట్లా బదుకనీఁగదవే ॥ ఎందాఁ ॥ 540

రేకు 1391 సామంతం

మొక్కేము నీకును ముందుముందుగా నేము
మక్కువసేసి ఇట్టె మన్నించవయ్యా ॥ పల్లవి ॥

తలఁచి నీవే నన్ను దయఁజూచుటగాక
కొలఁదిమీరి యెందాఁకఁ గొసరేను
చలము సాదించేనంటే సతులము నే మెదురా
మలసి ఇంతటనైన మన్నించవయ్యా ॥ మొక్కే ॥

పవివడి నీవే నాపై బత్తిసేయుటగాక
కొనగొనల నెందాఁకాఁ గొసరేసు
మనసు సోదించేనంటే మంకులము నే మెంత
మనసిచ్చి యిపుడైనా మన్నించవయ్యా ॥ మొక్కే ॥

గరిమల నీవే నన్నుఁ గలసి మెచ్చుటగాక
కురులంటి యెందాఁకఁ గొసరేను
యిరవై శ్రీవేంకటేశ యేలితి విల్లాల నేను
మరిగి యింతటనైనా మన్నించవయ్యా ॥ మొక్కే ॥ 541

రామక్రియ

సతుల మిందరమును సంతోసించేము
తతివచ్చె నీక నిట్టె దాఁచకువయ్యా ॥ పల్లవి ॥

కన్నులనే నవ్వుతాను కలకల మాటాడుతా
వున్నది చెలియ నేఁడు వుల్లసానను
మన్నించిననీనుద్దులు మాతోఁ జెప్ప సిగ్గువడీ
అన్నియు నీవైనా నానతియ్యవయ్యా ॥ సతు ॥

మోమునఁ గళదేరుతా ముచ్చటలు నెరపుతా
వేమారుఁ జెలరేఁగీని వేడుకలను
నీమోహపుగుణుతులు నే మడిగితే దాఁచీ
ఆముకొని నీవైనా నానతియ్యవయ్యా ॥ సతు ॥

మోవిఁదేనె లొలుకతా ముంచిసరసమాడుతా
వోవరిలో నిన్నుఁగూడి వున్నదిపుడు
శ్రీవేంకటేశుఁడ నే మెంచితేఁ దానే తలవంచీ
ఆవిధము నీవైనా నానతియ్యవయ్యా ॥ సతు ॥ 542

పాడి

మావలె నుండవలదా మనసు మనసుఁ బొంది
కైవశ మాతఁడు నాకుఁ గలకాలమెల్లను ॥పల్లవి॥

చనవరినందువు జాణ ననుకొందువు
యెనలేనిరమణుని నేల దూరేవే
పెనఁగి పెద్దరికాలు పెంచేది యెఱఁగము
ఘనమై మీగుట్టు నేఁడు కానవచ్చె మాకు ॥మావ॥

నీవే మించితి నందువు నేరుపరినందువు
యీవల నాతని కెంత యేఁకారేవే
భావించి వేసాలు నీవు పచరించే దెఱఁగము
కావిరి వలపు తాడకాణాయ మాకు ॥మావ॥

యెమ్మె చెల్లునందువు యెనసితి నందువు
చిమ్మి శ్రీవేంకటేశుపై చేఁత వేసేవేమె
నెమ్మి నాతఁడె నన్నేలె నీమనసు యెఱఁగము
తెమ(మ్మ?)లై నసంతోసము దిష్టమాయ మాకు ॥మావ॥ 543

కురంజి

ఏమయ్య తగవు నీవెఱఁగనిదా
కామించితే బిగిసే విక్కడి జాణతనమా ॥పల్లవి॥

కోరికతో నిన్ను నాపె కొంగువట్టి తియ్యఁగాను
సారె సిగ్గులువడేది జాణతనమా
నేరుపుతో బత్తిగడు నీమీఁదఁ జేయఁగాను
యీరీతి గుట్టుసేసే విది జాణతనమా ॥ఏమ॥

గోమునఁ బెంచినయట్టిగుబ్బల నిన్నొ త్తఁగాను
సాము సేసే వాపెతోను జాణతనమా
నేమముతోఁ గానుకిచ్చి నిన్నుఁ దప్పకచూడఁగా
ఆమనివవ్వులు నవ్వే వది జాణతనమా ॥ ఏమ ॥

కదలేవినిబ్బరాన కాఁగిట నిన్నుఁ గూడఁగా
జడిసేవు రతులకు జాణతనమా
అదరి శ్రీవేంకటేశ ఆపె నీకు మొక్కఁగాను
తొదరి కొసరే వింక దొమ్మి జాణతనమా ॥ ఏమ ॥ 544

భైరవి

గక్కన చెక్కునొక్కేవు కమ్మటి నీవు
కిక్కిరిసినవేడుకఁ గృపఁ జూడవయ్యా ॥ పల్లవి ॥

నేరుపరిసతినై తే నీతో మాటాడుటగాక
వూరకుండేముద్దరాల నోపుదునా
గారవించి యింతయేల కదిసి వెద్దువెట్టేవు
మారీతి నీవెఱఁగవా మన్నించవయ్యా ॥ గక్క ॥

చన్నులు గొప్పలై తే సరివెనఁగుదుఁగాక
చిన్నదాన నే నింతేసికిఁ గలనా
యిన్నిటా సారెకునేల యిచ్చకముసేసేవు
కన్నులెదుట నుందాన కరుణించవయ్యా ॥ గక్క ॥

మిక్కిలిప్రౌఢనై తే మేలములాడుదుఁగాక
యిక్కువ సిగ్గరికత్తె వింత సేసేనా
వొక్కటైతివి శ్రీవేంకటోత్తమ యేల దూరేవు
తక్కులఁబెట్టక యిట్టె దయఁజూడరాదా ॥ గక్క ॥ 545

శ్రీరాగం

ఏమయ్య నన్నేల యెలయించేవు నీవు
చేముంచి నీపాదాలసేవ సేసేదానను ॥ పల్లవి ॥

వంతుకు నందరివలె వలచినదానా
కాంతుఁడ నీవు మన్నించేకాంతను నేను
దొంతివావులు చెప్పేటిదోమటిలోదానా
మంతనాన నెలకొన్న మచ్చికలోదానను ॥ ఏమ ॥

పూసుకవాసుకవచ్చేపొరుగులదానా
రాసికెక్కెపట్టపురమణి నేను
వేసాలకుఁ గొసరేటివింతపొందులదానా
సేసవెట్టి పెండ్లాడినచేతిలోనిదానను ॥ ఏమ ॥

మించి కూడపెట్టుకొన్న మూఁకలోవిదానా
కంచపుఁబొలకూళ్ల కామిని నేను
యెంచఁగ శ్రీవేంకటేశ యేలితి వేదోదానా
మించిననీపురముపై మేనదాన నేను ॥ ఏమ ॥ 546

రేకు 1392 సౌరాష్ట్రం

ఏలయ్య మాతోడియేలాటాలు
కేలెత్తి మొక్కేము కృపఁజూడవయ్యా ॥ పల్లవి ॥

చల్లలమ్మేవారిసంగడి నుండఁగ
యెల్లవారు విన్ను నేమందురు
గొల్లఁడాయ రాచకొడుకు వీఁడంటా
తొల్లే మధురలో దూరిరి విన్ను ॥ ఏల ॥

అలఁగాపరై అడవి నుండఁగ
యీలీలఁ జొరులు యేమందురు
బాలుఁడాయ పరబ్రహ్మము వీఁడంటా
పోలిమితోఁ గరిపురజను లనిరి ॥ఏల॥

బందిబోయఁ(యీఁ?)డపై పౌఁజులలో నుండఁగ
యిందువిండ్లవా రేమందురు
దండి శ్రీవేంకటోత్తముఁడాయ వీఁడంటా
విందుఁదిరుపతివిలయాలు నగిరి ॥ఏల॥ 547

కన్నడగౌళ

చెక్కుచేతి తోడ చింతించేదేకాక
అక్కలాల మిమ్ము నిఁక నవఁగఁ జోఁచేది ॥పల్లవి॥

చెంతనున్నచెలులే చెలువునికి లోనైతే
మంతన మెవ్వరితోడ మాటలాడేది
[1]కాంతునిమాటలవారగలు మీరే దిట్టితేను
యెంతటివారికినైనా యెట్టు దరించేది ॥చెక్క॥

పిలిచితెచ్చేటివారే ప్రియునిఁ గలసితే
చలము లెవ్వరితోడ సాదించేది
బలిమి నాతనికిఁగా బాసకు మీరే వచ్చితే
యిలమీఁద చుట్టరికా లెట్టుసేసేది ॥చెక్క॥

కాఁగిలించఁబెట్టేవారే కందువలు సోఁకించితే
చేఁగదేర నెవ్వరిపై నేసవెట్టేది
ఆఁగి శ్రీవేంకటేశుమో వప్పుడే నాకిప్పించితే
పాఁగిన మీనేర్పు లెట్టు భావించేది ॥చెక్క॥ 548

1. విభుని మాటలకు గీటురాళ్ళైన మీరే అని యర్థమా? మంచిచెడ్డలను తెలుపునది గదా ఒరగల్లు.

### హిందోళవసంతం

చెలులాల మీరూరకే చేతికి కానికియ్యరే
తలఁచుకొని యన్నిటాఁ దానే మన్నించీని ॥ పల్లవి ॥

పిలిపించ నెంతదాన పెనఁగఁగ నెంతదాన
తలఁపులోపలివాఁడు తానే వచ్చీని
చెలరేఁగి పెండ్లాడినాఁడు చేపట్టినాఁడు తొల్లె
కొలచినందే కొలచి కొత్తసేయవలెనా ॥ చెలు ॥

అగడుసేయఁగనేల ఆకులు వ్రాశంపనేల
తగులాయమైనవాఁడు తానే వచ్చీని
నగి సేసవెట్టినాఁడు నమ్మించినాఁడు తొల్లె
విగిడినందే విగిడి విందవేయవలెనా ॥ చెలు ॥

చొక్కించఁగా నెట్టో సొలయఁగా నది యెట్టో
దక్కి నాకుఁ గలవాఁడు తానే వచ్చీని
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డితఁడే వచ్చి నన్నేలె
మొక్కినందే మొక్కి మరి మోపుగట్టవలెనా ॥ చెలు ॥ 549

### దేసాళం

ఎలయింపుఁజేఁతల నీ వెంత సేసేవు
చలములు సాదించక చనవియ్యరాదా ॥ పల్లవి ॥

మాటలకుఁ దలపెట్టి మనసెల్లా భ్రమఇంచి
ఆఁటదాని నింతయేల అలఇంచేవు
నీటున బుసకొట్టుచు నిలుచుండెప్పటనుండి
గాఁటానఁ బాసుపునను కలయఁగరాదా ॥ ఎల ॥

బిట్టుబయలు నవ్వించి పరాకులు పుట్టించి
చుట్టమవై యీపెనేల సూడువట్టేవు
దట్టపుఁజెమటతోడ తప్పకచూచీ నిన్ను
నెట్టుకొన్నరతులఁ దనివిసేయరాదా ॥ఎల॥

చేతులు మీఁదవేసి చిమ్మిరేఁచి వలపుల-
కాతర మీకె కంటించి కాఁగిలించేవు
యీతల శ్రీవేంకటేశ యెనసి నీకింతి మొక్కీ
రాతిరిఁబగలు నిట్టె రమియించరాదా ॥ఎల॥ 550

బౌళి

చెల్లఁజెల్ల నోయి నీవు సేసినంతాను
కొల్లన నవ్వేవు నీకొంగువట్టఁగాను ॥పల్లవి॥

పంతగాఁడవా వోయి పలుమారుఁ బెనఁగేవు
చెంతనుండి నీసేవసేయఁగాను
వింతవాఁడవావోయి వెరగంది చూచేవు
మంతనాన నేఁడు నీమర్మము లంటఁగాను ॥చెల్లఁ॥

అందగాఁడవా వోయి ఆడినట్టె ఆడేవు
అంది నే సుద్దులు నిన్ను నడుగఁగాను
మందడీఁడవా వోయి మంకులెల్లా నెరపేవు
విందు చెప్పి చెక్కునొక్కి వేఁడుకొనఁగాను ॥చెల్లఁ॥

నాటకాఁడవా వోయి నంటునఁ దలవంచేవు
కొలువుండై కాఁగిటిలో కొసరఁగాను
యీలీల శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
బాలుఁడవా మోవిచ్చితే పచ్చిగాఁ జేయఁగాను ॥చెల్ల॥ 551

పాడి

బలిమాయ ఇఁక విట్టే బతుకరమ్మా
తలమోచి సవతులు దగ్గరఁజోచేది ॥ పల్లవి ॥

ఇచ్చక మాతఁ డాడితే వియ్యకొందువు నీవైతే
హెచ్చిన నేరుపరులే ఇద్దరును
పచ్చిదోఁచె మీమోవుల పనులెల్లఁ జక్కనాయ
తచ్చి సవతుల కిఁకఁ దగుఁజోచేది ॥ బలి ॥

సన్న నాతఁడు చూచితే సారె మొక్కుదువు నీవు
ఇన్నిటా జాణలే మీరిద్దరును
కన్నులఁ దేటలు నిండె కాయములు పులకించె
కన్న విన్న సవతులు కలయఁజోచేది ॥ బలి ॥

శ్రీవేంకటేశ్వరుఁ దేలె సేవ సేసితివి నీవు
యీవల నావల ఘనులిద్దరును
వావి చూచి నన్నుఁ గూడె వరుస వితఁడే నేఁడు
భావించి సవతులిఁకఁ బదరఁజోచేది ॥ బలి ॥ 552

రేకు 1393 దేశి

ఏల సిగ్గులువడేవే యెందాఁకాను
వేళవేళతోఁ బతికి విడెమియ్యవే ॥ పల్లవి ॥

పండినపంటవంటిది పాయపునాఁటిమదము
నిండుఁజెరువువంటిది నెయ్యపుటాస
వుండనుండ నవి లోలో నుడివోవకుండును
అండనుండివపతికి నప్పగించవే ॥ ఏల ॥

పెరతేనియవంటిది ప్రియములతమకము
విరివాసనవంటిది వేడుకనవ్వు
సరికిబేసికి నవి చవిదప్పకుండాను
దొరకె నాతనికే విందులు సేయవే ॥ ఏల ॥

చేవ చిగురువంటిది చెందినకాఁగిటిరతి
భావమునొంపువంటిది పైకొన్నమేలు
వావితోఁ గూడితి విఁక వరుసదప్పకుండాను
శ్రీవేంకటేశ్వరుని సేవ సేయవే ॥ ఏల ॥ 553

## బౌళిరామక్రియ

సమ్మటూరిచెన్నుఁడా జాణఁడ వౌదువయ్య
పమ్మి యన్నిటాను చెల్లుబడియాయ వలపు ॥ పల్లవి ॥

తమ్మిపువ్వుల వేసేవు తప్పకచూచితినంటా
దొమ్మి సేసేవు పాదముతొక్కితినంటా
విమ్మపండు పిందేవు విన్నునే దొబ్బితినంటా
ముమ్మాటికిని ముయికి ముయ్యాయ వలపు ॥ సమ్మ ॥

కోరి పన్నీరు చిమ్మేవు కొంగు నేఁ బట్టితినంటా
గీరేవు గోరను గిలిగించేనంటా
యేరా చన్నులు విసికే విట్టె కొప్పంటితినంటా
మారుకొ నొకటి కినుమడియాయ వలపు ॥ సమ్మ ॥

కప్పురము చల్లేవు కాఁగిట బిగించితినంటా
గుప్పేవు పరిమళాలు కూడితినంటా
యిప్పుడే శ్రీవేంకటాద్రి నేలితివి మెచ్చేనంటా
చప్పుడుమోవితేనెల జంటాయ వలపు ॥ సమ్మ ॥ 554

ఆహిరి

ఎన్నఁ దెలిఁగేవు నీవు ఇంతి నీపైఁజేసేబత్తి
సన్న యెరిఁగి ఇప్పుడే చనవియ్యరాదా ॥పల్లవి॥

చెలియ నీకుఁ గతలు చెప్పి చెప్పి దప్పిగొనె
యెలమిఁ గప్పురబాగా లియ్యరాదా
మెలుపునఁ బాదాలొత్తి మేనెల్లఁ జెమరించె
వెలయ సురటిఁగొని విసరరాదా ॥ఎన్నఁ॥

సతి వూడిగాలు నేసి సారెకు మేను బడలె
ఇతవుగా మోవిపండు ఇయ్యఁగరాదా
తతితో జూజాలాడి తమకించి బుసకొట్టె
పతివి నీతొడమీఁదఁ బవ్వళింపించరాదా ॥ఎన్నఁ॥

మగువ నీతోఁ గూడి మనసు విచ్చేరగండె
జిగిగోర నెచ్చరిక సేయఁగరాదా
విగిడి శ్రీవేంకటేశ నీతో జాగరాలు సేసె
మిగులా విందురతుల మెప్పించరాదా ॥ఎన్నఁ॥ 555

సామంతం

కంకణసూడిగెములకామినివి యీ -
యంకెల నీభావమెల్లా నానతియ్యవే ॥పల్లవి॥

వెలఁది మొక్కేవు నీవు వేమారు మరువితే
మెలుపై నీకీలుగంటు మిట్టిపడఁగా
వులుకుఁగుచములతో నూఁగేటిసరులతో -
నలసే విదేమి గోరే వానతియ్యవే ॥కంక॥

గరిమ నోమేవు నీవు కంతునిఁ బూజలుసేసి
శిరసుచెమట మేనఁ జిందఁగాను
వరుస నూరుపులతో వలగొని బడలేవు
అరిది నీతలఁపెల్లా నానతియ్యవే ॥కంక॥

మంతనాన నొడిగేవు మదనమంత్రములే
దొంతిపులకలు మేనఁ దొడరఁగాను
యింతి నీవు శ్రీవేంకటేశు నీకాఁగిటఁ గూడి
అంతలో నవ్వినదేమి ఆనతియ్యవే ॥కంక॥ 556

భూపాళం

మరుఁడు సేసినయట్టిమాయ లివి
కరఁగె మే విందు లోనుగాకుండవచ్చునా ॥పల్లవి॥

తరుణి నీపతిఁ బాసి తమకాన బడలవు
విరహ మిందరి కొకవిధమేకాదా
పెడరేఁచి కూరిములు పెట్టినపాట్లనెల్లాఁ
బొరలక మన కవి పొంతఁ దోయవచ్చునా ॥మరుఁ॥

నెవ్వగఁ జిత్తములోన నీకేల చింతింప
జవ్వన మిందరి కొకనరిగాదా
యెవ్వరేకాలమునందు యెట్టుండవలె నట్టు
దవ్వుచేరువలు నమ్మి తప్పించవచ్చునా ॥మరుఁ॥

చెక్కుటిచేతితోడ చెలులపై నొరగేవు
చక్కఁదన మిందరికి జయమేకాదా
యెక్కువతో శ్రీవేంకటేశుఁ డిదె విన్నుఁ గూడె
కక్కసమేఁటికి విఁకఁ గాదనఁగవచ్చునా ॥మరుఁ॥ 557

ఆహిరినాట

మెలుఁతలు బెళుకుల మెఱసినను
విలువునఁ గొంతలో నీడలు నిలిచె ॥పల్లవి॥

మలపుల నాడుచు మగువలు నీపై
సొలసిసొలసి నినుఁ జూడఁగను
నిలువున నీమై నీలపుసరులై
కలువదండలై కలగొన బెరసె ॥మెలుఁ॥

మునుకొని యిద్దరు మురిపెపునడపుల
చెనకి కరజములఁ జెన్నగను
పెనగొనువజ్రపుఁ బేరులసొమ్ములు
తనుకాంతులలోఁ దగులములాయ ॥మెలుఁ॥

తిరుపుగొనుచు నినుఁ దేఁకువ నొరయుచు
సరుసనె నగవులు చల్లినను
గరిమల శ్రీవేంకటపతి నీకివి
తెరమరఁగురతుల తేజములాయ ॥మెలుఁ॥ 558

రేకు 1394 సౌరాష్ట్రం

మాటలాడఁగదవె మంకులేఁటికి
[1]నాఁటుకొనీతఁడు నీతో నవ్వు నవ్వఁగాను ॥పల్లవి॥

చెలఁగేల కట్టేవే చెక్కుచేయేల పెట్టేవే
మఱి యెదుటనే నీమగఁ డుండఁగా
నెఱులేల ముడువవే నేలనేమి వ్రాసేవే
తఱితో నీతఁడు నీదండ నుండఁగాను ॥మాట॥

---

1. నాఁటుకొని + ఈతఁడు.

చెమటేల తుడిచేవే శిరసేల వంచేవే
తమకిం చితఁడు నిన్ను దప్పిదేర్పఁగా
సమమై యేల మొక్కేవే సారెనేల యలసేవే
జమళి నీతఁడు నీచన్ను లంటఁగాను ॥ మాట ॥

దిక్కులేల చూచేవే తెరయేల వేసేవే
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ గూడఁగా
చొక్కి యెంత కొసరేవే సొలపు లెంత సేసేవే
మిక్కిలి యీతఁడే నీతో మేలమాడఁగాను ॥ మాట ॥ 559

సాళంగనాట

కూరిమి నెక్కువయ్యె నాకుచదుర్గాలు
యేరీతినైనా వారి నేమనఁగఁగలవు ॥ పల్లవి ॥

యేతల చూచినా సతులెందరైనా నుండఁగాను
నాతోనే సారెసారె నవ్వు నవ్వేవు
కాతరించి వారెల్లా నొక్కటై దొమ్మి సేసితేను
యేతులుమెరసి నీవు యేమనఁగఁగలవు ॥ కూరి ॥

కుచ్చినట్టు యిందరూ నీకొలువు సేయఁగాను
మచ్చికసేసి నాతోనే మాటలాడేవు
పచ్చిగా నందరు నిన్ను బలిమిఁ బైకొంటేను
హెచ్చి నీవింతటిలోన యేమనఁగఁగలవు ॥ కూరి ॥

ఆసపడినసవతులు అంటి సేవలుసేయఁగా
లేసులకు నన్నుఁ గాఁగిలించి కూడేవు
వాసితో శ్రీవేంకటేశ వారు సేసలు వెట్టిరి
యీసరికే వచ్చి రిఁక నేమనఁగఁగలవు ॥ కూరి ॥ 560

## ముఖారి

[1] నిలుచున్నాఁ డల్లవాఁడె నివ్వెరగుతో
తలఁపెల్లఁ జేకొని దగ్గరవే తరుణి ॥ పల్లవి ॥

తప్పకచూచుచు నట్టె తలఁచు నిన్నాతుమలో
పుప్పొదిగా జుంజుకొనఁ బులకించును
వుప్పతిల్లువిరహాన వూరకే గోర గీరు
దప్పిదేరనిమ్మని దగ్గరవే తరుణి ॥ నిలు ॥

అడుగిడుఁ గాఁకలార అరగంటఁ గెంపు నించు
అడవిలోనే తిరుగు నాసోదాన
కడువలపులు రేఁచు కందువమాయలు నేసి
తడవి నీపతి వాఁడే దగ్గరవే తరుణి ॥ నిలు ॥

సిగ్గులు విడువఁజూచు చిమ్ముల నెనయఁజొచ్చి
విగ్గుదేర విన్నుఁ గని నెయ్యముతోడ
అగ్గమై శ్రీవేంకటేశుఁ డంతలోనె విన్నుఁగూడె
తగ్గక దినము నిట్టె దగ్గరవే తరుణి ॥ నిలు ॥ 561

## సామంతం

ఆయనాయఁ జాలుఁజాలు నట్టె వుండరా
చాయలపలుకు లివి చవుకయ్యీనా ॥ పల్లవి ॥

యెంతవడి నావద్ద నిచ్చకమై వుండినా
పంతపునీతలఁ పెందుఁ బారకుండినా
ఇంతలేపియానలు నీ వెన్ని వెట్టుకొన్నాను
కొంతైన నామనను గొని నమ్మీనా ॥ ఆయ ॥

1. ఇందు దశావతారవమన్వయము కలదు.

కడఁగి నీవెంత నన్నుఁ గాఁగిలించుకుండినాను
కడవారిమీఁద నీకుఁ గాఁక మానీనా
విడువక నీవెంత వేసరక బొంకినాను
వుడివోని నామనసు వొడఁబడీనా ॥ అయ ॥

కొంకక నీవెంత నాతో గుట్టుసేసుకుండినాను
వుంకువనీతమకము లుండనిచ్చీనా
పొంకపుశ్రీవేంకటేశ భోగపుఁగాఁగిట నన్ను
కంకిగాఁ గూడితివి నేఁ గాదనేనా ॥ అయ ॥ 562

## మాళవిగౌళ

ఇలమీఁద నివి గొన్ని యింద్రజాలాలా నీ-
కులుకువలపు నాపై గురిసేయవలెనా ॥ పల్లవి ॥

యెదురై మొక్కేవు నాకు యేదలేనివినయాన
యిది గొంత ఆరదే నా కిందరిలోన
పొదివి నీవెఁ(వెం?)దైన భోగించి వచ్చి యీడ
వెదకి నాపైఁ జొప్పు వేయవలెనా ॥ ఇల ॥

పెట్టెడి నాపెండె మిది పెట్టుకొంటి విందరిలో
ముట్టి నాకు విది గొంత మోచిదింపులా
గుట్టున నీచేఁతలును గుణములు వెద్దువెట్టి
అట్టున మామాటలే యాఅడి సేయవలెనా ॥ ఇల ॥

ఇందాఁకా యేఁచి నన్ను యిప్పుదే శ్రీవేంకటేశ
పొందితి విన్నియు నీకుఁ బొద్దువోకల
మందలించి నే నీకు మన్నించు సతి వింతే
అంది నాకు వింతప్రియము చెప్పవలెనా ॥ ఇల ॥ 563

శంకరాభరణం

ఓహో ఇదేఁటి నవ్వు లూరకుండవే
నాపలుకు వింటి విఁక నవ్వులేకావా ॥ పల్లవి ॥

యేమే వచ్చితివి నీవెన్నఁడు లేమి । వో-
కామిని నీరమణుఁ డీకడ కంపెనే
యేమిపని గలిగె నేఁదేఁటికొత్తలే
అమాఁటకే పో నన్నడుగనేలే ॥ ఓహో ॥

మగిడి యాసుద్దులేల మరిమాఁటేలే। వో-
మగువ నీవిభుఁడు రమ్మనుమనెనె
యెగసక్కెములు నాతో వివియుఁ గొన్నా।యేమో
విగిడి యాతవిగుట్టు నీవెఱఁగవా ॥ ఓహో ॥

తవిసితి వింక నవి తడవకువే।నీ-
వెనకనె వాఁడె శ్రీవేంకటేశుఁడు
అననేమున్నది విన్ను నాయుఁబదవే।మీ-
మనసు లెవసె వింకా మఱఁగేఁటికే ॥ ఓహో ॥ 564

రేకు 1395 సామంతం

కంటిమి నీలో మేలు కాంతల మిందరమును
జంటవాయ కతవితో సతమై వుండఁగదే ॥ పల్లవి ॥

నెలవి నవ్వు లుండఁగా చెక్కుపై చేఁకనేలే
మలసేనీపతితోడ మాటలాడవే
వలపు లోన నుండఁగ వట్టి యలుక లింకేల
కలయికకు రమ్మని కప్పుర మియ్యఁగదె ॥ కంటి ॥

కనుచూపు పదరఁగ కాఁకలు మేనిపై నేలే
    చెనకి విభునిమీఁద చేఇచాఁచవే
    మనసు బాఁతిపడఁగ మకుంఁదనములవేల
    మొనసేటిరతులకు మోవి చూపఁగదవే ॥ కంటి ॥

భావము కలఁకుండఁగ పంతపుమోనములేలే
    శ్రీవేంకటేశ్వరుఁ గూడి చెలరేఁగవే
    వావి కాఁగిట నుండఁగ వట్టితరితీపులేల
    వోవరిలో నుండుమని వుంగరాన నొత్తవే ॥ కంటి ॥ 565

ముఖారి

చందురుఁడు నుదఇంచె జల్లున వెన్నెలగాసె
    చందములు సేసుకొని సమ్మతించరాదా ॥ పల్లవి ॥

దొరకొనినమాటల దొంతులు నీవు వెట్టఁగ
    యెరవుల మారుత్తరా లేమిచ్చేము
    తరుణి వాతనికి నాతఁడు నీకు రమణుఁడు
    మరిగి నీకోపమెల్ల మానరాదా ఇఁకను ॥ చందు ॥

యెంచి ఆతనినేరాలే ఇటు వాములువేయఁగ
    అంచెల నెఁదాఁకా నేము ఆడుకొనేము
    కొంచక కాతఁడు బాసిచ్చె గురిగా విలిచితివి
    ఇంచుకంత మోవితేనె లియ్యరాదా ఇఁకను ॥ చందు ॥

కేరడపునవ్వులే కిమ్ముల వెదవెట్టఁగ
    సారెసారె నిన్నెట్ల సాదించేము
    కోరి శ్రీవేంకటేశుఁడు గూడె నీవు గూడితివి
    వూరడై వొక్కుమ్మడి నీవుండరాదా ఇఁకను ॥ చందు ॥ 566

భైరవి

ఏమనిన వడిఁబడు నీవేళను మీ-
రేమాటకైన నిట్టె ఇయ్యకొనరే ॥పల్లవి॥

చిత్తము గోమలము చిగురింతే దేహము
వొత్తి విన్నవించకురే వోపదు చెలి
గుత్తపురమణి నీపై గోపగించి వున్నదిదె
అత్తి యాకె ఆడినట్టే ఆడరే మీరు ॥ఏమ॥

తెగువలే ఘనము దీమసము గొంచము
వొగి నౌఁగాదనకురే వోపదు చెలి
మిగులా విరహమున మేరమీరి వున్నదిదె
మొగమిచ్చలే నేసి ముచ్చటాడరే ॥ఏమ॥

కూరిమి వెగ్గళము కూడపెట్టెఁ జలము
వూరకుండరే మీరు వోపదు చెలి
కోరి శ్రీవేంకటేశుఁ గూడుకొనెఁ దనుఁదానే
చేరిచేరి యిందరును సేస చల్లరే ॥ఏమ॥ 567

చెంచుమలహరి

ఒకటొక టింక నాకు నుడువవలనె
మొకమిచ్చమాటలకు మొదలుకొనవలనె ॥పల్లవి॥

అతవితో నేఁడు నే నలిగి వుండఁగఁగదా
వెతఁబొంది మదనునికి వెఱవవలనె
తతి వంతలో విభుఁని దలపోయఁగాఁగదా
మతిఁ గరఁగి నామేను మఱపందవలనె ॥ఒక॥

విరహతాపపు(ము?)వెదవెట్టఁ బొరలఁగఁగదా
గరిమ నాచెలులతోఁ గసరవలసె
జరసి నాతమకములు చలముకొనఁగాఁ గదా
సిరులఁ బతి పంతములు చెల్లించవలసె ॥ ఒక ॥

పెనఁగి తొల్లిటిరతులు పెరరేఁచఁగాఁగదా
మునుప నే నతనికి మొక్కవలసె
చనవు శ్రీవేంకటేశ్వరుఁ డియ్యఁగాఁగదా
తనివొంది కలసి సంతములు గావలసె ॥ ఒక ॥ 568

## సాళంగనాట

అతఁ డెంతవిలిసిన నలిగిరావు నీ-
కతమున వింకేమి గాఁగలదో ॥ పల్లవి ॥

చూచినట్టు రాదు సూనసాయకుని-
రాచకార్య మిది రమణి
ఱాచిలుకల గుఱ్ఱపుదళములు మించె-
నేచె నిన్నిఁక నవి యేమనునో ॥ అతఁ ॥

తలఁచినట్టు రాదు తగ వసంతుని-
బలమెంత గలదో పడఁతి
నలువంకఁ గోవిల నల్లఁబజలవెన్ను-
బలములు మోహరించెఁ బనిగాదుసుమ్మీ ॥ అతఁ ॥

కదిసినట్టు రాదు కదు శ్రీవేంకటపతి-
చిదుముగోరికొన చేకత్తుల-
అదన నినుఁ గూడె అతనువిబలముల-
కెదిరి పలికితివి యిందాఁకాను ॥ అతఁ ॥ 569

1. ఎంత + పిలిచిన.

రామక్రియ

ఎవ్వరంటాఁ జూచేవు యింతివి వోనాయకుఁడ
జవ్వని యారతిరాజసంపదే కాదా ॥ పల్లవి ॥

చెలియచిత్తములోనిచిత్తజునమ్ములేకావా
చిలుకుఁజూపరలై చిమ్మిరేఁగెను
చలువైననెమ్మోముచందురువెన్నెలే కాదా
పలచనినవ్వులై పచ్చిదేరేవి ॥ ఎవ్వ ॥

సతికొప్పుమేఘముజడివానలేకావా
మితిలేవిచెమటలై మేన నున్నవి
చతురైనదిమియాకసపుమెఱుఁగులేకావా
తతితో బంగారువన్నెతళుకు లివి ॥ ఎవ్వ ॥

కుత్తికలో గోవిలకూఁతలు నేఁ డివె కావా
కొత్తయి నీకాఁగిటిలోఁ గుమ్మరించేవి
హత్తినశ్రీవేంకటేశ అంగననీకూటములు
మొత్తమి వొంగేటిభావములసొంపుగాదా ॥ ఎవ్వ ॥ 570

రేకు 1396 సామంతం

ఇతరులతరమా యింతేసి -
అతిరాజసమున నీ వాడితిగాక ॥ పల్లవి ॥

కల్లయు నిజమునుఁ గానక పతితో -
నుల్లస మాడఁగ నుచితములా
బల్లిదురాలవు పట్టపుదేవివి
చెల్లఁగనక అటు సేసితి నీవు ॥ ఇత

వెనకముందు భావించక నీపతి
పెనగొని యిటు గోపించితివి
వెనుకొని యాతనివిరహము నీపైఁ
జనవునఁ గలఁగఁగ జందములాయ ॥ ఇత ॥

అకట నీతమక మాఁపఁగ లేకే
మొకమోడక చెయి ముంచితివి
వెకలియైన శ్రీవేంకటేశ్వరుఁ –
డొకటవి కూడఁగ నొద్దికలాయ ॥ ఇత ॥ 571

సాళంగం

కన్నవారెవ్వరు దీనిఁ గాంతలాల
యెన్నియైనా మీరిట్టె యేమఱకుఁడీ ॥ పల్లవి ॥

వొక్కటై నిలిచె మేన నొరసి వొరసి చన్ను –
జక్కవల కిదె పుట్టె జగడములు
గక్కన నట్టనడుమ గడిదేరె నింతలోనె
యెక్కడెక్కడిపనులు యెటు వచ్చునో ॥ కన్న ॥

కొమ్మ కనుగండుమీలు కోరి బొమ్మలవిండ్లు
యెమ్మెలకు నిరుమేలా నేట్లాడీని
దిమ్మరేఁచే చెలికొప్పు దిక్కులు చీఁకటి సేసె
కమ్మకొన్న దెటువంటి కాలమహిమో ॥ కన్న ॥

కంతుపిబాణములై నకరపల్లవములకు
అంతరంగమై పుట్టె ననురాగము
యింతలో శ్రీవేంకటేశుఁ డింతి పట్టె కూడఁగాను
బంతినే తొల్లియు నేతపము సేసెనో ॥ కన్న ॥ 572

### గుండక్రియ

ఘనుఁడ నీకియ్యాట గలితేఁ జాలు।తొల్లి
యెనసి పొందిననతు లెట్టుండిరేమీ ॥పల్లవి॥

తరుణితురుము నీకు దాగిలిముచ్చులాడ-
నిరవాయ రమణుఁడ యిదివో నీకు
అరిదిఁ గుచగిరులు అచ్చనగండ్లాడ
వొరపాయ విదివో నీకున్న వేమీనేల ॥ఘను॥

వెలఁది మోము నీకు వెన్నెలపులుఁ గమాడ
నెలవాయ నింతలోనే నీకిదివో
చిలుపచెమటలెల్ల చిమ్మనగోవాటలాయె
యిలపై నెక్కడిసుద్దు లేమైనా నేమీ ॥ఘను॥

కోమలికెమ్మోవి నీకు గుజ్జనఁగూళ్లాయ
గామిడి శ్రీవేంకటేశ(శ?) కాఁగిటిలోనే
కామించువారినెల్లా గలసితి విట్లానే
వేమరు నెందరైనా వేసట నీకేది ॥ఘను॥ 573

### ముఖారి

ఇపు డిన్నిటికి సైరించవలెఁగా
కపటా లిన్నియు మీఁదఁ గనుకొనేఁగాని ॥పల్లవి॥

యేదలేవిమచ్చికల కింత చిక్కనవేళ-
నాద(డి?)నెట్టెల్లా నే నాదవలెఁగా
వేడుకైతేఁ జాలుఁగాక విసుగనేఁటికి నే
సూడువట్టి యెప్పుడైనాఁ జూచుకొనేఁగాని ॥ఇపు॥

పంతపునాకోరి కెలబారికిఁ జిక్కినవేళ
వింతలు నీవేమనిన వినవలెఁగా
మంతనాన నాతోడ మాటలకుఁ బనిలేదు
అంతయు నీరతివేళ నాడుకొనేఁగాని ॥ ఇపు ॥

చిత్తము నీకొప్పగించి చేతికిలోనైనవేళ
కొత్త నీచెం(చేఁ?)తల కియ్యకొనవలెఁగా
పొత్తుల శ్రీవేంకటేశ పొందితివి చాలు నీ-
తత్తరపులచ్చనల దాఁచుకొనేఁగాని ॥ ఇపు ॥ 574

భూపాళం

ఇప్పుదేమి దప్పిపోయ నింతలోనె
కప్పుక యాతఁడు నాపైఁ గరుణించీఁగాక ॥ పల్లవి ॥

విడువనిపతిఁ బాసి విరహానఁ బొరలఁగ
పడఁతులిందరి కాడఁబట్టాయఁగా
యెడరైతి నొకవేళ యేమిసేయవచ్చు మాటఁ
బడవలెఁగాక ఇట్టె పదరనేలే ॥ ఇప్పు ॥

అలిగి యాతఁడు నేను నవ్వులిమోమైతే
పొలఁతులకును నవ్వఁబొద్దాయఁగా
తలము దప్పినవేళ దానికేమి గొరతాయ
వలసినట్లయ్యీని వగవకువే ॥ ఇప్పు ॥

యెన్నికతో శ్రీవేంకటేశుఁడు గూడఁగ నన్ను
మున్నిటివారిసొంపు మూలఁబడెఁగా
అన్నువ నప్పటిచేఁత లట్లాయ నేఁ దిప్పు-
డిన్నిటాఁ బంతము చెల్లె నిఁకనేఁటికే ॥ ఇప్పు ॥ 575

శంకరాభరణం

ఎప్పటికి విన్నపము ఇదియేసుమ్మీ
తప్పక నీవాడఁబాటు తరుణికి నీవు ॥పల్లవి॥

వలపువవులు చూపి వనితఁ జేకొంటి వింక
తలఁపున వేరొండుఁ దలఁచకుమీ
కలసి వుండువుగాని కడదాఁకా నిట్లానే
చెలఁగి తియ్యవినోరఁ జేదు చవిగాదు ॥ఎప్ప॥

యిందరు నెఱఁగఁ జెలి నింతగా మన్నించితివి
కందులేవిచనవిచ్చి కరుణించుమీ
చందమున నాకెమాఁట జవదాటకుండవయ్య
విందువెట్టిఁ బిగ వద్దు వేడుకయ్యీ వికను ॥ఎప్ప॥

పూరకుండినరమణి నొక్కటొక్కటె చేసి
చేరి కూడితివి రతిఁ జెలఁగించుమీ
యీరీతి శ్రీవేంకటేశ యీబంగారుకొఁత
గారబానఁ జేపట్టి కడమేల నీకు ॥ఎప్ప॥ 576

రేకు 1397 సామంతం

చెల్లఁబో తియ్యవినోరఁ జేఁదేలయ్య
కల్లనిజములు నొక్కట నుండఁగా ॥పల్లవి॥

మొదలఁ జెలియమీఁద మోహము చల్లినవాఁడ-
విదివో కమ్మరఁ గాఁకలేల చల్లేవు
కదిసి కూటములు కపటము లొకచోటఁ
బొదలించితే నవి పొసఁగునా నేఁడు ॥చెల్లఁ॥

ప్రేమపుటాసలు మతిఁ బెంచినవాఁడవు
యేమన్నా నూరకుండే విదేమయ్యా
తామసాలఁ దత్తరాలఁ దగులఁగట్టేనంటే
భూమిలోన నిటువంటిపొందు గలదా ॥చెల్లఁ॥

కంచపుమోవిపొత్తు కలిగి కూడినవాఁడ-
వించుకంత పరవశ మిదియేలయ్యా
సంచితపుపలపు జవ్వనాలు సరిగావా
యెంచఁగల శ్రీవేంకటేశ్వరుఁడా ॥చెల్లఁ॥ 577

కాంబోది

నామేనే యెంతసేసె నాయెడకు
కామించి కడవారు గాఁబోయేరా ॥పల్లవి॥

యెవ్వరి నేమనలేక ఇందరుఁ జూడఁగానే
జవ్వనభారముచేత జడియఁగానే
పువ్వకిపూచినయట్టు పులకజొంపము మేనఁ-
గువ్వనిపేరులవలె గుదిగొనీనే ॥నామే॥

ఇన్నియు నోరుచుకొని ఇంతుల దూరఁగలేక
కన్నులపెట్టె పొద్దు గడపఁగను
వున్నరీతినే వుండి వొట్టినచూపులు నాకు
పున్నమవెన్నెలనీడై పొంగు వచ్చీనే ॥నామే॥

చక్కఁదనములన్నియుఁ జవిచేసుకొనీనే
చెక్కిటిచేతితోడఁ జింతించఁగా
యిక్కడనె శ్రీవేంకటేశుఁడు గూడఁగాను
మక్కువ పరవశాన మఱపాయెనే ॥నామే॥ 578

ముఖారి

ఎన్నఁడును నిట్టివల పెఱఁగనమ్మ
తన్నుఁదానె పులకించి తనివందీని ॥ పల్లవి ॥

పతిఁ జూచిచూచి తా పరవశమందె నీ-
యతివ కన్నులనే మోహము చల్లీని
మతిలోనే కరఁగీని మలగుపై నొరగీని
రతులు దలఁచి నివ్వెరగువడీని ॥ ఎన్నఁ ॥

చిప్పిలుఁబ్రియము లింతి చెలులతోఁ జెప్పీని
వుప్పతిల్లఁగోరికల నోలలాడీని
రెప్పలు ముయ్యనేరక రిచ్చవడి యిందరిలోఁ
జెప్పరానికోరికలఁ జెంగలించీని ॥ ఎన్నఁ ॥

కమ్మరఁగమ్మరఁ దమకములెల్లఁ బెడరేఁచి
కొమ్మ దనయాసలెల్లఁ గుమ్మరించీని
సమ్మతై శ్రీవేంకటేశ్వరుఁడు గూడఁగ నిట్టె
చిమ్ముఁజెమటలచేత సేదదేరీని ॥ ఎన్నఁ ॥ 579

ఆహిరి

ఎంతేసి కాఁగలదో ఇన్నియును నిట్లాయ
యెంతవింతలు వొడమె నెదురెదురనె ॥ పల్లవి ॥

పడఁతివేసవి జారి పగలు చీఁకట్లాయ
వొడలఁ బులకలు చుక్కలు రక పొడమె
తొడరి కనుబొమ్మలనె ధూమకేతువు దోఁచె
పొడమెనుత్పాతములు పూఁటపూఁటకును ॥ ఎంతే ॥

పరిగొనుచు విరహంపుపతిసూర్యుఁ డుదఇంచె
వారిమఁ జెమటలజ౹ధు లుప్పొంగెను
ఇరవైననిట్టూర్పు లేదుగాడ్పులు విసరె
పరగ విపరీతంబు పైపైనె మెరసె ॥ ఎంతే ॥

జడిగొనుచు కుచగిరులు చంద్రశకలము లలరె
నగవులను విచ్చపున్నమ లాయను
సొగిసి శ్రీవేంకటేశుఁడు చెలియఁగూడఁగా
పగలు రేయును నేరుపడదాయను ॥ ఎంతే ॥ 580

## ఆహిరినాట

రమణుఁడ నీమై రచన లివి
చెమటల చెలియకు చెలువాయ ॥ పల్లవి ॥

తరుణికి నీపైఁ దప్పులు వెదకఁగ
సరసపుమాటలు చవులాయ
విరహపుఁదరుణికి వెన్నెలమోమే
పరితాపపువైభవ మాయె ॥ రమ ॥

సుదతి విన్నుఁ గని సొలపులు సొలయఁగ
ముదితకు నవ్వులమోమాయ
కదలేతురుమునఁ గొంత నడవఁగా
కుదురుఁగుచములకుఁ గులుకాయ ॥ రమ ॥

చెలి విను గోళ్లఁ జెక్కు నొక్కఁగా
తెలి నునుమోవికిఁ దీపాయె
వెలఁది కిపుడు శ్రీవేంకటేశ్వరుఁడ
అలుకలు దీరఁగ ననువాయె ॥ రమ ॥ 581

కేదారగౌళ

ఏమిటికిఁ దలపోఁత యిన్నీ రోఁత
వేమారు నసలేను వెల్లవిరి నేను ॥పల్లవి॥

చెంగావినీమోవిచెలువెల్లా దేవి దేవి
యేఁగిలైనచీకాకు యేఁటికి నాకు
సంగతాయ నటు వోర సారె నేల విన్నుదూర
యింగితపునీగుణాలు యెంతిఁగితిఁ జాలు ॥ఏమి॥

మొక్కేటిది యీమొక్కు మున్నీటిచెలులు పెక్కు
తొక్కితొక్కి కోపానఁ దోసిన వోల
యెక్కడఁ దలఁచరాదు యేమవినఁ గదువాదు
పెక్కుమాఁట లింకనేల పెనఁగేటివేళ ॥ఏమి॥

కాఁగిటనీకూటములు కన్నచోటివోటములు
తోఁగిననాతోఁడిపొందు దొరకు విందు
దాఁగక శ్రీవేంకటేశ తనువు లొక్కట రాసె
కాఁగినకాఁకలు దేరె కందువలు చేరె ॥ఏమి॥ 582

రేకు 1398 వరాళి

మాటలాడఁబోయి చెలి మందమిరియాలు చల్లె
నీటుగాదు మేటిగాదు నీకే పోదయ్యా ॥పల్లవి॥

చూపులఁ గొసరఁబోయి నోయగాన జంకించె
కోపము నిలుపలేక కోమలి విన్ను
కోపుల నవ్వఁగఁబోఇ గుంపించె కాఁకలెల్ల
యీపదఁతి కన్నె ఇంతె యెగ్గనకువయ్యా ॥మాట॥

తగులనాడఁగఁబోయి తప్పులెంచీ నీమీఁద
అగడైన విరహాగ్ని నాఁపఁగలేక
మొగము చూడఁగఁబోయి మొక్కె నొకచేత నీకు
ఇగురుఁబోఁడిభావ మియ్యకొనవయ్యా ॥మాట॥

సరసమాఁడఁగఁబోయి సరుగ నీకాలు దొక్కె
ఇరవైన(శ్రీ)వేంకటేశుఁడ నేఁడు
కరఁగి కూడఁగఁబోయి కాఁగిటిలో నిన్ను మెచ్చె
తరుణి ఇట్టె నీకుఁ దగుఁగదవయ్యా ॥మాట॥ 583

ఆహిరి

ఆకెకును నీకుఁ బాయనిచుట్టరికమఁగన
చేకొందు విప్పుడే విచ్చేయవయ్యా ॥పల్లవి॥

ధరఁ గొలవి తామరలు తపనుఁ డుదయంబైన
విరివిఁ జెంగలించి వికసించును
తెరవముఖకమలమైతే నీవు రాకుంటే
వెరవార నాయకుఁడ వికసించదు ॥ఆకె॥

సంతతమఁ గలువ లివి చందురునిరాకలకు
వింతగాఁ బైపైనే వికసించును
యింతియాకమఁగవ లివియైతే నీవదన-
కాంతిచంద్రుఁడు రాక కడువిరియవు ॥ఆకె॥

మినుకు మయూరములు మేఘోదయంబైన
తనయిచ్చ వేడుకల తగనాడును
యెనలేని(శ్రీ)వేంకటేశ యిటువలె నేఁడు
వనితఁ గూడకయున్న వహికెక్కదు ॥ఆకె॥ 584

సామంతం

మరులు దెలిపియు నాయు మాటలైన నాదరే
అరమోడ్పుఁ గన్నులనే లలసీఁ జెలియ ॥పల్లవి॥

తరుణి మై చెమరించె తలఁపెందు నున్నదో
విరహపుఁజింతలలో వెదకీని
కురులెల్ల నెరివిచ్చె గుణ మెందు దాఁగెనో
పరవశములోఁ జిక్కి భావించీ నిదివో ॥మరు॥

చెక్కులెల్లఁ బులకించె చిత్త మేమిసైనెనో
మొక్కల శిరసువంచి మొరసీని
ముక్కున నూర్పులు మూంచె మున్ను నేమి గాఁగలదో
నీకుఁ గుచగిరులతో నిటుపీఁడీ నదివో ॥మరు॥

సిగ్గులెల్ల నుడివోయ చేఁత లిఁక నేఁటివో
కగ్గని శ్రీవేంకటేశు కాఁగిటిలోన
అగ్గపువేడుక లబ్బె నంగననోముఫలాన
తగ్గు మొగ్గులెల్లాఁ దీరి తమకించీ నిదివో ॥మరు॥ 585

ముఖారి

ఎంతైన మాగుణాలు యిటువంటివేకాని
అంతటి నీఘనతే అది యెంచుకొమ్మీ ॥పల్లవి॥

తలఁపు విలుపలేక తమకింతుఁగాని నాపైఁ
గలమోహ మెరుఁగుదు ఘనుఁడ నీవు
చెలులము గాన మాకుఁ జెల్లు నేమాటాడిన నీవు
విలువుగంభీరుఁడవు నీకుఁ బోదుసుమ్మీ ॥ఎంతై॥

1. ప్రతిత గంది వ్రాతలోనే అస్పష్టము.

సంగడి మచ్చరమున సారెఁ గోరుదుఁగాని
అంగపునీమన్నన నే నదెరుఁగుదు
కంగి చంచలాక్షులముగాన మాజాడలవింతే
వంగడమైననీవరు నెంచుకొమ్మీ ॥ఎంతై॥

చనవున బొమ్మలనే జంకించితిఁగాక నీ-
వెనసినమహిమ నే నెరుఁగుదును
మనువై నరతుల సమయపుమామత మిది
వోవరి శ్రీవేంకటేశ వొగిఁ దెలుసుకొమ్మీ ॥ఎంతై॥ 586

దేశి

నేనెంతగబ్బినైన నీకుఁ బోదుగా
నీనెలఁతనైనఁ గాన నీకుఁ బోదుగా ॥పల్లవి॥

పెరిగి నాకుచములు పెద్దపెద్దకొండలైనా
నెరుసులేక సాదించ నీకుఁ బోదుగా
సిరులనామోవి ఇది చిగురైనా చేవసేయ
విరతి నోరమణుఁడ నీకుఁ బోదుగా ॥నేనెం॥

వలుద నాకురు లివి వంకరకొంకరలైనా
విలిపి చిక్కుదియ్య నీకుఁ బోదుగా
నలువై నాకన్నులందు నల్లఁదెల్ల గలిగిన
నెలకొవి మెచ్చుమెచ్చ నీకుఁ బోదుగా ॥నేనెం॥

గారవపుఁగాఁగిటను కాలు చేఇ దాఁకినాను
నేరమెల్ల మఱవక నీకుఁ బోదుగా
కూరిమి శ్రీవేంకటేశ కూడితివి నామనను
నీరైనఁ బాలైన నీకుఁ బోదుగా ॥నేనెం॥ 587

శ్రీరాగం

చెప్పరాదు చూపరాదు చిగిరించీ భావమెల్ల
తప్పవిజవ్వనపువసంతవేళో కాని ॥ పల్లవి ॥

అతనిసుద్దులు వింటే అంగమెల్లఁ జెమరించె
రతి నాచిత్తపుమోహరసమో కాని
తతిఁ జేరుకొంచేను తనువెల్లాఁ బులకించె
అతనుబాణములకు ఆయమో కాని ॥ చెప్ప ॥

కందువలు దలఁచితే కన్నుల నీళ్లురాలీ
విందులయానందముల వెల్లులో కావి
చెందిన నీముద్దు చూచి జిగి గుండె జల్లురనీ
చందురువెన్నెలకుప్ప జారెనో కాని ॥ చెప్ప ॥

శ్రీవేంకటేశుఁ గూడి సెలవి నవ్వులు చిందె
చేవదేర నాలోనిసిగ్గులో కాని
నీవి జారినంతలోనే నీకు సంతసము నిండె
యేవిధానఁ దానే చనవిచ్చెనో కాని ॥ చెప్ప ॥ 588

రేకు 1899 సామంతం

అతనిగతు లొరుల కలవడునా
తతి నెటుచూచిన ధగధగమెరుపు ॥ పల్లవి ॥

ముందర దెలియక మొదలు చేకొనక
గొందినే కూరిమి గొసరేవు
అందరివలెనా ఆతనిచిత్తము
యెందుచూచినా యింపులయెరవు ॥ అత ॥

రెప్పల నవ్వక రేసుల భ్రమయక
తప్పులె యెన్నెదు తమకమున
చెప్పుదురతు లాచెలువ లతవికే
కుప్పలుఁ దెప్పలు కోరిక కొసరు ॥ అత ॥

ఘాతలు దియ్యక కసరులు దుయ్యక
అతఁ డిట్ల నీకలవడునా
శ్రీతరుణీపతి శ్రీవేంకటపతి
యేతెరు వేఁగిన యేనుగవీధి ॥ అత ॥ 589

తెలుఁగుఁగాంబోది

సతిచక్కఁదన మెంతో సరసునిమోహ మెంతో
చతురిక లిందరును సరిఁజూడరమ్మా ॥ పల్లవి ॥

కాంతకన్నులు వ్రాసి కడలు వ్రాయఁగ రాక
చింతతోడఁ దలవంచెఁ జెలివిభుఁడు
పంతపునడుము వ్రాసి బయలు వ్రాయఁగ రాక
కొంతదడ వుస్సురనెఁ గోమలిప్రాణేశుఁడు ॥ సతి ॥

కలికికుచాలు వ్రాసి కఠినము వ్రాయలేక
తలపోయఁ దొడఁగెఁ బంతపువిభుఁడు
నలినాక్షిమోము వ్రాసి నవ్వులు వ్రాయఁగ రాక
నిలువున వెరగందె నెలఁతరమణుఁడు ॥ సతి ॥

వనితకాఁగిటఁ దమ్ము వ్రాసి రతి వ్రాయలేక
తనువెల్ల మఱచెను తమకమున
వెనకముందర వ్రాసి వేడుక వ్రాయఁగ రాక
చినుకుఁజెమట వ్రాసె శ్రీవేంకటేశుఁడు ॥ సతి ॥ 590

వరాళి

పదరిన మాకాపని గాదు
    ఇదియే విన్నప మింకాఁ జుమ్మీ ||పల్లవి||

పిలువున నాతఁడు నిన్నుఁగని నవ్విన
    కెలసి బొమల జంకించితివి
    చెలమీదేరక సరికిసరాయను
    కల దిఁక సంతముగావలెఁజుమ్మీ ||పద||

ఆసల పతి విన్నంగడిఁ జెనకిన
    వోసరి కుచముల నొరసితివి
    తాసులవలె మీతమకము లలరెను
    యీసుల తెరమరఁగింతేసుమ్మీ ||పద||

ఘనుఁడగు శ్రీవేంకటపతి గూడఁగ
    మనసున నిప్పుడె మఱచితివి
    చనవులు మనవులు చందములాయను
    వినయమే విభునకి వేడుకసుమ్మీ ||పద|| 591

సౌరాష్ట్రం

అప్పటి మానవు నాపై నానవెట్టేవు
    యెప్పటి నీగుణములు యెందుఁ గొత్తలౌనా ||పల్లవి||

విన్నటివునుకుల నీజాడలెల్లఁ గంటిమి
    అన్నియు నాతో నీ వాడఁబలెనా
    యెన్నరావిటాసలెల్ల యేల మనఇద్దరితో
    సన్నకు సన్నలే చాలుచాలు సుందరా ||అప్ప||

అటువంటివాఁడవని అంటినా విన్నేమైనా
కటకట ఇంతకెల్లఁ గలనా నేను
కిటుకుఁగూటమికంటె కిందటి మనపొందు —
లటు దలఁచుకొనుట అదియే మేలు ॥ అప్ప ॥

యింతలోనే యేమిదప్పె యెట్లైన నేమాయ
ఇంత నన్ను బుజ్జగించే విది వలెనా
చెంతలఁ గూడితి నన్ను శ్రీవేంకటేశ్వర
యింతి నింతే నీకు నే నెదురాడేనా ॥ అప్ప ॥ 592

## ముఖారి

విరిగినట్టిబండివారే వెట్టివారుగాక నీవు
యెరవు సతము సేసుకొంటి వేమిసేతువే ॥ పల్లవి ॥

పొలఁతి నీవు అతనిఁ బిలువఁబోయినట్టిపొద్దు లేద
నిలువుఁజెమటతోడియలపు నీకిదేడదే
వెలుఁగు చేనుమేసినట్టివిధము దోఁచె నీయందు
అలసిసొలసి విన్ను నిఁక నాడనేఁటికే ॥ విరి ॥

యింతి నేను విరహమునను యెదురు చూచుచుండ; నీవు
వింతపులకగముల విట్టువీఁగు టేఁటిదే
కంతుసంచకారులోనె కల్ల దోఁచె నీయందు
మంతనమున నీతోడిమాట లేఁటిదే ॥ విరి ॥

వనిత శ్రీవేంకటేశ్వరుఁడు దానే నన్నుఁ గూడె
చనవిమనవి వితనితోడి సన్నలేఁటికే
తనరి వీఁపు గానరాఁగ దాఁగినట్టి చందమాయ
వెనక నాకుఁ బ్రియము చెప్పి వేఁడనేఁటికే ॥ విరి ॥ 593

ఘంటారవం

ఇప్పటిగతి యిదె యెంచినను
కప్పినభ్రమయో కరుణో యెఱఁగ ॥ పల్లవి ॥

తలఁపున నాపతిఁ దలఁచినంతలో
నెలకొని ముందట నిలిచె నిదె
కలసినట్లనే కమ్మరఁ దోఁచీ
కలయో నిజమో కపటమో యెఱఁగ ॥ ఇప్ప ॥

అడుగిడినే నేఁ దలిగిననాఁడే
బడివాయనిపతిభావ మిదే
అడియాలంబులు అవెయివె నాపై
తడయనితగులో తమకమో యెఱఁగ ॥ ఇప్ప ॥

గక్కన శ్రీవేంకటపతి నాకును
నిక్కపుఁగూటమి నెరపె నిదే
యిక్కువ లివివో ఇందాఁకానే
యెక్కడ నేమో యేదియు నెఱఁగ ॥ ఇప్ప ॥ 594

రేకు 1400 లలిత

అపుడే నీకు లోనైతి నిదే నీ-
రపమిఁక నాబీరము చెల్లీనా ॥ పల్లవి ॥

తేటలమాటలఁ ద్రిపురాంగనలను
కూటువఁ గూడినకొనబలిమి
పాటైరుకుమిణి బలిమినె తెచ్చితి
గాఁటపునిను నేఁ గాదనఁగలనా ॥ అపు ॥

తిరముగ మందలఁదిరిగెడిమగువల
వెరవునఁ గూడినవిటుఁడవు
అరిదిఁ బదార్వేలతివల నేలిన
దొరవిటు చెనకినఁ దోయఁగఁగలనా ॥ అపు ॥

చలిమిని బలిమిని జలధికన్యకనుఁ
గలసిన శ్రీవేంకటపతివి
మలసి నీవు నన్ను మన్ననఁ గూడితి –
వెలమి నగించే వింతకుఁ గలనా ॥ అపు ॥ 595

శంకరాభరణం

వాసియు వన్నెయుఁ గలవనిత నేను, నీవు
వేసర పె దుకున్నై నా వెరతు నే నిందుకు ॥ పల్లవి ॥

వొద్దువొద్దు వాదులేల పుమ్మడినే పుండనీరా
కొద్దిమీరి బడలించుకొననేఁటికి
కద్దు నీకు నలవాటు కడు శిశుపాలునిచే -
నద్దలింపులఁ బడితి వంతకు నే నోపను ॥ వాసి ॥

పట్టఁబట్టకురా నన్ను బలిమి నంతేసి నేఁడు
గుట్టున నుండరా నీవు గొంత యేఁచక
యిట్టునట్టు వెన్నలకు నిండ్లిండ్లెల్లా దూరి
కట్టువడితి రోలఁ గలమా నే మెంచును ॥ వాసి ॥

పోకుపోకు మంత నీవు పొందితి శ్రీవేంకటేశ
చేకొని పెదమనసుచేఁతవాఁడవు
కాకరివై యనసూయ కడరుబాలుఁడవైతి
నీకు నిది మెచ్చుగాక నెరి మాకుఁ దగునా ॥ వాసి ॥ 596

తెలుఁగుఁగాంబోది

ఇన్నియుఁగూడెను యింతికిని
విన్నటిమాఁటలు విజపొంతువులు ॥ పల్లవి ॥

పులకల [1] మొలకలపున్నమనాఁడే
తలిరుఁబోఁడికిని దలఁబాలు
సొలపులనగవుల సోమవారమునఁ
గలయురతుల కంకణదారములు ॥ ఇన్ని ॥

ననుపుగ చిత్తానక్షత్రంబున
వినుకలిఁ బెట్టినపీడెములు
పనివడి చెలి సౌభాగ్యయోగమున
కొనచూపులకొంగుముడిసిరులు ॥ ఇన్ని ॥

మిక్కిలికూటపుమిథునలగ్నమున
తొక్కిటిపాదపుదోమట్లు
గక్కన శ్రీవేంకటపతిచెనకులు
వొక్కట నెదిరినవుంకువలు ॥ ఇన్ని ॥ 597

శంకరాభరణం

ఉవిద విరహమున నొఁటిపడె। మన-
కివల నీకెతో నిది యేపాటు ॥ పల్లవి ॥

చిత్తము చెదరఁగ చెంతల పూవుల-
నెత్తులఁగట్టిని లేమ
యిత్తలనత్తల నెడనెడ దండలు
గుత్తము రారో కొమ్మకుఁ దాడు ॥ ఉవి ॥

1. వైశాఖ శుద్ధ పూర్ణిమ.

పాసి విభునితోఁ బాదంబున భువి
వ్రాసెఁ జిత్తరువు వగఁ దరుణి
యీసతిచెలులము యింక నేమైనాఁ
జేసినచేఁత చేయకపోదు ॥ ఉవి ॥

గాదిలిశ్రీవేంకటపతి కాఁగిట
నేదలుదేరమ చెలియకును
మోద మిప్పుడుగా మొనకొనె మనకును
యేదెన నుంటిమి యిందాఁకాను ॥ ఉవి ॥ 598

సాళంగనాట

అతఁడు మొదలనే యనంగుఁడూ
రతివసంత మిటు రాదుగదా ॥ పల్లవి ॥

కోమలిశిరసునఁ గూడెను యిప్పుడు
యేమిగారణమునన్ యీయలులు
ఆమనికుచముల నలజడి పుట్టెను
కామునికవగతి గాదుగదా ॥ అతఁ ॥

యి తలఁ జెలిమో మింతయుఁ గైకొనె
కొత్తగ నయనచకోరములు
కుత్తికకోవిలకూఁతలు రేఁగెను
చిత్తజబలి మిటు చెడదుగదా ॥ అతఁ ॥

కొమ్మజవ్వనము కొల్లలు చేరెను
కమ్మర శ్రీవేంకటపతికి
నెమ్మది నెంతయు నిలిపె నీతఁదే
యిమ్మడి మరుఁడయి యేఁచెఁగదా ॥ అతఁ ॥ 599

ఆహిరినాట

ఇద్దరిజాణతనము లెటువంటివే యిందు
వొద్దనున్న చెలులాల వోటపంత మేది ॥పల్లవి॥

హత్తినసతియుఁ బతి యలిగి మాఁటాడమని
వొత్తి యానవెట్టుకొని రొకరొకరు
మొత్తమి నాకె దనకు మొక్కినభావ మతఁడు
చిత్తరువులో వా(వ్రా?)సిన చెలిఁ జూచి నగెను ॥ఇద్ద॥

బలిమి నొకరొకరిఁ బట్టమని పంతమాడి
చలపట్టి మారుమంచము లెక్కిరి
విలువుటద్దములోని నెలఁతనీడరూపు
చెలువుఁడు దగ్గరించినఁ జెలి నగెను ॥ఇద్ద॥

అంగవయు శ్రీవేంకటాధిపుఁడు నధరము
యెంగిలి వియ్యమని యెన్నికఁ గూడి
ముంగిటి కెంపులు పంటిమొనలనే మోవిమీఁదఁ
జెంగట నించినఁ బతి చెలిఁ జూచి నగెను ॥ఇద॥ 600

# 1-వ అనుబంధము

## ఆకారాదిగ రాగ-సంకీర్తనసంఖ్యా సూచి

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| అమరసింధు | ... | 380. |
| ఆరిబి | ... | 43. |
| ఆహిరి | ... | 25, 28, 55, 76, 97, 107, 127, 136, 143, 165, 198, 218, 227, 267, 282, 285, 325, 340, 350, 381, 388, 404, 426, 447, 453, 482, 517, 538, 555, 580, 584. |
| ఆహిరినాట | ... | 7, 24, 61, 121, 181, 255, 310, 392, 401, 458, 468, 491, 494, 529, 558, 581, 600. |
| కన్నడగౌళ | ... | 35, 62, 110, 188, 248, 349, 409, 548. |
| కాంబో (భో) ది | ... | 8, 22, 111, 137, 158, 162, 202, 250, 371, 446, 475, 539, 578. |
| కుంతలవరాళి | ... | 5, 343, 444. |
| కురంజి | ... | 80, 279, 338, 544. |
| కేదారగౌళ | ... | 125, 208, 238, 276, 364, 582. |
| కొండమలహరి | ... | 114. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| గుండక్రియ | ... 216, 573. |
| గౌళ | ... 12, 26, 68, 108, 229, 288, 346, 405, 432, 489. |
| ఘంటారవం | ... 594. |
| చెంచుమలహారి | ... 568. |
| తెలుఁగుఁగాం(కాం)బోది | ... 39, 101, 120, 180, 197, 264, 318, 430, 450, 506, 590, 597. |
| తోండి | ... 210. 237. |
| దేవక్రియ | ... 74. |
| దేవగాంధారి | ... 145, 183, 249, 266, 326, 331, 480, 499. |
| దేశా (సా) క్షి | ... 52, 214, 285, 308, 415, 490, 583. |
| దేశి | ... 199, 225, 553, 587. |
| దేసాళం | ... 2, 6, 57, 63, 115, 131, 140, 159, 187, 213, 231, 243, 257, 258, 289, 315, 354, 390, 411, 442, 464, 473, 487, 516, 550. |
| ద్రావిళభైరవి | ... 47, 421. |
| ధ(ద)న్నాశి (సి) | ... 18, 85, 261, 478. |
| నట్టనారాయణి | ... 17. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| నాగగాంధారి | ... 495. |
| నాగవరాళి | ... 221, 341, 498. |
| నాదరామక్రియ | ... 30, 48, 83, 112, 117, 126, 176, 207, 270, 299, 306, 398, 407, 431, 477, 496, 507. |
| నారాయణి | ... 93, 314, 416. |
| నీలాంబరి | ... 122. |
| పడ(ళ)మంజరం | ... 13, 70, 190, 222, 427. |
| పాడి | ... 11, 21, 36, 42, 84, 87, 102, 105, 129, 150, 200, 205, 217, 224, 303 321, 345, 357, 366, 372, 377, 393, 399, 419, 423, 455, 465, 470, 486, 501, 513, 524, 528, 537, 543, 552. |
| పూర్వగౌళ | ... 254, 353, 428, 534. |
| బౌళి(భవుళి) | ... 19, 33, 41, 45, 64, 96, 100, 123, 141, 173, 194, 201, 212, 228, 273, 281, 297, 302, 328, 348, 369, 395, 459, 467, 518, 551. |
| బౌళిరామక్రియ | ... 113, 492, 554. |
| భల్లాటి | ... 38, 365. |
| భూపాళం | ... 58, 71, 86, 557, 575. |

| రాగములు | | కీర్తనసంఖ్యలు. |
|---|---|---|
| భైరవి | ... | 9, 69, 79, 88, 98, 144, 223, 287, 292, 359, 400, 469, 514, 545, 567. |
| మంగళకౌశి(సి)క | ... | 59, 191, 301, 334, 410, 422, 429, 449, 503. |
| మధ్యమావతి | ... | 29, 172, 260, 305, 437. |
| మాళవి | .... | 178, 220, 413, 466, 540. |
| మాళవిగౌళ | .... | 56, 95, 138, 148, 154, 160, 182, 239, 242, 296, 316, 382, 425, 484, 515, 530, 563. |
| మాళ(వి)వశ్రీ | .... | 184, 293, 451. |
| ముఖారి | .... | 3, 20, 23, 46, 73, 89, 99, 118, 156, 175, 226, 230, 271, 278, 358, 370, 373, 433, 438, 485, 485, 511, 521, 526, 561, 566, 574, 579, 586, 593. |
| మేచబౌళి | .... | 90, 203, 309, 439. |
| మేఘరంజి | .... | 277. |
| రామక్రియ | .... | 37, 65, 92, 128, 135, 155, 169, 189, 240, 247, 272, 298, 329, 374, 391, 408, 417, 448, 461, 479, 505, 512, 523, 542, 570. |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| రీతిగౌళ | .... | 50, 91, 104, 177, 253, 319, 379. |
| లలిత | .... | 15, 67, 147, 236, 294, 339, 344, 355, 387, 420, 463, 502, 525, 595. |
| వరాళి | .... | 32, 51, 81, 109, 139, 158, 186, 262, 290, 307, 356, 396, 402, 418, 424, 440, 457, 474, 500, 535, 583, 591. |
| వసంతవరాళి | .... | 233, 268, 320. |
| వేళావళి | .... | 244, 286, 363, 367. |
| శంకరాభరణం | .... | 44, 94, 116, 146, 151, 163, 174, 196, 204, 265, 327, 336, 385, 406, 476, 483, 493, 508, 564, 576, 596, 598. |
| శ్రీరాగం | .... | 10, 53, 60, 72, 75, 133, 142, 168, 206, 219, 283, 312, 322, 330, 347, 376, 412, 454, 536, 546, 588. |
| శుద్ధదేశి | .... | 472 |
| శుద్ధవసంతం | .... | 106, 164, 170, 192, 256, 259, 295, 311, 351, 403, 443, 509 527. |
| సామంతం | .... | 4, 16, 31, 34, 40, 77, 78, 82, |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| | 103, 130, 149, 157, 195, 209, 211, 245, 246, 269, 280, 300, 313, 323, 337, 352, 360, 389, 394, 436, 441, 456, 462, 471, 504, 519, 531, 541, 556, 562, 565, 571, 577, 585, 589. |
| సామవరాళి .... | 171, 251, 324, 386. |
| సాళంగం .... | 27, 134, 166, 252, 291, 362, 378, 414, 522, 572. |
| సాళంగనాట .... | 49, 132, 167, 215, 241, 382, 383, 397, 434, 452, 460, 532, 560, 569, 599. |
| సింధురామక్రియ .... | 14, 124, 275, 317, 481, 510. |
| సౌరాష్ట్రం .... | 1. 66, 119, 185, 234, 274, 335, 361, 368, 375, 445, 547, 559, 592. |
| హిందోళం .... | 54, 232, 284, 435, 520. |
| హిందోళవసంతం .... | 152, 161, 179, 263, 384, 497, 549. |
| హిజ్జిజి(జ్జి) ... | 193, 304, 333, 342. |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన-రాగ-సంఖ్యా సూచి


| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంగడినేల | నాదరామక్రియ | 126 |
| అంగన నాపతి | మంగళకౌసిక | 191 |
| అంగన నింతట | కన్నడగౌళ | 349 |
| అంగనలంగనుగొంటే | పాడి | 102 |
| అంటుకొంటి | రామక్రియ | 135 |
| అండమండ | ఆహిరినాట | 458 |
| అండనున్న | బౌళి | 123 |
| అందరికిదారు | సామంతం | 78 |
| అందరివలె | పూర్వగౌళ | 428 |
| అందుకు నిందుకు | భైరవి | 223 |
| అందుకు మనసు | కన్నడగౌళ | 35 |
| అందుకేపో | ముఖారి | 370 |
| అందుకే మెచ్చ | హిజ్జిజి | 342 |
| అందుకేమే | ధన్నాశి | 18 |
| అందులకే | ఆరిబి | 43 |
| అందువంక | ఆహిరి | 136 |
| అటుగాన | పాడి | 372 |
| అటువంటి | శ్రీరాగం | 133 |
| అట్టైకానీ | పాడి | 465 |
| అడుగరాదా | మంగళకౌసిక | 449 |
| అడుగరే యీమాట | దేసాళం | 57 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అడుగరే యీనుద్ది | కేదారగౌళ | 276 |
| అతఁడు మొదలనే | సాళంగనాట | 599 |
| అతఁడెంత | సాళంగనాట | 569 |
| అతసికొక్క | రామక్రియ | 37 |
| అతనిగతు | సామంతం | 589 |
| అతివనింత | సౌరాష్ట్రం | 445 |
| అద్దమరాతిరి | లలిత | 420 |
| అనవలసిన | సాళంగనాట | 383 |
| అన్నిటాగుట్టు | సామవరాళి | 251 |
| అన్నిటికి నేరుతు | సామంతం | 130 |
| అన్నినాయ | కన్నడగౌళ | 62 |
| అప్పటి నీ | ముఖారి | 373 |
| అప్పటి మానవు | భల్లాటి | 265 |
| అప్పటి మానవు | సౌరాష్ట్రం | 592 |
| అప్పుడే నీకు | లలిత | 595 |
| అప్పుడే మఱతు | రామక్రియ | 448 |
| అయ్యాజియ్యాలు | సాళంగనాట | 452 |
| అలిగితినా | ఆహిరినాట | 491 |
| అలిగి వుండి | మేఁచబౌళి | 439 |
| అలుకలు దీరె | మంగళకౌసిక | 334 |
| అవధరించ | రామక్రియ | 461 |
| అవునయ్యా | వరాళి | 139 |
| అవునయ్యా | నాదరామక్రియ | 507 |
| ఆఁటదాని | కాంబోది | 202 |
| ఆఁటదిరాజ్య | కేదారగౌళ | 364 |
| ఆఁడువారి | ఆహిరినాట | 468 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| ఆకెకును | ఆహిరి | 584 |
| ఆకెఱుఁగు | మంగళకౌశిక | 429 |
| ఆడుకొనే నెంత | శుద్ధవసంతం | 192 |
| ఆతఁడు సేసిన | బౌళి | 302 |
| ఆతఁడు సేసేటి | ముఖారి | 358 |
| ఆతవికే | ఆహిరి | 55 |
| ఆతని మనసు | మేఘరంజి | 277 |
| ఆదరించి | ఆహిరి | 97 |
| ఆనతియ్యఁగదవే | ఆహిరి | 388 |
| ఆనతీవయ్య | సామంతం | 519 |
| ఆనతీవయ్యా | ఆహిరి | 285 |
| ఆయనాయఁజా | సామంతం | 562 |
| ఆయనాయ | ఆహిరినాట | 310 |
| ఆవిభువి | దేశాక్షి | 415 |
| ఆసలనే బడ | సౌరాష్ట్రం | 361 |
| ఆసుద్దులే | కుంతలవరాళి | 5 |
| ఆసోదకుఁడవు | దేసాళం | 213 |
| ఇఁక నెంతగాఁగద్దో | నాదరామక్రియ | 176 |
| ఇంక నెంతగావలె | దేవగాంధారి | 249 |
| ఇంక నేలదాఁచేవు | ఆహిరి | 325 |
| ఇంకనేల యీసుద్దు | దేసాళం | 289 |
| ఇంకనోజకు | శుద్ధవసంతం | 443 |
| ఇంకాఁగొన్ని | లలిత | 344 |
| ఇంకానిట్లానే | లలిత | 355 |
| ఇంకానేల | వరాళి | 535 |
| ఇంటికి విచ్చేసితి | ఆహిరినాట | 198 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇంటికి విచ్చేసె | శంకరాభరణం | 265 |
| ఇంతచాలదా | దేసాళం | 187 |
| ఇంతటివాఁడ | మాళవి | 178 |
| ఇంతనేరకుండి | రీతిగౌళ | 91 |
| ఇంత సేసితి | దేసాళం | 115 |
| ఇంతి చెలువం | శ్రీరాగం | 347 |
| ఇంతితోటి | ఆహిరి | 453 |
| ఇంతితోనేఁటి | దేసాళం | 243 |
| ఇంతినీకు | తెలుఁగుఁగాంబోది | 430 |
| ఇంతినీవూ | కాంబోది | 446 |
| ఇంతి యివి | పాడి | 486 |
| ఇంతులకు | దేసాళం | 354 |
| ఇంతులట | ముఖారి | 23 |
| ఇంతేఇంతే | పాడి | 36 |
| ఇందరిలోనా | మాళవి | 413 |
| ఇందరిలోనీ | ధన్నాసి | 478 |
| ఇందాఁకానున్న | వేళావళి | 244 |
| ఇందాఁకామనమెల్లా | శ్రీరాగం | 219 |
| ఇందాఁకావలెఁగా | మేఁచబౌళి | 309 |
| ఇందుకు జంకించ | శంకరాభరణం | 493 |
| ఇందుకా నీదొర | బౌళి | 459 |
| ఇందుకే నేఁ జింతించే | శుద్ధవసంతం | 164 |
| ఇందుకేల | బౌళిరామక్రియ | 492 |
| ఇందులోనే | ఆహిరి | 127 |
| ఇచ్చకము | మాళవిగౌళ | 382 |
| ఇట తరువాతి | ధన్నాశి | 85 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇటమీఁద | వరాళి | 290 |
| ఇటువంటి చెలి | భైరవి | 469 |
| ఇటువంటిది | పూర్వగౌళ | 353 |
| ఇటువంటిదే | పాడి | 524 |
| ఇట్టిపతితో | మాళవిశ్రీ | 293 |
| ఇట్టె ఆదరించ | బౌళి | 518 |
| ఇట్టె తప్పు | దేశి | 225 |
| ఇట్టె నాకు | భైరవి | 9 |
| ఇతఁడేనా | బౌళి | 19 |
| ఇతరుల | సామంతం | 571 |
| ఇదియేచాలు | ఆహిరినాట | 255 |
| ఇదివో ఇప్పటి | ముఖారి | 433 |
| ఇదివో నాభాగ్య | సామంతం | 462 |
| ఇదివో మంచి | సౌరాష్ట్రం | 375 |
| ఇది యెంత | సాళంగనాట | 434 |
| ఇది యేఁటి | గుండక్రియ | 216 |
| ఇదె నేఁజేసిన | తోండి | 237 |
| ఇద్దరము | వరాళి | 262 |
| ఇద్దరికిఁజెల్లు | శంకరాభరణం | 116 |
| ఇద్దరికిఁబోదు | నాగవరాళి | 341 |
| ఇద్దరి జాణ | ఆహిరినాట | 600 |
| ఇద్దరి భావము | ఆహిరి | 165 |
| ఇన్నాళ్లవాఁడ | ఆహిరి | 219 |
| ఇన్నిటా ఘనుఁడు | మాళవిగౌళ | 239 |
| ఇన్నిటా సంతోసించి | వసంతవరాళి | 268 |
| ఇన్నిటికి నీకు | భైరవి | 400 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| ఇన్నిటికి | తెలుఁగుఁగాంబోది | 101 |
| ఇన్నియుఁ గూడెను | తెలుఁగుఁగాంబోది | 597 |
| ఇప్పటి తెలిఁగ | సామంతం | 531 |
| ఇప్పటికే | సామవరాళి | 3·6 |
| ఇప్పటిగతి | ఘంటారవం | 594 |
| ఇప్పుడిన్నిటికి | ముఖారి | 574 |
| ఇప్పుడుగా | రామక్రియ | 298 |
| ఇప్పుడు మా | కొండమలహారి | 114 |
| ఆప్పుదే నీ | శ్రీరాగం | 312 |
| ఇప్పుదే నేరుచు | వరాళి | 356 |
| ఇప్పుదేమి | భూపాళం | 575 |
| ఇప్పుదే విన్న | మాళవిగౌళ | 160 |
| ఇప్పుదే వేగిర | సాళంగనాట | 460 |
| ఇరువంకల | దేసాళం | 231 |
| ఇలమీఁద | మాళవిగౌళ | 563 |
| ఇవి గొన్ని | వరాళి | 474 |
| ఇవిఁగొన్ని | వరాళి | 81 |
| ఈ పాటిది వలె | పాడి | 11 |
| ఈ పెవంటి | సింధురామక్రియ | 124 |
| ఈమేలు దలఁచు | ముఖారి | 488 |
| ఉండనీవే | బౌళి | 297 |
| ఉద్దండము | భల్లాటి | 38 |
| ఉవిద విరహ | శంకరాభరణం | 598 |
| ఊరకుందు | ఆహిరి | 404 |
| ఊరకే కరఁగు | ముఖారి | 485 |
| ఎంచిచూడు | లలిత | 236 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంత కాతరీఁడి | దేశి | 199 |
| ఎంత గిజిగిజి | కాంబోది | 153 |
| ఎంత చనవిచ్చి | బౌళి | 369 |
| ఎంత చెప్పినా | శుద్ధవసంతం | 106 |
| ఎంత తాలిమి | లలిత | 502 |
| ఎంతవి చెప్పే | శ్రీరాగం | 53 |
| ఎంత విజ | సౌరాష్ట్రం | 274 |
| ఎంత నా సుద్దులు | శ్రీరాగం | 75 |
| ఏంత బయలీఁదించే | సామంతం | 16 |
| ఎంత మానాపతి | దేశాక్షి | 2:4 |
| ఎంత లేదు | పూర్వగౌళ | 254 |
| ఎంతవడి | హిందోళం | 232 |
| ఎంతి వాఁడవయ్యా | సామంతం | 245 |
| ఎంత వోరుచు | బౌళి | 100 |
| ఎంత యింత | కాంబోది | 8 |
| ఎంత వేడుకో | సామంతం | 31 |
| ఎంత సణఁగు | సామంతం | 40 |
| ఎంతేసి కాఁగలదో | అహిరి | 580 |
| ఎంతైన మా గుణాలు | ముఖారి | 586 |
| ఎందాఁకా మంకుఁదన | నాదరామక్రియ | 306 |
| ఎందాఁకా మనసు | మాళవిశ్రీ | 184 |
| ఎందాఁకా మనసు | వరాళి | 32 |
| ఎందాఁకా వంకలు | మాళవి | 540 |
| ఎందున్నవి | సామంతం | 280 |
| ఎక్కడ పరాకు నీకు | భూపాళం | 68 |
| ఎక్కడ పరాకు నేనే | లలిత | 463 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎక్కడి కెక్కడ | శంకరాభరణం | 44 |
| ఎక్కడేమి | ముఖారి | 526 |
| ఎటువంటి పొందు | సాళంగం | 27 |
| ఎటువంటివిలాసివి | నాదరామక్రియ | 30 |
| ఎటువలెఁబొగడి | మాళవిగౌళ | 95 |
| ఎటువలె నమ్మించీ | నాదరామక్రియ | 496 |
| ఎట్టిజాణలో | పాడి | 200 |
| ఎదిరి నిన్నెంచు | శుద్ధవసంతం | 170 |
| ఎదుటనే | బౌళి | 340 |
| ఎదురాడఁజాల | ఆహిరి | 143 |
| ఎదురుచూచి | నాదరామక్రియ | 398 |
| ఎదురుచూచీఁజెలి | శ్రీరాగం | 322 |
| ఎదురుబడి | శుద్ధవసంతం | 295 |
| ఎన్నఁడును | ముఖారి | 579 |
| ఎన్నఁడెఱిఁగేవు | ఆహిరి | 555 |
| ఎన్నినోములు | దేవగాంధారి | 145 |
| ఎన్నెన్నిమేళ్లు | బౌళి | 328 |
| ఎప్పటికి | శంకరాభరణం | 576 |
| ఎప్పటివలె | ఆహిరి | 340 |
| ఎప్పుడుదలఁచే | కన్నడగౌళ | 248 |
| ఎప్పుడూఁదన | మాళవి | 466 |
| ఎమ్మెలవాఁడ | గౌళ | 229 |
| ఎమ్మెలుసేయఁగ | ముఖారి | 278 |
| ఎఱఁగనివాఁడ | కాంబోది | 162 |
| ఎఱఁగనివారు | సాళంగం | 166 |
| ఎఱఁగము | సామంతం | 195 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎఱఁగవు | పాడి | 377 |
| ఎఱఁగించవే | నాదరామక్రియ | 43 |
| ఏఱిఁగిఁచి | ముఖారి | 156 |
| ఎఱుఁగుకోవే | కురంజి | 30 |
| ఎఱుఁగుదు | మాళవిగౌళ | 138 |
| ఎలయింపుఁజేత | దేసాళం | 550 |
| ఎవ్వతైనా | కాంబోది | 250 |
| ఎవ్వరంటాఁజూచే | రామక్రియ | 575 |
| ఎవ్వరు గలిగి | రామక్రియ | 500 |
| ఎవ్వరును | సౌరాష్ట్రం | 368 |
| ఎవ్వరేమనిరి | మాళవిగౌళ | 425 |
| ఏఁటికివేసాలు | ముఖారి | 438 |
| ఏఁటికొడఁబర | సామవరాళి | 324 |
| ఏఁటిజాణ | పళవంజరం | 70 |
| ఎకతానఁజేయఁరాదా | హిజ్జిజి | 333 |
| ఏకతాననున్న | భూపాళం | 58 |
| ఏడనుండి | రామక్రియ | 92 |
| ఏదీ నీయందు | హిందోళం | 284 |
| ఏమని చెప్పను | హిందోళం | 54 |
| ఏమని చెప్పుదు | భైరవి | 79 |
| ఏమని చెప్పే | కన్నడగౌళ | 110 |
| ఏమనిన | భైరవి | 567 |
| ఏమయ్యా తగవు | కురంజి | 544 |
| ఏమయ్యా నన్నేల | శ్రీరాగం | 546 |
| ఏమయ్యా నే | లలిత | 339 |
| ఏమయ్యారట్టు | దేసాళం | 411 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమాయనింత | రామక్రియ | 272 |
| ఏమిగలిగిన | భైరవి | 514 |
| ఏమిచూచేవు | పాడి | 366 |
| ఏమి నేరుపులు | బౌళి | 194 |
| ఏమి నేర్చితి | సామంతం | 360 |
| ఏమి మోగము | ఆహిరి | 227 |
| ఏమి చెప్పేది | సామంతం | 269 |
| ఏమి చెప్పేరే | పాడి | 419 |
| ఏమిటికిఁదల | కేదారగౌళ | 582 |
| ఏమి దక్కువాయ | పాడి | 150 |
| ఏమి నవ్వులు | బౌళి | 281 |
| ఏమి నీవొళ్ళఁగల్ల | రామక్రియ | 408 |
| ఏమిబాఁతి | బౌళి | 33 |
| ఏమివిన్నవించే | లలిత | 525 |
| ఏమిసేతుఁజెప్పవే | శ్రీరాగం | 10 |
| ఏమిసేయు | శ్రీరాగం | 206 |
| ఏమీవనఁగఁజాల | మాళవిగౌళ | 296 |
| ఏమీననకురే | ముఖారి | 521 |
| ఏమేనమ్మి | ఆహిరినాట | 24 |
| ఏమేమి నీవు | దేశాక్షి | 308 |
| ఏమేయెంత | దేశాక్షి | 235 |
| ఏరుపరచి | శ్రీరాగం | 72 |
| ఏల కైలాటాలు | ఆహిరినాట | 401 |
| ఏలకోపగించి | పళవంజరం | 427 |
| ఏలజాగారాలు | సామంతం | 34 |
| ఏలజోలిసేసే | తెలుఁగుఁగాంబోది | 318 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏల తప్పులు | దేసాళం | 516 |
| ఏల తమకించే | శుద్ధవసంతం | 311 |
| ఏల నీకు | తోండి | 210 |
| ఏల పంతాలాడు | నాటరామక్రియ | 270 |
| ఏలయ్య మాతో | సౌరాష్ట్రం | 547 |
| ఏల వంకలు | వరాళి | 186 |
| ఏలవేఁడుకొనీ | సాళంగం | 378 |
| ఎలవేఁడుకొనే | సౌరాష్ట్రం | 335 |
| ఏలసిగ్గులు | ఆహిరి | 76 |
| ఏల సిగ్గులు | దేశి | 553 |
| ఏలసిగ్గులు | సామంతం | 441 |
| ఏలా ఇంకాఁగొసర | వాడి | 205 |
| ఏలినవాఁడవు | దేశాక్షి | 533 |
| ఏలుకొన్న ఫలమూ | శంకరాభరణం | 146 |
| ఏవంక నేరిచి | పాడి | 217 |
| ఐనపని | వసంతవరాళి | 233 |
| ఒకటంటే | పాడి | 393 |
| ఒకటికినుమ | రామక్రియ | 247 |
| ఒకటుండఁగా | సాళంగం | 414 |
| ఒకటొక | చెంచుమలహరి | 568 |
| ఒకరిఁదద | మాళవిగౌళ | 530 |
| ఒకరిపై నెపము | ముఖారి | 99 |
| ఒక్కపానుపు | సామంతం | 436 |
| ఓహో ఇదేఁటి | శంకరాభరణం | 564 |
| ఔదువయ్యా | శంకరాభరణం | 163 |
| ఔదువేఁటాణవు | ఆహిరి | 360 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఔనటవే | బౌళి | 467 |
| ఔనయ్యమంచి | ముఖారి | 271 |
| కంకణ సూడిగె | సామంతం | 556 |
| కంటిఁగంటి | సాళంగనాట | 397 |
| కంటిమిఁవో | శ్రీరాగం | 142 |
| కంటిమి సీలో | సామంతం | 565 |
| కంటిమివింటిమి | మధ్యమావతి | 29 |
| కంటివిగా | శంకరాభరణం | 406 |
| కడమలేదేమిటా | సౌరాష్ట్రం | 119 |
| కడుఁజుట్టి | లలిత | 147 |
| కన్నవారెవ్వరు | సాళంగం | 572 |
| కన్నియ | ఆహిరి | 426 |
| కన్నెగడు | పాడి | 21 |
| కపటపు నీ | రామక్రియ | 523 |
| కపటాలు | శుద్ధవసంతం | 509 |
| కలసితి | రామక్రియ | 169 |
| కాఁగిలించ | బౌళి | 141 |
| కాదనేమా | రామక్రియ | 479 |
| కానవచ్చె | సాళంగం | 291 |
| కానీలే | మధ్యమావతి | 172 |
| కానీవయ్యా | దేశాక్షి | 490 |
| కానీవోయి | దేవగాంధారి | 326 |
| కామిని విధాన | నారాయణి | 416 |
| కామిని సరస | కాంబోది | 371 |
| కాముకుఁడై | రామక్రియ | 391 |
| కూడినవేళ | వరాళి | 457 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కూరిమినెక్కు | సాళంగనాట | 560 |
| కొంకకువే | శంకరాభరణం | 483 |
| కొండవంటి | సాళంగం | 134 |
| కొత్తపెండ్లి | దేసాళి | 52 |
| కొప్పువంగనీ | శంకరాభరణం | 204 |
| కొమ్మలు | దేసాళం | 131 |
| కొలఁదులు | దేవగాంధారి | 183 |
| కొలువు సేయించు | సాళంగనాట | 132 |
| కోనతిరువెంగ | మాళవిగౌళ | 242 |
| కోమలిరో | మేఁచబౌళి | 90 |
| కోరికెలెల్లా | సామంతం | 352 |
| గక్కనచెక్కు | భైరవి | 545 |
| గజరున | రామక్రియ | 329 |
| గదుసవంటా | పాడి | 423 |
| గదుసవు | సామంతం | 149 |
| గామిడివి | ముఖారి | 226 |
| గారవించ | నాదరామక్రియ | 117 |
| గుట్టువనుండు | సామవరాళి | 171 |
| గుట్టు సేసుకో | పాడి | 105 |
| గెలువరాదు | శుద్ధవసంతం | 259 |
| గొల్లదావ | సాళంగం | 252 |
| ఘనుఁడనీ | గుండక్రియ | 573 |
| ఘనుఁడవు | సామంతం | 209 |
| చందురుఁడు | ముఖారి | 566 |
| చదివితి | కుంతలవరాళి | 444 |
| చల్లఁగా బదుక | వేళావళి | 367 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| చాలదా నాకీ | భైరవి | 292 |
| చాలదా యీ | సామంతం | 389 |
| చాలుఁజాలునిఁక | ఆహిరి | 282 |
| చాలుఁజాలునూర | వరాళి | 402 |
| చిట్టకీవి | పాడి | 470 |
| చిత్తగించ | రామక్రియ | 155 |
| చిత్తమురా | శ్రీరాగం | 536 |
| చిత్తానఁబెట్టు | భైరవి | 88 |
| చిత్తానసెగ్గు | ఆహిరి | 25 |
| చిన్నదాన | బౌళి | 45 |
| చుట్టిచుట్టి | శ్రీరాగం | 412 |
| చూచితే | ముఖారి | 89 |
| చూడముద్దు | బౌళి | 41 |
| చూడరమ్మ | సామంతం | 157 |
| చూతము | పాడి | 513 |
| చెంతనున్న | గౌళ | 68 |
| చెక్కిటిచేయి | నాగవరాళి | 221 |
| చెక్కుచేతితోడ | కన్నడగౌళ | 548 |
| చెక్కునొక్కి | ఆహిరి | 447 |
| చెనకేవు | బౌళి | 173 |
| చెప్పఁగదరా | మంగళకౌసిక | 503 |
| చెప్పరాదు చూప | శ్రీరాగం | 588 |
| చెప్పరాదు యీతని | మాళవిగౌళ | 148 |
| చెప్పరావి | కాంబోది | 111 |
| చెప్పవయ్య | పూర్వగౌళ | 534 |
| చెప్పవే | ముఖారి | 3 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చెప్పితినీ | ద్రావిళభైరవి | 47 |
| చెప్పినట్టుసేయ | కాంబోది | 137 |
| చెప్పినట్టుసేసే | గౌళ | 108 |
| చెయ్యరాని | సామంతం | 323 |
| చెలంగిపెద్ద | నీలాంబరి | 122 |
| చెల్లఁబోతియ్యా | సామంతం | 577 |
| చెల్లఁబో యేమయ్యా | నారాయణి | 93 |
| చెలిక త్తెవు | శంకరాభరణం | 94 |
| చెలి చెలువ | హిజ్జిజి | 193 |
| చెలిమిఁబాయ | పాడి | 399 |
| చెలిమోము | ముఖారి | 230 |
| చెలియకు | రీతిగౌళ | 177 |
| చెలియా | నట్టనారాయణి | 17 |
| చెలులకుఁదగుఁగాక | శుద్ధవసంతం | 351 |
| చెలులాలమీరూ | హిందోళవసంతం | 549 |
| చెలులాలమీరై | కేదారగౌళ | 238 |
| చెలులాల యేమని | భైరవి | 144 |
| చెలువుని | రీతిగౌళ | 319 |
| చెల్లుఁజెల్లు | బౌళి | 551 |
| చెవులార | ముఖారి | 175 |
| చేకొవి నీ | గౌళ | 489 |
| చేచాఁచవయ్యా | తెలుఁగుఁగాంబోది | 450 |
| చేయివట్టె | పాడి | 537 |
| చేయెత్తి మొక్కి | తెలుఁగుఁగాంబోది | 264 |
| జాణతన | దేసాళం | 464 |
| తక్కినవారికి | హిందోళవసంతం | 263 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తగవు తానే | మంగళకౌసిక | 301 |
| తగుఁదగు | మాళవి | 220 |
| తగునయ్యా | సామంతం | 456 |
| తనంతనే | వరాళి | 500 |
| తనకంటె | మధ్యమావతి | 260 |
| తన చేతిడిఁక | కేదారగౌళ | 125 |
| తరుణికి | మంగళకౌసిక | 410 |
| తఱితో నీ చేతి | మాళవిగౌళ | 515 |
| తలఁచిన పను | కన్నడగౌళ | 188 |
| తాను సేసిన | వరాళి | 440 |
| తానెరుఁగు | దేసాళం | 487 |
| తానే ఎఱుఁగు | సామంతం | 103 |
| తొయ్యలి | రీతిగౌళ | 50 |
| తొలుతనే | కాంబోది | 475 |
| దేవతలు | శ్రీరాగం | 376 |
| దేవుఁడవు | పాడి | 129 |
| దొరవునీవన్ని | కేదారగౌళ | 208 |
| దొరవుసారెకు | ఆహిరినాట | 494 |
| ధరనెఱుఁగ | మధ్యమావతి | 437 |
| నవిచి పది | దేవక్రియ | 74 |
| నన్ను నింత | ముఖారి | 20 |
| నయమున | రామక్రియ | 512 |
| నవ్వేవారి | సాళంగనాట | 215 |
| నాకునీవే | నాగగాంధారి | 495 |
| నాకు వెఱవఁగ | రామక్రియ | 374 |
| నాటకాలు | సింధురామక్రియ | 275 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నాతోఁడాఁచక | పాడి | 357 |
| నామేనే | కాంబోది | 578 |
| నిండు వేడుకల | శ్రీరాగం | 60 |
| నిన్నఁజూచి | హిందోళవసంతం | 384 |
| నిన్నవిఁక | సామంతం | 394 |
| నిన్నమెచ్చఁగ | ఆహిరి | 538 |
| నిరతివెరగయ్యా | భైరవి | 359 |
| నిలుచున్నాఁడల్ల | ముఖారి | 561 |
| నివ్వెరగుతో | దేసాళం | 257 |
| నీకంటెఁజల | పాడి | 455 |
| నీకివిప్రియములు | సామంతం | 300 |
| నీకునీవే | రామక్రియ | 189 |
| నీకునేము | వరాళి | 109 |
| నీకెంతవేడుక | సౌరాష్ట్రం | 1 |
| నీకేతెలుసుఁగాక | పాడి | 528 |
| నీకేమిగలిగినా | తెలుఁగుఁగాంబోది | 39 |
| నీకేమేలు | హిందోళవసంతం | 179 |
| నీకేలవెఱపు | హిందోళం | 435 |
| నీకొలఁది | పాడి | 42 |
| నీచలము | మాళవిగౌళ | 316 |
| నీచిత్తము | సామంతం | 82 |
| నీచిత్తమే | సామంతం | 313 |
| నీనేరములకు | శంకరాభరణం | 151 |
| నీయంతవట్టు | దేవగాంధారి | 499 |
| నీయంతానెఱఁగ | ఆహిరినాట | 181 |
| నీలోమెలఁగిన | దేసాళం | 140 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీవల్లవింతేసి | శంకరాభరణం | 174 |
| నీవల్లవచ్చిన | హిందోళం | 520 |
| నీవుండేదొక్క | హిందోళవసంతం | 161 |
| నీవుగడించిన | సాళంగనాట | 532 |
| నీవెంతలెస్స | మాళవిగౌళ | 56 |
| నీవెఱఁగవా ఇంత | లలిత | 294 |
| నీవెఱఁగవావోయి | సామంతం | 211 |
| నీవేడుకే | రామక్రియ | 128 |
| నీసాజమిట్లా | శంకరాభరణం | 336 |
| నెరవాది రమణుఁడ | వేళావళి | 286 |
| నెలఁతభాగ్య | శంకరాభరణం | 327 |
| నెలఁతమేని | ఆహిరి | 482 |
| నేనంతదానా | పాడి | 321 |
| నేవిట్టె | సింధురామక్రియ | 317 |
| నే నెంత గబ్బి | దేశి | 587 |
| నే నెప్పుడు | గౌళ | 288 |
| నే నెఱిఁగిన | దేసాళం | 473 |
| నేము నీకిత | రామక్రియ | 417 |
| నేరవివార | భైరవి | 287 |
| నేరుపన్నిటా | నాదరామక్రియ | 83 |
| నేరుపరివన్ని | దేసాళం | 63 |
| నేరుపే విధాన | గౌళ | 26 |
| పచ్చలాయకట్టి | వరాళి | 424 |
| పదరిన | వరాళి | 591 |
| పదరు | పాడి | 345 |
| పాయపువాఁడ | సాళంగం | 522 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పిన్నతనాలే | తెలుఁగుఁగాంభోది | 506 |
| పిన్నలున్నా | బౌళి | 212 |
| పిలిచిన | బౌళి | 273 |
| పిలుచుక | వరాళి | 51 |
| పిలువవే | శ్రీరాగం | 283 |
| పిసికితే | సౌరాష్ట్రం | 284 |
| ప్రియము | కాంభోది | 539 |
| పుట్టఁగాఁబుట్టి | రీతిగౌళ | 104 |
| పొంచి నీతొల్లిటి | శంకరాభరణం | 508 |
| పొగదేవు | శుద్ధవసంతం | 256 |
| పొద్దువోవివాఁడు | ఆహిరినాట | 61 |
| పొలఁతికి | సౌరాష్ట్రం | 66 |
| పోపో యెక్కడి | దేసాళం | 258 |
| బంగారుమేడ | శ్రీరాగం | 330 |
| బంగారువంటి | దేసాళం | 6 |
| బంతిపక్షము | పాడి | 501 |
| బడలె నీ | ధన్నాసి | 261 |
| బతికితి వన్ని | సాళంగనాట | 167 |
| బదుకవయ్యా | సౌరాష్ట్రం | 185 |
| బలిమాయ | పాడి | 552 |
| బలిమి | మాళవిగౌళ | 182 |
| బుద్దిచెప్పవయ్యా | సాళంగం | 362 |
| బుద్దిచెప్పే | వేళావళి | 363 |
| భావించి | మాళవిగౌళ | 154 |
| భోగించవయ్యా | నాగవరాళి | 498 |
| మంకుఁదన | వరాళి | 418 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మంచికాల | హిందోళవసంతం | 497 |
| మంచిమేలు | రీతిగౌళ | 253 |
| మంచివాఁడ | ఆహిరి | 517 |
| మంచివాఁడ | లలిత | 387 |
| మండాటాలిఁక | ద్రావిళభైరవి | 421 |
| మందెమేళమై | పాడి | 303 |
| మగఁడేమీ | మంగళకౌశిక | 59 |
| మగరూపు | పాడి | 224 |
| మచ్చికగల | నారాయణి | 314 |
| మట్టుమీర | నాదరామక్రియ | 431 |
| మదనుబండారము | శంకరాభరణం | 196 |
| మనసుకు మనసే | పాడి | 84 |
| మనసుకు మనసే | పళవంజరం | 222 |
| మన్నించవయ్యా | ఆహిరి | 267 |
| మన్నించవయ్యా | బౌళి | 201 |
| మమ్ము నెట్టు | గౌళ | 405 |
| మమ్ము నేమి | మాళవిశ్రీ | 451 |
| మరిగించితి | ముఖారి | 73 |
| మరిగేల | ముఖారి | 118 |
| మరుఁడు నేసిన | భూపాళం | 557 |
| మరులు దెలివి | సామంతం | 585 |
| మఱిమీకు | దేసాళం | 2 |
| మఱి వెనక | ముఖారి | 46 |
| మాటలాడఁగద | సౌరాష్ట్రం | 559 |
| మాటలాడఁబోయి | వరాళి | 583 |
| మాటలెన్ని | నాదరామక్రియ | 112 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మాటలేమి | శంకరాభరణం | 385 |
| మాతోఁబంతా | శుద్ధదేశి | 472 |
| మాతోనేఁటికి | మధ్యమావతి | 305 |
| మాతోనేల | సామంతం | 337 |
| మానవచ్చు | హిజ్జిజి | 304 |
| మానవుని | కురంజి | 279 |
| మావలెనుండ | పాడి | 543 |
| మావసమా | ఆహిరి | 107 |
| మీకిద్దరికే | గౌళ | 432 |
| ముందుముందుగా | అమరసింధు | 380 |
| మెచ్చితి మప్పుడే | దేవగాంధారి | 266 |
| మెత్తని మనసు | నాదరామక్రియ | 477 |
| మెలుఁత నిన్నిటా | పాడి | 87 |
| మెలుఁత లందరు | సాళంగనాట | 241 |
| మెలుఁతలు | ఆహిరి | 558 |
| మేమింత | గౌళ | 346 |
| మేమును నీ | దేసాళం | 390 |
| మేము విన్నవించ | బౌళి | 228 |
| మేలు మేలయ్యా | సింధురామక్రియ | 510 |
| మేలు మేలయ్యా | హిందోళవసంతం | 152 |
| మేలు మేలు మీ | లలిత | 76 |
| మేలు మేలు యివిఁగొన్ని | గౌళ | 12 |
| మేలు సుద్ది | పళవంజరం | 13 |
| మేలే యెట్టుండి | సింధురామక్రియ | 481 |
| మొకదాకిరి దా | దేసాళం | 315 |
| మొకదాకిరివి | తెలుఁగుఁగాంభోది | 180 |
| మొక్కఁ జేకొను | నాదరామక్రియ | 207 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మొక్కేము నీకును | సామంతం | 541 |
| యశోద నీబిడ్డ | దేవగాంధారి | 331 |
| రమణి గుట్టు | రీతిగౌళ | 379 |
| రమణుఁడ | ఆహిరినాట | 581 |
| రమణుని తోడ | నాదరామక్రియ | 407 |
| రమ్మనమ్మ | భూపాళం | 71 |
| రాఁగదే నీ | సామంతం | 504 |
| రావయ్యా చూతుపు | సామంతం | 246 |
| రావయ్యావో | దేవగాంధారి | 480 |
| వట్టిబూటకాన | తెలుఁగుఁగాంబోది | 120 |
| వట్టియలుకల | తెలుఁగుఁగాంబోది | 197 |
| వట్టియాసఁబొర | కుంతలవరాళి | 343 |
| వట్టివేసాలు నేసు | రామక్రియ | 240 |
| వట్టివేసాలు నేసే | ఆహిరినాట | 392 |
| వట్టియెమ్మెలు | సాళంగనాట | 49 |
| వద్దనేవా | సింధురామక్రియ | 14 |
| వద్దువద్దు | వరాళి | 396 |
| వనితలజాడ | బౌళిరామక్రియ | 113 |
| వనితలసొలపు | ఆహిరి | 381 |
| వరుసగావి | శుద్ధవసంతం | 527 |
| వలపులేవి | ఆహిరి | 28 |
| వాకిటి | బౌళి | 64 |
| వాసితోఁబ్రదికే | కన్నడగౌళ | 409 |
| వాసియువన్నె | శంకరాభరణం | 596 |
| వింతవారమా | వరాళి | 158 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వింతవింత | రామక్రియ | 65 |
| వినఁగదవే | వరాళి | 307 |
| వినరమ్మ | శ్రీరాగం | 454 |
| వినవేడుక | సామంతం | 77 |
| విన్నవించితిమి | సామంతం | 471 |
| విరిగినట్టి | ముఖారి | 593 |
| వీడెమియ్యఁగద | భైరవి | 98 |
| వెంగెమాడ | కురంజి | 338 |
| వెంగెమాడేనా | మాళవిగౌళ | 484 |
| వెడ్డుపెట్టి | బౌళి | 395 |
| వెనకటి | శ్రీరాగం | 168 |
| వెన్నవట్టుకొని | భైరవి | 69 |
| వెఱవక | వసంతవరాళి | 320 |
| వెలఁదివింత | దేసాళం | 159 |
| వెలయఁబెండ్లాడి | ముఖారి | 511 |
| వెసఁగాఁపురము | మంగళకౌసిక | 422 |
| వేగిరమేలా | శంకరాభరణం | 476 |
| వేడుకైతే | కాంబోది | 22 |
| వేరేపొందు | పళవంజరం | 190 |
| వేఱొకటి | దేసాళం | 442 |
| సంగతెఱఁగ | శుద్ధవసంతం | 403 |
| సంతోసించి | సాళంగనాట | 332 |
| సతి నవ్వినంత | సామంతం | 4 |
| సతుల మిందర | రామక్రియ | 542 |
| సమ్మటూరి | బౌళిరామక్రియ | 554 |
| సమ్మతిలఁజెప్పే | ఆహిరినాట | 121 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| సరసుఁడ | మేఁచబౌళి | 203 |
| సతి చక్కఁదన | తెలుఁగుఁగాంబోది | 590 |
| సిగ్గువడ | ఆహిరినాట | 529 |
| సెలవిచ్చితి | బౌళి | 96 |
| సేలపాల | నాదరామక్రియ | 299 |
| నేసేవుపచార | లలిత | 15 |
| సొరిది సీ | ఆహిరినాట | 7 |


---

# 3-వ అనుబంధము

## సందిగ్ధపద సమీక్ష.

[తాళ్ల పాకకవుల వాఙ్మయములో అపూర్వపదరాశి గొప్పది. ప్రత్యేకముగ ఈపని గొప్పగ సాగవలసియున్నది. దాని కుపస్కారకముగ, ఈ సంపుటములో నాదృష్టికి వచ్చినకొన్ని పదములను లఘువుగ చర్చించితిని. నిఘంటువుల కెక్కనివీ, ఎక్కినా అన్యార్థములందు ప్రయోగింపబడినవీ, వ్యాకరణమును పట్టిచూచేవి, ఇతర భాషా నిఘంటు ప్రసిద్ధములు మాత్రమే ఇందు చర్చింపబడినవి.]

### 1. ఊరఁగూటము: పాట 44

వేర్వేరు ఊర్ల వారు ఒకయూరిలో కలియుట, ఊరఁగూటమని లాక్షణికముగ వాడినట్లున్నది. పరస్పరము సంబంధములేని- పదార్థములు ఒకచో కలియుటకు ఈవ్యవహారము ఆనాడుండిన-దేమో.

2. గోవాళుఁడు: పాట 114

గోవాళుఁడు=యువకుడు, విటుడు ఇత్యాదిగా తెలుగు నిఘంటువులు. "విటనామధేయమౌ విటకాఁడు, వేడుకకాఁడు, బొజుఁగు, ననుపుకాఁడు, లంజకాఁడనఁగ, నివియుఁగాక గోవాళ్ల - నఁగా నొక్కశబ్దంబు గలదు బహుత "- అం. భా 2-116. దీనిని ఏకవచనములో వాడుట వింత.

3. మునిపితే: పాట 110

ముని=మునిపు=మునిసు=ముశిసు = కోపము, anger, wrath, passion, rage! enemity ఇత్యాదిగా కిటెల్. దాని రూపమే 'మునిపితే' కావచ్చు.

4. ముమ్మదము: పాట 297

'ముచ్చట, మున్నీరు' వలె, కాయిక-వాచిక-మానసిక-ములైన మదములు మూడు ముమ్మతమై ఉండవచ్చు.

5. వాగపు: పాట 245

'వాగము' శబ్దము విశేషణించినరూపమో, లేక 'వాగుస' అనుకన్నడపదము యొక్క అర్థాంతరమైనపామ్మినో = ఎమ్మె=అది కలిగినవారు అని అర్థమో కావచ్చు.

6. విత్తరాలు: పాట 31

'బిత్తరాలు' కు రూపాంతరముగా తోచుచున్నది. బిత్తరము = విలాసము. "బిత్తరము కులుకు బెడఁగు బెళుకు హొయలనఁగ విలాసమొప్పుచుండు" - (ఆం. భా 1-139) - అది కలది బిత్తరాలు.

7. వెలకా: పాట 511

'వెళక్కు' శబ్దవికారమేమో

వెళక్కు=దీపము అని తమిళ నిఘంటువు.

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్, తిరుపతి. కా. 2000

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ
1980